17-07Pg1exHMNWJQEK.qxd:17-07Pg1exHMNWJQEK.qxd 1/1/02 6:41 AM Page 1



వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

: fb.com/vaartha Digital

Published from Srikakulam ,Visakhapatnam,Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem

17-7-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 167 పేజీలు: 16 వెల: 6.50

డి.సిఎం పవన్‌ను పరామర్శించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

2లో

మాజీ మంత్రి అంబటి రాంబాబుపై కేసు నమోదు

గురువారం పూరీలో వైభవంగా సాగిన జగన్నాథ రథయాత్ర దృశ్యం

కదిలిన జగన్నాథ రథాలు

• పూరీ యాత్రలో అపశ్రుతి • తొక్కిసలాటలో ఇద్దరు మృతి.. 120 మందికిపైగా గాయాలు • పది లక్షలు పైగా భక్తులు రాక • రథాలు లాగేందుకు వారు పోటీ పడటంతో అనూహ్య ఘటన

పూరి,జులై 16: ఒడిశాలోని పూరీ క్షేత్రంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన జగన్నాథ రథయాత్రలో అపశృతి చోటుచేసుకుంది. లక్షలాదిమంది తరలివచ్చిన ఈ యాత్రలో తొక్కిసలాట కారణంగా ఒకరు తీవ్ర అస్వస్థతకు లోనుకావడంతో ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరేలోపే మరణించినట్లు నిర్వాహకులు తెలిపారు.మృతుడు కటక్‌కు చెందిన అనిల్ దాస్‌గా గుర్తించారు. అలాగే మరొక సంఘటనలో 35 ఏళ్ల వ్యక్తి >>2

గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

అమరావతి చిత్రపటాన్ని శిరస్సున ధరించి రథయాత్రలో పాల్గొన్న సిఎం చంద్రబాబు

అమరావతిలో జగన్నాథ రథయాత్ర

2లో

'జమిలి'కి ఇసి రెడీ

ఆరు నెలలు గడువు ఇస్తే 2029 నుంచే అమలు

2028లో సంబంధిత చట్టం ఆమోదించాలి

99% ప్రజలు కూడా ఈ విధానానికే ఓటు: జెపిసి చైర్మన్

లక్నో,జులై 16: కేంద్ర ఎన్నికల సంఘానికి ఆరు నెలల ముందస్తు సమయం ఇస్తే దేశవ్యాప్తంగా లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఈసీతెలిపింది. ప్రతిపాదిత 'ఒకే దేశం ఒకేసారి ఎన్నికలు అంశాన్ని పరిశీలిస్తున్న పార్లమెంటు సంయుక్త కమిటీకి (జెపిసి) ఇసి తన ప్రాథమిక నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించినట్లు కమిటీ ఛైర్మన్ పి.పి. చౌదరి తెలిపారు. లక్నోలో విద్యావేత్తలతో మూడు రోజులపాటు జరిగిన సంప్రదింపుల అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, ఇసి అభిప్రాయాలను కూడా కమిటీ పూర్తిగా విని, అనంతరం రాజ్యాంగ సవరణలపై తుది సిఫార్సులు చేస్తామని చెప్పారు. ఇసి ప్రణాళికపై తమ ప్రశ్నలను ఎన్నికల సంఘం ముందు ఉంచనున్నామని, ఒకేసారి ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలపై ఇసి వివరణలను పరిశీలించిన తర్వాతే కమిటీ తన నివేదికను సిద్ధం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇసి ప్రాథమిక నివేదికను ప్రస్తావిస్తూ, దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం సాధ్యమేనని, ఇందుకు కనీసం ఆరు నెలల ముందస్తు నోటీసు అవసరమని ఎన్నికల సంఘం అభిప్రాయపడిందని చౌదరి వెల్లడించారు. 2028లో పార్లమెంట్ సంబంధిత చట్టాన్ని ఆమోదిస్తే, 2029 నుంచి 'ఒకే దేశం ఒకేసారి ఎన్నికలు అమలు' చేయ వచ్చని ఎన్నికల సంఘం అభిప్రాయపడిందని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ >>2

భవిష్యత్తు పిపిపిలదే

రాష్ట్రంలో 260 ప్రాజెక్టులకు అదే విధానం

ప్రతి ప్రభుత్వ శాఖకు ఓ ఫైనాన్షియల్ ప్లాన్

మెడికల్ కాలేజీలలో పిపిపికి కేంద్రం ప్రశంసలు

విజిఎఫ్ పాలసీ మార్గదర్శకాలు త్వరలో : సమీక్షలో సిఎం చంద్రబాబు

విజయవాడ,జులై 16, ప్రభాతవార్తప్రతినిధి: భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌తో కూడిన ప్రాజెక్టులే కీలకంగా మారనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గతంలో ఆర్థిక సంస్కరణలు, ప్రస్తుతం మౌలిక సదుపాయాల విప్లవం దేశంలో నడుస్తోందని అన్నారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతోనే (పిపిపి) వివిధ రంగాల్లో ప్రాజెక్టులు చేపట్టి వేగంగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని సీఎం అన్నారు. రాష్ట్రంలో పిపిపి కింద చేపట్టిన ప్రాజెక్టులు, ప్రభుత్వం చేస్తున్న వ్యయం తదితర అంశాలపై గురువారం ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం పోర్టులు, షిప్ యార్డులు, ఎయిర్ పోర్టులు, పర్యాటక ప్రాజెక్టులు సహా మొత్తం 260 ప్రాజెక్టులను పిపిపి కింద చేపట్టినట్లు ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పరిశ్రమలు, మౌలికసదుపాయాలు, పురపాలక, టూరిజం, వైద్య కళాశాలలు, రహదారులు, సౌర విద్యుత్ లాంటి రంగాల్లో రూ.1,23,229 కోట్ల విలువైన ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన సిఎం అన్ని పిపిపి ప్రాజెక్టులనూ సస్టెయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని... ప్రతీ ప్రాజెక్టు వద్దా ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్రం ఇచ్చే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ లాంటి వాటిని కూడా సమర్థంగా వినియోగించుకోవాలని అన్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను సమర్థంగా నడిపేందుకు అవసరమైన మెకానిజమ్ సిద్ధం చేయాలని సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టుల్లో స్థానిక మత్స్యకారులను కూడా భాగస్వాములను చేసి వారికి ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద పబ్లిక్ టచ్ పాయింట్ల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాలకు అవకాశాలు కల్పించాలన్నారు. విజయవాడ, తిరుపతిలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు రూ.178 కోట్ల విజిఎఫ్‌ను కేంద్రం ఇస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మెడికల్ కాలేజీలకు రూ.1,468 కోట్ల విజిఎఫ్ రానుందని.. ఈ ప్రాజెక్టులు చేపట్టిన విధానంపై కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని అధికారులు తెలిపారు.

వచ్చే కేబినెట్‌కు నూతన విధానం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం విజిఎఫ్ పాలసీ 1.0ను వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చకు పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు విడుదల చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వేర్వేరు విధానాలను కూడా అధ్యయనం చేయాల్సిందిగా సూచించారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాల మేరకు ప్రతీ యేటా పిపిపి కింద రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. రాష్ట్రంలోని విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లలో పెద్దఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కింద వీటిని చేప >>2

పర్యాటకంలో టాప్‌కి ఎపి

దేశంలో అత్యంత ఆకర్షణీయ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నాం: మంత్రి దుర్గేష్

విజయవాడ, జులై 16,ప్రభాతవార్తప్రతినిధి: "పర్యాటకమే భవిష్యత్ ప్రగతి చక్రం" అని నమ్ముతూ ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన పర్యాటక రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. జులై 16,17 తేదీల్లో న్యూఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ హోటల్‌లో ఇన్ క్రెడిబుల్ ఇండియా..ఇన్ వ్యాలబుల్ ఎకనామిక్స్ అంశంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న "ఫెయిత్ టూరిజం కాన్ క్లేవ్ 2026" సదస్సులో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని ప్రసంగించారు. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సంధు,జమ్మూ అండ్ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వ పర్యాటక, విద్యా, గ్రామీణ పనులు, పార్లమెంటరీ వ్యవహారాలు మరియు గ్రంథాలయాలశాఖ మంత్రి పాసాంగ్ దోర్జీ సోనా, కేంద్ర పర్యాటక శాఖ అదనపు కార్యదర్శి డైరెక్టర్ జనరల్ సుమన్ బిల్లా జాతీయ, అంతర్జాతీయ పర్యాటక రంగ విధాన నిర్ణేతలు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు హాజరైన ఈ ఉన్నత స్థాయి వేదికపై ఆంధ్రప్రదేశ్ అద్భుత పర్యాటక సామర్థ్యాన్ని, భవిష్యత్ కార్యాచరణను ఆయన అత్యంత సమర్థవంతంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. సిఎంచంద్రబాబు నేతృత్వంలో రూపొందించిన 'స్వర్ణాంధ్ర పర్యాటక విజన్ 2047' ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ పర్యాటక పటంలో అగ్రగామిగా నిలపడమే తమ సంకల్పమని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న 'వికసిత్ భారత్' లక్ష్యాలకు అనుగుణంగా, స్థానిక సమాజాల భాగస్వామ్యంతో పర్యావరణహిత, సుస్థిర పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక వైవిధ్యాన్ని వివరిస్తూ, భారతదేశంలోని అన్ని అద్భుతాలు ఎపిలో కొలువై ఉన్నాయని (ఎపి బిట్ ఆఫ్ ఇండియా ఈజ్ ఇన్ ఆంధ్రప్రదేశ్) పేర్కొన్నారు. 1,054 కి.మీ.లతో దేశంలోనే 3వ అతి పెద్ద సముద్ర తీరం, 283 బీచ్‌లున్నాయని, తిరుమల సహా 80,000కు పైగా దివ్య ఆలయాలు తమ సొంతమని పేర్కొన్నారు. అంతేగాక 13 వన్య ప్రాణి సంరక్షణ కేంద్రాలు, 3 జాతీయ పార్కులు, దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వ్, విస్తారమైన బ్యాక్ వాటర్స్ (దేశంలో 2వస్థానం) కలిగిన రాష్ట్రం ఏపీ అని తెలిపారు.లేపాక్షి, శ్రీకాళహస్తి, తిరుమల కొండలు, ఎర్రమట్టి దిబ్బలు వంటి ప్రాంతాలు యునెస్కో తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకున్నాయని వివరించారు. ప్రధానంగా ఆధ్యాత్మిక (తిరుపతి, అహోబిలం, శ్రీశైలం, సింహాచలం), బౌద్ధ (అమరావతి, నాగార్జునకొండ, తొట్లకొండ, బొజ్జన కొండ), వారసత్వ (లేపాక్షి, గండికోట, ఉండవల్లి గుహలు, చంద్రగిరికోట), ఎకో టూరిజం (అరకు, మారేడుమిల్లి, కొండకర్ల ఆవ,పులికాట్ సరస్సు), అరుదైన రుచులు (పూతరేకులు, చేపలపులుసు, రాగి సంగటి, బొంగు చికెన్), కళలుచేనేత (కొండపల్లి బొమ్మలు, కలంకారీ, నిమ్మలకుంట తోలుబొమ్మలాట, కోనసీమ ప్రభలతీర్థం), సాహస క్రీడల్లో భాగంగా రాక్‌క్లైంబింగ్, స్కూబా డైవింగ్, సర్ఫింగ్, బౌల్డరింగ్, బీచ్ టూరిజం(సూర్యలంక, విశాఖ, పేరుపాలెం,సీతపాలెం, కోనసీమ బ్యాక్ వాటర్) వంటి సకల పర్యాటక అనుభూతుల సమాహారమే ఆంధ్రప్రదేశ్ అని మంత్రి దుర్గేష్ ప్రకటించారు.

నీట్ రీఎగ్జామ్ ఫలితాలు విడుదల

11.21 లక్షల మందికి అర్హత

715 మార్కులతో ఆర్యన్ గుప్తా, పాన్సుల్ బన్సాల్ టాపర్లు

హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 16: దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎంబిబిఎస్, బిడిఎస్‌తోపాటు ఇతర మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)-యుజి-2026 రీ ఎగ్జామినేషన్ ఫైనల్ కీ విడుదల చేసిన ఎన్‌టిఎ తుది ఫలితాలను విడుదల చేసింది. 720 మార్కులకు గానూ పంజాబ్‌కి చెందిన ఆర్యన్ గుప్తా, హర్యానాకి చెందిన పాన్సుల్ బన్సాల్ ఇద్దరు 715 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. పరీక్షకు హాజరైన వారిలో 56.8 శాతం మంది మహిళలు, 55.1 శాతం మంది పురుషులు అర్హత సాధించారు. పరీక్షకు హాజరైన వారిలో 11.21 లక్షల మంది అర్హత సాధించినట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. మే 3న జరిగిన నీట్-యుజి-2026 ప్రశ్నాపత్రం లీకేజీ కావడంతో నీట్ యుజి రీఎగ్జామ్‌ను జూన్ 21న మరోసారి ఎన్‌టిఎ నిర్వహించిన విషయం తెలిసిందే. దేశ వ్యాప్తంగా 1.80 లక్షల మందితో భద్రతను ఏర్పాటు చేసి, పరీక్షకి అదనంగా 15 నిమిషాల సమయం కేటాయించింది ఎన్‌టిఎ. పరీక్షను మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు నిర్వహించారు. పరీక్షను దేశ వ్యాప్తంగా 551 నగరాలతోపాటు విదేశాల్లోని 14 నగరాల్లో నిర్వహించారు. నీట్ యుజి-2026 పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న 22,79,743 అందరికీ రీ ఎగ్జామ్ రాయడానికి ఎన్‌టిఏ అనుమతించింది. నీట్ రీ ఎగ్జామ్‌కి సుమారు 90 శాతం మంది హాజరైనట్టు ఎన్‌టిఏ ప్రకటించింది. పరీక్షను మొత్తం 13 భాషల్లో నిర్వహించారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, >>2

రేపు నింగిలోకి విక్రమ్-1 రాకెట్

సూళ్లూరుపేట, జులై 16 ప్రభాతవార్త: ప్రథమంగా ఇస్రో, స్వదేశీ ప్రైవేట్ కీలక భాగస్వామ్యతో..అంతరిక్ష రంగంలో ఎన్నో మైలురాళ్లను అధిగమించిన ఇస్రో మరో కీలక ప్రయోగానికి సిద్ధమైంది. ఇందులో భాగంగా హైదరాబాదుకు చెందిన స్పేస్ టెక్ స్టార్ట్ అప్ సమస్త రూపొందించిన విక్రమ్ 1అనే రాకెట్‌ను ఈనెల 18వ తేదీ ఉదయం 11 గంటల 30 నిమిషాలకు నింగిలోకి పంపనున్నది. ఈ రాకెట్ భారత అంతరిక్ష పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ జ్ఞాపకార్థం విక్రమ్ అని పేరు పెట్టారు. ఇందుకు తగ్గట్టుగా అనుసంధా కార్యక్రమాలు శ్రీహరికోటలో పూర్తి చేశారు. ఈ చారిత్రత్మకమైన ప్రయోగానికి మిషన్ ఆగమన్ అనే పేరు పెట్టారు.

విక్రమ్ రాకెట్ 24 మీటర్ల ఎత్తు గల మల్టీ స్టేజ్‌లు కలిగి ఉన్న రాకెట్. రాకెట్ బరువును తగ్గించి, ఎక్కువ బరువును మోసుకెళ్లే విధంగా ఆల్ కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో ఈ రాకెట్‌ను తయారు చేశారు. నాలుగు దశల్లో ప్రయోగం. ఈ రాకెట్ ప్రయోగంలో నాలుగు దశలు ఉంటాయి మూడు దశల్లో ఘనఇంధనం నాలుగో దశలో కక్ష్యను కచ్చితంగా సర్దుబాటు చేయడం కోసం హైపర్ గోలిక్ ద్రవ ఇంధనాన్ని ఉపయోగిస్తారు. ఈ రాకెట్‌లో త్రీ డి ప్రింటెడ్ ఇంజన్లు ఉపయోగించడంతో నిర్మాణ ఖర్చు తగ్గడమే కాకుండా వేగంగా అనుసంధానం ప్రక్రియను పూర్తి చేసేందుకు వీలవుతుంది.

అమెరికాలో ప్రమాదం విజయవాడ యువకుని మృతి

విజయవాడ, జులై 16,ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడకు చెందిన ఒక యువకుడు అమెరికాలో జరిగిన ప్రమాదంలో దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయాడు. ఉన్నత భవిష్యత్తు కోసం అగ్రరాజ్యానికి వెళ్లిన ఆ యువకుడు, కొత్త ఉద్యోగంలో చేరడానికి కేవలం ఒక్క రోజు ముందు జరిగిన స్కైడైవింగ్ ప్రమాదంలో మృతి చెందడం అతని కుటుంబంలో, స్వగ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడుకు చెందిన గద్దం మణిచంద్ర తేజ (28), అమెరికాలోని మసాచుసెట్స్‌లో నివసిస్తున్నాడు. జులై 12న ఆరెంజ్ టౌన్‌లో స్కైడైవింగ్ చేస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఆకాశం నుంచి కిందకు దిగుతున్న సమయంలో ఒక్కసారిగా బలమైన గాలులు వీయడంతో తేజ అదుపుతప్పి సుమారు 30 అడుగుల ఎత్తు నుంచి కింద పడిపోయాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన అతను అక్కడికక్కడే మరణించాడు. హైదరాబాద్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసిన తేజ, బోస్టన్‌లోని నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీలో ఎంఎస్ పట్టా పొందాడు. ఇటీవల క్లావియా అనే ప్రముఖ కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు. అయితే, విధుల్లో చేరడానికి ఒక్కరోజు ముందే ఈ దుర్ఘటన జరగడం అందరినీ కలచివేస్తోంది. తేజ ఉన్నత చదువుల కోసం అతని తల్లిదండ్రులు గద్దం ప్రసాద్, ఉమాదేవి దంపతులు సుమారు రూ. 50 లక్షల వరకు విద్యా రుణం తీసుకున్నట్లు తెలుస్తోంది.

22న తల్లికి వందనం జమ

విజయవాడ. జులై16. ప్రభాతవార్తప్రతినిధి: తల్లికి వందనం లబ్ధిదారులకు ప్రభుత్వం తీపి కబురు తెలిపింది. ఈ నెల 22న తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపింది. ఈ పథకం కింద ఒకటి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాకు రూ. 13,000లు, పాఠశాల అభివృద్ధికి రూ.2000ల చొప్పున మొత్తం రూ.15,000ల నగదును నేరుగా జమ చేస్తోంది. >>2

రాష్ట్రంలో 12కు పెరిగిన కరోనా కేసులు

దేశ వ్యాప్తంగా రెండు వారాల్లో 339 కేసులు నమోదు

విజయవాడ,జులై16,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో కొవిడ్ కేసులు చెదురుమొదురుగా బయటపడినట్లు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్ నేడొక ప్రకటనలో తెలిపారు.జూన్ 26 నుంచి జులై 16 వరకు మొత్తం 12 మంది కోవిడ్ వైరస్ బారిన పడ్డారు. వీరిలో నలుగురు మృతిచెందారు. వీరికి అంతకుముందే తీవ్రమైన బీపీ,షుగర్, కిడ్నీ, ఇతర తీవ్ర వ్యాధులతో >>2

తుంగభద్ర నుంచి తాగునీరు విడుదల చేసిన దృశ్యం

తుంగభద్ర నుంచి 1.5 టిఎంసిల నీటి విడుదల

కర్నూలు జిల్లా తాగునీటి సంక్షోభానికి తాత్కాలిక ఊరట

జలచౌర్యంపై అధికారుల్లో తీవ్ర ఆందోళన

రెండు రాష్ట్రాల్లో భద్రతా ఏర్పాట్లు

కర్నూలు, జులై 16, ప్రభాతవార్త : ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కర్నూలు జిల్లాలో తాగునీటి సంక్షోభాన్ని అధిగమించేందుకు తుంగభద్ర డ్యాం నుంచి 1.5 టిఎంసిల నీటిని విడుదల చేశారు. ప్రజల దాహార్తిని తీర్చడమే ప్రధాన లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి తెలిపారు. అయితే ఈ నీరు జిల్లాకు చేరే వరకు జలచౌర్యం, ప్రవాహంలో నీటి నష్టం వంటి అంశాలు అధికారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రస్తుతం కర్నూలు నగరానికి తాగునీటిని అందించే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో కేవలం వారం రోజులకు మాత్రమే సరిపడే నీటి నిల్వలు ఉండటంతో గత పది రోజులుగా తుంగభద్ర నుంచి నీటి విడుదల కోసం జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు తుంగభద్ర ప్రాజెక్టు అధికారులతో నిరంతరం చర్చలు జరిపారు. జిల్లా అధికారులు రెండు టిఎంసిల నీటిని కోరగా, ప్రాజెక్టు అధికారులు 1.5 టిఎంసిల నీటిని మాత్రమే విడుదల చేయడానికి అంగీకరించారు. జిల్లా >>2

17-7pg2exHMNWJQE.qxd:17-7pg2exHMNWJQE.qxd 1/1/02 6:38 AM Page 1

గురువారం హైదరాబాద్‌లో డి.సిఎం పవన్‌ను పరామర్శిస్తున్న గవర్నర్ నజీర్

డి.సిఎం పవన్‌ను పరామర్శించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

విజయవాడ,జూలై 16,ప్రభాతవార్తప్రతినిధి: కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ పరామర్శించారు. గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ గురువారం ఉదయం హైదరాబాద్‌లోని పవన్ కల్యాణ్ నివాసానికి విచ్చేశారు. ఆయనతో మాట్లాడి శస్త్ర చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య నిపుణుల సూచనలు పాటించాలని చెప్పారు. త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో విధుల్లోకి రావాలని ఆకాంక్షించారు.పవన్ కల్యాణ్ లైబ్రరీని జస్టిస్ అబ్దుల్ నజీర్ తిలకించారు. లైబ్రరీలోని పలు పుస్తకాలను పరిశీలించారు. ప్రఖ్యాత రచయితలు, స్కాలర్స్, విశ్లేషకులు, పబ్లిక్ పాలసీ మేకర్స్ రాసిన పుస్తకాలు పరిశీలించారు. వాటి గురించి పవన్ కల్యాణ్‌తో ఆసక్తిగా చర్చించారు. పవన్ కల్యాణ్ కోరడంతో ఓ పుస్తకంపై జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆటోగ్రాఫ్ చేశారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఎంతో ఆప్యాయతతో వచ్చి పరామర్శించి నందుకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

పెరిగిన కరోనా కేసులు

>> బాధపడుతున్నారని ఈ యేడాది తొలి కొవిడ్ కేసు జూన్ 26న కడప జిల్లాలో నమోదైంది. జులై 1 నుంచి 16 వరకు మరో 11 కేసులు బయటపడ్డాయి. వీరిలో ఇద్దరు కొవిడ్ సోకిన వ్యక్తులతో సన్నిహితంగా మెలిగినవారుగా గుర్తించారు. మొత్తం కేసుల్లో కడప జిల్లాలో అత్యధికంగా ఎనిమిది నమోదయ్యాయి. గుంటూరులో రెండు, విశాఖపట్నం, కాకినాడ జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున వెలుగుచూశాయి. ఇవన్నీ వేర్వేరు మండలాలు, ప్రాంతాల్లో నమోదైనవేనని.. ఒకేచోట కేసులు గుంపుగా బయటపడలేదని వీర పాండియన్ తెలిపారు

67 మందికి కోవిడ్ రీక్షలు

జూన్ 26 నుంచి జులై 15 వరకు రాష్ట్రంలో 67 మందికి కొవిడ్ పరీక్షలు నిర్వహించగా 11 మందికి పాజిటివ్‌గా తేలింది. కాకినాడ జిల్లాకు చెందిన మరోకరికి తమిళనాడులోని వేలూరు సిఎంసిలో నిర్వహించిన పరీక్షలో వైరస్ నిర్ధారణైంది.

4 మరణాలు

కొవిడ్ పాజిటివ్‌గా తేలినవారిలో కడప జిల్లాకు చెందిన ముగ్గురు, కాకినాడ జిల్లాకు చెందిన ఒకరు మృతి చెందారు. వీరందరికీ ముందునుంచే తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్నాయని వైద్య ఆరోగ్యశాఖ పేర్కొంది. వైరస్ జన్యు స్వరూపాన్ని గుర్తించేందుకు ఐదు నమూనాలను జులై 9న పుణెలోని జాతీయ వైరాలజీ సంస్థకు జన్యుక్రమ విశ్లేషణ కోసం పంపించారు. ప్రస్తుతం ముగ్గురు స్వీయ గృహ నిర్బంధంలో ఉన్నారు. ఇద్దరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరో ముగ్గురు కోలుకుని డిశ్చార్జి అయ్యారు. ప్రజల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ముందు జాగ్రత్తలు పాటించాలని, వైద్యులు, ఆసుపత్రులు సిబ్బందిని అప్రమత్తం చేశామని వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి వీర పాండియన్ తెలిపారు. జిల్లాలవారీగా కేసులు గమనిస్తే కడప 8, గుంటూరు 2, విశాఖపట్నం 1, కాకినాడ 1, మొత్తం కేసులు: 12

3 రోజులు వర్ష సూచన

విజయవాడ. జులై 16,ప్రభాతవార్తప్రతినిధి: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా - పశ్చిమ బెంగాల్ తీరాల మీదుగా ఉన్న నిన్నటి అల్పపీడనం, ఈ రోజు, జులై 16, 2026, ఉదయం అదే ప్రాంతంలో బలమైన అల్పపీడన ప్రాంతంగా మారింది. దీని అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి, ఎత్తు పెరిగే కొద్దీ నైరుతి దిశగా వంగి ఉంది.ఇది రాబోయే 2 రోజులలో ఉత్తర ఒడిశా, గంగానది పశ్చిమ బెంగాల్ మీదుగా వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉంది. సగటు సముద్ర మట్టం వద్ద ఉన్న రుతుపవన ద్రోణి ఇప్పుడు జమ్మూ, బరేలీ, బస్తీ, డాల్టన్‌గంజ్, వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా - పశ్చిమ బెంగాల్ తీరాల మీదుగా ఉన్న బలమైన అల్పపీడన ప్రాంత కేంద్రం గుండా ప్రయాణించి, అక్కడి నుండి తూర్పుఆగ్నేయ దిశగా ఈశాన్య బంగాళాఖాతం వైపు కదులుతుంది.వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా - పశ్చిమ బెంగాల్ తీరాలపై ఏర్పడిన బలమైన అల్పపీడన ప్రాంతంతో సంబంధం ఉన్న ఉపరితల ఆవర్తనం నుండి తూర్పుమధ్య అరేబియా సముద్రం మీదుగా కోస్తా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర వరకు సగటు సముద్ర మట్టానికి 5.8 నుండి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. నేటి సాయంత్రానికి భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 40 -50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది. వడగాలులు ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశముంది.శుక్రవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 40-50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశముంది. శనివారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 40-50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది.ఈ రోజు రాత్రికి తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 40-50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది. వడగాలులు ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశముంది. శుక్రవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 40 50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది.

ఎపి లిక్కర్ కుంభకోణం కేసు: నిందితులను కస్టడీకి తీసుకున్న ఇడి

విజయవాడ, జులై16,ప్రభాతవార్తప్రతినిధి: ఎపి లిక్కర్ రవాణా కుంభకోణం కేసులో నిందితులను ఇడి కస్టడీకి తీసుకోంది. వారిని మూడు రోజుల పాటు ఇడి ప్రశ్నించనుంది. రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డి, సునీల్‌కుమార్‌ను కస్టడీలోకి తీసుకోనున్నారు. ప్రస్తుతం చంచల్‌గూడ కారాగారంలో వీరు ముగ్గురు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. చంచల్‌గూడ జైలు నుంచి ముగ్గురిని ఇడి కార్యాలయానికి తరలించి విచారించనున్నారు. మనీలాండరింగ్, ఆర్థిక లావాదేవీలు, లిక్కర్ రవాణాపై ప్రశ్నించనున్నారు. విచారణలో మరిన్ని కీలక వివరాలు తెలిసే అవకాశం ఉందని ఈడీ భావిస్తోంది.నిందితులను ప్రశ్నించి మరిన్ని వివరాలు రాబట్టే ప్రయత్నం చేయనున్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం రవాణా టెండర్ల కేటాయింపులో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఇడి మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపడుతోంది.

భవిష్యత్తు పిపిపిలదే

>> ట్రాల్సి రావొచ్చని సిఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సిఎం స్వర్ణాంధ్ర విజన్ మైక్రో, మ్యాక్రో లక్ష్యాలకు అనుగుణంగా ప్రాజెక్టులు చేపట్టాలని అన్నారు. ఎప్పటికప్పుడు లోటుపాట్లను సరిదిద్దుకుంటూ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో పరిశ్రమలకు సరఫరా చేసే నీటి ద్వారా జలవనరుల శాఖకు ఆదాయం వస్తుందని... సాగునీటి సంఘాలు కూడా ఈ ప్రక్రియలో కీలకంగా ఉంటాయన్నారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ఫైనాన్షియల్ ప్లాన్ ను తయారు చేసుకోవాలని సిఎం స్పష్టం చేశారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా ఆదాయ మార్గాలను నిర్దేశించుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖలు పెట్టుబడి దారుల నుంచి విశ్వాసాన్ని కలిగించేలా పీపీపీ ప్రాజెక్టులను చేపట్టాలని సీఎం సూచించారు. ఏ రంగమైనా ఏపీకి ఫస్ట్ మూవర్ అడ్వాంటేజి రావాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

ప్రభుత్వ ఆస్తుల సద్వినియోగం..

ప్రభుత్వం వద్ద నిరర్ధకంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మలచుకోవాలని సిఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని అన్ని బస్టాండ్ల వద్ద ప్రభుత్వానికి ఉన్న భూములను వాణిజ్య పరంగా వినియోగించుకునే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పంప్డ్ స్టోరేజీ, సౌరవిద్యుత్ ప్రాజెక్టులు కూడా పిపిపి కింద చేపట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గనులు, నెడ్ క్యాప్, పర్యాటకం, లాజిస్టిక్స్ రంగాల్లో భారీగా ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉందని సిఎం అన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఉన్న విద్యార్థుల సంఖ్యను రెట్టింపు చేసేందుకు ఆలోచన చేస్తున్నామని.. పట్టణ ప్రాంతాల్లో రహదారులకు సమీపంలోనే మినీ టౌన్‌షిప్‌లా రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సిఎం సూచించారు. బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను నైపుణ్యం ఉన్న మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందని సిఎం స్పష్టం చేశారు. ఐఐటీ, ఐఐఎం లాంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లోనూ చదివేలా వీరిని తీర్చి దిద్దాలని అన్నారు. ఈ సమీక్షకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆ శాఖ ఉన్నతాధికారులు పీయూష్ కుమార్, వి.వినయ్ చంద్, రోనాల్డ్ రోస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఐఅండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు తదితరులు హాజరయ్యారు.

'జమిలి'కి ఇసి రెడీ

>> కలల ప్రాజెక్టుగా పేర్కొన్న ఈ ప్రతిపాదనపై మాట్లాడుతూ, 1954 నుంచి 1960 మధ్యకాలంలో దేశంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి బ్యాలెట్ పేపర్ల ద్వారా నిర్వహించిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం అనేది కేవలం ఎన్నికల షెడ్యూల్‌ను సమన్వయం చేయడమే తప్ప, రాష్ట్రాల అధికారాలు లేదా రాజ్యాంగ హక్కులను ఏ విధంగానూ తగ్గించదని నిపుణులు అభిప్రాయపడుతున్నట్లు చౌదరి చెప్పారు.ఈ ప్రతిపాదనకు ప్రజల నుంచి విస్తృత మద్దతు లబిస్తోందని పేర్కొంటూ, పౌర సమాజ ప్రతినిధులు, సాధారణ ప్రజల్లో దాదాపు 99 శాతం మంది ఒకే దేశం ఒకేసారి ఎన్నికలకు అనుకూలంగా ఉన్నారని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రతిపాదన ప్రకారం, దేశవ్యాప్తంగా ప్రతి ఐదేళ్లకోసారి లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఎన్నికల చక్రాన్ని సమన్వయం చేసి, ఓటర్లు ఒకే సమయంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులను ఎన్నుకునే అవకాశం కల్పించడమే లక్ష్యం.ఈ విధానాన్ని అమలు చేయడానికి రూపొందించిన భారత రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో మూడింట రెండొంతుల మెజారిటీతో ఆమోదం పొందడంతో పాటు, కనీసం సగం రాష్ట్రాల శాసనసభల ఆమోదంకూడా పొందాల్సి ఉంటుంది. ఈ ప్రతిపాదనలో పంచాయతీలు, మున్సిపాలిటీల ఎన్నికలు లేదా ఉపఎన్నికలు ప్రస్తుతం చేర్చలేదు. ఒకేసారి ఎన్నికల సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన 2023 సెప్టెంబరులో కేంద్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 2024లో సమర్పించిన నివేదికలో తొలి దశలో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను సమకాలీకరించాలని, అనంతరం 100 రోజుల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని సిఫార్సు చేసింది.

మూడు స్థాయిల ప్రభుత్వాల ఎన్నికల కోసం ఒకే ఓటరు జాబితా మరియు ఒకే ఎలెక్టర్ ఫోటో ఐడెంటిటీ కార్డు అమలు చేయాలని కూడా కమిటీ సూచించింది.కోవింద్ కమిటీ సిఫార్సుల ఆధారంగా కేంద్ర మంత్రివర్గం 2024 సెప్టెంబరులో ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. రెండు దశల్లో అమలు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం, తొలి దశలో లోక్‌సభఅసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం, రెండో దశలో వాటి తర్వాత 100 రోజుల వ్యవధిలో మున్సిపాలిటీలు, పంచాయతీల ఎన్నికలు నిర్వహించే విధంగా ప్రణాళిక రూపొందించింది.

నీట్ రీఎగ్జామ్ ఫలితాలు విడుదల

>> కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళంతోపాటు ఉర్దూ భాషల్లో పరీక్షను నిర్వహించారు. నీట్ రీ ఎగ్జామ్‌కి హాజరైన వారిలో 11.21 లక్షల మంది అభ్యర్థులు అర్హత సాధించారు. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (అండర్ గ్రాడ్యుయేట్) నీట్(యుజి)-2026 ఫలితాలను ఎన్‌టిఏ ప్రకటించింది. అభ్యర్థుల మెడికల్ అడ్మిషన్. కౌన్సెలింగ్ ప్రక్రియ షెడ్యూల్ ప్రకారం సాగేలా చూసేందుకు ఈ ఫలితాలను సకాలంలో విడుదల చేశారు. భారతదేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో ఉన్న 5,440 కేంద్రాలలో సుమారు 20 లక్షల మంది అభ్యర్థులు నీట్ రీఎగ్జామ్‌కి హాజరయ్యారు. అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్, డెంటల్, ఆయుష్ అనుబంధ కోర్సుల్లో ప్రవేశానికి 11.21 లక్షల మంది అభ్యర్థులు అర్హత సాధించారు. అభ్యర్థులందరి స్కోర్‌కార్డులు అధికారిక ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. 720 మార్కులకు గాను 138 మంది అభ్యర్థులు 690కి పైగా మార్కులు సాధించారు. వారిలో 93 శాతానికి పైగా అభ్యర్థులు మొదటిసారిగా నీట్ పరీక్షకు హాజరయ్యారు. 99 శాతం మంది 17 నుండి 19 ఏళ్ల వయస్సు గలవారు. ఉత్తరప్రదేశ్‌లో 1.7 లక్షలకు పైగా ఉండగా, లక్షద్వీప్‌లో 43 మంది పరీక్షకు హాజరయ్యారు. 17 మంది రాష్ట్ర స్థాయి టాపర్లు 700 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించగా, 26 మంది 690కి పైగా మార్కులు సాధించారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన 138 మంది అభ్యర్థులు దేశవ్యాప్తంగా 66 నగరాల నుండి ఉన్నారు. 705 మార్కులకు పైగా సాధించిన మొదటి 17 మంది ర్యాంకర్లు పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు చెందినవారు. 720 మార్కులకు గాను 19 మంది అభ్యర్థులు 700కు పైగా మార్కులు సాధించారు. 1,492 మంది అభ్యర్థులు 650 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించారు. 10,160 మంది అభ్యర్థులు 600 మరియు అంతకంటే ఎక్కువ మార్కులు సాధించారు. 90,780 మంది అభ్యర్థులు 500 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించారు. జనరల్‌లో 2.91 లక్షలు, ఓబీసీ-ఎన్‌సీఎల్ అభ్యర్థులు 5.12 లక్షలు, ఎస్సీ 1.59 లక్షలు, ఎస్టీ 63,716, జనరల్ ఈడబ్ల్యూఎస్ 95,026, పిడబ్ల్యూబిడి 3,666మంది, పిడబ్ల్యూడి 303 మంది అర్హత సాధించారు.

తల్లికి వందనం జమ

>> ఈ మేరకు ఈ పథకాన్ని 2026-2027 విద్యాసంవత్సరానికి వర్తింపజేస్తూ ఉత్తర్వులిచ్చింది. ఇందుకోసం రూ.10,120.78 కోట్ల చెల్లింపునకు విద్యాశాఖ అనుమతినిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులిచ్చారు. తద్వారా 67,47,190 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.ఈనెల 22 నాటికి 64,76,590 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమకానుంది. అదే రోజున స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో అర్హుల జాబితా ప్రకటిస్తారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే ఆగస్ట్ 3 వరకు స్వీకరిస్తారు. ఆ తర్వాత సప్లిమెంటరీ జాబితాను ఆగస్ట్ 10 నాటికి విడుదల చేస్తారు. కొత్తగా అడ్మిషన్లు తీసుకున్న ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆగస్ట్ 25 వరకు గడువు విధించారు. వీరిలో అర్హులైన వారిని ఆగస్ట్ 30న ప్రకటించి ఆదే రోజు వారి తల్లుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తారు.

మరోవైపు తల్లికి వందనం పథకం కోసం 1.55 లక్షల మంది ఇళ్ల వివరాలు లేవని విద్యాశాఖ పేర్కొంది. ఈసారి ఈ పథకాన్ని అంగన్వాడీలకు కూడా వర్తింపజేస్తారు. దీంతో మంత్రి లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ ఆదాయం నెలకు రూ.10,000లు, పట్టణ ప్రాంతాల్లో రూ.12,00లకు మించకూడదు. రేషన్ కార్డు కలిగి ఉండాలి. కుటుంబానికి 3 ఎకరాల్లోపు మగాణి, 10 ఎకరాల్లోపు మెట్ట లేదా రెండూ కలిపి 10 ఎకరాల్లోపు ఉండాలి. కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా ఫోర్ వీలర్ ఉంటే పథకం వర్తించదు. ట్రాక్టర్లు, ఆటోలు, ట్యాక్సీలకు మినహాయింపు ఇచ్చారు.అలాగే సంవత్సరం నెలకు కరెంట్ వినియోగం సగటున 300 యూనిట్లలోపు ఉండాలి. పురపాలిక పరిధిలో 1000 చదరపు అడుగుల కంటే ఎక్కువ స్థిరాస్తిని కలిగి ఉండకూడదు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ తర్వాత పింఛన్ పొందేవారు ఈ పథకానికి అనర్హులు. పారిశుద్ధ్య కార్మికులకు మినహాయింపు ఉంటుంది. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ఇన్ కమ్ ట్యాక్స్ చెల్లిస్తే ఈ పథకం వర్తించదు. రాష్ట్ర గృహ డేటాబేస్‌లో ఉండాలి.

సెప్టెంబరులో స్థానిక ఎన్నికలు!

విజయవాడ, జులై 16,ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్‌లో ప్రారంభం కానున్నాయి. తొలుత మున్సిపల్ ఎన్నికలను సెప్టెంబర్‌లో నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. మున్సిపల్ ఎన్నికల తర్వాత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించనుంది. ఆ తర్వాత గ్రామ పంచాయితీ ఎన్నికలు నిర్వహించాలని ప్రాథమికంగా ఎపి సర్కార్ భావిస్తోంది. ఈ నెల 27వ తేదీ నుంచి 45 రోజుల పాటు తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆయా నియోజకవర్గాల్లో ఇంటింటికీ వెళ్లాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రతిపక్ష నేతల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సిఎం ఆదేశాలు జారీ చేశారు. డోర్ టూ డోర్ క్యాంపెయిన్ ఎన్నికల ప్రచారంగా ఉపయోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు జోనల్ కోఆర్డినేటర్లు, పార్టీ నేతల సమావేశంలో టిడిపి అగ్రనేతలు వెల్లడించారు. ఈ క్రమంలోనే ఖాళీగా ఉన్న నియామక పదవులన్నింటిని వెంటనే భర్తీ చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు.

వారం - వర్జ్యం

17-07-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పునర్వసు కార్తె
తదియ ఉ.6.28, చవితి తె.4.44
మఖ సా.6.40
వర్జ్యం : ఉ.7.19-ఉ.8.50, 2) రా.2.29-తె.4.02
దు.ఉ.8.19-ఉ.9.11, 2) మ.12.39-మ.1.31
శుభసమయం : ఉ.6.00-7.00
రాహుకాలం - ఉ.10.30-12.00

వార్తాఫలం

మేషం: మిత్రులతో కలిసి విందు, వినోదాలలో పాల్గొంటారు. రాజకీయ రంగాల వారికి ప్రభుత్వ రంగాల నుండి ఆహ్వానాలు అందుతాయి.

వృషభం: చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. నూతన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి.

మిథునం: పెద్దల శ్రేయోభిలాషులు ఇచ్చిన సలహాలు పాటించడానికి కాలం కలిసి రాదు. జాగ్రత్తలు అవసరం.

కర్కాటకం: సంఘంలోని పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.దూర ప్రాంతాల నుండి కీలక సమాచారాలు అందుతాయి.

సింహం: సంక్షేమ పథకాల వలన లాభపడతారు. పొదుపు చేయాలనుకునే ఆలోచనలు కార్యరూపం దాల్చవు.

కన్య : కీలక విషయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. దీర్ఘకాలికి సమస్యలు తీరుతాయి.

తుల : పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. శత్రువులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు. ఆస్తివివాదాలు తీరుతాయి.

వృశ్చికం: మానవసేవే మాధవసేవని నమ్ముతారు. అనుకూల ఫలితాలు అధికంగా ఉంటాయి. విందులు, వినోదాలలో పాల్గొంటారు.

ధనుస్సు: ఉద్యోగస్తులు తమ తోటి వారితో అప్రమత్తంగా మెలగాలి. సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు.

మకరం: కుటుంబంలో చెప్పుకోదగిన మార్పులు ఏర్పడవు. అంతా మంచికే అనుకొని సర్దుకు పోవటం మంచిది. వస్త్రలాభం.

కుంభం: వివాహ యత్నాలు ఫలిస్తాయి. పాతబాకీలు వసూలవుతాయి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది.

మీనం: మనోధైర్యంతో మీరు తీసుకునే నిర్ణయాలు నలుగురిలో స్లాఘించ బడతాయి. సోదరుల కలయిక.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

జగన్నాథుని రథం ముందు శుభ్రం చేస్తున్న చంద్రబాబు

అమరావతిలో జగన్నాథ రథయాత్ర

ఆధ్యాత్మికత ఒక్కటే ఒత్తిడి తగ్గించే మంత్రం: సిఎం చంద్రబాబు

విజయవాడ, జులై 16,ప్రభాతవార్తప్రతినిధి: రోజువారీ జీవితంలో ఒత్తిడి తగ్గించే అత్యుత్తమ మంత్రం ఆధ్యాత్మికత ఒక్కటేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. సమాజాన్ని ప్రశాంతంగా ఉంచే క్షేత్రాలు మన దేవాలయాలని సిఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. సమాజంలో మానవ సంబంధాలు తగ్గి సామాజిక మాధ్యమాల ప్రతికూల ప్రభావం పడుతోందని ఆయన అన్నారు. ఈ కారణంగా కొన్ని కుటుంబాల్లో ఆత్మహత్యలు, చిన్నారులపై అఘాయిత్యాల లాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. అందరి జీవితాల్లో ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత చేకూరేందుకు ఆధ్యాత్మికతే మార్గమని ఆయన వివరించారు. అందుకే రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాలు నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. అమరావతి రాజధానిలోని వెంకటపాలెం నుంచి జగన్నాథుడి రథయాత్రను ముఖ్యమంత్రి ప్రారంభించారు. పూరీ క్షేత్రంలో నిర్వహించే సంప్రదాయ క్రతువులను అనుసరిస్తూ జగన్నాథ, బలభద్ర, సుభద్రలతో కూడిన రథం ముందు సిఎం బంగారు చీపురుతో ఊడ్చి శుభ్రంచేసి స్వామివారి రథ యాత్రను తాడుతో లాగి ప్రారంభించారు. అమరావతి రాజధాని నగర బృహత్ ప్రణాళికతో కూడిన చిత్ర పటాన్ని శిరస్సుపై ధరించి విశ్వ నగరిగా అమరావతి ఎదగాలని ముఖ్యమంత్రి జగన్నాథ స్వామిని కోరుకున్నారు. అంతకు ముందు అక్కడే ఏర్పాటు చేసిన రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని సిఎం ప్రసంగించారు. భారతీయ సంస్కృతిలో భాగమైన ఉమ్మడి కుటుంబాలు రావాలని మైక్రో ఫ్యామిలీలు కాదని సిఎం అన్నారు. పూరీ క్షేత్రంలో నిర్వహించే జగన్నాథ రథ యాత్రకు ఎంతో ప్రత్యేకత ఉందని.. అలాంటి రథ యాత్రను అమరావతిలో తొలిసారి నిర్వహించటంపై సిఎం సంతోషం వ్యక్తంచేశారు. ప్రతీ యేటా జగన్నాథ రథ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఇస్కాన్ సంస్థ ప్రకటించిందని అన్నారు. ఆధ్యాత్మికత, ప్రజా సేవలో ఇస్కాన్, అక్షయపాత్ర ఫౌండేషన్‌లు పనిచేస్తున్నాయని తెలిపారు. దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 25 వేల పాఠశాలల్లో ఆహారం అందిస్తున్నాయన్నారు. ఏపిలోని 10 సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా 1.80 లక్షల మంది విద్యార్థులకు అక్షయపాత్ర ఫౌండేషన్ ఆహారం అందిసోందన్నారు. భారతీయ సంస్కృతిని కాపాడేందుకు ఇస్కాన్ లాంటి సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు. జగన్నాథ రథ యాత్ర కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి పి.నారాయణ, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్ కుమార్ తదితర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

కదిలిన జగన్నాథ రథాలు

>> గుండెపోటుకు గురై మృతిచెందినట్లు తేలింది. వీరితోపాటుగా మొత్తం 120 మందికిపైగా గాయాలపాలయ్యారు. లక్షలాదిమంది తరలిరావడంతో రథాలు లాగేందుకు భక్తులు ఎగబడటంతో తొక్కిసలాట తీవ్రమయింది. ఈకారణంగానే ఇరువురు మృతిచెందడం సుమారుగా వందకుపైగా భక్తులు గాయపడటం జరిగింది. గుండిచా ఆలయం సమీపంలో మరీచకోట్‌కు చేరువలో ఈ దుర్ఘటన సంభవించింది. భక్తులు భారీ సంఖ్యలో రావడంతో అదుపుతప్పి తొక్కిసలాటకు దారితీసినట్టు తెలుస్తోంది. క్షతగాత్రులను చికిత్స కోసం సమీపంలో ఆసుపత్రులకు తరలించారు. బోడా దండాపై రథం లాగుతుండగా ఈ ఘటన జరిగింది. ఊపిరాడకపోవడంతో ఒక భక్తుడు స్పృహ కోల్పోయినట్లు సమాచారం. అతడిని వెంటనే పూరీ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. దురదృష్టవశాత్తు, ఆసుపత్రికి చేరుకునేసరికే అతడు మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. గాయపడిన వారికి అత్యవసర వైద్య బృందాలు చికిత్స అందిస్తున్నాయి. ఒక్కసారిగా తొక్కిసలాట జరగడంతో ఇద్దరు మృతిచెందడంతోపాటు కిందపడి అనేకమంది గాయాలపాలయ్యారు. ఇక రథయాత్ర కోసం ప్రభుత్వం కూడా భారీగా ఏర్పాట్లు చేసింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, వైద్యసిబ్బంది మోహరించారు. అయినాకూడా ఒకేచోట పెద్ద ఎత్తున గుమిగూడడంతో ఈ తొక్కిసలాట జరిగినట్లుగా తెలుస్తోంది. వెంటనే పోలీసులు స్పందించి పలువురిని రక్షించారు. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ లక్షలాది మంది భక్తులు పూరీకి చేరుకున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా భక్తులు రథాలవైపు దూసుకురావడంతోనే ఒకరినొకరునెట్టుకుని, కిందపడిపోయి ఊపిరాడక అస్వస్థతకు గురయ్యారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనా స్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో పలువురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

అత్యంత వైభవంగా గురువారం ప్రారంభమైన రథయాత్ర మహోత్సవంలో పాల్గొనేందుకు దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు పూరీకి తరలివచ్చారు. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవి కొలువై ఉన్న రథాలను లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. జై జగన్నాథ్ నినాదాలతో పూరీ వీధులు మార్మోగాయి. యేడాదికి ఒకసారి గర్భగుడి నుంచి బయటకు వచ్చి, గుండిచా ఆలయంలోని తన అత్తవారింటికి వెళ్లే జగన్నాథుడిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ యాత్ర భారతదేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోడీ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. జగన్నాథుడి ఆశీస్సులతో అందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. రథయాత్రకు భారీ సంఖ్యలో భక్తులు వస్తారన్న అంచనాతో ఒడిశా ప్రభుత్వం కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేసింది. భద్రత కోసం 13వేల మందికి పైగా పోలీసు సిబ్బందిని, కేంద్ర బలగాలను మోహరించారు. 19 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. 473 సిసిటీవీ కెమెరాలు, 65 భారీ ఎల్ఇడి స్క్రీన్లను ఏర్పాటు చేశారు. 13వేల మందికిపైగా భద్రతా సిబ్బంది విధుల్లో నిమగ్నం అయ్యారు.

మాజీ మంత్రి అంబటి రాంబాబుపై కేసు నమోదు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై16(ప్రభాతవార్త): మాజీమంత్రి, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల లో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తూ అందులో భాగంగా గార్డ్ ఆఫ్ హానర్ సందర్భంలో పోలీసులను తోసివేసిన సంఘటనలో మాజీమంత్రి వైకాపా నేత అంబటి రాంబాబుతో పాటు ఆయన అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విధులకు తీవ్ర ఆటంకం కలిగించినట్లు లిఖితపూర్వక ఫిర్యాదుతో పెద్దాపురం డీఎస్పీ, పెద్దాపురం, జగ్గంపేట సీఐల సమక్షంలోనే పోలీసులపై తోపులాటపై ఏఆర్ ఎస్ఐ వెలుదూటి అప్పలరాజు, పలువురు కానిస్టేబుళ్ల ఫిర్యాదుతో కిర్లంపూడి పోలీసులు ఈ కేసు నమోదు చేశారు.భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్లు 132, 3(5) కింద అంబటి రాంబాబు సహా మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.ప్రభుత్వ లాంచనాలతో దివంగత ముద్రగడ పద్మనాభంకి ఘనంగా వీడ్కోలు పలికేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. ప్రభుత్వ లాంఛనంగా పోలీసులు గాడ్ ఆఫ్ హానర్ ప్రారంభించారు. దీంతో పోలీసులకు అడ్డుపడుతూ వారిని అంబటి తోసివేయడంతో ఈమేరకు కేసు నమోదు చేశారు.

1.5 టిఎంసిల నీటి విడుదల

>> కలెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం జూలై 16న విడుదలైన నీరు ఐదు రోజుల వ్యవధిలో కర్నూలు జిల్లాకు చేరనుంది. ముందుగా జిల్లాలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపి నగర ప్రజలకు తాగునీటి సరఫరా కొనసాగించేలా చర్యలు చేపడుతున్నారు. అయితే నీరు ప్రయాణించే క్రమంలో ఆవిరి, భూమిలోకి ఇంకి పోవడం తదితర కారణాలతో సుమారు 400 క్యూసెక్కుల మేర నష్టం సంభవించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు వర్షాలు లేకపోయినా ఇప్పటికే సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు కొంతమంది రైతులు కాలువల నుంచి నీటిని మళ్లించే అవకాశాలు ఉన్నందున జలచౌర్యం జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. నీటి విడుదలతో కర్ణాటక రాష్ట్ర పరిధిలోనే భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోకి నీరు ప్రవేశించిన తర్వాత కర్నూలు వరకు నీరు చేరేందుకు పోలీస్, రెవెన్యూ, సాగునీటి శాఖల సమన్వయంతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ విషయంలో తహసీల్దార్లు, ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు, పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని జిల్లా కలెక్టర్ తెలిపారు. తాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని వినియోగించాలని, ట్యాంకుల నుంచి నేరుగా నీటిని తీసుకునేందుకు ప్రయత్నించినా లేదా సాగునీటిగా మళ్లించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ యేడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు అత్యల్పంగా కురిసినందున ప్రస్తుతం సాగునీటిని అందించే పరిస్థితి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజల తాగునీటి అవసరాలే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. అయితే రైతుల్లో మాత్రం ఆందోళన నెలకొంది. నీటి కొరతతో పంటలు ఎండిపోతున్న పరిస్థితుల్లో తుంగభద్ర నుంచి నీరు విడుదల కావడం ఆశలు కలిగించినా, తాగునీటికే పరిమితం చేయడంతో సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు జలచౌర్యం, ప్రవాహ నష్టం కలిపి చివరకు జిల్లా తాగునీటి అవసరాలకు ఎంత మేర నీరు అందుతుందన్న దానిపై అధికారులు నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం విడుదలైన నీటితో కర్నూలు జిల్లా తాగునీటి సంక్షోభానికి తాత్కాలిక ఉపశమనం లభించే అవకాశం ఉన్నప్పటికీ, రానున్న రోజుల్లో వర్షాలు కురవకపోతే మళ్లీ తుంగభద్ర డ్యాంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

17-7Pg3exHMNWJQEK.qxd:17-7Pg3exHMNWJQEK.qxd 1/1/02 6:47 AM Page 1

ఆక్వా రైతుల సబ్సిడీకి తిలోదకాలు ఇచ్చిన జగన్
ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరం

● ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: ఆక్వా రైతుల విద్యుత్ సబ్సిడీ విధానాన్ని నిర్వీర్యం చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇప్పుడు ఆక్వా రైతుల గురించి మాట్లాడటం ఆశ్చర్యకర మని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. ఈ మేరకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఓ నోట్‌ను విడుదల చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలోనే ఆక్వా ప్రాంతాన్ని ఆక్వా, నాన్ ఆక్వా జోన్‌లుగా విభజించి వేలాది మంది రైతులను విద్యుత్ సబ్సిడీకి దూరం చేశారని మంత్రి పేర్కొన్నారు. జగన్ రెడ్డి తీసుకొచ్చిన ఈ విధానంతోనే ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ విధానాన్ని సరిదిద్దుతూ అర్హులైన ఆక్వా రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించి ప్రతి అర్హులైన రైతన్నలకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న కూటమి ప్రభుత్వం వ్యవసాయ రైతులతో పాటు ఆక్వా రైతులు, చేనేత కార్మికులు, స్వర్ణకారులు, నాయి బ్రాహ్మణులకు కూడా విద్యుత్ సబ్సిడీలు అందిస్తోందని మంత్రి గొట్టిపాటి వివరించారు. వివిధ వర్గాల జీవనోపాధికి అండగా నిలిచేలా విద్యుత్ రాయితీలను కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో విద్యుత్ రంగంతో పాటు ఆక్వా రంగం, ఇతర కీలక వ్యవస్థలను వైఎస్సార్సీపీ ప్రభుత్వం దెబ్బతీసిందని మంత్రి ఆరోపించారు. ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేస్తూ జగన్ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డి చేపడుతున్న యాత్రలు, పర్యటనలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాకుండా రాజకీయ స్వలాభం కోసమేనని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

విజయనగరాన్ని రాష్ట్రానికి వెన్నెముకగా తీర్చిదిద్దండి

● జలధార-జలహారతితో భూగర్భ జలాలు పెరిగాయి ● ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి ● రాష్ట్ర ఇన్‌చార్జి, హోం మంత్రి వంగలపూడి అనిత

విజయనగరం, జులై 16 ప్రభాతవార్త: విజయనగరం జిల్లాను వెనుకబడిన జిల్లాగా కాకుండా రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముకగా నిలిచే జిల్లాగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఇన్‌చార్జ్, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సమీక్షా కమిటీ (డీఆర్‌సీ) సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జలధార- జలహారతి కార్యక్రమం ఫలితంగా భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా మెరుగుపడిందన్నారు. జిల్లాలో మొత్తం 8,059 ఎంఐ ట్యాంకులుండగా, వాటిలో 6,447 ట్యాంకుల పనులకు మంజూరు లభించిందని, ఇప్పటికే 6,442 ట్యాంకుల పనులు పూర్తయ్యాయని తెలిపారు. అలాగే 2,549 కాలువల పనులు కొనసాగుతున్నాయని, రూ.320.62 కోట్లు వ్యయం చేసినట్లు చెప్పారు. ఈ పనుల ద్వారా 1.28 కోట్ల పనిదినాలు కల్పించడంతో పాటు పూడిక తొలగింపు కారణంగా నీటి నిల్వ సామర్థ్యం పెరిగి అదనపు ఆయకట్టుకు అవకాశం ఏర్పడిందన్నారు. సమర్థవంతంగా అమలు చేస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, సాగునీటి శాఖ అధికారులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు కార్యాచరణ: ఎల్‌నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. వచ్చే రెండు నుంచి మూడు వారాల్లో పూర్తి స్థాయి కార్యాచరణ ప్రణాళికతో ముందుకు రావాలని సూచించారు.

రైతులకు ఎరువుల కొరత లేదు: రైతులకు పంటల బీమాపై విస్తృత అవగాహన కల్పించాలని, ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ పూర్తిస్థాయి పారదర్శకతతో జరుగుతోందన్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని స్పష్టం చేస్తూ, రైతులను అనవసరంగా ఆందోళనకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రైతు బజార్లలో ప్రత్యేక ఆర్గానిక్ ఉత్పత్తుల కౌంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెరగడం శుభపరిణామం. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు దూరంగా ఉన్న పిల్లలను గుర్తించి విద్యా వ్యవస్థలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో 4 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా చేరడం ప్రభుత్వ విద్యపై ప్రజల్లో పెరిగిన విశ్వాసానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు.

గృహాల మౌలిక సదుపాయాల పూర్తి: గృహ నిర్మాణ కార్యక్రమంలో ఇప్పటికే 60 శాతానికి పైగా మౌలిక సదుపాయాలు కల్పించామని, మిగిలిన పనులను త్వరలో పూర్తి చేస్తామని మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ప్రజలకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందన్నారు.

త్వరలో భోగాపురం విమానాశ్రయం ప్రారంభం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అవసరమైన అన్ని అనుమతులు లభించాయని, త్వరలో భారత ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అనిత వెల్లడించారు. పరిశ్రమల ఏర్పాటుతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి కూడా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమిష్టిగా భాగస్వాములు కావాలని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసులు నాయుడు, గ్రీష్మ, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి రాజు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

మూడు పోర్టుల అభివృద్ధికి రెండో దశ భూసేకరణకు ఉత్తర్వులు

విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: మూడు పోర్టుల అభివృద్ధికి రెండో దశ భూసేకరణకు ఉత్తర్వులు జారీ చేశారు. మూలపేట, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల అభివృద్ధికి రెండో దశలో 6,248.54 ఎకరాల భూమి సేకరణకు నిర్ణయం తీసుకున్నారు. రూ.1,638.52 కోట్లతో భూసేకరణకు పరిపాలనా అనుమతులు వచ్చాయి. మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు 1,903.39 ఎకరాల కోసం రూ.440.52 కోట్లు, మచిలీపట్నం పోర్టుకు 1,420.70 ఎకరాల కోసం రూ.347 కోట్లు, రామాయపట్నం పోర్టుకు 2,924.45 ఎకరాల కోసం రూ.851 కోట్ల వ్యయం వెచ్చించనున్నారు.

మద్యం మత్తులో క్షణికావేశం నిర్ణయాలతో కుటుంబాలను చిన్నాభిన్నం

విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: మద్యం మత్తులో, క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేయడమే కాకుండా, సంబంధిత వ్యక్తుల భవిష్యత్తును కూడా అంధకారంలోకి నెడతాయని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. మద్యం తీసుకోవడం వలన ఆలోచనా శూన్యత ఏర్పడుతుందన్నారు. మద్యం వలన కలిగే ప్రమాదాలను ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. మద్యం వలన కుటుంబాలకు కుటుంబాలు అల్లకల్లోలం అవుతున్నాయన్నారు. అలవాటుగా మద్యం తీసుకోవడం. ఏదో కారణ దొరకబుచ్చుకుని లిక్కరు తాగడం చాలా నష్టాన్ని తీసుకుని వస్తుందన్నారు. గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలం మూలపేట ప్రాంతాల్లో చోటుచేసుకున్న సంఘటనలే మద్యం వలన కలిగే అనర్థాలకు నిదర్శనమన్నారు. ఈ రెండు ఘటనలపై కాకినాడ జిల్లా పోలీసులు సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సున్నితమైన ప్రాంతాలు గుర్తించి అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు.

డాక్టర్ పూర్ణచందుకి లోకగురు పురస్కారం

విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: విలువల విద్య, విలువైన విద్య వ్యాప్తికి కృషిచేసే విద్యార్థి వికాస వాహిని స్వచ్ఛంద సంస్థ ఈ సంవత్సరం లోకగురు పురస్కారాన్ని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, ఆహార శాస్త్రవేత్త, తెలుగు భాషోద్యమ నేత డాక్టర్ జి వి పూర్ణచందుకి అందిస్తోంది. విద్యార్థి వికాస వాహిని వ్యవస్థాపక అధ్యక్షులు వేములపల్లి కేశవ రావు తెలిపారు. జివి పూర్ణచంద్ గత యాభై సంవత్సరాలుగా వారి ప్రసంగాల ద్వారా, రచనల ద్వారా ఆరోగ్యశాస్త్రములో, సాహిత్య ప్రక్రియలలో అనేకమంది సామాన్య జనులను విజ్ఞాన వంతులుగా చేసినందుకు ఈ లోకగురు పురస్కారం తో సత్కరించబడుతున్నారు. ఈ కార్యక్రమము విద్యార్థి వికాస వాహిని సంస్థాపక దినోత్సవం గురుపూర్ణిమ సందర్భముగా జులై 29న విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపములోని సర్వోత్తమ గ్రంథాలయములో నిర్వహించబడునని తెలియచేస్తూ విద్యార్థి వికాస వాహిని సభ్యులను, శ్రేయోభిలాషులను, విద్యావేత్తలను, విద్యార్థులను, ఉపాధ్యాయులను, రచయితలను, రోటరియన్లను, పూర్ణచందు సన్నిహితులను సాదరముగా ఆహ్వానిస్తున్నాము. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ హైకోర్ట్ జడ్జి జస్టిస్ శేషసాయి ముఖ్య అతిథిగా విచ్చేసి పురస్కార ప్రదానం చేస్తారు.

ఆసియాలోనే అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా ఎస్వీ జూలాజికల్ పార్క్

● పార్క్‌లో అతిపెద్ద నైట్ సఫారీ ● నైట్ ట్రైన్‌కు రూపకల్పన ● లోటు భర్తీకి నిధులు, పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దే దిశగా అడుగులు ● స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడి

తిరుపతిరూరల్, జులై 16 ప్రభాతవార్త: శ్రీవేంకటేశ్వర జూలాసికల్ పార్కును ఆసియాలోనే అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వన్యప్రాణి, పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మెన్, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. జూ పార్కులో ఆసియాలోనే అతిపెద్ద నైట్ సఫారీతో పాటు ప్రత్యేక నైట్ ట్రెన్ ఏర్పాటు దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. గురువారం జూ కమిటీ ఎస్వీ జూ పార్కును సందర్శించారు. జూ పార్కును సందర్శించిన కమిటీ ఆదాయం-వ్యయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించింది.

ప్రస్తుతం జూకు సంవత్సరానికి సుమారు రూ.10కోట్ల ఆదాయం వస్తుండగా, నిర్వాహణకు రూ.18కోట్ల రుపాయాలు ఖర్చు అవుతుందని అధికారులు వివరించారు. రూ.8కోట్ల రుపాయాల లోటును భర్తీ చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆయ్యన్నపాత్రుడు తెలిపారు. టిటిడి నుంచి రూ.3కోట్లు, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల ద్వారా మరో రూ.3కోట్ల ఎంపి నిధుల నుంచి రూ.2కోట్ల సమీకరించే ప్రణాళిక ఉందని చెప్పారు. జూ పార్కు అభివృద్ధి మూడు దశల్లో అమలుచేయాలని కమిటీ నిర్ణయించింది. ఆధునిక సౌకర్యాలు, ఆకర్షణీయ ప్రదర్శనలు, పర్యాటక అనుభవాన్ని మెరుగుపరిచే చర్యలు చేపట్టి, జూను దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు కలిగించేలా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. కమిటీ సభ్యులకు స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని, అటవీశాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు. జూ ప్రాంగణంలో పచ్చదనం పెంపొందించేందుకు అయ్యన్నపాత్రుడు, సభ్యులు ఎమ్మెల్యే కలిసి మొక్కలు నాటారు.

చంద్రగిరి ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ చంద్రగిరి నియోజవర్గంలో 3100 ఎకరాలలో విస్తరించి ఉన్న ఎస్వీ సూ పార్కు ఆసియాలోనే అతిపెద్దది కావడం గర్వకారణమని అన్నారు. జూను మరింత అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించే కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తామని తెలిపారు.

సౌకర్యాల పరిశీలన - సందర్శకుల సంఖ్యపై ఆందోళన

ఎస్వీ జూ సందర్శకుల సంఖ్య తగ్గిపోవడంపై కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. దీనికి గల కారణాలను విశ్లేషించి మరింత మంది పర్యాటకులను ఆకర్షించే విధంగా సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించింది. జూ పార్కులో మౌలిక వసతుల మెరుగుదలకు రూ.18కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని కమిటీ తెలిపింది. ఆధునిక హంగులు, సదుపాయాలు కల్పించి ఎస్వీ జూ పార్కును దేశ వ్యాప్తంగా ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, టిడిపి నాయకులు బడి సుధాయాదవ్, నాగూరు శ్రీనివాసులు, ఉసిరిపాటి శ్రీనివాసులు, కత్తి సుధాకర్, కాయం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, పార్టీ నాయకులు బడి సుధా యాదవ్, నాగూరు శ్రీనివాసులు, కత్తి సుధాకర్, కాయం వెంకటేష్, ఉసిరిపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల సమాచారం

శ్రీవారి సేవలో నారా భువనేశ్వరి

తిరుమల, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి గురువారం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని శ్రీవారిని ప్రార్థించినట్టు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, రైతులు, యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు అందరూ సుభిక్షంగా ఉండాలని ప్రత్యేకంగా మొక్కులు చెల్లించారు. ఉదయం ఆమె వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి ప్రవేశించారు. విఐపి బ్రేక్ దర్శన సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆనందనిలయుడ్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారుల పర్యవేక్షణలో దర్శన ఏర్పాట్లు చేసి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారి దర్శనం కల్పించారు. శ్రీవారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

'కొండెక్కని' మోనోరైల్ ప్రతిపాదనలు!

తిరుమల, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: అనూహ్యంగా తిరుమలకు రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీకి తగ్గట్లు మరింత సులభంగా కొండకు భక్తులు చేరుకునేందుకు తీసుకున్న పలు నిర్ణయాలు ఇప్పటికీ కాగితాలకే పరిమితమైపోయాయి. వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం రోజురోజుకూ తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్యకు తగ్గట్లు రవాణా మార్గాలుగా ఉన్న రెండు ఘాట్‌రోడ్లు తీవ్ర విపత్తులను తట్టుకోలేక పోతుండటం జరిగింది. ఇందుకు ప్రత్యామ్నాయ మార్గంగా మోనో, ట్రామ్‌రైల్ నడపాలని గత వైసిపి ప్రభుత్వంలోని టిటిడి బోర్డు నిర్ణయించింది. ఎలాంటి పరిస్థితుల్లోనూ, విపత్కర సమయంలోనూ తిరుమలకు ప్రస్తుతం ఉన్న ఘాట్‌రోడ్డులు అనుకూలంగా లేకపోతే వైఖానస ఆగమానికి ఆటంకం లేకుండా రోడ్డుపై నడిచే మోనో,ట్రామ్‌రైల్ తరహాలో నడిపితే ఎలా ఉంటుందనే అభిప్రాయం 2021లోనే అప్పటి పాలకమండలి ప్రతిపాదన చేసింది. ఎట్టిపరిస్థితుల్లోనూ శేషాచలంలో తిరుమలకొండకు తీగలపై నడిచే రైలు వంటి(రోప్‌వే)జోలికి వెళ్ళబోమని కూడా స్పష్టం చేశారు. గతంలోనే ఇదే విషయంగా హైదరాబాద్ మెట్రో ఎండి ఎన్‌విఎస రెడ్డితో చర్చించి నివేదిక కూడా తెప్పించుకుంటామని తెలిపారు. నివేదిక ప్రకారం ఆగమ పండితులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. అయితే ఈ హామీ పూర్తిగా నెరవేరలేదు. ఆస్ట్రియాలో ఎత్తయిన కొండలపైకి మోనోరైలు వెళుతోందని, దానిని మోడల్‌గా తీసుకుని తిరుమలకు రైలు ఏర్పాటును పరిశీలిస్తామని చెప్పారు. 2020-2024మధ్య కాలంలో ఈ ప్రతిపాదనపై ఊహాగానాలు తప్ప కనీసం డిపిఆర్ వరకు కూడా వెళ్లలేదు. శేషాచలం అడవుల్లో వెలసిన తిరుమల క్షేత్రంలో పర్యావరణాన్ని పరి రక్షించేందుకు వీలుగా మోనోరైలు ప్రతిపాదన కొంత వరకు ఉపయోగపడుతుందని కూడా భావించారు. ఆ తరువాత ఈ అంశంపై చర్చించిన దాఖలాలు లేవు. 2021నవంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు తిరుమలకు వచ్చే రెండో ఘాట్ రోడ్డుపై భారీగా కొండచరియలు విరిగి జారి పడటం, రక్షణగోడలు, రోడ్లు ధ్వంసమైన విషయం విదితమే. మూడురోజులు కొండపైకి వాహనాల రాకపోలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఏకంగా అప్పట్లో రాత్రి వేళ పూర్తిగా తిరుమలకు వాహనాలను అనుమతించకుండా నిలుపుదల చేశారు. దీంతో తిరుమలకు మూడో ఘాట్ అవసరాన్ని టిటిడి పాలకమండలి మళ్ళీ తెరపైకి తీసుకువచ్చింది. అయితే పదేళ్ళక్రిందట తీసుకున్న నిర్ణయం, ప్రతిపాదనల మేరకు రెండోఘాట్‌రోడ్డులో లింకురోడ్డు నుంచి మోకాళ్ళపర్వతం మీదుగా తిరుమల జిఎన్‌సి వరకు మూడో ఘాట్ రోడ్డు అవసరమని గుర్తించారు. కానీ ఇప్పటి పరిస్థితుల్లో తిరుమలకు వచ్చే రెండో ఘాట్ రోడ్డు వర్షాలకు తట్టుకుని సాఫీగా లేదని ఐఐటి నిపుణులు హెచ్చరించారు. దీంతో పూర్తిగా మూడో ఘాట్ రోడు మార్గం అవసరాన్ని మరోసారి అప్పటి టిటిడి పాలక మండలి, అధికారులు తెరపైకి తీసుకువచ్చారు. కానీ ఈ మూడో ఘాట్ రోడ్డు నిర్మాణం కడప జిల్లా వైపు నుంచి కాలినడక మార్గంగా వున్న అన్నమయ్య కాలిబాటను అభివృద్ధి చేయాలని కూడా నిర్ణయించారు. ప్రత్యామ్నాయంగా మూడో ఘాట్ రోడ్డు నిర్మాణం చేపడితే ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుకలుగుతుందని గతంలో ఉన్న టిటిడి అధికారులు, పాలకమండలి యోచనచేసింది. ఈ మార్గం వల్ల హైదరాబాద్, కర్నూలు, కడప వైపు నుండి వచ్చే భక్తులకు ప్రయాణదూరం తగ్గడమే గాక సులభంగా తిరుమలకు చేరుకునేం దుకు వీలు కలుగుతుందని భావించారు. ఈ నేపథ్యంలో ఆ పనులు, ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవగా మోనోరైలు విషయం చర్చకే పరిమితమైంది.

శ్రీవారి ఆశీస్సులతో కోరిక నెరవేరింది

● తిరుమలలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

తిరుమల, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: ఇటీవల తిరుమలకు వచ్చినపుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని ఒక కోరిక కోరుకున్నానని, అది మూడు రోజులకే నెరవేరిందని అసెంబ్లీ స్పీకర్ సిహెచ్ అయ్యన్నపాత్రుడు విశ్వాసం వ్యక్తం చేశారు. తన కుమారుడికి రాజ్యసభ సీటు వచ్చిందన్న స్పీకర్ అయ్యన్న వన్యప్రాణి సంరక్షణ కమిటీ చైర్మన్‌గా తిరుపతి జూపై సమీక్షకు వచ్చాచన్నారు. సౌకర్యాల లేమితో ఉన్న తిరుపతి జూకు భారీగా తగ్గిన సందర్శకుల సంఖ్యతో టిటిడి సహకారంతో జూపార్క్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. జూలో సమస్యలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు. గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, తన రాజకీయ జీవితానికి, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. గతంలో తాను స్వామివారి దర్శనానికి వచ్చినపుడు రాజ్యసభ ఎన్నికలు ఇంకా జరగలేదని గుర్తుచేసుకున్నారు. స్వామివారి దయ, ప్రజల ఆశీర్వాదమే అని అయ్యన్నపాత్రుడు వివరించారు.

26 నుండి కపిలేశ్వరస్వామి పవిత్రోత్సవాలు

తిరుమల, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని కపిలేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల26 నుండి 28వ వరకు మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు ముందుగా 25న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే నిత్యార్చనలు, ఉత్సవాలు, కైంకర్యాల్లో తెలియక సంభవించిన దోషాలకు పరిహారంగా, ఆలయ పవిత్రతను పరిరక్షించేందుకు శైవాగమ శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఉత్సవాల ద్వారా ఆలయంలో ఆధ్యాత్మిక శోభ మరింత వృద్ధి చెందుతుంది.

మళ్లీ తిరుమల కొండ కిటకిట
- వెంకన్న సర్వదర్శనానికి 20గంటలు

తిరుమల, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల భక్తజన సంద్రంగా మారింది. వారాంతంకు ముందే ఏడుకొండల వెంకన్న దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. వేలాదిగా భక్తులు దేశం నలుమూలల నుంచి తిరుమలకు చేరుకుంటున్నారు. గురువారం ఉదయానికి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లలోని 32 కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల క్యూలైన్లలో శిలాతోరణం వరకు బారులు తీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి 20గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఐదు గంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. గురువారం సాయంత్రం వరకు 41వేల మంది భక్తులకు సర్వ దర్శనంలో మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 20వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. బుధవారం రాత్రి వరకు 85,255మంది భక్తులకు మహాలఘులో దర్శనం చేయించారు. సాధారణంగా శని, ఆదివారాలు భక్తులు భారీగా తిరుమలకు వస్తారు. భక్తులు భారీగా చేరుకోవడంతో గదుల కోసం సామాన్యభక్తులు నిరీక్షిస్తున్నారు.

ఆగస్టు -సెప్టెంబర్ నెలల్లోనూ నిరంతర విద్యుత్ సరఫరాకు ముందస్తు చర్యలు

● పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ అప్రమత్తం ● ఇంధన సంస్థలకు ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్



విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, అలాగే ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్న దృష్ట్యా, రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత పటిష్టంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. గురువారం ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఐ.పృథ్వీ తేజ్, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ, ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ పి. పుల్లారెడ్డి, ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ (గ్రిడ్) ఎ.కె.వి. భాస్కర్‌తో పాటు ఏపీఎస్ఎల్‌డీసీ, ఏపీపీసీసీ, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, రాష్ట్రంలోని విద్యుత్ పంపిణీ సంస్థల సీనియర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో ప్రస్తుత విద్యుత్ లభ్యత, డిమాండ్, ఆగస్టు-సెప్టెంబర్ 2026 నెలలకు అవసరమయ్యే విద్యుత్ వనరులు, ఉత్పత్తి సామర్థ్యం, ప్రసార వ్యవస్థ సన్నద్ధత, విద్యుత్ కొనుగోలు, బొగ్గు నిల్వలు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే కార్యాచరణ ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు.

రాష్ట్రంలో జూలై నెలలో ఇప్పటివరకు ఎన్నడూ లేనంతగా విద్యుత్ వినియోగం నమోదైందని, జూలై 15, 2026న రోజువారీ విద్యుత్ వినియోగం 285 మిలియన్ యూనిట్ల (ఎంయూ)కు చేరుకోవడం రాష్ట్ర విద్యుత్ రంగ చరిత్రలో జూలై నెలకు సంబంధించి అత్యధిక డిమాండ్‌గా నమోదైందని తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు కొనసాగడం, నైరుతి రుతుపవనాల ఆలస్యం, వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య, గృహ వినియోగ రంగాల్లో విద్యుత్ అవసరాలు పెరగడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడినట్లు అధికారులు వివరించారు. ప్రస్తుత పరిస్థితిని సమీక్షించిన కె. విజయానంద్, రానున్న నెలల్లో విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేలా అన్ని విద్యుత్ సంస్థలు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను సంసిద్ధం చేసి అమలు చేయాలని ఆదేశించారు.

వినియోగదారులకు ఎటువంటి అంతరాయం లేకుండా 24 గంటల పాటు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించడం ప్రభుత్వ లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు. డిస్కమ్‌లు విద్యుత్ డిమాండ్‌ను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, అవసరమైతే పవర్ ఎక్స్ఛేంజీలు, టర్మ్‌అహెడ్ మార్కెట్ వంటి వేదికల ద్వారా ముందస్తుగానే అదనపు విద్యుత్‌ను కొనుగోలు చేయాలని ఆయన ఆదేశించారు. విద్యుత్ కొనుగోలు విషయంలో ఆలస్యం జరగకుండా, మార్కెట్ పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో తగిన స్థాయిలో బొగ్గు నిల్వలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏపీ జెన్‌కో అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గరిష్ట విద్యుత్ అవసరాల సమయంలో ఉత్పత్తిలో ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా బొగ్గు సరఫరా, నిర్వహణ, యంత్రాల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే విద్యుత్ సరఫరా నిరంతరంగా కొనసాగుతుందని పేర్కొన్న విజయానంద్, ఏపీఎస్ఎల్‌డీసీ, ఏపీ జెన్‌కో, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీపీసీసీ, మూడు డిస్కమ్‌ల మధ్య సమర్థవంతమైన సమన్వయం ఉండాలని ఆదేశించారు.

విద్యుత్ డిమాండ్, వనరుల లభ్యత, గ్రిడ్ స్థిరత్వం, ప్రసార వ్యవస్థ సామర్థ్యం, విద్యుత్ కొనుగోలు, అత్యవసర పరిస్థితుల నిర్వహణ వంటి అంశాలను ప్రతిరోజూ సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రసార వ్యవస్థలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ట్రాన్స్‌మిషన్ లైన్లు, సబ్‌స్టేషన్లు, కీలక విద్యుత్ మౌలిక సదుపాయాల నిర్వహణను మరింత బలోపేతం చేయాలని, ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేలా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
నిట్ నెం. 26/TO/DB/EE/R&B/TKL/2026-27, తేది: 13.07.2026
టెక్కలి R&B డివిజన్‌లో రూ.31.00 లక్షల మొత్తం కొరకు 1 సం. రోడ్ పని నిమిత్తం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. ఆన్‌లైన్ బిడ్స్ జారీ కొరకు తేది: 15.07.2026 మ.3.00 గం. నుండి 30.07.2026 మ.3.00 గం. వరకు. తదుపరి వివరాలు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా https://www.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), టెక్కలి
DIPR.No.20947/CL/Advt/1/1/2022-23, తేది: 16.07.2026

17-7Pg7exHMNWJQE.qxd:17-7Pg7exHMNWJQE.qxd 1/1/02 6:31 AM Page 1

తిరుమల పుణ్యక్షేత్రంలో అపవిత్రం

- ఆస్థానమండపం వద్ద పాదరక్షలు

తిరుమల, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగవైకుంఠం తిరుమల పుణ్యక్షేత్రం పవిత్రతను మరింతగా పరిరక్షించే దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం చర్యలు తీసుకుంటున్నా ఆచరణలో అమలుకావడం లేదు. సాధారణంగా తిరుమల పవిత్రతను భక్తులు కూడా కాపాడుతారు. అయితే ఇక్కడ ఉన్న పరిస్థితుల్లో శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి తరలివస్తున్న లక్షమందిభక్తులకుపైగా ధరిస్తున్న పాదరక్షలు ఇబ్బడిముబ్బడిగా ఆలయం ఎదురుగా వాహనమండపం సమీపంలో, ఆస్థానమండపం వద్ద, బేడి ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో పాదరక్షలు వదలిపెట్టేయడం ఆలయ పవిత్రతకు భంగం కలిగించే విషయంగా మారింది. తిరుమలపుణ్యక్షేత్ర మహిమను, పవిత్రతను మరింత పెంపొందించే దిశగా కూడా తీసుకున్న నిబంధనల్లో ఆలయ మాఢవీధుల్లో పూర్తిగా పాదరక్షలు ధరించడం నిషేధించారు. ఈ నిబంధనలు పక్కగా అమలవుతున్నాయి. భక్తులు కూడా ఆలయం ముందు గొల్లమండపం ప్రాంతం, మాఢవీధుల్లో, చివరకు లడ్డూప్రసాదాల వితరణశాల, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, కల్యాణకట్ట తదితర ప్రాంతాల్లో పాదరక్షలు ధరించడం నిషేధించారు. ఇది కొంతవరకు దశాబ్దాల తరబడి అమలవుతోంది. అయితే తిరుమలకు వస్తున్న భక్తులు తమతమ దర్శనం సమయం, క్యూకాంప్లెక్స్ లలోకి త్వరగా ప్రవేశించే సమయాల్లో, భక్తుల రద్దీ పెరిగినపుడు అదనపు క్యూలైన్లు అమలైతే ప్రవేశమార్గాల ప్రాంతాల్లో భక్తులు తమ పాదరక్షలు వదలిపెట్టి వెళ్ళిపోతున్నారు. ఇలా ఎక్కడబడితే అక్కడ పాదరక్షలు వదలివెళ్ళడం ఇతర భక్తులకేగాక పవిత్రంగా వెంకన్న సేవలో తరిస్తున్న టిటిడి ఉద్యోగులు, చివరకు శ్రీవారి సేవకులు కొంత ఇబ్బందిపడుతున్నారు. మనోభావాలు దెబ్బతినేలా పాదరక్షలు ఎక్కడబడితే అక్కడ వదలి పెట్టేయడంతో ఇదో సమస్య ఎదురవుతోంది. తిరుమలలో అనేక ప్రధాన ప్రాంతాల్లో పాదరక్షల భద్ర పరిచే స్టాండ్‌లు ఉన్నాయి. అయినా చాలావరకు కొన్నిచోట్ల పాదరక్షలు ఎక్కడబడితే అక్కడ అపవిత్రంగా వదలి పెట్టేస్తున్నారు. భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశం కావున ఇలా అపవిత్రతకు చెక్ పెట్టడానికి తిరుమలలో ఉచిత పాదరక్షల స్టాండ్‌లు మరిన్ని ఏర్పాటు చేయాలని, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆ దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

గ్లోబల్ ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్

- దేశ ఆహార శుద్ధి రంగంలో 9శాతం వాటాతో ఏపి నంబర్ వన్
- రూ.30వేల కోట్ల పెట్టుబడులు, 3 లక్షల ఉద్యోగాలే లక్ష్యం
- పెట్టుబడిదారులకు లాంగ్‌టర్మ్ వృద్ధి భాగస్వామిగా ఆంధ్రప్రదేశ్
- 17వ ఫుడ్ వరల్డ్ ఇండియా సదస్సులో రాష్ట్ర మంత్రి టి.జి.భరత్

విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రపంచ ఆహార రంగానికి అవసరమైన ముడిసరుకును అందిస్తూ, అత్యాధునిక సాంకేతికతతో వాటిని శుద్ధి (ప్రాసెస్) చేయడంలో ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా ఆవిర్భవిస్తోందని రాష్ట్ర భారీ పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ అన్నారు. న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక సాంగ్రిల్లా హోటల్‌లో ఫిక్కి డెలాయిట్ సంయుక్తంగా నిర్వహించిన 17వ ఫుడ్ వరల్డ్ ఇండియా జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిం చారు. ఈ సదస్సు ముఖ్య ఇతివృత్తం ఆయన స్టెప్ అప్- సామర్థ్యం, లాభదా యకత కోసం విస్తృత రూపాంతీకరణ్ణను అభినందించారు. సదస్సులో మంత్రి టి.జి. భరత్ మాట్లాడుతూ, "ప్రస్తుత దశాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్పేస్ టెక్నాలజీ వంటి రంగాల గురించి మాట్లాడుకుంటున్నారనీ కానీ ఈ దశాబ్దంలో అత్యంత భారీ ఆర్థిక వ్యాపార అవకాశం మన డైనింగ్ టేబుల్‌పై ఉన్న 'ఆహారం' రూపంలోనే ఉందని అన్నారు. నేడు ఆహారం అంటే కేవలం వ్యవసాయం మాత్రమే కాదని అది ఆర్థిక వ్యవస్థ, సాంకేతికత, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, అంతర్జాతీయ భౌగోళిక వ్యూహాత్మక అంశాలతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. ప్రపంచ ఆహార ప్రాసెసింగ్ రంగం 8.1 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ కలిగి ఉండగా, అందులో భారత దేశ వాటా 543 బిలియన్ డాలర్లని, కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే అందులో 49 బిలియన్ డాలర్లు (దాదాపు 9 శాతం) వాటాను అందిస్తూ దేశంలోనే అత్యధిక రిజిస్టర్డ్ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు కలిగిన రాష్ట్రంగా నంబర్ వన్ స్థానంలో నిలిచిందని తెలిపారు.

'ఈజ్ ఆఫ్ డూయింగ్ కాదు.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్: రాష్ట్రంలో సేులభతర వాణిజ్యం మాత్రమే కాకుండా, ఒక అడుగు ముందుకు వేసి వేగవంతమైన వాణిజ్యం వైపు అడుగులు వేస్తున్నామని మంత్రి తెలిపారు. పెట్టుబడి దారులు అనుమతుల చుట్టూ తిరగడం కాకుండా, వేగంగా ఉత్పత్తిని ప్రారంభించినప్పుడే లాభాలు వస్తాయని, అందుకోసమే సింగిల్ డెస్క్ అనుమతులు, ప్రత్యేక ప్రాజెక్ట్ హ్యాండ్‌హోల్డింగ్ వేగవంతమైన నిర్ణయాలు ప్రభుత్వ పనివిధానమని స్పష్టం చేశారు.

రూ.30,000 కోట్ల పెట్టుబడులు, 3 లక్షల ఉద్యోగాలే లక్ష్యం: రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో సాధించిన ప్రగతి మౌలిక వసతులను మంత్రి వివరిస్తూ..మౌలిక సదుపాయాలు:.. రాష్ట్రంలో 1,000 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం, 6 కార్యాచరణ రేవులు, 7 విమానాశ్రయాలు, 247 నాణ్యమైన విద్యుత్ మరియు 9 ప్లగ్‌అండ్‌ప్లే ఫుడ్ పార్కులు అందుబాటులో ఉన్నాయన్నారు. 17.20 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఆధునిక కోల్డ్ స్టోరేజ్, 33.52 లక్షల మెట్రిక్ టన్నుల వేర్‌హౌసింగ్ వసతులు సిద్ధంగా ఉన్నాయన్నారు. భవిష్యత్తులో ఆహార ప్రాసెసింగ్ రంగం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ప్రిసిషన్ అగ్రికల్చర్, డిజిటల్ సప్లై చైన్, స్మార్ట్ లాజిస్టిక్స్ ఆధారంగా నడుస్తుందని, టెక్నాలజీ రంగంలో పెట్టుబడిదారులకు పూర్తి మద్దతు ఇస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. సదస్సులో పాల్గొన్న దేశ, విదేశీ పెట్టుబడిదారులకు పిలుపునిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌ను కేవలం ఒక గమ్యస్థానంగా చూడకుండా, మీ దీర్ఘకాలిక వృద్ధి భాగస్వామిగా చూడాలని, "మీ విజయమే మా విజయం" అంటూ ఆయన ఈ సందర్భంగా మంత్రి టి.జి. భరత్ పేర్కొన్నారు.

వైసిపి హయాంలో టిటిడి ఐటి జిఎం సందీప్‌రెడ్డిపై సిఐడి విచారణ

తిరుమల, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: 2019-24 మధ్యకాలంలో రాష్ట్రంలో అధికారంలోఉన్న వైసిపి ప్రభుత్వం హయాంలోని వైసిపి టిటిడి బోర్డు పెద్దలు నియమించిన ఐటి జిఎం సందీప్‌రెడ్డి అక్రమనియామకంపై తాజాగా సిఐటి విచారణ చేపడుతోంది. ఆయన నియమాకం చెల్లదని, ఆయన అర్హుడు కాదని గతంలోనే నివేదికలు వెల్లడయ్యాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ,టిటిడి బోర్డు గతంలో ఐటీ జీఎంగా సందీప్‌రెడ్డి నియామకంపై సిఐడి విచారణకు ఆదేశించింది. ఆయన నియమాకం దగ్గర నుండి ఇప్పటివరకు జరిగిన అంశాలపై ,ఆయన స్విమ్స్‌లో కీలక పోస్టులో ఉండటంపై సమగ్ర దర్యాప్తునకు టిటిడి అధికారులు ఆదేశించారు. ఆయన నియమాకం నిబంధనలకు విరుద్ధమంటూ 2024 ఆగస్టులో టిటిడి విజిలెన్స్ ప్రాథమిక నివేదిక ఇచ్చింది. ఇప్పుడు సందీప్‌రెడ్డి నియామకంలో అక్రమాలు జరిగాయా? టిటిడి కీలక సమాచారం బయటకు వెళ్లిందా అనే కోణంలో దర్యాప్తు సాగనుంది. సిమ్స్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా కొనసాగుతూనే, ఐటీ జీఎంగా జీతం పొందిన అంశంపైనా సీఐడీ ఆరా తీస్తోంది.

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

తిరుపతి, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, 6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ న్యాయస్థానం న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పు నిచ్చారు. శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. 40/2017 కేసులో తమిళనాడు, తిరువన్నామలై జిల్లా పోలూరు తాలూకా మెలకుప్పనూరు గ్రామానికి చెందిన సి. కుమార్ ముద్దాయి అరెస్ట్ అయ్యాడు. ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు 6లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

మద్యం మత్తులో ఘర్షణ.. యువకుడి హత్య

ఇందుకూరుపేట (నెల్లూరు), జులై 16 ప్రభాతవార్త: మద్యం మత్తు, క్షణికావేశం ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పల్లిపాడులో చోటుచేసుకున్న ఈ హింసాత్మక ఘటన తీవ్ర కలకలం రేపింది. స్నేహితుడి పుట్టినరోజు వేడుకల్లో మొదలైన ఘర్షణ చివరకు హత్యకు దారి తీసింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం ఎస్.కె.సుల్తాన్ జన్మదిన వేడుకలను పురస్కరించు కుని అతని స్నేహితులు పల్లిపాడు సవక తోటలో మద్యం విందు ఏర్పాటు చేసుకున్నారు. అందరూ కలిసి మద్యం సేవిస్తున్న సమయంలో రాజేంద్ర అనే యువకుడికి, ఎస్.కె. సుల్తాన్‌కు మధ్య అనుకోకుండా స్వల్ప వివాదం తలెత్తింది. మద్యం మత్తులో ఆగ్రహానికి లోనైన రాజేంద్ర అక్కడే ఉన్న ఒక బీరు సీసాను తీసుకొని సుల్తాన్ తలపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్ర ఆవేశానికి గురైన సుల్తాన్, తన చేతి కడియంతో రాజేంద్రపై ఎదురుదాడికి దిగాడు. ఈ గొడవ తీవ్రరూపం దాల్చడంతో అక్కడే ఉన్న వారి స్నేహితులు, రాజేంద్ర సోదరుడైన రాజశేఖర్ పక్కనే ఆటోలో దాచిన ఆయుధంతో సుల్తాన్ తలపై బలంగా బాదాడు. తలకు తీవ్ర గాయం కావడంతో సుల్తాన్ కోమాలోకి పోయి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సుల్తాన్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని స్థానికులు విచారం వ్యక్తం చేశారు. సుల్తాన్ తండ్రి అనారోగ్య కారణాలతో మంచంలోని జీవనం సాగిస్తున్నాడు. తల్లి కూలి నాళిచేసుకొని భర్త కొడుకులను పోషిస్తుంది. సమాచారం అందుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ తన సిబ్బందితో కలిసి తక్షణమే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, దాడికి పాల్పడిన నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు.

గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

- స్థానిక ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పిలుపు

వరికుంటపాడు (నెల్లూరు), జులై 16, ప్రభాతవార్త: ఉదయగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి, ఉపాధి అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, మౌలిక సదుపాయాల కల్పనతోపాటు పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గురువారం వరికుంటపాడు మండలం కాకొల్లువారిపల్లెలో రూ.1.67 కోట్ల వ్యయంతో నిర్మించిన రోడ్డు ప్రారంభోత్సవంలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. గ్రామీణాభివృద్ధిలో రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అయితే అభివృద్ధి అంటే కేవలం రోడ్ల నిర్మించడం మాత్రమే కాదని, విద్య, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధి వంటి అన్ని రంగాల్లో ప్రగతి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. దుత్తలూరు ప్రాంతంలో డిఫెన్స్ అమ్మునిషన్ క్లస్టర్‌లో భాగంగా సుమారు రూ.2,245 కోట్ల పెట్టుబడులతో ఐదు పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు. భూసేకరణ ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోందన్నారు. ఏడాదిలోపే పరిశ్రమల నిర్మాణ పనులు ప్రారంభమై స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని ఎంపీ పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో ఎలాంటి విభేదాలు ఉన్నా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, అవసరమైతే స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి లేదా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గంతో పాటు నెల్లూరు జిల్లా వ్యాప్తంగా కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన. ప్రజల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. ఢిల్లీ పర్యటనల్లో సైతం రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర మంత్రులతో గంటల తరబడి సమావేశాలు నిర్వహిస్తూ నిధులు, ప్రాజెక్టులు తీసుకురావడానికి కృషి చేస్తున్నారని ఎంపీ కొనియాడారు. ఇటీవల రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన భాష్యం రామకృష్ణకి కాకొల్లువారిపల్లెలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, ప్రజా జీవితంలో మరింత ఉన్నత సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తెలుగు దేశం జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనం: దుత్తలూరు మండలం నర్రవాడలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి దేవస్థానాన్ని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు ఎంపీకి స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో ఐక్యంగా పనిచేయాలి

- కూటమి శ్రేణులకు పిలుపు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

కొడవలూరు (నెల్లూరు), జులై 16 ప్రభాతవార్త: గత ప్రభుత్వం ప్రారంభించి మధ్యలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందిస్తున్నది కూటమి ప్రభుత్వమేనని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. గురువారం కొడవలూరు మండలం నాయుడుపాళెం పంచాయతీలో రూ.50 లక్షలతో నిర్మించిన 1.5 కిలోమీటర్ల బీటీ రోడ్డు, రూ.21 లక్షలతో నిర్మించిన నాలుగు సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. ప్రతి గ్రామంలో రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రధాన్ మంత్రి గ్రామ్ సడక్ యోజన అమలులో, రహదారుల నాణ్యత ప్రమాణాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. నాయుడుపాళెంలో మిగిలిన 1.10 కిలోమీటర్ల రోడ్డును త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఓటర్ల నమోదు ప్రక్రియ గడువు పొడిగించిన నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నాయకులు ఐక్యంగా పనిచేసి అన్ని స్థానాల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, ఎంపీడీవో వెంకట సుబ్బారావు,మాగుంట సతీష్ కుమార్ రెడ్డి, కరకట మల్లికార్జున్, కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, భూలోకం విజయకుమార్, జొన్న శివకుమార్, పల్లం రెడ్డి సురేష్ రెడ్డి, కోవూరు వెంకీ, మయూరి సిద్ధార్థ, బద్దిపూడి సూర్య, పలు శాఖ అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గమ్మకి కలెక్టర్ దంపతుల ఆషాఢం సారె

ఇంద్రకీలాద్రి, జులై 16 ప్రభాతవార్త: దుర్గమ్మకి గురువారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా దంపతులు ఆషాఢం సారెను సమర్పించారు. వారికి ఇఒ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు స్వాగతం పలికి మంగళ వాయిద్యాల నడుమ దుర్గమ్మ చెంతకు తోడ్కొని వెళ్లి అక్కడ ప్రత్యేక పూజాదికాలు జరిపించారు. ఆషాఢం సారెను 6వ అంతస్థులోని శ్రీ అమ్మవారికి సమర్పించిన అనంతరం కలెక్టర్ దంపతులకు దుర్గమ్మ జ్ఞాపిక, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. పండితులు వేదాశీర్వచనాలందించారు.

దుర్గమ్మకి ఎండోమెంట్ కమీషనర్ ఆషాఢం సారె: దుర్గమ్మకి గురువారం దేవదాయ శాఖ కమీషనర్ కె రామచంద్రమోహన్ ఆషాఢం సారెను సమర్పించారు. వారికి ఇఒ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు స్వాగతం పలికి మంగళ వాయిద్యాల నడుమ దుర్గమ్మ చెంతకు తోడ్కొని వెళ్లి అక్కడ ప్రత్యేక పూజాదికాలు జరిపించారు. ఆషాఢం సారెను 6వ అంతస్థులోని శ్రీ అమ్మవారికి సమర్పించిన అనంతరం దుర్గమ్మవారి జ్ఞాపిక, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. పండితులు వేదాశీర్వచనాలందించారు.

భక్తబృందాల ఆషాఢం సారె: గురువారం సాయంత్రం 5 గంటల వరకు 18 భక్త బృందాలకు చెందిన 7,940 మంది భక్తులు దుర్గమ్మకి ఆషాఢం సారె సమర్పించారు. వారికి ఉచితంగా రు.100 దర్శనం కల్పించారు.

దుర్గమ్మ సేవలో అల్లరి నరేష్: దుర్గమ్మవారిని సినీ నటుడు అల్లరి నరేష్ గురువారం దర్శించుకున్నారు.

దుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన సిద్దినేని మధుబాబు, కుసుమ కుమారి దంపతులు రు.1లక్ష విరాళాన్ని గురువారం అందించారు. ఉచిత ప్రసాదం పంపిణీ స్కీంనకు ఎన్టీఆర్ జిల్లా పెద ఒగిరాలకు చెందిన గుంటక దుర్గాప్రసాద్ రెడ్డి, ఇంద్రజ దంపతులు రు.1,11,111ల విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

అమెరికాలో హైదరాబాద్‌వాసిపై కత్తితో దాడి

హైదరాబాద్ (మెహిదీపట్నం), జులై 16, ప్రభాతవార్త : అమెరికాలోని ఓ షాపింగ్ మాల్‌లో వ్యాపార దుకాణాన్ని నిర్వహిస్తున్న హైదరాబాద్ యువకుడిపై కత్తితో దాడి చేశారు. హైదరాబాద్ టోలిచౌకికి చెందిన సయ్యద్ సోహెల్ పై ఓ దుండగుడు 15 సార్లు కత్తితో దాడి చేశాడు. జులై 13న జరిగిన సంఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తీవ్రంగా గాయపడిన సయ్యద్ సోహెల్ అమెరికా వెస్ట్ వ్యాలీ సిటీలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నాడు. సయ్యద్ సోహెల్ గత రెండేళ్లుగా షాపింగ్ మాల్ లో చిన్న వ్యాపార దుకాణం నిర్వహిస్తూ తన భార్య పిల్లలతో అక్కడే నివాసం ఉంటు న్నాడు. స్థానికులు ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడి వద్ద నుంచి కత్తిని తీసుకొని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని పీటర్ మైకేల్ గా గుర్తించారు. ఈ ఘటనపై భారత ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

మైనర్ బాలికపై లైంగిక దాడి

నిందితుడికి 20 యేళ్ల జైలుశిక్ష

చిన్నశంకరంపేట, జులై 16, ప్రభాతవార్త: చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 2022లో మైనర్ బాలికపై జరిగిన లైంగికదాడి కేసులో నిందితుడికి న్యాయస్థానం 20 సంవత్సరాల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్ గురువారం తెలిపారు. 2022 అక్టోబర్ 10న చిన్నశంకరంపేటకు చెందిన బాలిక (13) ఇంటి వద్ద ఒంటరిగా ఉండగా పక్కనే ఉన్న పంక్చర్ దుకాణ యజమాని మహ్మద్ షంషోద్దీన్ బాలిక వద్దకు వెళ్లి మీ అమ్మకు డబ్బులు ఇవ్వాలని బాలికను బయటకు పిలిచి బలవంతంగా పక్కనే ఉన్న చెట్ల చాటుకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుండి పరారయ్యాడు. ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులకు జరిగిన విషయం తెలుపడంతో అప్పటి చిన్నశంకరంపేట ఎస్ఐ సుభాష్‌గౌడ్ పోక్సో కింద కేసు నమోదు చేశారు. తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి విచారణ చేపట్టి బాధితురాలికి వైద్యపరీక్షలు నిర్వహించారు. బాధిత బాలికను భరోసా కేంద్రానికి తరలించగా, న్యాయ సలహాదారు శ్వేత పూర్తి సమాచారాన్ని అందించింది. పీపీ బాలయ్య న్యాయస్థానం ముందు బలంగా వాదనలు వినిపించారు. పూర్తి వివరాలను పరిశీలించిన మెదక్ ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి సుభావలి.. నిందితుడు మహ్మద్ షంషోద్దీన్‌ను దోషిగా నిర్ధారించి 20 యేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధించారు.

నేడు తొలి హైడ్రోజెన్ రైలు పట్టాల పైకి



హర్యానాలో ప్రధాని మోడీ చేతుల మీదుగా ప్రారంభం

న్యూఢిల్లీ, జులై 16: దేశంలో తొలి హైడ్రోజెన్ రైలు హర్యానాలోని జింద్ నుంచి ఆ రైలు ప్రారంభం కానున్నది. ప్రధాని మోడీ ఈనెల 17వ తేదీన ఆ కొత్త రైలుకు పచ్చజెండా ఊపనున్నారు. జింద్ నుంచి సోనిపట్ మధ్య ఆ రైలు నడుస్తుంది. ఈ రెండు స్టేషన్ల మధ్య 89 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రైలులో మొత్తం 10 కోచ్‌లు ఉంటా యి. గరిష్టంగా 75 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంది. చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో దీన్ని డిజైన్ చేశారు. ఫ్యూయల్ సెల్ డీపీఆర్ఎస్ విధానంలో రైలు నడవనున్నది. 1200 కిలోవాట్ల ప్రొపల్షన్ సిస్టమ్ ఆ రైలుకు ఉంటుంది. 2025లో జింద్ సోనిపట మధ్య ట్రయల్స్ విజయవంతంగా నిర్వ హించారు. మే 22వ తేదీన 10 కోచ్‌ల హైడ్రోజన్ రైలు కోసం రైల్వే బోర్డు అనుమతి ఇచ్చింది. హైడ్రోజన్ ట్రైన్ నెంబర్ 74010 జింద్ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 7.40 నిమిషాలకు బయలుదేరుతుంది. ఆ తర్వాత సోనిపట్‌కు 9.40 నిమిషాలకు చేరుకుంటుంది. ఫ్యూయల్ సెల్స్ ఆధారంగా హైడ్రోజన్ రైలు విద్యుత్తను ఉత్పత్తి చేస్తుంది. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రియాక్షన్‌తో విద్యుత్తు ఉత్పత్తి అవు తుంది. ఆనోడ్‌పై హైడ్రో జన్, క్యాథోడ్‌పై ఆక్సిజన్ రియాక్ట్ అవుతుంది. ఆనోడ్‌లో హైడ్రోజన్ కణా లు ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లుగా విభజన అవు తాయి. ప్లాటినం ఉత్ప్రేరకం ఆధారంగా ప్రోటా న్లతో ఆక్సిజన్ కలిసి వాటర్‌గా మారుతుంది. ఈ విధానంలో రైలు ఇంజిన్ నడుస్తుంది. హైడ్రోజన్ రైళ్లను 2018లో తొలిసారి జర్మనీలో ప్రవేశపెట్టారు. ఫ్రెంచ్ కంపెనీ ఆల్‌స్టామ్ వీటిని డెవలప్ చేశాయి. ఈ రైలు కోసం జింద్‌లో హైడ్రోజన్ జనరేషన్, రీఫ్యూయలింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. శిలాజ ఇంధనాల తరహాలో హైడ్రోజన్ మూడు రెట్ల శక్తిని ఉత్పత్తి చేస్తుంది. అయితే ప్రస్తుతం ఈ విశ్వంలో హైడ్రోజన్ ఎక్కువ స్థాయిలో లభిస్తుంది. దీన్ని ఇంధనంగా వాడితే, అది కేవలం నీటి ఆవిరిని, వేడిని మాత్రమే బై ప్రొడక్ట్స్‌గా రిలీజ్ చేస్తుందని చెబుతున్నారు. దీని వల్ల పర్యావరణం పరిశుభ్రం గా ఉంటుందని భావిస్తున్నారు.

విచారణ ఖైదీ ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ మృతి

హైదరాబాద్ (సికిందరాబాద్), జులై 16, ప్రభాతవార్త: ఆత్మహత్యకు యత్నించిన అండర్ ట్రయల్ ఖైదీ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి లో నివాసం ఉండే రోహిత్ పవార్ (20)పై గత మే నెలలో లైంగిక దాడి కేసు నమోదైంది. అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా చర్లపల్లి కేంద్ర కారాగారంలో అండర్ ట్రయల్ ఖైదీగా ఉన్నాడు. కాగా రెండు రోజుల కిందట నిందితుడు జైలులోని బాత్‌రూమ్‌లో ఉరి వేసుకున్నాడు. అప్రమత్తమైన సిబ్బంది తక్షణమే గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచాడు. కేసు దర్యాప్తులో ఉంది.

17-7Pg5.qxd:17-7Pg5.qxd 1/1/02 6:29 AM Page 1

సాగుకు రూ. 32.50 లక్షల కోట్ల రుణాలు

వ్యవసాయరంగానికి క్షేత్రస్థాయి పరపతి కింద భారీగా రుణ పంపిణీ: కేంద్రం

గ్రామీణ రుణ వ్యవస్థ 13 శాతం విస్తరణ

న్యూఢిల్లీ, జులై 16: దేశంలోని వ్యవసాయ రంగానికి అందుతున్న సంస్థాగత రుణాల పంపిణీ గణనీయంగా పెరిగింది. ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి క్షేత్రస్థాయి పరపతి కింద రూ.32.50 లక్షల కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు కేంద్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన అధికారిక ఫ్యాక్ట్‌షీట్ వెల్లడించింది. ఇది 2014-15 ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ.8 లక్షల కోట్లతో పోలిస్తే నాలుగు రెట్లకు పైగా పెరిగింది.ఫ్యాక్ట్‌షీట్ ప్రకారం, 2014-15 నుంచి 2023-24 మధ్యకాలంలో గ్రామీణ రుణ వ్యవస్థ సగటున ప్రతి ఏడాది 13 శాతం చొప్పున విస్తరించింది. వ్యవసాయం, అనుబంధ రంగాలకు స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాల కోసం బ్యాంకులకు అవసరమైన నిధులను సమకూర్చేందుకు నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్) రీఫైనాన్స్ సౌకర్యాన్ని కల్పిస్తూ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొంది.గ్రామీణ ప్రాంతాల్లో అధికారిక ఆర్థిక సేవల విస్తరణ వేగంగా పెరుగుతున్నట్లు నాబార్డ్ నిర్వహించిన రూరల్ ఎకనామిక్ కండిషన్స్ అండ్ సెంటిమెంట్స్ సర్వే (మే2026) స్పష్టం చేసింది. సర్వేలో పాల్గొన్న గ్రామీణ కుటుంబాల్లో 77.2 శాతం మంది తమ వినియోగ వ్యయం పెరిగిందని తెలిపారు. ఇది గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి పెరగడంతో పాటు స్థిరమైన డిమాండ్ కొనసాగుతోందని సూచిస్తోంది. అధికారిక బ్యాంకింగ్‌వ్యవస్థద్వారా రుణాలు పొందుతున్న కుటుంబాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. సుమారు 51 శాతం కుటుంబాలు పూర్తిగా అధికారిక ఆర్థిక సంస్థల నుంచే రుణాలు పొందుతుండగా, మరో 27 శాతం కుటుంబాలు అధికారిక, అనధికారిక రెండు మార్గాల ద్వారా రుణ సదుపాయాలను వినియోగిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు కూడా విస్తరించాయి. 2014లో గ్రామీణ ప్రాంతాల్లో షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల శాఖలు 41,464 ఉండగా, 2025 జులై నాటికి అవి 35 శాతానికి పైగా పెరిగి 56,193 శాఖలకు చేరుకున్నాయి. ఇవి గ్రామీణ రుణాల పంపిణీలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (ఆర్ఆర్‌బీలు) దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 700 జిల్లాల్లో 22 వేలకుపైగా శాఖలతో సేవలందిస్తున్నాయి.సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పిఏసిఎస్) కూడా గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ అలవాట్లను పెంపొందించడంతో పాటు సంస్థాగత రుణాల విస్తరణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. ఆర్‌బిఐ, నాబార్డ్ గణాంకాల ప్రకారం దేశంలో 1,458 పట్టణ సహకార బ్యాంకులు, 34 రాష్ట్ర సహకార బ్యాంకులు, 352 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు నిరంతరాయంగా రుణాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు విధానాలను అమలు చేస్తోంది. రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించిన ప్రాధాన్యతారంగ రుణాల విధానం అమల్లో ఉంది. అన్ని బ్యాంకులు తమ సవరించిన నికర బ్యాంకు రుణాల్లో కనీసం 18 శాతం వ్యవసాయ రంగానికి కేటాయించాల్సి ఉంటుంది.పేదరిక నిర్మూలన లక్ష్యంగా అమలవుతున్న దీనదయాళ్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కూడా గ్రామీణ పేద కుటుంబాలకు కీలకంగా మారింది.

ఈ పథకం ద్వారా గ్రామీణ పేదలను స్వయం సహాయక సంఘాలుగా (ఎస్‌హెచ్‌జిలు) ఏర్పాటు చేసి, వారి ఆదాయాన్ని పెంచడంతో పాటు జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు సహకారం అందిస్తున్నారు.ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా అమలులో ఉండగా, 2026 జులై 10 నాటికి 19.83లక్షలకుపైగా స్వయం సహాయక సంఘాలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. పథకం ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఈ సంఘాలకు మొత్తం రూ.13.28 లక్షల కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు ఫ్యాక్ట్‌షీట్ వెల్లడించింది.

మయన్మార్ తీరంలో రెండు శరణార్థి పడవలు బోల్తా

500 మంది మృతిచెందినట్లు యుఎన్ ధ్రువీకరణ

నేయ్‌పిఇడావ్, జులై 16: ప్రాణాలకు రక్షణ, మెరుగైన జీవన పరిస్థితుల కోసం శరణార్థులు ప్రమాదకర స్థితిలో సముద్ర ప్రయాణాలు చేస్తున్నారు. ఈ క్రమంలో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల శరణార్థులతో వెళ్లిన రెండు పడవలు మయన్మార్ తీరంలో బోల్తాపడి ఉండవచ్చని ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలు తెలిపాయి. ఆపడవల్లో మొత్తం 500 మంది ఉన్నారని, వారంతా మరణించి ఉండవచ్చని పేర్కొన్నాయి. ప్రాథమిక సమాచారం ఆధారంగా ఈ రెండు పడవలు జూన్ చివరలో మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రం నుంచి బయలుదేరాయని, వాటిలో ఎక్కువమంది రోహింగ్యా జాతికి చెందిన ప్రయాణికులేనని అంతర్జాతీయ వలససంస్థ, ఐక్యరాజ్య సమితి శరణార్థుల సంస్థ సంయుక్త ప్రకటనలోతెలిపాయి. బంగ్లాదేశ్‌లోని శరణార్థి శిబిరాల నుంచి వచ్చిన కొందరూ ఆ పడవల్లో ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనల్లో 500 మందికిపైగా మృతి చెందినట్లు భావిస్తున్నామని పేర్కొన్నాయి. అయితే ఈ ఘటనలు, మృతుల సంఖ్యపై ఇంకా అధికారికంగా ధ్రువీకరణ రాలేదని, అయినా భారీగా ప్రాణనష్టం జరిగి ఉండవచ్చన్న అంశంపై యుఎన్‌హెచ్‌సిఆర్, ఐఒఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని సంయుక్త ప్రకటనలో ఆ సంస్థలు పేర్కొన్నాయి. ఐక్యరాజ్య సమితి సంస్థల సమాచారం ప్రకారం.. తొలి పడవ బయలుదేరిన కొద్దిసేపటికే దానితో సంబంధం తెగిపోయింది. అందులో దాదాపు 250 మంది ఉన్నారు. 280 మందితో ప్రయాణించిన రెండు పడవ జులై 8న మయన్మార్‌లోని ఇరావడీ తీరంలో బోల్తాపడి ఉండొచ్చని భావిస్తున్నారు.

'సైనికులకు టెస్టోస్టిరాన్ పరీక్షలు తప్పనిసరి'

అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సేత్

వాషింగ్టన్, జులై 16: అమెరికా సైన్యాన్ని మరింత సమర్థంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పెంటగాన్ మరో కీలక నిర్ణయం తీసుకుందని ఆ దేశ రక్షణ మంత్రి పీట్ హెగ్సేత్ ప్రకటించారు. యుద్ధ సామర్థ్యాన్ని పెంచే చర్యల్లో భాగంగా సైనికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 30 యేళ్లు దాటిన సైనికులకు హార్మోన్ పరీక్షలను తప్పనిసరి చేస్తూ కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చినట్లు వెల్లడించారు. పెంటగాన్ ప్రకటించిన కొత్త నిబంధనల ప్రకారం.. యాక్టివ్ డ్యూటీ, రిజర్వ్ విభాగాల్లో పనిచేస్తున్న 30 యేళ్లు పైబడిన సైనికులందరికీ టెస్టోస్టెరాన్ లోపం ఉందా? లేదా? అనే పరీక్ష తప్పనిసరిగా నిర్వహించనున్నారు. ప్రతి యేడాది జరిగే పీరియాడిక్ హెల్త్ అసెస్‌మెంట్‌లో ఈ పరీక్షను భాగంగా చేర్చారు. 30 యేళ్లలోపు ఉన్న సైనికులు కోరితే స్వచ్ఛందంగా ఈ పరీక్ష చేయించుకునే అవకాశం కల్పించారు. రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సేత్ ఆదేశాల మేరకే ఈ కొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు పెంగాన్ ప్రధాన ప్రతినిధి సాన్ పార్నెల్ తెలిపారు.

సైనికుల్లో దీర్ఘకాలిక ఒత్తిడి, హార్మోన్ లోపం, శారీరక సామర్థ్యం తగ్గడం వంటి సమస్యల సమాహారం అయిన 'ఆపరేషన్ సింద్రోమ్' సమస్యను ఎదుర్కోవడం, యుద్ధ సన్నద్ధతను మరింత బలోపేతం చేయడం ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ పరీక్షల ద్వారా సైనికుల ఆరోగ్య పరిస్థితిపై సమగ్ర సమాచారం సేకరించనున్నట్లు పెంటగాన్ తెలిపింది. అవసరమైన వారికి టెస్టోస్టెరాన్ చికిత్స అందించి, సైనిక దళాన్ని ఆరోగ్యంగా, సమర్థంగా ఉంచాలని భావిస్తోంది.

సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం నిరంతర పర్యవేక్షణ చేయాలి

కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ,జులై 16: పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష 19వ రోజుకు చేరింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వాలకు కీలక ఆదేశాలు ఇచ్చింది. వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైతే ఆయనకు వైద్యసాయం అందించాలని సూచించింది. ప్రతి ప్రాణం విలువైందేనన్న న్యాయస్థానం.. సొలిసిటర్ జనరల్‌ను ఆయన ఆరోగ్యం గురించి ప్రశ్నించింది. రోజుల తరబడి ఆహారం తీసుకోకపోవడంతో వాంగ్‌చుక్ ఆరోగ్యం విషమిస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఆయన శరీర అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. కాగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూన్ 28 నుంచి సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేస్తున్నారు. నీట్ పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆయన ఈదీక్ష చేస్తున్నారు. గత 18రోజులుగా ఆహారం తీసుకోకపోవడంతో ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. దాంతో ఆయన దీక్ష విరమించాలని ప్రతిపక్ష నేతలు కోరుతున్నారు. సోనమ్ వాంగ్‌చుక్ నిరాహారదీక్ష 19వరోజుకుచేరడం,ఆయన ఆరోగ్యం దెబ్బతింటున్న నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించింది.

మేం పాక్‌లో భాగం కాదు.. బలవంతంగా ఆక్రమించారు

- పివోకేలో నేతల వెల్లడి

ముజఫరాబాద్,జులై 16: పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలో ఇస్లామాబాద్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్థానిక ప్రజలు, నాయకులు పెద్ద ఎత్తున తిరుగుబాటుకు దిగారు. అక్కడ జరిగిన ఒక భారీ బహిరంగ సభలో నిరసనకారులను ఉద్దేశించి స్థానిక నాయకుడు అమ్జద్ అయూబ్ మీర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర సంచలనం రేపుతున్నాయి. ఈప్రాంతం స్వతంత్రమైనది కాదని, పాకిస్థాన్ సైనిక బలగాలు దీనిని అక్రమంగా ఆక్రమించుకున్నాయని ఆయన బహిరంగంగానే ప్రకటించారు. ఈ నిరసన ర్యాలీలో నాయకులు మాట్లాడుతూ దశాబ్దాలుగా పాకిస్తాన్ పాలకులు తమ ప్రాంతంలోని సహజ వనరులను, ముఖ్యంగా నీటిని, జలవిద్యుత్‌ను పూర్తిగా దోచుకుంటున్నారని ఆరోపించారు. తమ ప్రాంతంలోనే విద్యుత్ ఉత్పత్తి అవుతున్నప్పటికీ, స్థానిక ప్రజలకు మాత్రం కనీస విద్యుత్‌సరఫరా లేకుండా అంధకారంలో ఉంచుతున్నారని మండిపడ్డారు. పాకిస్థాన్ ప్రభుత్వం తమను పౌరులుగా కాకుండా, కేవలం బానిసలుగా మాత్రమే చూస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో ఇస్లామాబాద్ ప్రభుత్వం పీవోకే ప్రాంతంపై అదనపు పన్నుల భారాన్ని మోపడాన్ని స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తమకు కనీస సదుపాయాలు కల్పించని ప్రభుత్వం, పన్నులు మాత్రం ఎలా వసూలు చేస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ అణచివేతను ఇకపై భరించే ప్రసక్తే లేదని, తమ హక్కుల సాధన కోసం మరియు పాక్ ఆక్రమణ నుంచి విముక్తి కోసం ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నిరసనకారులు స్పష్టం చేశారు.

ఇస్రోలో రాజీనామాల పరంపర

ఆమోదించవద్దంటూ కేంద్రం ఆదేశాలు

బెంగళూరు,జులై 16: ఇస్రోలో కీలక ప్రాజెక్టులపై పనిచేస్తున్న శాస్త్రవేత్తలు వరుసగా రాజీనామాలు చేస్తున్న నేపథ్యంలో కేంద్ర అంతరిక్ష శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గగన్‌యాన్‌తో పాటు ఇతర ప్రధాన మిషన్లలోఉన్న శాస్త్రవేత్తల స్వచ్ఛంద పదవీ విరమణ, రాజీనామాలపై కఠిన నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చింది. ఈనెల 14న విడుదల చేసిన అంతర్గత మెమో ప్రకారం గగన్‌యాన్, ఇతర కీలక ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న గ్రూప్ ఏ శాస్త్ర, సాంకేతిక సిబ్బంది రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణ దరఖాస్తులను ఇకపై సాధారణంగా ఆమోదించరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులు పూర్తయ్యే వరకు అలాంటి అభ్యర్థనలను కేంద్రాల డైరెక్టర్లు ఆమోదించకుండా, తమ సిఫార్సులతో పాటు అంతరిక్ష శాఖకు పంపాలని ఆదేశించింది. తుది నిర్ణయం మంత్రిత్వ శాఖే తీసుకోనుంది. ఇస్రోలో ఇటీవల రాజీనామాలు పెరిగిన విషయాన్ని పరోక్షంగా అంతరిక్ష శాఖ గుర్తించింది. అయితే ఎంతమంది వెళ్లారనే అధికారిక వివరాలు వెల్లడించలేదు. ఇస్రో వర్గాల ప్రకారం కనీసం 100 నుంచి 120మంది వరకు రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. వారిలో యూఆర్ఎస్‌సీ నుంచి సుమారు 80 మంది, వీఎస్ఎస్‌సీ నుంచి కనీసం 20 మంది ఉన్నట్లు సమాచారం. ఎల్‌వీఎం3 ప్రాజెక్ట్ డైరెక్టర్ విక్టర్ జోసెఫ్, స్పాడెక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో పాటు చంద్రయాన్3లో కీలకంగా పనిచేసిన ఓ యువ శాస్త్రవేత్త కూడా రాజీనామా చేసినట్లు వర్గాలు తెలిపాయి.

ఈ పరిణామాలపై ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ స్పందించారు. రాజీనామాలు జరుగుతున్న మాట వాస్తవమేనని, అయితే ప్రతి సంస్థలో ఇలాంటి పరిస్థితులు ఉంటాయన్నారు. కీలక ప్రాజెక్టులకు ఒక్కసారిగా అంతరాయం కలగకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా వెళ్లినా వారి బాధ్యతలను మరొకరు చేపడతారని, పరిస్థితిని ఇస్రో సమర్థంగా నిర్వహిస్తోందని వెల్లడించారు. ఇస్రోలో మొత్తం 14,600 మందికి పైగా ఉద్యోగులు ఉన్నప్పటికీ, రాజీనామాలు చేసిన వారిలో కీలక మిషన్లకు చెందిన అనుభవజ్ఞులు ఉండటమే ఆందోళన కలిగిస్తోంది. చంద్రయాన్ 3లో ల్యాండింగ్ ప్రక్రియ ధ్రువీకరణకు అవసరమైన లక్షకు పైగా పరీక్షలు నిర్వహించి, దాదాపు 25 టెరాబైట్ల డేటాను సిద్ధం చేసిన ప్రాజెక్ట్ మేనేజర్ ఆదిత్య రాళ్లపల్లి కూడా సంస్థను వీడినట్లు సమాచారం. 2020లో జారీ చేసిన నిబంధనల ప్రకారం గ్రూప్ఏ శాస్త్ర, సాంకేతిక సిబ్బంది రాజీనామాలను సంబంధిత కేంద్రాల డైరెక్టర్లే ఆమోదించే అధికారం ఉండేది. తాజా ఆదేశాలతో గగన్‌యాన్, ఇతర ప్రధాన మిషన్లలో పనిచేసే శాస్త్రవేత్తల విషయంలో ఆ అధికారాన్ని వెనక్కి తీసుకుంది. ఖాళీలను భర్తీ చేయడం కంటే అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలను భర్తీ చేయడం అంత సులభం కాదనే అభిప్రాయంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తాజా ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి.

ప్రియాంక గాంధీ పిఎనంటూ రూ.3 కోట్లకు కుట్ర

ఎమ్మెల్యే ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు

తిరువనంతపురం,జులై 16: కాంగ్రెస్ కీలక నాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా వ్యక్తిగత కార్యదర్శిగా నమ్మించేందుకు ఒక వ్యక్తి ప్రయత్నించాడు. కేరళ ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి రూ.3 కోట్లు కాజేసేందుకు ప్రయత్నించాడు. వారి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తున్నారు. ప్రియాంక గాంధీ ఢిల్లీ కార్యాలయంలో ఆమె వ్యక్తిగత కార్యదర్శి డీఎస్ రాజ్‌కుమార్‌గా నమ్మించేందుకు ఒక వ్యక్తి ప్రయత్నించాడు. ఈనెల 6న కేరళలోని ఏలత్తూర్ ఎమ్మెల్యే కె. విద్యా బాలకృష్ణన్‌కు వాట్సాప్ కాల్ చేశాడు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశం ఉందని తెలిపాడు. రూ.3 కోట్లు ఇస్తే ఆమెకు మంత్రి పదవి ఇప్పించేలా చూస్తానని ఆశ కల్పించాడు. కోజికోడ్‌కు చెందిన మరో ఎంపీ ఆమె పేరును సూచించినట్లు అతడు చెప్పాడు. అనుమానం రావడంతో ఎమ్మెల్యే విద్యా బాలకృష్ణన్ ఆ ఎంపీతో పాటు ప్రియాంక గాంధీ కార్యాలయాన్ని సంప్రదించారు.

తనకు కాల్ చేసిన వ్యక్తి రాజ్‌కుమార్‌గా నమ్మించి డబ్బు కాజేసేందుకు ప్రయత్నించినట్లు నిర్ధారించుకున్నారు. దీంతో ఆ ఎమ్మెల్యే ఫిర్యాదుతో కోజికోడ్ సైబర్ పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు కేరళ ఎంపీలు షఫీ పరంబిల్, డీన్ కురియకోస్‌తో పాటు పలు కాంగ్రెస్ నేతలను ఆ వ్యక్తి సంప్రదించినట్లు బయటపడింది. ఈ నేపథ్యంలో ప్రియాంక గాంధీ వాద్రా ఢిల్లీ కార్యాలయ కార్యదర్శి రాజ్ కుమార్ దీనిపై స్పందించారు. కేరళ రాష్ట్ర పోలీస్ చీఫ్, వయనాడ్ ఎస్పీకి ఆయన ఫిర్యాదు చేశారు. ఒక వ్యక్తి తన గుర్తింపు, ప్రియాంక గాంధీ వాద్రా కార్యాలయం పేరు దుర్వినియోగం చేస్తున్నాడని, డబ్బు డిమాండ్ చేసి ప్రజాప్రతినిధులను మోసగించేందుకు ఆ వ్యక్తి ప్రయత్నించినట్లు ఆరోపించారు. ఈ నేపథ్యంలో బుధవారం వయనాడ్‌లో కూడా కేసు నమోదైంది.

ఢిల్లీ నుంచి వాట్సాప్ కాల్ చేసిన ఆ వ్యక్తి ఉపయోగించిన ఫోన్ నంబర్ ఆధారంగా ఒక అనుమానితుడ్ని గుర్తించినట్లు కేరళ పోలీస్ అధికారి తెలిపారు. నకిలీ గుర్తింపు పత్రాలతో సిమ్ కార్డు కొనుగోలు చేశాడా అని అనుమానిస్తున్నారు. దర్యాప్తు కోసం ఒక బృందాన్ని ఢిల్లీకి పంపిస్తామని పోలీస్ అధికారి వివరించారు.

అవినీతిపరులకు రెండో ఛాన్స్ ఇవ్వను

తమిళ సిఎం విజయ్ వార్నింగ్

చెన్నై,జులై 16: తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ అవినీతిపై తన మంత్రులకు, ప్రభుత్వ యంత్రాంగానికి గట్టి హెచ్చరిక చేశారు. తన ప్రభుత్వంలో అవినీతి, లంచాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడినవారికి ఎలాంటి రెండో అవకాశం ఉండదని గురువారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రజలకు పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ అవినీతిపై జీరో టోలరెన్స్ విధానాన్ని మరోసారి ప్రకటించారు. ఇటీవల అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న తన పార్టీ చెంగల్పట్టు ఈస్ట్ జిల్లా సంయుక్త కార్యదర్శి వీరసామిని విజయ్ పార్టీ నుంచి బహిష్కరించడం సంచలనంగా మారింది. సోషల్ మీడియాలో లంచం తీసుకుంటున్నట్లు ఆరోపణలు వచ్చిన వీడియో వైరల్‌కావడంతో రాజకీయ విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో పార్టీ ప్రాథమిక సభ్యత్వంతోపాటు అన్ని పదవుల నుంచి ఆయనను తొలగించారు. అనంతరం పోలీసులు కూడా ఆయనను అరెస్ట్ చేశారు. అయితే వీరసామి మాత్రం ఇదంతా ప్రతిపక్షాల కుట్ర అని ఆరోపిస్తున్నాడు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం పోలీస్ విచారణ జరుగుతోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచే పారదర్శక పాలనకు ప్రాధాన్యం ఇస్తున్న విజయ్ అవినీతిపై రాజీపడబోమనే సంకేతాన్ని వరుస చర్యల ద్వారా ఇస్తున్నారు. ప్రజల సహకారంతోనే అవినీతిని పూర్తిగా నిర్మూలించగలమని ఆయన పదేపదే చెబుతున్నారు. అవినీతి, లంచాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు.

డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష భేటీ నిర్వహించండి

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే జరపండి: ప్రధాని మోడీకి ఖర్గే లేఖ

న్యూఢిల్లీ, జులై 16: కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖరాశారు. రాబోయే వర్షాకాల సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు, డీలిమిటేషన్‌పై ప్రభుత్వం సవరించిన బిల్లులపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆయనను కోరారు. ఈ ఏడాది ప్రారంభంలో ఈ విషయంపై విస్తృత సంప్రదింపులు జరపాలని కాంగ్రెస్ పదేపదే కోరిన విషయాన్ని ఖర్గే తన లేఖలో గుర్తు చేశారు. ప్రభుత్వ డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం కోరుతూ 2026 మార్చి, ఏప్రిల్ నెలలంతా తాను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి లేఖలు రాశానని, అయితే ఆ అభ్యర్థనలు అంగీకరించబడలేదని ఆయన తెలిపారు. 2026 ఏప్రిల్ 17న లోక్‌సభలో రాజ్యాంగబద్ధంగా అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించడంలో విఫలమైన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు,

2026 గతిని కూడా ఖర్గే ప్రస్తావించారు. రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 సవరించిన ప్రతిని తిరిగి ప్రవేశపెట్టడానికి కేంద్రం యోచిస్తున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయని కాంగ్రెస్ అధినేత అన్నారు.

సంక్షిప్త వార్తలు

టిఎంసికి రాజీనామాచేసిన ఎంపి కోయల్ మల్లిక్

కోల్‌కతా,జులై 16: మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌పార్టీకి మరో జలక్ తగిలింది. ఆ పార్టీ తరపున రాజ్యసభ ఎంపీగా ఏప్రిల్ 6వ తేదీన ప్రమాణ స్వీకారం చేసిన నటి కోయల్ మల్లిక్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఎగువ సభలో టిఎంసికి కష్టాలు మరింత పెరిగాయి. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని, తక్షణమే తన రాజీనామాను ఆమోదించాలని కోరుతూ ఎంపీ కోయల్ మల్లిక్ రాజ్యసభ ఛైర్మెన్ సిపి రాధాకృష్ణనన్‌కు లేఖ రాశారు. అయితే జులై 20వ తేదీ నుంచి వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఎంపి కోయల్ రాజీనామా టిఎంసికి పెద్ద దెబ్బే అవుతుంది.

బంగ్లాలో వధువులను కొనుగోలుచేస్తున్న చైనా పౌరులు

ఢాకా,జులై 16: బంగ్లాదేశ్‌లో వధువుల కొనుగోలుకు పాల్పడవద్దని చైనా ప్రభుత్వం తమ పౌరులను తీవ్రంగా హెచ్చరించింది. వివాహం పేరుతో సాగించే ఇలాంటి చర్యలను మానవ అక్రమ రవాణాగా పరిగణిస్తారని, నిబంధనలు ఉల్లంఘిస్తే బంగ్లాదేశ్ చట్టాల ప్రకారం మరణశిక్ష పడే అవకాశం కూడా ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఢాకాలోని చైనా రాయబార కార్యాలయం ఒక కీలక ప్రకటన విడుదల చేసింది. బ్రోకర్లు లేదా సోషల్ మీడియా వేదికల ద్వారా పరిచయమై, పెళ్లి ముసుగులో సాగించే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తన పౌరులకు సూచించింది.

ఎర్రకోటలో సందర్శకులకు అనుమతి నిలిపివేత

న్యూఢిల్లీ,జులై 16: దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోటను ఆగస్టు 15 వరకు (నెల రోజుల పాటు) సాధారణ సందర్శకులు, ప్రజల కోసం పూర్తిగా మూసివేశారు. ఈ మేరకు భారత పురావస్తు శాఖ అధికారికంగా కీలక ఆదేశాలు జారీ చేసింది. 2026 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో ముందస్తు భద్రతా కారణాల దృష్ట్యా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎర్రకోట ప్రధాన వేదిక కావడంతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండటానికి అధికారులు చాలా వారాల ముందు నుంచే ఇక్కడ విస్తృత ఏర్పాట్లు ప్రారంభించారు.

ఆస్తికోసం కన్నతండ్రినే కాల్చి చంపిన కొడుకు

ఘజియాబాద్, జులై 16: ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో అత్యంత దారుణమైన ఘటన వెలుగు చూసింది. ఆస్తి వివాదాల నేపథ్యంలో కన్నతండ్రినే ఓ కుమారుడు తుపాకీతో కాల్చి చంపాడు. మోదీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుదానా గ్రామంలో బుధవారం రాత్రి ఈ ఘాతుకం చోటుచేసుకుంది. సుమారు రూ. 150 కోట్ల విలువైన ఆస్తులు కలిగిన హరిఓం చౌదరి (55) అనే వ్యక్తిని ఆయన పెద్ద కుమారుడు నిఖిల్ (32) దారుణంగా హత్య చేశాడు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎసిపి భాస్కర్ వర్మ వెల్లడించారు.

అపార్టుమెంట్‌లో అనస్తీషియా వైద్యుడి దారుణ హత్య

ధార్వాడ్,జులై 16: కర్ణాటకలో అత్యంత దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ధార్వాడ్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో 45 యేళ్ల అనస్థీషియా వైద్యుడు దారుణ హత్యకు గురయ్యారు. ఆయన ఎనిమిదేళ్ల కుమారుడు కత్తి పోట్లతో ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనకు సంబంధించి మృతుడి భార్య, వృత్తిరీత్యా కంటి వైద్యురాలైన డాక్టర్ ప్రియాంకను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఉద్యోగాల భర్తీ, క్యాడర్ల వర్గీకరణపై ప్రభుత్వం కార్యాచరణ

● ప్రత్యక్ష నియామకాల నియంత్రణ, స్థానిక క్యాడర్ల వ్యవస్థీకరణ కోసం ప్రణాళిక

విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, క్యాడర్ల వర్గీకరణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. రాష్ట్రపతి ఉత్తర్వులు 2025 అమలు ద్వారా ప్రత్యక్ష నియామకాల నియంత్రణ, స్థానిక క్యాడర్ల వ్యవస్థీకరణ కోసం ప్రణాళికను రూపొందించింది. ఇకపై రాష్ట్రంలో ఆరు జోన్లు, రెండు మల్టీ జోన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందుకు అనుగుణంగా ఆ పరిధిలో ఉద్యోగుల అంశాల్లో వ్యవస్థీకరణ చేస్తారు. అన్ని శాఖల్లోనూ ఈ క్యాడర్లను వ్యవస్థీకరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయా శాఖలు ఇచ్చిన జాబితాలకు అనుగుణంగా సీఎస్ ఉత్తర్వులు ఇచ్చారు. కొత్త నిబంధనల ప్రకారం ప్రత్యక్ష నియామకాల్లో స్థానిక అభ్యర్థులకు ఏకంగా 95శాతం రిజర్వేషన్ వర్తిస్తుంది. మిగతా 5శాతం పోస్టులను మాత్రమే స్థానికేతర(ఓపెన్) కోటా కింద భర్తీ చేస్తారు. నియామకాలు, పదోన్నతులు, సీనియారిటీ, బదిలీలకు జిల్లా, జోన్, మల్టీ జోన్లను వేర్వేరు స్వతంత్ర యూనిట్లుగా పరిగణిస్తారు. గిరిజన సంక్షేమ శాఖలో ప్రధానోపాధ్యాయులను గ్రేడ్2 జోనల్ క్యాడర్‌గా నిర్ణయించారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టును మాత్రం అన్ని శాఖల్లోనూ జిల్లా క్యాడర్ పోస్టుగా పేర్కొన్నారు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు మాత్రం ఈ స్థానిక క్యాడర్ వర్గీకరణ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఏపీ సచివాలయం, విభాగాధిపతుల (హెచ్ఓడి) కార్యాలయాలు, ప్రత్యేక కార్యాలయాలు, రాష్ట్రస్థాయి సంస్థలు, రాజధాని ప్రాంత పరిధిలోని పోలీసు కమిషనరేట్ పోస్టులకు ఇది వర్తించదు. ఈ క్యాడర్ల వారీగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ పూర్తిగా ముగిసే వరకు రాష్ట్రంలో ఆంక్షలు అమల్లో ఉంటాయి పలు శాఖల్లోని పోస్టులను జిల్లా, జోనల్, మల్టీ జోనల్ క్యాడర్లుగా వర్గీకరిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. 1975 నాటి పాత ఉత్తర్వుల స్థానంలో కేంద్రం తీసుకొచ్చిన కొత్త నిబంధనల ఆధారంగా ఈ క్యాడర్ విభజన చేపట్టారు. రాష్ట్రంలో కొత్త పోస్టుల సృష్టి, పోస్టుల ఉన్నతీకరణ, ప్రత్యక్ష నియామకాలు, పదోన్నతులు, బదిలీలు, డిప్యుటేషన్లపై ప్రభుత్వం పూర్తి నిషేధం విధించింది. క్యాడర్ విభజన పూర్తయిన తర్వాత సిబ్బందిని కొత్త, పాత జిల్లాల మధ్య కేటాయిస్తారు. కొత్తగా ప్రకటించిన మార్కాపురం, పోలవరం జిల్లాలు ఇంకా రాష్ట్రపతి ఉత్తర్వుల షెడ్యూల్‌లో చేరలేదు. అధికారికంగా చేర్చేవరకు ఆ జిల్లాలకు కూడా పోస్టులను తాత్కాలికంగా కేటాయిస్తారు. ఆయా శాఖలకు మంజూరైన మొత్తం పోస్టులను క్యాడర్ స్ట్రెంత్‌గా పరిగణిస్తారు. ప్రస్తుత ఖాళీలను మినహాయించి, మిగతా వారిని వర్కింగ్ క్యాడర్‌గా గుర్తిస్తారు. డిప్యుటేషన్, సెలవు, శిక్షణ, సస్పెన్షన్‌లో ఉన్న వారిని కూడా పని చేస్తున్న ఉద్యోగులుగానే పరిగణిస్తారు. ఉద్యోగుల సీనియారిటీ జాబితాలను రూపొందించి, కొత్త జిల్లాలకు వారి నుంచి ఐచ్ఛికాలు తీసుకుంటారు.

కమిటీల ఏర్పాటు: ఉద్యోగులను పాత, కొత్త జిల్లాల మధ్య పారదర్శకంగా కేటాయించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ఉమ్మడి జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా ఉంటారు. కొత్త జిల్లా కలెక్టర్ కోఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఆయా విభాగాల ఉమ్మడి జిల్లా అధికారి కన్వీనర్‌గా, కొత్త జిల్లా అధికారి కోకన్వీనర్‌గా, కొత్త, పాత జిల్లాల రెవెన్యూ అధికారులు సభ్యులుగా ఉంటారు.

ఆయా విభాగాధిపతులు ఈ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. జోన్ పరిధిలోని ఉమ్మడి, కొత్త జిల్లాలకు చెందిన జిల్లా స్థాయి శాఖాధిపతులు సభ్యులుగా ఉంటారు. విభాగాధిపతి నామినేట్ చేసిన జోనల్ హెడ్ గానీ, సంబంధిత విభాగం అధికారి గానీ కన్వీనర్‌గా బాధ్యతలు చూస్తారు. రాష్ట్ర సచివాలయం పరిధిలో ప్రభుత్వ కార్యదర్శి ఛైర్మన్‌గా ఉంటారు. కార్యదర్శి నామినేట్ చేసిన అధికారి సభ్యుడిగా, విభాగాధిపతి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. పాత జిల్లాల మధ్య ఉద్యోగుల విభజన ప్రక్రియను ఆగస్టు 5 లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విభజన పూర్తయిన తర్వాత స్పౌజ్ (భార్యాభర్తల) కేటగిరికి సంబంధించి బదిలీల దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ అభ్యర్థనలను ఆగస్టు 12 లోపు పరిష్కరించేలా ప్రభుత్వం పక్కా ప్రణాళిక రూపొందించింది.

లక్కీ మహారాజ్‌కు జనసేన సత్కారం

విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: దేశంలో వెన్నుపాము, మెదడులోని నరాల కణాలను దెబ్బతీసే జన్యుపరమైన వ్యాధి (ఎస్ ఎంఏ)తో బాధపడుతున్న చిన్నారుల చికిత్సకు తెలంగాణ, ఏపితోపాటు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని మహబూబ్‌నగర్‌కు చెందిన బయలుపాటి లక్కీ మహారాజ్ కోరుతూ హైదరాబాద్ నుంచి ఏపిలోని మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వరకు పాదయాత్ర చేస్తూ గురువారం కంచికచర్ల చేరుకున్నాడు. రూ.16 కోట్ల విలువైన ఒక ఇంజక్షన్ ఆ వ్యాధి సోకిన చిన్నారులను బతికిస్తుంది. అటువంటి చిన్నారులకు ప్రభుత్వాలు సాయం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ని కలవాలనే ఉద్దేశంతో పాదయాత్ర చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న జనసైనికులు ఆయనను దుశాలవాతో ఘనంగా సత్కరించి యోగక్షేమాలు పాదయాత్ర వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్పైనల్ మస్కులర్ అట్రోఫీ (యస్ఎమ్ఏ) అనేది వెన్నుపాము, మెదడు కాండంలోని చలన న్యూరాన్‌లను దెబ్బతీసే ఒక అరుదైన జన్యుపరమైన వ్యాధి. ఇది క్రమంగా, కోలుకోలేని విధంగా కండరాల బలహీనతకు, క్షీణతకు కారణమవుతుంది అని లక్కీ మహారాజ్ తెలిపారు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాలలో సుమారు 15 మంది పిల్లలు ఈ వ్యాధి బారిన పడ్డారని ఈ వ్యాధికి ఉపయోగించే ఇంజక్షన్ ఖర్చు రూ.16 కోట్ల విలువైనదని సాధారణ ప్రజలు కొనేందుకు అసంభవం అని ప్రభుత్వాలు పూనుకుంటే తప్ప పసి పిల్లల ప్రాణాలు దక్కవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ చీఫ్ మినిస్టర్ పవన్ కల్యాణ్‌ను కలిసి ఆయన ద్వారా భారత ప్రధాని నరేంద్ర మోడీకి ఈ సందేశాన్ని చేరవేసి భారతదేశంలోనే ఈ మెడిసిన్ తయారయ్యేలా చూడాలని కోరనున్నట్లు లక్కీ మహారాజ్ తెలిపారు. లక్కీమహారాజ్ కృషిని ఎంతగానో మెచ్చుకున్న జనసైనికులు కచ్చితంగా పవన్ కల్యాణ్ దృష్టికి ఈ విషయం చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షుడు నాయన సతీష్, దేవిరెడ్డి శ్రీనివాసరావు, కొఠారు దేవేంద్ర, పుప్పాల వేణుగోపాల్, తోట ఓంకార్, పసుపులేటి గోపి, ఖమ్మంపాటి తిరుమల రావు పాల్గొన్నారు.

ఎఇఇ నియామక షెడ్యూల్‌లో మార్పు లేదు

● అసత్య ప్రచారాలను నమ్మవద్దు: సిఎండి పుల్లారెడ్డి

విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీసీపీడీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎఇఇ) నియామక ప్రక్రియకు సంబంధించిన షెడ్యూలులో ఎటువంటి మార్పు లేదని సంస్థ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ పి. పుల్లారెడ్డి స్పష్టం చేశారు. ఏఈఈ పోస్టుల కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ 30062026 ఉదయం 10:00 గంటలకు ప్రారంభమై, 20072026 రాత్రి 11:59 గంటల వరకు (మొత్తం 21 రోజులు) కొనసాగుతుందని తెలిపారు. ఈ షెడ్యూలులో ఎలాంటి మార్పులు లేవని, ఇదే అధికారిక షెడ్యూలు అమల్లో ఉందని స్పష్టం చేశారు. ఏఈఈ నియామకాలకు సంబంధించి సామాజిక మాధ్యమాలు, వాట్సాప్ గ్రూపులు, యూట్యూబ్ ఛానళ్లు, ఇతర అనధికార వేదికలలో అసత్య వార్తలు,వదంతులు ప్రచారం అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అభ్యర్థులు ఇటువంటి తప్పుడు ప్రచారాలను విశ్వసించవద్దని ఆయన సూచించారు. .అలాగే, ఉద్యోగాలు ఇప్పిస్తామని, నియామకాల్లో సహాయం చేస్తామని చెప్పి డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తులు, మధ్యవర్తులు (దళారులు) పట్ల అభ్యర్థులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సీఎండీ సూచించారు. ఉద్యోగాల పేరుతో ఎవరైనా డబ్బులు అడిగినా, హామీలు ఇచ్చినా వాటిని నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం ప్రతిభ ఆధారంగా మాత్రమే నిర్వహించబడుతుందని స్పష్టం చేశారు.

ఎపికి భారీ పరిశ్రమలు వస్తున్నాయి!

● నాలుగేళ్లలో వలసలు ఆగే పరిస్థితి వస్తుంది ● టిడిపి సీనియర్ నేత, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం అర్బన్, జులై 16 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు, మంత్రి నారా లోకేష్ కృషి ఫలితంగా విదేశాల నుంచి భారీ పరిశ్రమలు ఆంధ్రప్రదేశ్‌కు తరలివస్తున్నాయని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు.తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నానికి తోడు రాష్ట్రంలో మరో రెండు స్టీల్ ప్లాంట్లు ఏర్పాటుకు చర్యలు జరుగుతున్నాయని, ఆటోమొబైల్, సెల్‌ఫోన్ తయారీ కంపెనీలు కూడా ఏపీకి వస్తున్నాయని తెలిపారు. దీంతో రానున్న నాలుగేళ్లలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా పెరిగి, ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లే పరిస్థితి తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, 1,600 ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ విడుదల చేశామని తెలిపారు. బీటెక్, డిగ్రీ, ఇంటర్, పదో తరగతి, ఐటీఐ

పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఉద్యోగం పొందిన వారికి అవసరమైన శిక్షణ కూడా అందిస్తామని చెప్పారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ నేతలపై ఎమ్మెల్యే తీవ్ర విమర్శలు చేశారు. ఆక్వా రైతులు, మత్స్యకారులు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు గత ప్రభుత్వ హయాంలో సరైన సహాయం అందలేదని ఆరోపించారు. ముద్రగడ పద్మనాభం అవినీతిపరుడు కాదని, అయితే కుల రాజకీయాల వల్ల ఆయన రాజకీయంగా నష్టపోయారని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు మత్స్యేటి ప్రసాద్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, తలారి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ యువ రచయితల ఉత్సవానికి తంగిరాల సోనికు ఆహ్వానం

విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర సాహిత్య అకాడమీ దక్షిణ భారత యువ రచయితల ఉత్సవంలో భాగంగా ఆరు రాష్ట్రాల నుంచి కన్నడ, కొడవ, మళయాళం, తుళు, మలైయాళి, తెలుగు నుంచి యువ కవులను ఎంపిక చేసారు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ప్రముఖ యువ కవి, రచయిత, తంగిరాల సోని(నవీన్)కు కేంద్ర సాహిత్య అకాడమీ బెంగళూరు నుంచి పిలుపు వచ్చింది. శనివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించే యువ కవుల కవితా పఠనం, కవిత్వంపై సోని ప్రసంగిస్తారు. బ్లాక్‌వాయిస్ కవితా సంపుటిని సోని ప్రచురించారు. బహుజన సాహిత్యోద్యమంలో ఉత్సాహంగా సోని పాల్గొంటు న్నారు. తెలుగు భాషను క్షేత్రస్థాయి నుంచి అభివృద్ధి చేయాలని, ఆ క్రమంలో పల్లెపదాలకు విస్తృత ప్రచారం ఇవ్వాలని దిశలో తంగిరాల ఉద్యమిస్తున్నారు. ప్రాచీన సాహిత్య అధ్యయనం, పద్యం, వచనం, గీతం భాషాభ్యున్నతి దోహదం చేస్తాయనే దిశలో సోనీ సాహిత్య ప్రయాణం సాగుతుంది. ఈ నేపథ్యంలో తంగిరాల సోనిను కేంద్ర సాహిత్య అకాడమీ నుంచి పిలుపు వచ్చినందుకు పలువురు రచయితలు అభినందనలు తెలియజేశారు.

ఫొటోగ్రాఫర్ల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రతి ఫ్రేమ్ ఒక జ్ఞాపకం.. కాలం మరచిపోయినా.. ఫొటో మాత్రం ఆ క్షణాన్ని సజీవంగా ఉంచుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. మధుర క్షణాలను శాశ్వతం చేసే ఫొటోగ్రఫీలో విశేష ప్రతిభకనబరిచిన ఫొటోగ్రాఫర్లకు ఆగస్ట్ 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో పురస్కారాలు ప్రదానం చేస్తామని చెప్పారు. ప్రపంచ ఫొటోగ్రఫీ సందర్భంగా నిర్వహించే పోటీలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ లక్ష్మీశ సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, ఫొటో జర్నలిస్టులతో కలిసి గురువారం కలెక్టరేట్‌లో ఆయన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపి హెడ్ క్వార్టర్ డిస్ట్రిక్ అయిన ఎన్‌టీఆర్ జిల్లా పరిధిలోని ఫొటో జర్నలిస్టులు, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు, స్టూడియో ఫొటోగ్రాఫర్లు పోటీల్లో పాల్గొనవచ్చునని వివరించారు. ఫొటోగ్రాఫర్లు ఆగస్టు 5వ తేదీలోగా తమ ఎంట్రీలు పంపాల్సి ఉంటుందన్నారు. మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నామని, మొదటి విభాగంలో జిల్లాకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ వారసత్వం, పర్యాటకం, సంస్కృతి అంశాల్లో ఫొటో ఎంట్రీలు పంపొచ్చన్నారు. రెండో విభాగంలో యువత, పి4, ఆర్థికాభివృద్ధిసంక్షేమం అంశాలు, మూడో విభాగంలో అత్యుత్తమ న్యూస్ ఫొటో పోటీ ఉంటుందన్నారు. ప్రతి విభాగంలో ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.7 వేలు తృతీయ బహుమతిగా రూ.4 వేలు నగదు బహుమతులతో పాటు రూ.2 వేలు చొప్పున ఆరుగురికి ప్రోత్సాహక నగదు బహుమతులు అందించనున్నట్లు వివరించారు. ఒక ఫొటోగ్రాఫర్ ఒక విభాగం నుంచి మూడు ఫొటోలు, అదేవిధంగా మొత్తం మూడు విభాగాల నుంచి తొమ్మిది ఫొటోలు పంపవచ్చన్నారు. 2025, జూన్ 12 నుంచి 2026, జులై 31 మధ్య తీసిన ఫొటోలై ఉండాలని, ఫొటో సైజు 12 ఇంటు10 ఉండాలని, ఫొటోలు ఎన్‌టిఆర్ జిల్లాలో మాత్రమే తీసి, పబ్లిసిటీకి మాత్రమే ఉపయోగించేవిగా ఉండాలని వివరించారు. వాటర్ మార్క్, మార్ఫింగ్ వంటి వాటిని అనుమతించడం జరగదని, ఉత్తమ ఫొటోల ఎంపిక విషయంలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయమని తెలిపారు. ఒరిజినల్ ఫొటో ఎంట్రీలను డిపిఆర్ఓ కార్యాలయం, స్టేట్ గెస్ట్ హౌస్, విజయవాడ -520002 చిరునామాకు నేరుగా లేదా పోస్టల్ ద్వారా సమర్పించవచ్చ న్నారు. ఇతర వివరాలకు కె.రవి, డివిజనల్ పిఆర్ఓ (90101 56550)ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ కె.వి. రమణరావు, డిపిఆర్ఓ టి.నాగేశ్వరరావు, డివిజనల్ పిఆర్ఓ కె.రవి, విశ్రాంత ఎ.వి. సూపర్‌వైజర్ వివి ప్రసాద్, ఫొటో జర్నలిస్టులు సిహెచ్ విజయ భాస్కర్, సిహెచ్ నారాయణరావు, కెవిఎస్ గిరి, జిఎన్ రావు పాల్గొన్నారు.

చేనేత, హస్తకళల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం

మంత్రి ఎస్. సవిత

విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో చేనేత, హస్తకళల రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోం దని రాష్ట్ర చేనేత, జౌళి, బీసీ సంక్షేమ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. కళాకారులకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించడం, సంప్రదాయ కళలను పరిరక్షిస్తూ ఆధునిక ఆవిష్కరణలను ప్రోత్సహిం చడం, జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనల్లో పాల్గొనే అవకాశాలను కల్పించడం ద్వారా వారి జీవనోపాధిని మరింత బలోపేతం చేస్తామని ఆమె తెలిపారు. గురువారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగు తున్న భారత్ టెక్స్-2026 ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ (లేపాక్షి) పెవిలియన్ ను మంత్రి ఎస్. సవిత సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ (లేపాక్షి) ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పాల్గొన్నారు. పెవిలియన్‌లో పాల్గొన్న కళాకారులతో మంత్రి ముచ్చటించి, వారి నైపుణ్యాన్ని అభినందించారు. క్రోషే లేస్, పెదన కలంకారీ, కార్పెట్ నేయడం, కలంకారీ బ్లాక్ ప్రింటింగ్ వంటి సజీవ ప్రదర్శనల ద్వారా ఆంధ్రప్రదేశ్ హస్తకళల వైభవాన్ని దేశానికి పరిచయం చేసిన లేపాక్షి సంస్థను ఆమె ప్రశంసించారు. ఈ సందర్భంగా లేపాక్షి ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌కు విశేష స్పందన లభించిందన్నారు. భారత్ టెక్స్-2026లో లేపాక్షి విజయవంతమైన భాగస్వామ్యం ద్వారా ఆంధ్రప్రదేశ్ హస్తకళలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశేష గుర్తింపు లభించిందని, కళాకారుల జీవనోపాదిని మరింత బలోపేతం చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ఇది నిదర్శనమన్నారు

హస్తకళా రూపకల్పనలను మంత్రి సవితకు అందిస్తున్న కళాకారులు

సరికొత్త హంగులతో ఢిల్లీ లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియం నేడు ప్రారంభం: ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ లేపాక్షి ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని స్టేట్ ఎంపోరియా కాంప్లెక్స్‌లో నూతన హంగులతో తీర్చిదిద్దిన లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియంను 17వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు పునఃప్రారంభించనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విశ్వ మనోహరన్ తెలిపారు. కన్నాట్ ప్లేస్‌లోని హనుమాన్ మందిర్ ఎదురుగా ఉన్న ఈ ఎంపోరియంను ఆధునిక హంగులతో పునరుద్ధరించి, ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ హస్తకళలను ఆకర్షణీయంగా ప్రదర్శించేలా తీర్చిదిద్దారు. ఈ పునఃప్రారంభంతో రాష్ట్ర హస్తకళలకు విస్తృత మార్కెట్ లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

నాదెండ్ల బ్రహ్మం చౌదరికి బ్రెయిన్ స్ట్రోక్

గౌతమీ శ్వేతను ఫోన్‌లో పరామర్శించిన మంత్రి లోకేష్

విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి అస్వస్థతతకు గురయ్యారు. అతనికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. దీంతో తాడేపల్లి మణిపాల్ ఆస్పత్రికి నాదెండ్ల బ్రహ్మం చౌదరిని తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో బ్రహ్మం చౌదరి సతీమణి గౌతమీ శ్వేతను మంత్రి లోకేష్ ఫోనులో పరామర్శించారు. బ్రహ్మం చౌదరి త్వరగా కోలుకోవాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నానని అన్నారు. లోకేష్ 'ఎక్స్'లో చేసిన పోస్టులో బ్రహ్మం పరిస్థితి వివరించారు. వైద్యులతో మాట్లాడి బ్రహ్మం చౌదరి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నానని, త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరానని అన్నారు. బ్రహ్మం చౌదరి త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఆయన ఆరోగ్యంపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ, సామాజిక ప్రముకులు కూడా బ్రహ్మం చౌదరి ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తూ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నారు. బ్రహ్మం చౌదరి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

శ్రీవసుకోటి ఎల్లమ్మ ఆలయంలో చోరీ

12.5 గ్రాముల బంగారు, హుండీలో నగదు మాయం

చంద్రగిరి, జులై 16 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలోని శ్రీవసుకోటి ఎల్లమ్మ వారి ఆలయంలో బుధవారం రాత్రి గుర్తు దుండగులు చొరబడి అందినకాడికి దోచుకుపోయారు. తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, మిట్టపాళ్యం పంచాయతీ శ్రీనివాస మంగాపురంలోని శ్రీవసుకోటి అమ్మవారి ఆలయంలో చోరీ జరిగినట్లు ఎస్ఐ అరుణాచలం తెలిపారు. ఆలయం వెనుక భాగంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయనీ, ఈ మార్గంలోని తాళాలను పగులగొట్టి నిందితులు లోనికి ప్రవేశించినట్లు తెలిపారు. సిసి కెమెరాలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆలయంలో రెండు హుండీలు వున్నట్లు వెళ్ళడించిన ఆయన ఒక హుండీ స్థానికులు, మరో హుండీని అమ్మవారి భక్తులు సేట్‌లు (పూసల వాళ్ళు) ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. వీటిలో స్థానికులు రెండు రోజుల క్రితం తమ హుండీని తెరచి అందులోని రూ.50 వేలకు పైగా నగదు కానుకలను బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు తెలిపారు. అయితే నిందితులు లోపల గల మరో హుండీని పగులగొట్టి అందులోని నగదును పట్టుకుపోయినట్లు తెలిపారు. అదేవిధంగా మినరల్ వాటర్ ప్లాంట్ కాయిన్ బాక్స్‌ను సైతం ఎత్తుకుపోయినట్లు తెలిపారు. అమ్మవారి మెడలోని 12.5 గ్రాముల బంగారు తాళిబొట్టును దోచుకుపోయినట్లు తెలిపారు. సంఘటనా స్థలికి చేరుకున్న ఎస్ఐ ఆలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా క్లూస్ టీమ్ ఇక్కడికి చేరుకుని వేలిముద్రలు సేకరించుకుని వెళ్ళారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బుక్ ఫెస్టివల్ బాబ్జీ కన్నుమూత

విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ పుస్తక మహోత్సవ సంఘ పూర్వ అధ్యక్షుడు, బుక్ ఫెస్టివల్ బాబ్జీ కన్నుమూశారు. గత కొంతకాలంగా కాలేయ సంబంధ అనారోగ్య సమస్యతో ఆయన బాధపడుతున్నారు. విజయవాడ పుస్తక మహోత్సవాల నిర్వహణతో పాటు బుక్ ఫెస్టివల్ భవన నిర్మాణంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. పుస్తక ప్రచురణ రంగంలోను ఆయనకు మంచి గుర్తింపు ఉంది, బాబ్జీ మృతి పట్ల పలువురు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసారు.

అమరరాజా కంపెనీకి లోకేష్ అభినందనలు

క్షమాపణలు తెలిపిన మంత్రి

విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: తెలంగాణలో కొత్త తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అమరరాజాకు ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. జగన్ హయాంలో సొంత రాష్ట్రంలో ప్రోత్సాహం దక్కాల్సిన సంస్థకు ఇబ్బందులు ఎదురయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు మంత్రి లోకేష్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. వైసిపి హయాంలో అమరరాజా వేధింపులకు గురైందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మళ్లీ పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా మారిందని స్పష్టం చేశారు. అమరరాజా భవిష్యత్తు విస్తరణలో ఏపి కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. 'ఆంధ్రప్రదేశ్ మీకు క్షమాపణ చెప్పాల్సి అంటూ గల్లా జయదేవ్‌కు మంత్రి లోకేష్ బహిరంగ క్షమాపణ చెప్పారు. పారిశ్రామిక రంగంలో పెట్టుబడులకు ముందుకు వస్తే అమరరాజాకు అన్ని విధాలుగా సహకరిస్తామని మంత్రి స్పష్టం చేసారు.

రాష్ట్రంలో పరిపాలన గాలికెగిరిపోయింది

● చంద్రబాబు పాలనలో ఎక్కడ చూసినా స్కామ్‌లే ● ప్రజా సమస్యలపై పార్లమెంటులో గొంతెత్తాలి ● ఉభయసభల్లో గట్టిగా వినిపించాలి ● ఎంపిల సమావేశంలో వైఎస్ జగన్

విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో పరిపాలన గాలికెగిరిపోయింది, చంద్రబాబు పాలనలో ఎక్కడ చూసినా స్కామ్‌లే అని వైసిపి నేత, మాజీ ముఖ్య మంత్రి జగన్ అభియోగించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైయస్ జగన్ అధ్యక్షతన వైయస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఈనెల 20 నుంచి జరగనున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో అనుసరిం చాల్సిన వ్యూహాలపై సమావేశంలో జగన్ మాట్లాడారు. పార్టీకి సంబంధించి 2.0 యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ప్రయోజ నాలే మనకు ముఖ్యం. వాటి కోసం గళం విప్పండి. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇది వరకే మనం మద్దతు ఇచ్చాం. దాన్ని మరోసారి పునరుద్ఘాటిస్తున్నాం. రాష్ట్రంలో పాలన గాలికి ఎగిరి పోయింది. ఎక్కడ చూసినా స్కాములే. డీఎస్సీ 2025 పోస్టుల భర్తీలో పెద్ద స్కాం చోటు చేసుకుంది. అసలు పోటీ పరీక్ష రాయ కుండానే ఉద్యోగాలు ఇవ్వడం ఏంటి? ఇంకా డీఎస్సీ పరీక్ష పేపర్ల లీక్‌పైనా అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి. స్పోర్ట్స్ కోటా ఉద్యో గాల భర్తీలో అనేక అవకతవకలు జరిగాయి. కేవలం తమ వాళ్ల కోసం ప్రత్యేకంగా జీవోలు ఇచ్చారు. తమ పని అయిపోగానే ఆ జీవోలు రద్దు చేశారు. సర్టిఫికెట్లు ఇచ్చిన క్రీడా సంఘాలు కూడా వారి చేతుల్లోనే ఉన్నాయి. సాఫ్ట్ బాల్ అసోసియేషన్‌కు టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ అధ్యక్షుడు. జూడీ సంఘా నికి గౌరవ అధ్యక్షుడి గా విశాఖపట్నం ఎంపీ, లోకేష్ తోడల్లుడు భరత్ ఉన్నాడు. రాష్ట్రంలో ఇష్టానుసారంగా భూముల పందేరం జరుగు తోంది. దాదాపు రూ.5 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను లోకేష్ తోడల్లుడికి అప్పనంగా అప్పగించారు. ఘోరమైన అవినీతి జరిగింది. అటు అమరావతి నిర్మాణంలోకూడా విపరీతమైన దోపిడీ జరుగుతోంది. చదరపు అడుగుకు రూ.20 వేలకు పైగా ఖర్చు చేస్తున్నారు. దేశంలో ఎక్కడా ఇలాంటి రేట్లు లేవు. రోడ్ల నిర్మాణాల్లోనూ దోపిడీయే. పూలింగ్‌కు భూములు ఇవ్వని రైతులపై దారుణాలకు దిగుతున్నారు. బలవంతంగా వారి భూము లను లాక్కుంటున్నారు. ఇప్పటికే తీసుకున్న వేల ఎకరాలకే దిక్కులేదు. ఇప్పుడు మళ్లీ మా భూములు ఎందుకు తీసుకుంటున్నా రని రైతులు అడుగుతున్నారు. ప్రభుత్వ తప్పులను వెలికి తీస్తున్న, ప్రశ్నిస్తున్న వారిపై వేధింపులకు దిగుతున్నారు. తప్పుడు కేసులు పెడుతున్నారు. సోషల్ మీడియా పేరిట చంద్రబాబు తీవ్ర అరాచకాలకు పాల్పడుతు న్నారు. ఎవరి మీదనైనా సరే కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్నారు. టెట్ రూపంలో టీచర్ల ఇబ్బందులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి. టెట్ రాకముందు నుంచి టీచర్లుగా పనిచేస్తున్న వారికి ఇప్పుడు టెట్ తప్పనిసరి చేయడం సరికాదు. పైగా వాళ్లంతా కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌లో ఉత్తీర్ణులు అయిన వారే. వీళ్లు ఉద్యోగాలు పొందనప్పుడు వీళ్లకు టెట్ అనే పరీక్ష లేదు. కానీ, ఇప్పుడు వీరిని టెట్ రాయమనడం భావ్యం కాదు. సుదీర్ఘ కాలంగా ఒకే సబ్జెక్టు బోధిస్తున్న వారిని, ఇప్పుడు అన్ని సబ్జెక్టులున్న టెట్ పరీక్ష రాయమనడం, దాన్ని తప్పనిసరి చేయడం ఏ మాత్రం సరికాదు. దీనికి సంబంధించి కేంద్ర మంత్రిని కలవాలి. వారికి సమస్యను నివేదించాలి. ఏ పంటకూ గిట్టుబాటు ధర లేక రైతాంగం కూడా చాలా నష్టపోతోంది. భీమవరం సభ ద్వారా ఆక్వా రైతులు ఆగ్రహం పెల్లుబికింది. తాము దగాకు గురవుతున్నామని రైతులు ఆగ్రహంతో ఉన్నారు. ఉద్యోగులు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటన్నింటినీ పార్లమెంటు ఉభయ సభలో లేవనెత్తాలి. ఈ ప్రభుత్వ అవినీతి వ్యవహారాలను ఎండగట్టాలి. ప్రజా సమస్యలపై గట్టిగా పోరాడాలని ఎంపీలకు జగన్ దిశానిర్దేశం చేశారు. సమావేశానికి పార్టీ వైయస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, వై.వి.సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ్‌రెడ్డి, గొల్ల బాబూరావు. లోకసభలో పక్షనేత పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, లోక్‌సభ సభ్యులు ఎం.గురుమూర్తి, అవినాష్‌రెడ్డి, గుమ్మా తనూజారాణి. ప్రత్యేక ఆహ్వానితులుగా పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి హాజరయ్యారు.

అసత్య ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీపై

గీతం పరువు నష్టం దావా

విశాఖపట్నం, జూలై 16, ప్రభాతవార్త :

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అధికారిక స్థలంలో ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యురాలు (ఎమ్మెల్సీ) శ్రీమతి వరుదు కల్యాణి పదేపదే చేసిన తప్పుడు ప్రకటనలు, అసత్య ప్రచారం పై తాజాగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రూ. 5 కోట్ల పరువు నష్టం దావా వేసింది. గౌరవ ప్రధమైన చట్ట సభకు ప్రాతినిధ్యం వహిస్తూ వాస్తవాలు పరిశీలించకుండా గౌరవ ఎమ్మెల్సీ శ్రీమతి వరుదు కల్యాణి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధా రమైనవని మరియు ప్రస్తుతం నిర్మాణంలో (తరువాయి 8వ పేజీలో)

నర్సీపట్నం 26వ వార్డులో సీసీ రోడ్డును ప్రారంభించిన ఎంపీ చింతకాయల విజయ్

నర్సీపట్నం, జూలై 16, ప్రభాతవార్త :

రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన తర్వాత ఎంపీ చింతకాయల విజయ్ తొలిసారిగా నర్సీపట్నంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. గురువారం నర్సీపట్నంలోని 26వ వార్డు వెలమ వీధిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 15 లక్షల 44 వేలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. చింతకాయల పద్మావతి, టీడీపీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్‌ల తో కలిసి రిబ్బన్ కట్ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముందుగా వెలమ వీధిలోని రామాలయంలో ఎంపీ విజయ్ విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ విజయ్ మాట్లాడుతూ.. తాను పుట్టి పెరిగిన వీధిలోనే, తన చేతుల మీదుగా తొలి శిలాఫలకం ఆవిష్కరించడం తన జీవితంలో మర్చిపోలేని అనుభూతి అని, ఇది తనకు ఎంతో గర్వకారణంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. నర్సీపట్నం అభివృద్ధి కోసం మంత్రి అయ్యన్న పాత్రుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని, కేవలం (తరువాయి 8వ పేజీలో)

ఐఐఐటీ శ్రీకాకుళానికి రూ. కోటి విలువైన ఫర్నిచర్ అందజేసిన

గీతం యూనివర్సిటీ ప్రెసిడెంట్ శ్రీభరత్

విశాఖపట్నం, జూలై 16, ప్రభాతవార్త :

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళం ప్రాంగణంలో విశాఖపట్నం గీతం యూనివర్సిటీ ప్రెసిడెంట్ మరియు విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు గౌ.శ్రీ.ఎం.భరత్ ఐఐఐటీ క్యాంపస్ కు విచ్చేసి తొలుత ఆడిటోరియం ఆవరణలో మొక్క నాటారు. ఇంజనీరింగ్ విద్యార్థులతో మాట్లాడారు. ప్రాంగణ అభివృద్ధి పనులు మరియు భోజన, వసతి గృహాల సౌకర్యాలు గురించి తెలుసుకున్నారు. ఉన్నత భవిష్యత్తు కోసం ఉన్నత విద్యా ప్రమాణాలు గురించి విద్యార్థులను మరియు అధికారులతో మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని పిల్లలతో అనేక విషయాలను చర్చించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ (తరువాయి 8వ పేజీలో)

గిరి ప్రదక్షిణకు

పకడ్బందీ ట్రాఫిక్ ఏర్పాట్లు

రూట్ మ్యాప్‌లపై ముందస్తు అవగాహన కల్పించాలి

ట్రాఫిక్ మళ్లింపు మార్గాలను విస్తృతంగా ప్రచారం చేయాలి: కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

విశాఖపట్నం, జూలై 16, ప్రభాత వార్త:

ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారి గిరి ప్రదక్షిణ సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు, నో వెహికల్ జోన్లు, ప్రత్యామ్నాయ రూట్లపై ప్రజలకు ముందుగానే పూర్తి అవగాహన కల్పిస్తూ రూట్ మ్యాప్‌లను మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రెండో విడత సమీక్ష సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ (తరువాయి 8వ పేజీలో)

విశాఖలో వైభవంగా 18వ ఇస్కాన్

శ్రీజగన్నాథ రథయాత్ర

వేలాది మంది భక్తుల మధ్య మూడు భారీ రథాల ఊరేగింపు

భక్తి పారవశ్యంలో నగర వీధులు

విశాఖపట్నం, జూలై 16, ప్రభాతవార్త :

ఇస్కాన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో 18వ శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం గురువారం ఆషాఢ శుక్ల ద్వితీయ సందర్భంగా అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి వారి కోసం ప్రత్యేకంగా రూపొందించిన మూడు భారీ రథాలు వేలాది మంది భక్తుల మధ్య నగర వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగాయి. 37 అడుగుల ఎత్తైన యాంత్రిక మడత శిఖరాలతో రూపొందించిన రథాలను (తరువాయి 8వ పేజీలో)

అడుగడుగునా ఎంపీ విజయ్‌కు జన నీరాజనం

ఎంపీగా నర్సీపట్నం నియోజకవర్గంలో తొలి పర్యటన సూపర్ సక్సెస్

నర్సీపట్నం, జూలై 16, ప్రభాతవార్త :

రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ ఎంపీ హోదాలో తొలిసారిగా నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో చేసిన పర్యటనకు అనూహ్య స్పందన లభించింది. ప్రజలు పెద్ద సంఖ్యలో విజయ్ వెంట నడిచారు. జేజేలు పలికారు. నర్సీపట్నం టౌన్, నాతవరం మండలాల్లో గురువారం ఎంపీ విజయ్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గడపగడపకు కార్యక్రమం పేరుతో నాతవరంలో స్వయంగా ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి ఆదరణ కనిపించింది. అడుగడుగునా ప్రజలు నీరాజనం పలికారు. పెద్ద ఎత్తున విజయ్ పర్యటనకు తరలివచ్చారు.

పర్యటనకు ముందు నర్సీపట్నం పట్టణంలోని శ్రీ బాలవినాయక స్వామి, మరిడితల్లి ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజల శ్రేయస్సు,ఈ ప్రాంత అభివృద్ధి కోసం ప్రార్థించారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి నాతవరం మండల పర్యటనను ప్రారంభించారు. మండల సరిహద్దు బెన్నవరం వద్ద వందలాది కార్లు, నాతవరం పెట్రోల్ బంక్ వద్ద వేలాది మంది కార్యకర్తలతో ఆయనకు అపూర్వ స్వాగతం లభించింది. అక్కడి నుంచి సైకిల్ ర్యాలీగా వెళ్లి అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం ప్రభుత్వ పాఠశాలలో వాలీబాల్ పోటీలను ఎంపీ విజయ్ స్వయంగా ఆడి ప్రారంభించారు. ఎంపీపీ స్కూల్‌లో ప్లే గ్రౌండ్‌ను ప్రారంభించి, ప్రాంగణంలో మొక్కలు నాటడంతో పాటు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. 'గడప గడపకు' కార్యక్రమంలో భాగంగా బీసీ కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత రెండేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా ఆయన ప్రజలకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎంపీ విజయ్ మాట్లాడుతూ ప్రజల ఆప్యాయత, ఆశీర్వాదాలు మరువలేనివన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆశీస్సులతో సొంత గడ్డపై అడుగుపెట్టడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ గురించి ప్రస్తావిస్తూ.. యువగళం పేరుతో సుమారు 4 వేల కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసి, పేదలు, మహిళలు, యువత కష్టాలను స్వయంగా తెలుసుకున్న ఏకైక దమ్మున్న నాయకుడు లోకేష్ అని కొనియాడారు. రాష్ట్రానికి, తెలుగుదేశం పార్టీకి నారా లోకేష్ భవిష్యత్తు అని ఆయన స్పష్టం చేశారు. తన తండ్రికి 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎటువంటి అవినీతి మచ్చ లేదని, ఆయన స్ఫూర్తితోనే తాను నిబద్ధతతో ముందుకు వెళ్తున్నానని తెలిపారు. తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి మహిళల పక్షపాతి (తరువాయి 8వ పేజీలో)

కదలిన జగన్నాథ రథచక్రాలు

- వైభవోపేతంగా జగన్నాథ స్వామివారి ఉత్సవాలను ప్రారంభించిన ఎంఎల్ఎ వంశీకృష్ణ శ్రీనివాస్
- భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు - ఆలయ అధికారి రాజగోపాల్

జ్ఞానాపురం, జూలై 16, ప్రభాతవార్త :

భక్తుల కోర్కెలు తీర్చే జగన్నాధస్వామివారి ఉత్సవాలు నగరంలో ప్రారంభమైయ్యాయి. రథయాత్ర మహోత్సవాలు కన్నుల పండుగగా ప్రారంభమయ్యాయి. లక్షలాది మంది స్వామివారి భక్తులు జగన్నాథ ... జగన్నాథ అంటూ కేకలు వేసుకుంటూ రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. 194 ఏళ్ళ చరిత్రతో ముడిపడి ఉన్న జగన్నాథస్వామి దేవాలయం పూర్ణామార్కెట్ దరిలో వేంచేసి ఉంది. చిన్న కమ్మలపాకలో ప్రారంభమైన దేవాలయం నేడు దివ్యక్షేత్రంగా విరజిల్లుతోంది. దక్షిణ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఈ దేవాలయ బాధ్యతలు రాజగోపాల్ నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం జగన్నాథుని ఉత్సవాలను దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. రథయాత్రలో భాగంగా స్వామివారు ఆశీనులై ఉన్న రథానికి పూజలు, హారతి అనంతరం వంశీకృష్ణ శ్రీనివాస్ స్వామివారి రథాన్ని లాగుతూ స్వామివారిని తోడ్కొని వచ్చారు.

స్వామివారి దేవాలయ విశిష్టత

విశాఖ కుగ్రామంగా ఉన్న నాడు సుమారు 1832 ఏడాదిలో ప్రస్తుతం దేవాలయం ఉన్న ప్రాంతంలో తవ్వకాల్లో శ్రీ రంగనాథస్వామి పంచలోహ విగ్రహాము బయటపడింది. నాడు ఈ (తరువాయి 8వ పేజీలో)

విశాఖలో యువకుని

దారుణ హత్య

విశాఖపట్నం, జూలై 16, ప్రభాతవార్త :

మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమర్ నగర్ లో గురువారం ఉదయం ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పాత కక్షల నేపథ్యంలో ఇద్దరి మధ్య గొడవ జరిగి, ఒకర్ని ఒకరు కత్తులతో దాడి చేసుకోగా ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్ర గాయలతో ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నారు. వివరాల్లోకి వెళితే అమర్ నగర్‌కు చెందిన కింజరపు గంగాధర్ (26) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఇదివరలో జ్ఞానాపురానికి చెందిన కంట శివకుమార్‌తో (తరువాయి 8వ పేజీలో)

లోకేష్‌తో గంటా భేటీ

నియోజకవర్గ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన మంత్రి

విశాఖపట్నం, జులై 16: విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం అమరావతిలో భేటీ అయ్యారు. భీమిలి నియోజకవర్గంలో వివిధ సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకువెళ్లగా వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. 2014-19 మధ్యలో ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ కు 5 ఎకరాల భూమిని కేటాయించి శంకుస్థాపన చేశామని, లీజు గడువును పేర్కొనకపోవడంతో సాంకేతిక సమస్య తలెత్తిందని గంటా తెలియజేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన (తరువాయి 8వ పేజీలో)

ఉత్తరాంధ్రలో తొలి కోవిడ్ కేసు

విశాఖలో కలకలం

- అప్రమత్తమైన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం
- విమ్స్‌లో 18, కెజిహెచ్ లో 17 పడకల కరోనా ఐసొలేషన్ వార్డులు ఏర్పాటు
- రాష్ట్రములో 12కు పెరిగిన కేసుల సంఖ్య
- ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు పిలుపు

విశాఖపట్నం, జూలై 16, ప్రభాత వార్త:

ఈ సీజన్‌లో ఉత్తరాంధ్రలో తొలి కోవిడ్-19 కేసు విశాఖపట్నంలో నమోదైంది. నగరంలోని వన్‌టౌన్ అఫీషియల్ కాలనీకి చెందిన 33 ఏళ్ల యువకుడికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఇటీవల హైదరాబాద్ నుంచి విశాఖకు వచ్చిన యువకుడు జ్వరం, జలుబు, ఒళ్లునొప్పులతో బాధపడుతుండగా ప్రైవేట్ ల్యాబ్, కేజీహెచ్ వైరాలజీ ల్యాబ్, పుణే వైరాలజీ కేంద్రంలో నిర్వహించిన పరీక్షల్లో కోవిడ్ పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో హోం ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. కుటుంబ సభ్యులు, సన్నిహితులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఇటీవల వైఎస్సార్ కడప జిల్లాలో ఇద్దరు కోవిడ్‌తో మృతి చెందడం, మరికొన్ని కేసులు నమోదవడంతో రాష్ట్ర (తరువాయి 8వ పేజీలో)

విఎంఆర్‌డిఎకి చెందిన

ఫిక్స్‌డ్ డిపాజిట్ కథనాలపై ఖండన

విశాఖపట్నం, జూలై 16, ప్రభాతవార్త :

విఎంఆర్‌డిఎకి సంబంధించిన వివిధ బ్యాంకుల్లో చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్ ల పై పలువురు ఆరోపణలు చేయటం, అలానే పలు దిన పత్రికల్లో వచ్చిన కథనాలు (విఎంఆర్‌డిఎ అకౌంట్స్‌లో తనిఖీలు, రూ.70 కోట్ల కలకలం పేరిట వచ్చిన కథనాలు) పూర్తిగా అవాస్తవమని, అసత్య దూరమని తెలియజేస్తున్నాము. అలానే బ్యాంకుల్లో వేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్ లను పూర్తి పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా చేయటం జరిగిందని విఎంఆర్‌డిఎ ముఖ్య గణాంక అధికారి హరి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి కోటక్ మహేంద్ర బ్యాంక్ అధికారులు విఎంఆర్‌డిఎ అధికారులను సంప్రదించి, మిగిలిన బ్యాంకులతో పోల్చితే అత్యధికంగా 7 శాతం వడ్డీ ఇస్తామని భరోసా ఇవ్వటం జరిగింది. మిగిలిన బ్యాంకులతో పోల్చితే ఎక్కువ శాతం వడ్డీ వస్తుందని భావించి, కోటక్ మహేంద్ర బ్యాంక్ వెంకోజీపాలెం శాఖలో విఎంఆర్‌డిఎ రూ.75 కోట్లు జమచేసి, ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయటం జరిగింది. అలానే హెచ్.డి.ఎఫ్.సి, బంధన్ బ్యాంకు, కెనరా బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంకులలో కూడా 7 శాతం తగ్గకుండా ఎఫ్.డి.రేటు తగ్గకుండా ఫిక్స్‌డ్ డిపాజిట్ లు వేయటం జరిగింది. ఐతే విశాఖ కోటక్ మహేంద్ర బ్యాంక్ అధికారులు బ్యాంకు నిర్వహణలో భాగంగా సాంకేతికత లోపాలతో విశాఖపట్నం వెంకోజీపాలెం శాఖలో జమ చేయాల్సిన ఫిక్స్‌డ్ డిపాజిట్ మొత్తాన్ని రాజమహేంద్రవరం లోని ఒక శాఖలో 7.16 శాతం వడ్డీ రేటుతో డిపాజిట్ చేయటం జరిగింది. ఈ విషయమై సదరు బ్యాంకు అధికారులు విఎంఆర్‌డిఎ గణాంక విభాగ అధికారులతో ఎలాంటి సమాచారం ఇవ్వలేదు (తరువాయి 8వ పేజీలో)

గీతం పరువు నష్టం దావా

(7వ పేజీ తరువాయి)

ఉన్న స్థలం పూర్తిగా విశ్వవిద్యాలయానికి చెందినదని, అలాగే నిర్మాణ విషయంలో వివిధ ప్రభుత్వ శాఖల అనుమతులను పొందినప్పటికి వాస్తవాలు తెలుసుకోకుండా గీతం పై ఆమె చేస్తున్న ఆరోపణలు సత్యదూరంగా ఉండటంతో పరువు నష్టం దావా వేసినట్లు గీతం న్యాయవాది టి.కనకరాజు వెల్లడించారు. దీనికి సంబంధించి గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ తదితర అధికారుల సమక్షంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన గతంలో గీతం విశ్వవిద్యాలయం తరుపున ఇదే విషయంపై సాక్షి గ్రూప్, కేకే రాజు, లీడర్ పత్రిక మరియు 69 సోషల్ మీడియా ఖాతాలపై రూ.20 కోట్లకు పరువు నష్టం దావా వేశామని వెల్లడించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయానికి వ్యతిరేకంగా పరువు నష్టం కలిగించే కంటెంట్‌ను ప్రచురించడం లేదా ప్రచారం చేయడం చేయరాదని సాక్షి గ్రూప్, కేకే రాజు, లీడర్ పత్రిక మరియు 69 సోషల్ మీడియా ఖాతాలను నియంత్రిస్తూ కోర్టు తాత్కాలిక నిషేధాజ్ఞలు (ఇంటర్మ్ ఇంజంక్షన్) జారీ చేసిందని ఆయన తెలిపారు. గీతంపై గతంలో సహితం సాక్షి పత్రిక ప్రచురించిన అవాస్తవ కథనాలపై కోర్టులో కేసు నమోదు చేసామని అయినప్పటికి సంబంధిత ప్రచురణ సంస్థ అసత్య ప్రచారాలను కొనసాగిస్తోందన్నారు. కోర్టు వీటిని పరిగణనలోకి తీసుకుందని తెలిపారు. దాదాపు 40 సంవత్సరాలకు పైగా సుదీర్ఘ చరిత్ర కలిగి దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలలో ఒకటిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించి విశాఖకు గర్వకారణంగా నిలిచిన విద్యా సంస్థపై అవాస్తవాలను ప్రచారం చేసే వారు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలని, భాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

ఐదో రోజుకు చేరిన మాజీ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పాదయాత్ర

గాజువాక,జులై 16, ప్రభాతవార్త : జీవీఎంసీ 69వ వార్డు మాజీ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి చేపట్టిన భద్రాచలం పాదయాత్ర దిగ్విజయంగా ఐదో రోజుకు చేరుకుంది. గురువారం నాడు ఈ యాత్ర అన్నవరం నుంచి ప్రారంభమై కత్తిపూడి వరకు ఉత్సాహంగా సాగింది. పాదయాత్ర సాగిన మార్గమధ్యంలో కార్పొరేటర్ గోవిందరెడ్డికి స్థానిక ప్రజలు, అభిమానులు బ్రహ్మరథం పట్టారు. మాదుగుల, తుంగలాం, కాపు తుంగలాం, యాదవ్ జగన్నాధపేట తదితర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు ఆయనకు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. గోవిందరెడ్డి చేపట్టిన ఈ భద్రాచలం పాదయాత్ర ఎలాంటి విఘ్నాలు లేకుండా, దిగ్విజయంగా పూర్తికావాలని భగవంతుడిని ప్రార్థిస్తూ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నర్సీపట్నం 26వ వార్డులో సీసీ రోడ్డును ప్రారంభించిన ఎంపీ విజయ్

(7వ పేజీ తరువాయి)

రెండేళ్ల వ్యవధిలోనే 558 కోట్లతో నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారని ఆయన కొనియాడారు. భవిష్యత్తులో నర్సీపట్నం వేదికగా 'సృష్టి క్షేత్రం' రూపుదిద్దుకోబోతోందని, ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న శివభక్తులను ఆకర్షించేలా అత్యద్భుతంగా ఉండబోతోందని ఆయన పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, మంత్రి అయ్యన్నపాత్రుడుల నాయకత్వంలో నర్సీపట్నం మరింత అభివృద్ధి చెందుతుందని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీలోని అన్ని వార్డుల ఇన్‌ఛార్జ్‌లు, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, వార్డు మహిళలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

అడుగడుగునా ఎంపీ విజయ్‌కు జన నీరాజనం

(7వ పేజీ తరువాయి)

అని, ఎన్టీఆర్ హయాం నుంచే మహిళలకు పెద్దపీట వేశారని ఎంపీ విజయ్ గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఉచిత బస్సు ప్రయాణం పథకానికి మహిళల నుంచి విశేష స్పందన వస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. కేవలం రెండేళ్ల వ్యవధిలోనే నియోజకవర్గంలో సుమారు రూ. 532 కోట్లతో అభివృద్ధి పనులు, రూ. 568 కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు కలిపి దాదాపు రూ. 1100 కోట్లు ప్రజల కోసం వెచ్చించామని, 1896 పనులు పూర్తి చేశామని వివరించారు. రానున్న రోజుల్లో నాతవరం మండలంతో పాటు నర్సీపట్నం నియోజకవర్గ అభివృద్ధికి తాను, తన సోదరుడు రాజేష్ నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ అపూర్వ విజయానికి సహకరించి, పర్యటనను విజయవంతం చేసిన జనసేన, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వేలాది మంది ప్రజలు, కార్యకర్తలు అడుగడుగునా పూల మాలలు వేస్తూ, పుష్పాలు చల్లుతూ, హారతులు పడుతూ, స్వాగతం పలికారు

ఐఐఐటీ శ్రీకాకుళానికి రూ. కోటి విలువైన ఫర్నిచర్ అందజేసిన గీతం యూనివర్సిటీ ప్రెసిడెంట్ శ్రీభరత్

(7వ పేజీ తరువాయి)

లక్ష్మీనారాయణ రావు గారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ఎంపీ భరత్ గారు సుమారు కోటి రూపాయలు విలువ చేసే ఫర్నిచర్ ఐఐఐటీ శ్రీకాకుళం ప్రాంగణానికి అందించటం అభినందనీయం అన్నారు. ఆడిటోరియంలో కుర్చీలు, డైనింగ్ హాల్ టేబుల్స్, తరగతి గదుల్లో కుర్చీలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని అన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ అత్యున్నత ప్రమాణాలతో విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందన్నారు. డైరెక్టర్ ప్రొఫెసర్. గిరిధర్ మదరాసు మాట్లాడుతూ తాను కోరగానే ఎంపీ భరత్ గారు చాలా వేగంగా స్పందించి క్యాంపస్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపాలనా అధికారి డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, డా.ముని రామకృష్ణ, డీన్ డా.శివరామశాస్త్రి, డాక్టర్ మోహన్ కృష్ణ చౌదరి,వెల్ఫేర్ డీన్లు డాక్టర్ ప్రకాష్ రావు, యోగేశ్వరి వివిధ విభాగాల కో ఆర్డినేటర్లు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖలో యువకుని దారుణ హత్య

(7వ పేజీ తరువాయి)

గంగాధర్‌కి పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అమర్ నగర్ లో ఓ వ్యక్తి మృతి చెందగా అక్కడకు శివ కుమార్ వచ్చాడు. గంగాధర్ కూడా అక్కడే ఉండడంతో ఇద్దరి మధ్య వివాదం మొదలైంది. ఉదయం 5.30 గంటలకు ఒకరిపై ఆయుధాలతో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో గంగాధర్ మృతి చెందగా శివకుమార్ కు తీవ్ర గాయలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. గంగాధర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మూడో పట్టణ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

లోకేష్‌తో గంటా భేటీ

(7వ పేజీ తరువాయి)

వైసీపీ ప్రభుత్వానికి ఫిల్మ్ నగర్ ప్రతినిధులు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. లీజు గడువు పేర్కొంటూ భూమి కేటాయించాలని కోరగా లోకేష్ సానుకూలంగా స్పందించారు. ఎండాడలో ప్రతిపాదించిన కాపు భవన్ కు టీడీపీ ప్రభుత్వం ఎకరం స్థలాన్ని కేటాయించగా వైసీపీ ప్రభుత్వం దాన్ని అర ఎకరానికి కుదించిందని లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. కాపు భవన్ కు ఎకరం స్థలాన్నిస్తూ ఉత్తర్వులు జారీ చేయించాలన్నారు. సింహాచలం గురుకుల పాఠశాలలో నిలిచిపోయిన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని లోకేష్ భరోసా ఇచ్చారు. సొంత భవనం లేక ఆనందపురం హైస్కూల్ లో నాలుగు తరగతి గదుల్లో నడుస్తున్న జూనియర్ కాలేజీకి గూడు కల్పించేలా నిధులివ్వాలని కోరారు. పద్మనాభం మండలంలో మాన్సాస్ ట్రస్టు జూనియర్ కాలేజీ ఉండడం వల్ల 2014-19 లో తాను విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ జూనియర్ కాలేజీ మంజూరు చేయలేకపోయిన విషయం లోకేష్ కు చెప్పారు. పద్మనాభంలో జూనియర్ కాలేజీ లేకపోవడంతో ఆ మండలంలోని విద్యార్థులు చదువుకోవడానికి విజయనగరం వెళ్లాల్సి వస్తుందన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మధురవాడ ప్రాంతానికి డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలని, పి.హెచ్.సి.ని.. భీమిలి సి.హెచ్.సి.ని 100 పడకల ఆస్పత్రులుగా ఉన్నతీకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా గూగుల్ డేటా సెంటర్ కోసం భూములిచ్చిన తర్లువాడ రైతులకు పరిహారం చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేస్తామని వెల్లడించారు. ప్రత్యేక మహిళ సెజ్ కోసం వంద ఎకరాలు కేటాయించాలని కోరారు. చిల్లపేట చెరువు సుందరీకరణ, ఆనందపురం జంక్షన్ లో అన్న క్యాంటీన్, ఇనాం భూముల సమస్యల పట్ల సానుకూల స్పందన తెలియజేశారు.

ఎండాడ-పనోరమ హిల్స్ రహదారిని 60 అడుగులకు విస్తరించండి

- ప్రభావిత ఆస్తులపై సమగ్ర సర్వే చేపట్టి కార్యాచరణ రూపొందించాలి: జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం, జులై 16, ప్రభాతవార్త : నగర మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా ఎండాడ-పనోరమ హిల్స్ మార్గంలో ప్రతిపాదించిన 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులకు అవసరమైన కార్యాచరణను వెంటనే ప్రారంభించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. గురువారం మధురవాడ జోన్ పరిధిలోని ఎండాడ నుంచి పనోరమ హిల్స్ వరకు వీఎంఆర్డీఏ అభివృద్ధి చేయనున్న మాస్టర్ ప్లాన్ రహదారి మార్గాన్ని జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడుతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ప్రస్తుతం 40 అడుగుల వెడల్పుతో ఉన్న రహదారిని 60 అడుగులకు విస్తరించేందుకు అవసరమైన అడ్డంకులను గుర్తించి తొలగించేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. రోడ్డు విస్తరణ వల్ల ప్రభావితమయ్యే ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల వివరాలను పూర్తిస్థాయిలో సేకరించి, సమగ్ర సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి ఆస్తికి సంబంధించిన యాజమాన్య పత్రాలు, ఇతర రికార్డులను పరిశీలించి పారదర్శకంగా ప్రతిపాదనలు రూపొందించాలని, అలాగే రోడ్డు విస్తరణ వల్ల నగరానికి కలిగే ప్రయోజనాలను ప్రభావిత ఆస్తి యజమానులకు వివరించి అవగాహన కల్పించాలని కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. ఈ పరిశీలనలో మధురవాడ జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, టౌన్ ప్లానింగ్ అధికారి తేజేశ్వరరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ షబ్నం శాస్త్రి తదితర అధికారులు పాల్గొన్నారు.

కదిలిన జగన్నాథ రథచక్రాలు

(7వ పేజీ తరువాయి)

విగ్రహానికి తాటి ఆకులతో పాకను వేసి అర్చకుల నియామకంతో పూజలు నిర్వహిస్తున్నారు. 1862లో స్వామివారికి గరుడ జగన్నాయకుల సారధ్యంలో దేవాల య నిర్మాణాన్ని చేపట్టినట్టు తెలుస్తుంది. 1864 నుంచి ఈ దేవాలయంలో రథయాత్ర మహోత్సవాలను నిర్వహిస్తున్నారు.

స్వామివారి రథయాత్ర ఉత్సవాలు

పూర్ణామార్కెట్ దరిలో ఉన్న దేవాలయం నుంచి గురువారం సాయంత్రం వేద మంత్రాలతో రథయాత్ర ప్రారంభమైంది. ఈ రథయాత్రను ఎంఎల్ఏ వంశీకృష్ణ ప్రారంభించారు. సాంప్రదాయ పద్ధతిలో వేద మంత్రాలతో స్వామివారి రథాన్ని వేలాది మంది భక్తులు లాగుతూ టర్నర్ చౌల్ట్రీ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో స్వామివారిని ఆశీనులను చేసి భక్తులకు దర్శనాలు కల్పిస్తున్నట్టు ఆలయ అధికారి రాజగోపాల్ తెలిపారు.

స్వామివారి విశిష్ట అలంకరణాలు - అవతారాలు

భక్తులకు స్వామివారు పలు రూపాల్లో దర్శనాన్ని కల్పించనున్నారు. వీటికి కార్యనిర్వహణాదికారి రాజగోపాల్ రోజువారి ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఈ నెల 17వ తేదీ శుక్రవారం స్వామివారు మత్స్యవతార రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అలాగే 19న కూర్మావతారం, 20న నృసింహావతారం, 21న వామనావతారం, 22న పరశురామావతారము, 23న రామావతారం, 24న బలరామ, కృష్ణావతారము, 25న శేషపాన్పు అవతారములలో స్వామివారు భక్తులకు దర్శనభాగ్యము కల్పించనున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు పలు సాంస్కృతిక కార్యక్రలను ఏర్పాటు చేసినట్టు ఇఒ రాజగోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో శాస్త్రీయ సంగీత కచేరి, పురందరదాస కీర్తనలు, కూచిపూడి నృత్య ప్రదర్శన, భరత నాట్యం కార్యక్రమాలు నిర్వహించను న్నారు.

మహాన్నదానము

స్వామివారి దర్శనార్థం వచ్చే వేలాది మంది భక్తులకు ఉచిత భోజన సదుపాయాలు కల్పించనున్నట్టు ఇఒ తెలిపారు. గురువారం నుంచి ప్రతి రోజు మద్యాహ్న12 గంటల నుంచి భోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు -

రథయాత్ర అనంతరం భక్తులు రథాన్ని చేతితో తాకకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు రథానికి పూజలు చేసుకునేలా ఏర్పాటు చేస్తున్నారు. పూలు, కుంకుమ తదిత వస్తువులతో స్వామివారి రథాన్ని పాడు చేయవద్దని అధికారులు కోరుతున్నారు.

గిరి ప్రదక్షిణకు పకడ్బందీ ట్రాఫిక్ ఏర్పాట్లు

(7వ పేజీ తరువాయి)

జి.విద్యాధరి, డీసీపీలు, దేవస్థానం ఈవో జె. వెంకటరావు తదితరులతో కలిసి కలెక్టర్ శాఖల వారీగా ఏర్పాట్లను సమీక్షించారు.

భారీ వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గాలు

శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి వచ్చే భారీ వాహనాలను ఆనందపురం--సబ్బవరం మార్గం మీదుగా మళ్లించాలని, నగరం నుంచి వెళ్లే భారీ వాహనాలకు కూడా ప్రత్యామ్నాయ మార్గాలు అమలు చేయాలని ఆదేశించారు.

హనుమంతువాక-మద్దిలపాలెం నో వెహికల్ జోన్

జూలై 28న మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 12 లేదా 1 గంట వరకు హనుమంతువాక-మద్దిలపాలెం, కురుపాం జంక్షన్-అప్పుఘర్ వరకు నో వెహికల్ జోన్లుగా ప్రకటించి ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని సూచించారు. అత్యవసర సేవల వాహనాల కోసం ప్రత్యేక కారిడార్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

గిరి ప్రదక్షిణ సందర్భంగా 32 కిలోమీటర్ల మార్గంలో తాగునీరు, బయో టాయిలెట్లు, పారిశుద్ధ్యం, విశ్రాంతి కేంద్రాలు, వైద్య శిబిరాలు, అంబులెన్సులు, మొబైల్ మెడికల్ యూనిట్లు, విద్యుద్దీపాలు, హైమాస్ట్ లైట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మొత్తం 50 నీటి ట్యాంకులు, ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక విశ్రాంతి కేంద్రం ఏర్పాటు చేయాలని తెలిపారు.

జూలై 28న విద్యాసంస్థలకు సెలవుపై పరిశీలన

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జూలై 28న విద్యాసంస్థలకు సెలవు ప్రకటించే అంశాన్ని పరిశీలించాలని, అదే రోజు మద్యం దుకాణాల మూసివేతకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గిరి ప్రదక్షిణ మార్గంలోని నివాసితులు అత్యవసరమైతే తప్ప ఆ రోజు వాహనాలతో బయటకు రాకుండా సహకరించాలని, వైద్య అవసరాలు ఉన్నవారు ముందుగానే ప్రయాణాలను ప్రణాళిక చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో ఆర్డీవోలు సంగీత్ మాధుర్, దిలీప్ చక్రవర్తి, దేవాదాయ, జీవీఎంసీ, ఆర్టీసీ, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, విద్యుత్, ఆర్ అండ్ బి, జాతీయ రహదారులు, మత్స్యశాఖ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశాఖలో వైభవంగా 18వ ఇస్కాన్ శ్రీజగన్నాథ రథయాత్ర

(7వ పేజీ తరువాయి)

ఒడిశాలోని పిపిలి నుంచి తెప్పించిన రంగురంగుల వస్త్రాలతో అలంకరించడంతో పూరీ జగన్నాథ రథయాత్రను తలపించేలా వైభవంగా కనిపించాయి. ఇస్కాన్ వ్యవస్థాపక ఆచార్యులు శ్రీల ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాదుల విగ్రహాన్ని ప్రత్యేకంగా రూపొందించిన చిన్న రథంలో ఊరేగించారు. సాయంత్రం 4 గంటలకు జీవీఎంసీ ఎదురుగా ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన రథయాత్ర ఎల్ఐసీ భవనం, అంబేద్కర్ విగ్రహం, డాబాగార్డెన్స్, జగదాంబ జంక్షన్, వాల్టేర్ మెయిన్ రోడ్ మీదుగా సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రం వరకు కొనసాగింది. ఈ మహోత్సవంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన కళాకారులు భక్తి కీర్తనలు, సాంప్రదాయ నృత్యాలు, కోలాట ప్రదర్శనలతో భక్తులను ఆకట్టుకున్నారు. వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు స్వచ్ఛంద సేవకులుగా పాల్గొన్నారు. సెంచూరియన్ యూనివర్సిటీ విసి రాజు, పైడా విద్యాసంస్థల అధినేత కృష్ణ ప్రసాద్, ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్ తదితరులతో పాటు వేలాది మంది భక్తులు రథాలను లాగుతూ శ్రీ జగన్నాథ స్వామివారి దివ్య దర్శనం పొందారు. రథయాత్ర పొడవునా భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేయగా, అనంతరం గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో 501 రకాల నైవేద్యాలు స్వామివారికి సమర్పించి మహాప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. అలాగే 108 దీపాలతో మహా సంధ్యా హారతి నిర్వహించి అనంతరం అన్నప్రసాదం వడ్డించారు.

ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రథయాత్ర విజయవంతానికి సహకరించిన భక్తులు, స్వచ్ఛంద సేవకులు, పోలీసు శాఖ, జీవీఎంసీ, ప్రభుత్వ శాఖలు, మీడియా ప్రతినిధులకు ఇస్కాన్ విశాఖపట్నం అధ్యక్షుడు సాంబ దాస్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తరాంధ్రలో తొలి కోవిడ్ కేసు... విశాఖలో కలకలం

(7వ పేజీ తరువాయి)

ప్రభుత్వం ఇప్పటికే అప్రమత్తమైంది. విశాఖలో తొలి కేసు నమోదవడంతో కేజీహెచ్, విమ్స్ ఆసుపత్రుల్లో ఐసోలేషన్ వార్డులు, ప్రత్యేక బెడ్లు, మందులు, ఆక్సిజన్, ర్యాపిడ్ టెస్ట్ కిట్లు సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు.

జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ, రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం కోవిడ్ కేసులపై నిఘా కొనసాగుతోందని, కాంటాక్ట్ ట్రేసింగ్, పరీక్షలు, ముందస్తు వైద్య ఏర్పాట్లను మరింత బలోపేతం చేసినట్లు వైద్యారోగ్య శాఖ అధికారులు తెలిపారు.

విశాఖలో కరోనా కలకలం.. ఉత్తరాంధ్రలో తొలి కేసు

ఈ సీజన్‌లో ఉత్తరాంధ్రలో తొలి కోవిడ్-19 కేసు విశాఖపట్నంలో నమోదైంది. వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన 33 ఏళ్ల యువకుడికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో జిల్లా వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. ప్రస్తుతం అతడు హోం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నాడు.

కేజీహెచ్, విమ్స్‌లో ప్రత్యేక కోవిడ్ బెడ్లు

కోవిడ్ కేసు నమోదవడంతో కేజీహెచ్, విమ్స్ ఆసుపత్రుల్లో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు సిద్ధం చేశారు. విమ్స్‌లో 18, కేజీహెచ్‌లో 17 బెడ్లను అందుబాటులో ఉంచడంతో పాటు మందులు, ఆక్సిజన్, మాస్కులు, ర్యాపిడ్ టెస్ట్ కిట్లను సిద్ధంగా ఉంచారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌వో

జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు సూచించారు. భయపడాల్సిన అవసరం లేదని, వ్యక్తిగత పరిశుభ్రత, మాస్క్ వినియోగం, చేతుల పరిశుభ్రత వంటి జాగ్రత్తలు పాటించాలని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా నిఘా పెంపు

కడప జిల్లాలో రెండు కోవిడ్ మరణాలు నమోదైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో కోవిడ్ ఐసోలేషన్ వార్డులు సిద్ధం చేయడంతో పాటు కాంటాక్ట్ ట్రేసింగ్, పరీక్షలు వేగవంతం చేయాలని వైద్యారోగ్య శాఖకు ఆదేశాలు జారీ చేసింది.

విమానాశ్రయాల్లో ఆరోగ్య తనిఖీలు

విశాఖ, విజయవాడ విమానాశ్రయాల్లో విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. అనుమానాస్పద లక్షణాలు ఉన్న వారికి కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన వైద్య చర్యలు చేపడుతున్నారు.

రక్షణ తయారీ రంగంలో ఎంఎస్ఎంఈలకు కొత్త అవకాశాలు

తిరుపతిలో రాష్ట్రస్థాయి ఎంఎస్ఎంఈ సదస్సు నిర్వహించిన హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్



విశాఖపట్నం, జులై 16, ప్రభాతవార్త : దేశ రక్షణ తయారీ రంగంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈలు) భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం, 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనకు పరిశ్రమలను సిద్ధం చేయడం లక్ష్యంగా హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఎంఎస్ఎంఈ సదస్సు తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. రక్షణ మంత్రిత్వ శాఖ, భారత్ చాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించాయి. "భారత రక్షణ రంగం - ఎంఎస్ఎంఈలకు నూతన అవకాశాలు" అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సుకు హెచ్ఎస్ఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్ అండ్ కమర్షియల్) సీఏ ఈ. కిరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత రక్షణ తయారీ వ్యవస్థకు ఎంఎస్ఎంఈలే వెన్నెముకలాంటివని అన్నారు. దేశీయ తయారీ (ఇండిజెనైజేషన్), సాంకేతిక ఆవిష్కరణలు, రక్షణ స్వావలంబన లక్ష్యాల సాధనలో ఎంఎస్ఎంఈల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. రక్షణ రంగ సరఫరా వ్యవస్థలో ఎంఎస్ఎంఈలకు మరింత ప్రాధాన్యం కల్పించడం ద్వారా దేశ వ్యూహాత్మక స్వయం సమృద్ధి మరింత బలోపేతం అవుతుందని చెప్పారు. ఈ సదస్సులో రాష్ట్రంలోని 120 మందికి పైగా స్థానిక ఎంఎస్ఎంఈ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటేనే భావితరాలకు భద్రమైన భవిష్యత్

సీఐ ఎర్రం నాయుడు

బోనిలో ఈగిల్ యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం

ఆనందపురం, జూలై 16 (ప్రభాత వార్త): మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటేనే భావితరాలకు భద్రమైన భవిష్యత్ సాధ్యమవుతుందని ఆనం దపురం సీఐ వీవీసీఎం ఎర్రం నాయుడు అన్నారు. విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న "పల్లెబాట" కార్యక్రమంలో భాగంగా గురువారం ఆనందపురం మండలం బోని గ్రామంలో ఈగిల్ యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎర్రం నాయుడు మాట్లాడుతూ గంజాయి, మత్తు మాత్రలు, మద్యం వంటి మాదక ద్రవ్యాలు వ్యక్తి, కుటుంబం, సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండి, వారిని చెడు స్నేహాలకు దూరంగా ఉంచి విద్య, క్రీడలు, ఉపాధి వంటి సానుకూల మార్గాల్లో ప్రోత్సహించాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. ఈగిల్ టీం సీఐ టి. కళ్యాణి మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులకు మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించగా, నిర్మూలనకు పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని గ్రామస్థులు హామీ ఇచ్చారు.

జీవితంలో విజయానికి జీవన నైపుణ్యాలే పునాది

ఆనందపురం, జూలై 16, ప్రభాతవార్త : విద్యార్థుల సమగ్ర వికాసానికి జీవన నైపుణ్యాలు ఎంతో అవసరమని, అవే భవిష్యత్ విజ యాలకు బలమైన పునాదిగా నిలుస్తాయని ఆనందపురం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) ప్రధానోపా ధ్యాయురాలు డి.చంద్రకళ పేర్కొ న్నారు. ప్రపంచ జీవన నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, సరైన నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం, సమర్థవంతమైన సంభాషణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం వంటి జీవన నైపుణ్యాలు ప్రతి విద్యార్థికి అత్యంత అవసరమని తెలిపారు. పాఠశాలలో అమలు చేస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్ వృత్తి విద్య ద్వారా విద్యార్థినులు ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వంటి ప్రాయోగిక నైపుణ్యాలను అలవర్చుకున్నారని వాటి ద్వారా భవిష్యత్తులో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను విస్తృతంగా పెంపొందించేందుకు దోహదపడుతుందని వివరించారు. విద్యార్థినులు లైఫ్ స్కిల్స్‌పై స్కిట్లు ప్రదర్శించి, రోజువారీ జీవితంలో వాటి ప్రాముఖ్యతను చక్కగా వివరించారు. జీవన నైపుణ్యాలు, వృత్తి విద్యకు సంబంధించిన ప్రాజెక్టులను ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకున్నారు. అలాగే చిత్రలేఖన పోటీలు నిర్వహించగా విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను చాటారు. పోటీలు, ప్రాజెక్టుల ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఏడాదిలో పోలవరం పూర్తి: కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

గాజువాక,జులై 16 ప్రభాతవార్త : ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టును మరో ఏడాదిలో పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ నేతృత్వంలో శనివారం రాజమహేంద్రవ రంలో ప్రారంభమైన 'పోలవరం మోదీ వరం' బస్సు యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, ఎంపీ పురందేశ్వరి మాట్లాడారు. విభజన చట్టం సెక్షన్ 90 ప్రకారం కేంద్రమే పోలవరం నిర్మాణ బాధ్యతను భుజానికెత్తుకుందన్నారు. ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు రూ. 23,468 కోట్లు విడుదల చేశామని, 2026-27 సంవత్సరానికి మరో రూ. 3,360 కోట్లు కేటాయించామని వెల్లడించారు. అత్యాధునిక సాంకేతికతతో దయాఫ్రాగమ్ వాల్, స్పిల్‌వే పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. ప్రాజెక్టు పూర్తయితే 23 లక్షల ఎకరాలకు సాగునీరు, విశాఖకు తాగునీరు, పరిశ్రమల అవసరాలు తీరడంతో పాటు 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఈశ్వరరావు, గాజువాక నేత కరణంరెడ్డి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

మద్ది గ్రామంలో ఈనెల 21న ముత్యాలమ్మ తల్లి ఉత్సవం

పద్మనాభం, జూలై 16, ప్రభాతవార్త: మండలంలో మద్ది గ్రామ ప్రారంభంలో కొలువుదీరిన ముత్యాలమ్మ తల్లి మహోత్సవం ఈనెల 21న నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు చెప్పారు. గురువారం రామాలయంలో పండగ విషయమై చర్చించడానికి పూజారి కనకల అచ్చన్నతో పాటు పలువురు గ్రామ పెద్దలు సమావేశం అయ్యారు. ఈ మేరకు 21వ తేదీన గతంలో మాదిరిగా గతంలో మాదిరిగా ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఈ ఉత్సవము జరుగుతుందని పెద్దలు చెప్పారు. అదే రోజున పలు సంస్కృతి కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసినట్లు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రాంబాబు, నాయకులు బి.సత్యనారాయణ, నగేష్ కుమారు, బుగత శ్రీను, మధు, ఎర్రి నాయుడు, చిన్నప్పల్ నాయుడు,బి ప్రకాష్, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

గాజువాకలో వర్ధమాన నటీమణులు ప్రియా దేశ్‌పాండే, రేఖా భోజ్ సందడి

గాజువాక,జులై 16,ప్రభాతవార్త : సరికొత్త డిజైన్లు, నమ్మకమైన ఆభరణాలతో గాజువాకలో ఏర్పాటు చేసిన 'ఎస్ఎస్ఎం గోల్డ్, డైమండ్ జ్యూయలరీ' షోరూమ్‌ను త్రిదండి భక్తి కేశవ గోస్వామి మహరాజ్ బుధవారం ప్రారంభించారు. హనుస్ ఫిలిం ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో వర్ధమాన నటీమణులు ప్రియా దేశ్‌పాండే, రేఖా భోజ్ పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా షోరూమ్ డైరెక్టర్లు రిక్కీ ప్రసాద్, కమల్ శర్మ మాట్లాడుతూ.. పెళ్ళిళ్ల సీజన్ కోసం ప్రత్యేక వెడ్డింగ్ కలెక్షన్లు అందుబాటులో ఉంచామన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్ల కింద క్యారెట్‌పై 15 శాతం, వజ్రాభరణాల తయారీపై 25 శాతం, బంగారు ఆభరణాల తయారీపై 9 శాతం తగ్గింపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

వీఎంఆర్డీఏకి చెందిన ఫిక్స్డ్ డిపాజిట్ కథనాలపై ఖండన

(7వ పేజీ తరువాయి)

అని స్పష్టం చేస్తున్నాము. ఐతే బ్యాంకులో తలెత్తిన సాంకేతికత లోపం అధిగమించిన పిమ్మట సదరు మొత్తం రూ.75 కోట్లు ఫిక్స్డ్ డిపాజిట్ మొత్తం తిరిగి విశాఖపట్నం వెంకోజీపాలెం శాఖకి బదలాయించారు. సదరు డబ్బులు వీఎంఆర్డీఏ పేరు మీద ఎఫ్.డి. కబడగా , పూర్తిగా వీఎంఆర్డీఏ యొక్క అధికారంలో ఉంటాయి. అంతే తప్ప ఎవరికో ఇచ్చినట్లు వక్రీకరించి కొంత మంది మాట్లాడం ఖండిస్తున్నామని తెలిపారు. ఫిక్స్డ్ డిపాజిట్ వ్యవహారంలో వీఎంఆర్డీఏ ఎలాంటి పొరపాటు చేయలేదని స్పష్టం చేస్తున్నాము. నిధులు దుర్వినియోగం జరిగాయని, ఇష్టానుసారం బ్యాంకులో ఫిక్స్డ్ డిపాజిట్ చేస్తున్నామని కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలియజేస్తున్నాము. అందువల్ల వీఎంఆర్డీఏ కి సంబంధించిన నిధులను బ్యాంకుల్లో ఫిక్స్డ్ డిపాజిట్ రూపంలో జమ చేసే సమయంలో నిబంధనలు అనుగుణంగా వ్యవహరిస్తామని తెలియజేస్తున్నాము.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర

గూడెం కొత్తవీధి, జులై 16, ప్రభాతవార్త :

మండల పోలీస్ శాఖ, సీఆర్పీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో పూరి జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్ ఉత్సాహంగా రథాన్ని లాగి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం సీఆర్పీఎఫ్ జవాన్లు, పోలీస్ సిబ్బంది, ఏపీఎస్పీ పోలీస్ సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి జగన్నాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రలో పాల్గొన్నారు. రథయాత్ర ఊరేగింపులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో రథాన్ని అనుసరించారు. భక్తుల జైజైధ్వానాలు, ఆధ్యాత్మిక వాతావరణం మధ్య రథయాత్ర వైభవంగా సాగింది. కార్యక్రమంలో ఎస్సై సురేష్, స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ జవాన్లు, ఏపీఎస్పీ పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సమీక్ష

పాడేరు,జులై16,ప్రభాతవార్త:

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సమీక్ష రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ 2026 జులై 16వ తేదీన ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్)-2026 కార్యక్రమం పురోగతిని సమీక్షించారు.సమీక్షలో ప్రధానంగా కింది అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో సర్ కార్యక్ర మం పురోగతిని జిల్లా ఎన్నికల యంత్రాంగం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించింది. జిల్లాలో అనా మలీ కేసులను గణనీయంగా తగ్గించినందుకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అభినందించారు. 2,49,298 (29.87శాతం) ఉన్న అనామలీ కేసులను 48,015 (9.87 శాతం)కు తగ్గించినట్లు తెలిపారు. మిగిలిన అనామలీ కేసులను ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఏ ఎస్ డీడీ గుర్తింపు పొందిన ఓటర్ల సంఖ్య 34,536 నుండి 29,636కు తగ్గింది. మిగిలిన కేసులను బి ఎల్ ఓలు క్షేత్రస్థాయిలో పునః ధృవీకరించాలని ఆదేశించారు. నిజమైన ఓటరుగా నిర్ధారణ అయినట్లయితే సంబంధిత కేసును బిఎల్ఓలతో నిరంతరం ఫోన్ ద్వారా సమీక్ష నిర్వహించాలని సూచించారు. జిల్లాలో 7,362 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని సమీక్షించారు. ఆధార్ డేటా ఆధారంగా ఎన్నికల సంఘం ప్రత్యేక మాడ్యూల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని, బిఎల్ఓ యాప్‌లో 85 సంవత్సరాలు పైబడిన సంభావ్య ఏఎస్‌డిడి కేసులు ప్రదర్శించబ డుతున్నాయని తెలిపారు. బిఎల్ఓలు ప్రతి కేసును క్షేత్రస్థాయిలో పరిశీలించి, లేదాగా సంబంధిత మాడ్యూ ల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారమ్‌ల ప్రకారం జిల్లాలో ఇంకా 21,117 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో: అరకు అసెంబ్లీ నియోజకవర్గం - 16,371పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం - 4,746అరకు నియోజకవర్గ ఈఆర్ఓఏఇఆర్ఓలు అదనపు ఏఇఆర్ఓలు,నో మ్యాపింగ్ కేసుల పరిష్కా రంపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. అన్ని వారిలు ఏఇఆర్ఓలు,అదనపు ఏఇఆర్ఓలు, బిఎల్ ఓలు కింది అంశాలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. అనామలీ కేసుల పరిష్కారం కేసుల నివారణగుర్తింపు పొందిన ఓటర్ల పునః ధృవీకరణ కేసుల ధృవీకరణ, పరిష్కారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్ర మంలో పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు.

పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రులదే

పాడేరు, జులై16, ప్రభాత వార్త:

పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్--టీచర్స్ మీటింగ్ (పీ టి ఎం) 3.1 కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ టి.నిశాంతి పిలుపునిచ్చారు.గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, పాఠశాల యాజమాన్య కమిటీలు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే పిల్లలకు నాణ్యమైన విద్యను అందించగలమని అన్నారు.విద్య అనేది కేవలం పాఠశాలల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి బిడ్డ సంపూర్ణ వికాసానికి తల్లిదండ్రులు, సమాజం చురుకైన భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు.పాఠశాలలు--తల్లిదండ్రుల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మెగా పీటీఎం 3.1 కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమావేశాలు విద్యార్థుల విద్యా పురోగతి, హాజరు, ప్రవర్తన, సమగ్ర అభివృద్ధిని సమీక్షించుకునేందుకు మంచి అవకాశాన్ని కల్పిస్తాయని తెలిపారు.ముఖాముఖి సంభాషణల ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లల బలాలు, మెరుగుపరచుకోవాల్సిన అంశాలు, ఇంటి వద్ద అందించాల్సిన మద్దతును మరింత స్పష్టంగా అర్థం చేసుకోగలరన్నారు.ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం దీక్ష గ్యారెంటీడ్ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ వంటి వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందని, తల్లిదండ్రులు ఈ వేదికలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.లీప్ యాప్ ద్వారా తమ పిల్లల హాజరు, విద్యా పనితీరు, అభ్యసన పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, వారి చదువులకు చురుకైన మద్దతు అందించాలని కోరారు.పిల్లలతో నాణ్యమైన సమయం గడపడం, పఠనా అలవాట్లను ప్రోత్సహించడం, ఉపాధ్యాయులతో క్రమం తప్పకుండా సంప్రదింపులు జరపడం ద్వారా అభ్యసన ఫలితాలు గణనీయంగా మెరుగుపడతాయని తెలిపారు.మన పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి అంకితభావం, నిబద్ధత సమాజం నుంచి ప్రశంసలు, మద్దతుకు అర్హమైనవని అన్నారు. పూర్వ విద్యార్థులు, దాతలు, సమాజ నాయకులు పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధికి, విద్యా కార్యక్రమాలకు సహకరించాలని కలెక్టర్ కోరారు. అలాగే తల్లిదండ్రులు పిల్లల భద్రత, మానసిక శ్రేయస్సు, మాదకద్రవ్యాల దుర్వినియోగం, మొబైల్ ఫోన్ల మితిమీరిన వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మనందరి ఉమ్మడి లక్ష్యం కేవలం పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం మాత్రమే కాకుండా, బాధ్యతాయుతమైన, ఆత్మవిశ్వాసం కలిగిన, నైపుణ్యవంతులైన పౌరులను తీర్చిదిద్దడమేనని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్యతో పాటు వారి కలలను సాకారం చేసుకునేందుకు సమాన అవకాశాలు కల్పించే దిశగా అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మన పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం జిల్లాలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా టీవీ బాలమురళీకృష్ణ

పాడేరు,జులై16,ప్రభాతవార్త:

అదనపు జిల్లా వైద్య అధికారిగా టీవీ మురళీకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన గురువారం జిల్లా కలెక్టర్ టి.నిశాంతి మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పని చేయ డం ఆనందకరమని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రజలకు మరింత వైద్య సేవలు అందిస్తానని స్పష్టం చేశారు. శ్రీకాకుళంలో జిల్లా వైద్యాధికారిగా పనిచేసి దీర్ఘకాలం సెలవులో వెళ్లారు. తిరిగి చేరేకా బదిలీపై అల్లూరి సీతారామరాజు జిల్లా అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా నియమితులయ్యారని తెలియజేశారు.

నేడు పాడేరులో మహా ధర్నా... పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలి

పాడేరు,జులై16, ప్రభాతవార్త:

ఈ నెల 17 వ తేదీ శుక్రవారం ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో జిఓ నెం .3 పునరుద్ధరణ,1/70 చట్టం అమలుకు సంబంధించి పిలుపునిచ్చిన మహా ధర్నా కార్యక్రమం పాడేరు సంత ప్రాంగణంలో నిర్వహించబడనుంది.ఈ నేపథ్యంలో పాడేరు పట్టణంలో అధిక సంఖ్యలో ప్రజలు చేరుకునే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ రద్దీ ఏర్పడి ప్రజలకు అసౌకర్యం కలిగే అవకాశం ఉంది. అందువల్ల ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించి, అత్యవసర అవసరం ఉన్నవారు మాత్రమే పాడేరు పట్టణానికి రావాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ధర్నా కార్యక్రమంలో పాల్గొనే వారు పోలీసు అధికారులు, సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించి, శాంతియుతంగా సహకరించగలరు. ప్రజల సహకారంతో ట్రాఫిక్ నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ సమర్థవంతంగా నిర్వహించబడుతుందన్నారు.

పనసపల్లిలో బొలెరో బోల్తా.. తృటిలో తప్పిన ప్రమాదం

గూడెం కొత్తవీధి ,జులై 16, ప్రభాతవార్త :

జెర్రీల పంచాయతీ పరిధిలోని పనసపల్లి గ్రామంలో గురువారం బొలెరో వాహనం బోల్తా పడింది. పరిసర గ్రామాల రైతులు గృహ నిర్మాణానికి అవసరమైన ఐరన్, సిమెంట్ సామగ్రిని తీసుకెళ్తుండగా చిరుజల్లుల కారణంగా రహదారి జారుడుగా మారి వాహనం అదుపుతప్పి పల్టీ కొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో వాహనంలో ఉన్న వారందరూ సురక్షితంగా బయటపడగా, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. తృటిలో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు.

గంజాయి నిర్మూలనకై అవగాహన ర్యాలీ

పాడేరు,జులై16,ప్రభాతవార్త;

పాడేరు మండలం గుత్తుల పుట్టు సంతబయలు గ్రామంలో గంజాయి వలన కలిగే అనర్థాలు, సైబర్ క్రైమ్స్ గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అక్కడున్న ప్రజలతో మమేకమై వారికి అవగాహన కల్పించి గురువారం ర్యాలీ నిర్వహించామని పాడేరు సిఐ ఎస్ రామారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాడేరు సిఐ ఎస్. రామారావు,పాడేరు ఎస్సై కె.పాపి నాయుడు , తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో ఘనంగా 'ట్రైబల్ ఆర్టిజన్ ఎంపవర్‌మెంట్ మేళా' ప్రారంభం

అరకులోయ , జులై 16,ప్రభాతవార్త :

అరకులోయలో ట్రైఫెడ్ ఆధ్వర్యంలో గిరిజన కళాకారుల ఎంపానెల్‌మెంట్ మేళాను పాడేరు ఐటిడిఏ, భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ట్రైబల్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ట్రైఫెడ్), సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఏ), పాడేరు సహకారంతో గురువారం స్థానిక ఏపీటీడీసీ గోష్ఠి మీటింగ్ హాల్‌లో గిరిజన కళాకారుల ఎంపానెల్‌మెంట్ మేళాను ఘనంగా రుబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిషాంతి.టి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన మహిళలు, ఎస్ హె జీస్ గ్రూప్‌లు, విడివికెలు, ఎఫ్ పిఓలు ద్వారా ఈ హాల్ లో ఏర్పాటు చేసిన గిరిజన ఉత్పత్తుల మేళా అద్భుతంగా ఉన్నాయని, కొనియాడారు. ఢిల్లీ, హైదరాబాద్ ప్రాంతాల నుండి విచ్చేసిన ట్రైఫెడ్ ఉన్నతాధికారుల బృందం స్థానిక గిరిజన ఉత్పత్తులను స్వయంగా పరిశీలించి, నాణ్యమైన ఉత్పత్తులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇక్కడ ఎంపిక చేసిన వస్తువులను కేంద్ర ప్రభుత్వం ట్రైఫెడ్‌కు చెందిన ప్రతినిధులతో దేశవ్యాప్త అవుట్‌లెట్లలో విక్రయానికి ఉంచుతామని, దీని ద్వారా మన గిరిజన కళాకారులకు జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సదుపాయం లభిస్తుందని పేర్కొన్నారు.ఆధునిక మార్కెట్ పోటీని తట్టుకునేలా స్థానిక ఉత్పత్తుల ప్యాకేజింగ్, లేబులింగ్, బ్రాండింగ్ విధానాల్లో మరిన్ని మార్పులు రావాలని కలెక్టర్ సూచించారు. గిరిజన కళాకారుల నైపుణ్యాలను పెంపొందించి, వారి ఆదాయాన్ని రెట్టింపు చేసే ఉద్దేశంతో రాబోయే ఒకటి రెండు నెలల్లో ప్యాకేజింగ్ మరియు బ్రాండింగ్‌పై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం తరపున నిర్వహించనున్నట్లు ఆమె ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ట్రైఫెడ్, ఐటిడిఏ అధికారులు, ఏజెన్సీ పరిధిలోని వివిధ గిరిజన గ్రామాలకు చెందిన కళాకారులు పాల్గొన్నారని ఈ గిరిజన కళాకారుల ఎంపానెల్‌మెంట్ మేళా యొక్క ప్రధాన ఉద్దేశ్యం గిరిజన కళాకారులు, ఉత్పాదకులు, సాంప్రదాయ చేతివృత్తుల నిపుణులు మరియు గిరిజన ఉత్పత్తుల తయారీ, విలువ ఆధారిత ప్రాసెస్సింగ్, మార్కెటింగ్‌లో నిమగ్నమైన కళాకారులను గుర్తించి ట్రైఫెడ్‌తో నమోదు చేయడమన్నారు. ఈ ఎంపానెల్‌మెంట్ ద్వారా గిరిజన కళాకారులకు ట్రైఫెడ్ జాతీయ స్థాయి మార్కెటింగ్ వ్యవస్థ ద్వారా దేశవ్యాప్తంగా తమ ఉత్పత్తులను విక్రయించే అవకాశం లభించడంతో పాటు, మెరుగైన ఆదాయం మరియు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించబడతాయని ఈ మేళాలో సుమారు 120 మంది గిరిజన కళాకారులు పాల్గొన్నారని తెలిపారు. వీరు సాంప్రదాయ హస్తకళలు, అటవీ ఆధారిత ఉత్పత్తులు, సహజ ఆహార ఉత్పత్తులు, ఇతర గిరిజన ఉత్పత్తులను ప్రదర్శించారు. ప్రదర్శించిన నమూనా ఉత్పత్తులు గిరిజనుల సాంప్రదాయ నైపుణ్యం, సృజనాత్మకత, సాంస్కృతిక వారసత్వం, ప్రకృతి ఆధారిత జీవన విధానాన్ని ప్రతిబింబించాయని పేర్కొన్నారు. ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూఅల్లూరి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన స్థానిక అరకు కాఫీ, వెదురు ఉత్పత్తులు (బాంబూ ప్రొడక్ట్స్), మట్టి పాత్రల వంటి సాంప్రదాయ కళలను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కళాకారులు తమ ఉత్పత్తులకు "వాల్యూ ఎడిషన్" (విలువ జోడింపు) చేయడం ద్వారా మార్కెట్లో మరింత మెరుగైన ఆర్థిక ప్రయోజనాలను, ఉన్నతమైన వృత్తిపరమైన గుర్తింపును సాధించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి ఎగ్జిబిషన్స్ ద్వారా మీరు తయారు చేసే ఉత్పత్తులను ఇంటర్నేషనల్ మార్కెట్లో ట్రై ఫెడ్ ద్వారా మార్కెటింగ్ చేసే విధంగా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 11 మండలాల నుండి వచ్చిన గిరిజన ప్రాంతాలకు చెందిన పలువురు హస్తకళాకారులు తాము తయారు చేసిన వైవిధ్యభరితమైన ఉత్పత్తులను ప్రదర్శించాడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ?ఈ సందర్భంగా ట్రైఫెడ్ ప్రాంతీయ మేనేజర్ భాస్కర్ ఝా మాట్లాడుతూ ట్రైఫెడ్ ఎంపానెల్‌మెంట్ కార్యక్రమం యొక్క లక్ష్యాలు, అర్హత ప్రమాణాలు, నమోదు ప్రక్రియ, ఉత్పత్తుల సేకరణ విధానం, మార్కెటింగ్ అవకాశాలు, ట్రైఫెడ్ ద్వారా అందించే వివిధ సహాయ కార్యక్రమాల గురించి ఆయన గిరిజన కళాకారులకు ఉత్పత్తు పై సమగ్రంగా వివరించారు.గిరిజన కళాకారులు ఉత్సాహభరితమైన భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతంగా కార్యక్రమన్ని ఏర్పాటు చేసిన ఐ టి డి ఏ వారికి ట్రైఫెడ్‌తో తమ అనుబంధం ద్వారా దేశవ్యాప్తంగా మార్కెట్ అవకాశాలు, ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు, స్థిరమైన ఆదాయ వనరులు లభిస్తాయని కళాకారులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ గిరిజన కళాకారుల ఎంపానెల్ మెంట్ మేళాలో వెదురుతో తయారు చేసిన వస్తువులు, చొంపి గ్రామం నుండి లక్క బొమ్మలు,వనదేవత ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, అరకు గ్రామం, కాఫీ, చిరుధాన్యాలు, తేనె, ఊరగాయలు, నల్ల మిరియాలు, పసుపు,శెట్టి సుందరరావు, గన్నేల ((గ్రామం అరకు వ్యాలీ మండలం వారు 3డి ప్రింటింగ్ (దుస్తుల డిజైన్లు), తమల్ల ఆనంద్ రావు, గెటువలస గ్రామం, సుంకరమెట్ట, అరకులోయ నుండి కాఫీ, మిరియాలు, పసుపు, అల్లం,కొర్ర అజయ్, బరువాల గ్రామం, అనంతగిరి మండలం నుండి కాఫీ, నల్ల మిరియాలు,గెమ్మెలి అప్పారావు, కొల్లామిడి గ్రామం, హుక్కుంపేట మండలం వారు కాఫీ,వీడీవీకే , మినుములూరు గ్రామం,పాడేరు మండలం నుండి కాఫీ, అడ్డాకులు, వీడీవీకే కొర్రాయి గ్రామం, దుంబ్రిగూడ మండలం, కాఫీ, పసుపు, అల్లం, కొర్ర వారు కుమారి, హెక్టోగుడ గ్రామం, అనంతగిరి మండలం నుండి కాఫీ, అనంతగిరి ఎఫ్ పి ఓ కాఫీ, తేనె, మిరియాలు,మడగడ గ్రామం నుండి కాఫీ, పాడి తులసి, తరలస గ్రామం కాశీపట్నం పంచాయితీ అనంతగిరి మండలం వారు నల్ల మిరియాలు, కాఫీ, గెమ్మెల బుయ్యి, హెక్టగుడ గ్రామం, అనంతగిరి మండలం కాఫీ,మౌంట్ అరకు ట్రైబల్ ఫార్మింగ్, మార్కెటింగ్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్డిడ్ల రమేష్, బొడమల గ్రామం, ఆర్మ పంచాయితీ, దుంబ్రిగూడ మండలం వారు కాఫీ, అల్లం, నల్ల మిరియాలు, లంబసింగి ఎఫ్‌పిఓ కె. సరోజ, రాజుపాకాలు గ్రామం, చింతపల్లి మండలం వారు చిరుధాన్యాలు, ఊరగాయలు, తేనె, భూమి ట్రైబల్ ఫ్రీజ లిమిటెడ్, కిలోగుడ గ్రామం, దుంబ్రిగూడ మండలం వారు కాఫీ, చిరుధాన్యాలు, నల్ల మిరియాలు, పసుపు, శెట్టి సంత్రి, గన్నేల గ్రామం, అరకు వ్యాలీ మండలం 3డి ప్రింటింగ్ (దుస్తుల డిజైన్లు),మనసనం ఎఫ్ పి వో దుంబ్రిగూడ మండలం వారు కాఫీ, నల్ల మిరియాలు, పసుపు,వన్మయ ఉమెన్ ఎఫ్ పి సి మాక్స్ లిమిటెడ్ అరకు గ్రామం, దుంబ్రిగూడ మండలం వారు , కాఫీ, నల్ల మిరియాలు, పసుపు పొడి, గోస్తని ఫార్మింగ్, మార్కెటింగ్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (ఫిక్) బల్లిమానుగూడ, అనంతగిరి మండలం నుండి నల్ల మిరియాలు, కాఫీ, అల్లం,మాన్యలోరాన ఎఫ్ పి సి లిమిటెడ్ గెడ్డంపుట్ గ్రామం, పాడేరు మండలం వారు కాఫీ, మిరియాలు, పసుపు, అల్లం, కొర్ర గోపాలరావు, బల్లిమామిడి గ్రామం, అనంతగిరి నుండి కాఫీ,కొర్ర వంకల రాజు, వంక చింతవిల్లి, మోదపల్లి గ్రామం, పాడేరు నుండి కాఫీ, ఎన్. కొత్తూరు వీడీవీకే ఎన్. కొత్తూరు, నూర్మతి, గంగరాజుగెడ్డ వారు కాఫీ,భీరమ్ వీడీవీకే వంకలహ గ్రామం, జి. మాడుగుల మండలం వారు కాఫీ,వీడీవీకే గబ్బంగి గ్రామం, దాలింపుట్టి గ్రామం, పాడేరు మండలం వారు అడ్డాకులు,కాంద్రుమ్ వీడీవీకే పంగి బృంద, లోకిత్, కాంద్రుమ్ గ్రామం, దుంబ్రిగూడ మండలం వారు కాఫీ,మంగళపాలెం వీడీవీకే మంగళపాలెం గ్రామం, దేవరాపల్లి, జి.కె. వీధి మండలం తేనె,గల్లోరి ప్రసాద్, భీమయ్య, సుంకరమెట్ట గ్రామం, అరకు వ్యాలీ మండలం వారు నల్ల మిరియాలు, చింతపండు, కాఫీ,కొర్ర సోమర, ధర్మ నాయుడు, పిరిబింద గ్రామం, సుంకరమెట్ట అరకు వ్యాలీ మండలం వారు కాఫీ, నల్ల మిరియాలు, పసుపు,వీడీవీకే, చింతపల్లి ముక్కల బేబి రాణి, చింతపల్లి వీడీవీకే తాజంగి గ్రామం, చింతపల్లి మండలం నుండి కాఫీ, కొర్ర బోదన్న, లచ్చన్న, నిస్సాని వలస గ్రామం, సుంకరమెట్ట , అరకు వ్యాలీ మండలం వారు కాఫీ, వీడీవీకే పెదబయలు, ఇతర మండలాల నుండి వీడీవీకెలు, ఎఫ్ పి ఓ లు వారు ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వాక్యతగా ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (పి వి టి జి)ఏం వెంకటేశ్వరరావు వ్యవహరించగా , ట్రైపేడ్ మార్కెటింగ్ మేనేజర్ కె.రాంబాబు, డిఆర్డిఏ ప్రాజెక్టు అధికారి జయకృష్ణ, ఏడి కాఫీ అధికారిని అయింతి కుమారి,ఎస్ హె జి గ్రూపులో సభ్యులు, ఎఫ్ పి ఒస్, వీడీవీకెలు, తదితరులు పాల్గొన్నారు.

2న పాడేరు మోదకొండమ్మ వారి శాకంబరి ఉత్సవం

పాడేరు,జులై16,ప్రభాతవార్త:

పాడేరు శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులతో అమ్మవారి ఆలయంలో గురువారం సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆలయ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు మాట్లాడుతూ ప్రతి యేట జరిగే శాకంబరి ఉత్సవం కొరకు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు ఆగస్టు 2వ తేదీ ఆదివారం నిర్వహించాలని ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం శర్మ మూర్తం నిర్ణయంతో శాకంబరి ఉత్సవం ఘనంగా నిర్వహించేందుకు నిర్ణయించినట్టు ఆయన తెలిపారు.ఆదివారం ఉదయం నుండి అమ్మవారికి అన్ని రకాల కూరగాయలతో భారీగా అమ్మవారిని అలంకరించి తెల్లవారి నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు.అలాగే మధ్యాహ్నం 12 గంటల నుంచి అమ్మవారి ప్రాంగణంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నామనీ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు చల్ల రామకృష్ణ ,బోణింగి వెంకటరమణ, కిల్లు చంద్రమోహన్ కుమార్ ,దన్నేటి పలాస రాము, గూడెపు సూర్య ప్రకాష్ ,ఏ. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ని సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్

పాడేరు,జులై16,ప్రభాతవార్త:

కొయ్యూరు మండలం బాలారం ఏకలవ్య రెసిడెన్షియల్ స్కూల్లో చదువుతున్న విద్యార్థులు పాడైపోయిన కూరగాయలు ఎందుకు వండి పెడుతున్నారని అడిగినందుకు విద్యార్థులపై దాడి చేసిన హింది సబ్జెక్ట్ టీచర్ పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలనీ అల్లూరి జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి కార్తీక్ శ్రీను డిమాండ్ చేసారు.విద్యార్థులకు మెను ప్రకారంగా భోజనం పెట్టకుండా నిర్లక్ష్య వైఖరి చూపిస్తున్న బాలారం ఏకలవ్య ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి.గిరిజన విద్యార్థులు అంటే కేంద్ర ప్రభుత్వాము కేటాయించిన మెనూ ఎందుకు పెట్టట్లేదని అడుగుతా ఉన్నాము.. విద్యార్థులకు కావాల్సిన పౌష్టికాహారం లోపం వలన అనేక మంది విద్యార్థులు రక్తహీనతతో చనిపోయేటువంటి ప్రమాదం ఉంది అని తెలిసిన భోజనంలో నాణ్యత లేదు. చదువుల్లో క్వాలిటీ లేదు. క్వాలిటీ లేని చదువు ఎందుకని ప్రశ్నిస్తావున్నాము.. వెంటనే రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి ఏకలవ్య రెసిడెన్షియల్ స్కూల్లో గిరిజన విద్యార్థులను అన్యాయం చేస్తున్న ప్రిన్సిపాల్ వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. షెడ్యూల్ ఏరియాలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ గిరిజన ఆదివాసి నిరుద్యోగ అభ్యర్థులను టీచర్స్ గా నియమించాలన్నారు. గిరిజన ప్రాంతంలో గిరిజన విద్యార్థులు ఎలా పెట్టిన తింటారనుకుంటున్నారేమో మేము మనుషులమే గుర్తించుకోండి. మీ పిల్లలకు ఒక న్యాయం మా గిరిజన విద్యార్థులకు న్యాయమా సమాధానం చెప్పవలసిన అవసరం ఐటిడిఏ అధికారులకు ఉందనీ డిమాండ్ చేసారు..వెంటనే ఐ టి డి ఏ పీఓ కలెక్టర్ స్పందించి చట్టపరమైన చర్యలు బాలారం ప్రిన్సిపల్ పై తీసుకోవాలని అల్లూరి జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి కార్తీక్ శ్రీను డిమాండ్ చేశారు.

గిరిజన హక్కుల పరిరక్షణకు చలో పాడేరు : వైసీపీ

గూడెం కొత్తవీధి, జులై 16, ప్రభాతవార్త :

గిరిజనుల మనుగడకు రక్షణ కవచంగా నిలిచిన 1/70 భూ బదలాయింపు నిరోధక చట్టాన్ని పరిరక్షించేందుకు నేడు పాడేరులో నిర్వహించనున్న భారీ బహిరంగ ర్యాలీలో ప్రతి గిరిజనుడు పాల్గొనాలని వైసీపీ గిరిజన విభాగం నేత బొబ్బిలి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. గురువారం పాడేరు కేంద్రంగా నిర్వహిస్తున్న 'చలో పాడేరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల హక్కులను హరించేందుకు కొన్ని శక్తులు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. 1/70 చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లను సమర్థవంతంగా తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి, గిరిజనుల ప్రయోజనాల పరిరక్షణ కోసం సుప్రీంకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన ఐదో షెడ్యూల్ హక్కులు, అడవులు, భూములను కాపాడుకునేందుకు రాజకీయాలకు అతీతంగా గిరిజన యువత, వివిధ సంఘాల ప్రతినిధులు, మేధావులు పెద్ద సంఖ్యలో ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని బొబ్బిలి లక్ష్మణ్ విజ్ఞప్తి చేశారు.

రెండు జిల్లాలను కలిపే ఈ లింకు రోడ్డు నిర్మాణమెప్పుడో..!

30 గ్రామాలకు పైగా దూరభారం తగ్గనున్న బకులూరు- అమ్మి రేకుల రోడ్డు

కొయ్యూరు, జులై 16, ప్రభాతవార్త :

అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాలను కలుపుతూ సుమారు 30 గ్రామాలకు పైగా ప్రజలకు ప్రయాణ దూరాభారాన్ని తగ్గించనున్న బకులూరు - అమ్మిరేకుల లింకు రోడ్డు నిర్మాణం ఎప్పుడో అంటూ స్థానికులు ఎదురుచూ స్తున్నారు. మండలంలోని బకులూరు నుంచి పక్కనున్న పోలవరం జిల్లా పరిధిలోని అమ్మి రేకుల గ్రామానికి కేవలం 6 కిలోమీటర్ల దూరమే ఉంది. అయితే ఈ రెండు గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం గావించకపోవడంతో ఇటు జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు, అటు పోలవరం జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు తమ అవసరార్థం ఎంతో దూరం ప్రయాణించి తమ గమ్య గ్రామాలను చేరుకోవాల్సి వస్తోంది. ఇదే ఈ ఆరు కిలోమీటర్ల మేర లింకు రోడ్డు నిర్మాణం జరిగితే సుమారు 40 కిలోమీటర్ల మేర దూరాభారం తగ్గుతుంది. ఈ లింకు రోడ్డు నిర్మాణం చేయాలని ఇటు మండలంలోని పలు గ్రామాల ప్రజలు, అటు పోలవరం జిల్లా, రాజవొమ్మంగి మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా కోరుతున్నప్పటికీ ఇటు జిల్లాలోని ప్రజాప్రతినిధులు గాని, అటు పోలవరం జిల్లాలోని ప్రజాప్రతినిధులు గాని, ఇరుజిల్లాల అధికారులు గాని పట్టించుకోవడం లేదు. దీనితో ఈ లింకు రోడ్డు నిర్మాణం కొరకు ఈ జిల్లాల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

గిరిజనుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

పాడేరు,జులై16,ప్రభాతవార్త:

షెడ్యూల్డ్ (ఏజెన్సీ) ప్రాంతాల్లో గిరిజనుల హక్కులు, భూములు, ఉపాధి అవకాశాలు, సంక్షేమాన్ని పరిరక్షించడం రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని జిల్లా కలెక్టర్ టి. నిశాంతి తెలిపారు.భారత రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ద్వారా షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నివసించే గిరిజనుల హక్కులు, ప్రయోజనాలకు ప్రత్యేక రక్షణ కల్పించబడిందని ఆమె పేర్కొన్నారు. ఈ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం అనేక చట్టాలు, విధానాలు అమలు చేస్తోందన్నారు.షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనుల భూములను రక్షించేందుకు అమల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ఏరియాస్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్, 1 ఆఫ్ 1970 (1/70 చట్టం) అత్యంత కీలకమైన చట్టమని తెలిపారు. ఈ చట్టం ప్రకారం గిరిజనుల భూములు గిరిజనేతరులకు బదిలీ కాకుండా రక్షణ కల్పించబడుతుందని, అక్రమ భూ బదిలీలను నిరోధించి గిరిజనుల భూహక్కులను కాపాడేందుకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.అదేవిధంగా, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో గతంలో జి.ఓ. ఎం.ఎస్. నెం. 3 జారీ చేయబడిందని తెలిపారు. అనంతరం సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఆ జి.ఓ. అమలులో మార్పులు వచ్చినప్పటికీ, గిరిజనుల ప్రయోజనాలను పరిరక్షించాలనే ప్రభుత్వ సంకల్పంలో ఎలాంటి మార్పు లేదని పేర్కొన్నారు. చట్టబద్ధమైన పరిధిలో గిరిజనుల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందన్నారు.ఇటీవలి కాలంలో ఈ అంశాలపై కొంతమంది అసత్య ప్రచారం చేస్తూ గిరిజనుల్లో ఆందోళన కలిగించే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. గిరిజన సోదరులు, సోదరీమణులు అలాంటి అపోహలు, వదంతులను నమ్మవద్దని, చట్టాలు మరియు ప్రభుత్వ విధానాలపై ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత ప్రభుత్వ అధికారులను సంప్రదించి వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు.గిరిజనుల హక్కులు, భూములు, విద్య, ఉపాధి, సంక్షేమం, అభివృద్ధి విషయంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, 1/70 చట్టం ద్వారా కల్పించిన రక్షణలను సమర్థవంతంగా అమలు చేయడం, గిరిజనుల రాజ్యాంగబద్ధ హక్కులను పరిరక్షించడం పట్ల ప్రభుత్వం సంపూర్ణ నిబద్ధతతో ఉందని జిల్లా కలెక్టర్ టి. నిశాంతి భరోసా ఇచ్చారు.అందువల్ల గిరిజనులు ఎటువంటి అపోహలకు, అసత్య ప్రచారాలకు లోనుకాకుండా శాంతియుత వాతావరణాన్ని కొనసాగించాలని, సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన మార్గాలను మాత్రమే అనుసరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు అరకు స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు



అరకులోయ, జులై 16, ప్రభాత వార్త :

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణం ఎస్.ఆర్.ఐ.సి ఇంజనీరింగ్ కాలేజీ క్రీడా మైదానంలో నేటి నుండి మూడు రోజులపాటు జరిగే జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు లో అరకు స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు పాల్గొంటున్నట్లు స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపల్ పిఎస్ఎన్ మూర్తి తెలిపారు . గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నేటి నుండి మూడు రోజులపాటు జరిగే జిల్లాస్థాయి షటిల్ బ్యాట్మెంటన్ టోర్నమెంటుకు అండర్ - 11, అండర్ - 13, అండర్ - 15 విభాగాల్లో తమ స్పోర్ట్స్ స్కూల్ నుండి విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు . అండర్ - 11 విభాగంలో కె జర్నీ పాల్ (7 వ తరగతి), కె చరణ్ కుమార్ (7 వ తరగతి), జె యాదవ్ రాజు (6 వ తరగతి), బి సాయిరాం (7 వ తరగతి), కే గణేష్ (7 వ తరగతి) విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు . అలాగే అండర్ - 13 విభాగంలో బి యశ్వంత్ తేజ (8 వ తరగతి), బి సుశాంత్ కుమార్ (8 వ తరగతి), పి జితేంద్ర (8 వ తరగతి), బి సుజిత్ (8 వ తరగతి), లీలా తేజ (8 వ తరగతి) విద్యార్థులు పాల్గొంటారని, అండర్ - 15 విభాగంలో కే దేవరాజు (9 వ తరగతి), వి యువరాజు (9 వ తరగతి) విద్యార్థులు పాల్గొంటున్నట్లు ప్రిన్సిపల్ తెలియజేశారు. కాగా జిల్లాస్థాయి షటిల్ బ్యాట్మెంటన్ టోర్నమెంట్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఇదిలా ఉండగా అరకు స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులకు బ్యాడ్మింటన్ కోచ్ కె రాజబాబు తర్ఫీదు నందించారు.

రూ. 1.1 కోట్ల విలువైన 220 కిలోల గంజాయి స్వాధీనం

ముగ్గురు నిందితుల అరెస్ట్

అనకాపల్లి, జూలై 16 ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అనకాపల్లి సబ్ డివిజన్ ఇంచార్జి డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్ ఆదేశాల మేరకు, కొత్తకోట సిఐ జీ.కోటేశ్వరరావు పర్యవేక్షణలో రావికమతం పోలీసులు గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపారు. ఈ దాడిలో రావికమతం పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకుని, రవాణాకు ఉపయోగించిన రెండు లగ్జరీ కార్లను సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి వివరాలను డి.ఎస్.పి జి ఆర్ ఆర్ మోహన్ గురువారం విలేకరుల సమావేశంలో తెలియజేశారు. రావికమతం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల15 మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఎస్సై ఎం.రఘువర్మ తన సిబ్బందితో కలిసి రావికమతం--అనకాపల్లి రహదారిలోని గుడివాడ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా వచ్చిన రెండు కార్లను అడ్డగించి తనిఖీ చేయగా, అందులో అక్రమంగా తరలిస్తున్న 220 కిలోల గంజాయి బయటపడింది. దీని విలువ సుమారు రూ.1.1 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. నిందితులు కిల్లో తిమోతి (26) ,షేక్ మహమ్మద్ రఫీ (26), షేక్ ఫయాజ్ (19) అనే ముగ్గురిని అదుపులో తీసుకొని అరెస్టు చేశారు. వీరితోపాటు పోలీసుల తనిఖీ సమయంలో కార్లలో ఉన్న మరో ముగ్గురు వ్యక్తులు, అలాగే మోటార్ సైకిల్పై ముందుండి పైలటింగ్ (దారి చూపుతూ) చేస్తున్న మరో ఇద్దరు నిందితులు పోలీసులను చూసి ఘటనా స్థలం నుండి పరారైనట్లు తెలిపారు. ఈ కేసు విషయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి, ఇంతటి భారీ గంజాయి రవాణా ముఠాను పట్టుకున్న రావికమతం ఎస్సై ఎం.రఘువర్మ, బుచ్చయ్యపేట ఎస్సై పి.మనోజ్ కుమార్ పోలీసు సిబ్బందిని అనకాపల్లి సబ్ డివిజన్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్ ప్రత్యేకంగా అభినందించి, నగదు రివార్డులు అభినందించారు.

వైభవంగా ప్రారంభమైన జగన్నాథ స్వామి రథయాత్ర

రథయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే కొణతాల స్వామివారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

అనకాపల్లి, జూలై 16, ప్రభాతవార్త

స్థానిక గవరపాలెం అగ్రిమరిచెట్టు వద్ద కొలువైన శ్రీ సుభద్రా బలభద్ర సమేత జగన్నాథ్ స్వామివారి రథయాత్ర మహోత్సవ భాగంగా బుధవారం రాత్రి ఆలయ మంటపములో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల్ స్వామి వారి కల్యాణం ఘనంగా జరిగింది. గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సుభద్రా బలభద్ర జగన్నాథ్ స్వామివారిని రథంపై అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పాలకమండ సభ్యులు అధికారులు స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి తొలి రథయాత్రను ప్రారంభించారు. జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జి భీమరిశెట్టి రామ్కి, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, మాజీ టిడిపి జిల్లా అధ్యక్షులు దాడి రత్నాకర్ దంపతులు, వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ రథయాత్ర గవరపాలెం ఆలయ వద్దనుండి బయలుదేరి పట్టణ పురవీధుల గుండా సాంప్రదాయ బద్ధంగా పలు నేలవేషాలతో పయనించి గూడ్స్ రోడ్ వద్ద ఉన్న ఇంద్రజ మ్న హాలు వద్దకు చేరుకుంటుంది. రథయాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా డీఎస్పీ ఆధ్వర్యంలో సిఐలు ప్రేమ్ కుమార్, టీవీ అశోక్ కుమార్, వెంకటనారాయణ భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ దాడి బుజ్జి, ఆలయ, జిల్లా సహాయ కమిషనర్ సుధారాణి, కార్య నిర్వాహణ అధికారి కె చంద్ర తేజ, ఆలయ కమిటీ ధర్మకర్తలు. బుద్ధ ఆదిలక్ష్మి, యల్లబిల్లి ధనలక్ష్మి, కాండ్రేగుల మహాలక్ష్మి, పేకేటి తులసి, భుగాతా కోటేశ్వరరావు, యండపల్లి చంద్రశేఖర్, మంగళపల్లి వివి సుబ్రహ్మణ్యం, బోడ్డేడ వెంకట చలపతిరావు, కూటమి నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ స్పష్టమైన ఆదేశాలు



అనకాపల్లి, జూలై 16,ప్రభాతవార్త

జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, నిర్దేశిత సమయాల్లోగా పెండింగ్ పనులన్నింటిని పూర్తి చేయాలని ఈఆర్ఓలను జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ విసీ హాలులో జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ పై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులు, సహాయ ఓటర్ల నమోదు అధికారులు ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, నిర్దేశిత సమయాల్లోగా పెండింగ్ పనులన్నింటిని పూర్తి చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఓటరు గుర్తింపు కార్డుల ఫోటోల డిజిటలైజేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, సమర్పించే ప్రతి అప్లికేషన్లోనూ ఖచ్చితంగా ఫోటో ఉండేలా చూడాలని, దీనికి సంబంధించిన డేటాను ఏఈఆర్ఓ సమర్పించాలన్నారు. మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన, డూప్లికేట్ ఓటర్లకు సంబంధించిన జాబితాలో డేటా వ్యత్యాసాలు జిల్లా వ్యాప్తంగా దాదాపు 21,000 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని, అంటే సగటున ఒక బీఎల్ఓకు 10 నుండి 15 దరఖాస్తులు మాత్రమే ఉండి ఉంటాయి కాబట్టి, వ్యత్యాసాలకు గల కారణాల ను బీఎల్ఓలు పరిశీలించి, రెండు రోజుల్లోగా వాటిని సరిచేసి ధృవీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఒకే రకమైన వివరాలతో ఉన్న ఓటర్ల (డెమోగ్రాఫికల్లీ సిమిలర్ ఎంట్రీస్) నమోదును సరిచేయడం చాలా సులువైన ప్రక్రియ. జిల్లా మొత్తం కలిపి కేవలం 1,500 ఎంట్రీలు మాత్రమే ఉన్నాయని, ఒక బీఎల్ఓకు సగటున ఒక్కటి కూడా వచ్చే అవకాశం లేదన్నారు. ఏ బీఎల్ఓ పరిధిలో ఈ ఎంట్రీలు ఉన్నాయో గుర్తించి, వెంటనే వాటిని సరిచేయాలని తెలిపారు. సదరు ఓటరు మన పరిధిలోనే ఉంటే ఉంచుకుని, వేరే చోట ఉంటే సంబంధిత బీఎల్ఓకు సమాచారం అందించి అక్కడ తొలగించేలా చర్యలు చేపట్టాలని, ఈ ప్రక్రియను ఈరోజే పూర్తి చేయాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఓటర్లకు ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేయాలని, ఫారాల నమోదులో ఇబ్బందులు ఎదుర్కొంటుంటే వారికి తగిన సహాయం అందించాలని స్పష్టం చేశారు. నేటి సాయంత్రానికి ఈ 60 పెండింగ్ కాల్స్ సమస్యను పూర్తిగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ అనేది అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రక్రియ అయినందున, అధికారులు సిబ్బంది ఎటువంటి అలసత్వం వహించకుండా బాధ్యతాయుతంగా పనిచేసి వంద శాతం లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణ రావు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎలక్షన్ సెల్ సూపరింటిండెంట్ వాసు నాయుడు, బిఎల్వోలు పాల్గొన్నారు.

శ్రీ జగన్నాథ స్వామిని దర్శించుకున్న నాగ జగదీష్

అనకాపల్లి జూలై 16, ప్రభాతవార్త

ఆషాడ మాసంలో శ్రీ జగన్నాథ స్వామి రథయాత్రలో ప్రజలు యువకులు ముందుండి పురవీధుల్లో కేరింతలతో ఉత్సాహంగా భక్తిశ్రద్ధలతో యాత్రలో పాల్గొంటారని, రథయాత్రలో ఎటువంటి అల్లర్లకు, గొడవలకు, వెళ్లకుండా శాంతియుతంగా రథయాత్రను చివరి వరకు విజయవంతంగా జరపాలని అందరికీ స్వామి దర్శనం జరిగే విధంగా పాలకవర్గం, పోలీసులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు అన్నారు. గురువారం జరిగిన జగన్నాథ స్వామి రథయాత్రలో ఆయన పాల్గొని జగన్నాథ స్వామిని దర్శించుకుని భక్తులతో కలిసి రధాన్ని ముందుకు కదిలించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేవస్థానం చైర్మన్ దాడి సూర్యనారాయణ(బుజ్జి) స్వామి దర్శనం అనంతరం నాగ జగదీష్ కు శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు.

కళ్యాణ మండపం మంజూరుకై ఎం.పి విజయ్‌కు వినతి

మాకవరపాలెం జూలై 16, ప్రభాతవార్త



మాకవరపాలెం మండలం శెట్టి పాలెంలో కళ్యాణ మండపం మంజూరు చేయాలని రాజ్యసభ సభ్యులు చింత కాయల విజయకు వినతిపత్రం అందజేశారు. ఈమేరకు గురువారం శెట్టిపాలెం మాజీ సర్పంచ్ అల్లు రామునాయుడు భీమబోయినపాలెం మాజీ సర్పంచ్ రుత్తల నందకిషోర్ తో కలిసి ఎంపీ విజయకు వినతి పత్రం అందజేశారు. రాజ్యసభ సభ్యులుగా ఎన్నికై నర్సీపట్నం వచ్చిన చింతకాయల విజయంతో పలు సమస్యలపై చర్చించారు. దీనిలో భాగంగా శెట్టిపాలెంలో వివాహాలు,ఇతర శుభకార్యాలు జరుపుకునేందుకు కళ్యాణమండపం ఎంతో అవసరమన్నారు. ఈసందర్భంగా నాయుడు మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ కళ్యాణ మండపం మంజూరుపై వినతి పత్రం అందజేశామని, దీనిపై ఎమ్.పి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కళ్యాణ మండపం మంజూరు చేస్తే శెట్టిపాలెంతో పాటు వెంకన్నపాలెం, భీమబోయినపాలెం, జెడ్.గంగవరం, దుంగలవానిపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ శుభకార్యాలకు ఉపయోగించు కునేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విజయ ను కలిసిన వారిలో భీమబోయినపాలెం మాజీ సర్పంచ్ రుత్తల నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతపై అభయ అవగాహన సదస్సు

కసింకోట, జూలై 16, ప్రభాత వార్త

అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్సిన్హా ఆదేశాల మేరకు బుధవారం కసింకోట వివేకానంద డిగ్రీ కళా శాలలో సిఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థుల ప్రత్యేకంగా రూపొందించిన అభయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతకు రాష్ట్ర పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థినులు ఎలాంటి వేధింపులు, బెదిరింపులు, ర్యాగింగ్, స్టాకింగ్, సోషల్ మీడియా వేధింపులు లేదా సైబర్ మోసాలకు గురైనా భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయిం చాలని సూచించారు. చిన్న సంఘటనగా భావించి నిర్లక్ష్యం చేయకుండా, ప్రారంభ దశలోనే ఫిర్యాదు చేస్తే నేరాలను సమర్థంగా అరికట్టవచ్చని తెలిపారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు అమల్లో ఉన్న చట్టాలు, పోక్సో చట్టం, మహిళలకు కల్పించిన చట్టపరమైన రక్షణ, అత్యవసర సహాయ సేవలపై విద్యార్థు లకు వివ రించారు. అత్యవసర పరిస్థితుల్లో 112, మహిళా హెల్ప్ లైన్ 181, సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930 హెల్ప్ లైన్ను వినియోగించుకోవాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల మోసపూరిత కాల్స్, నకిలీ లింకులు, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారం పంచుకోవడం వంటి అంశాల్లో అప్రమత్తంగా ఉండాలని హెచ్చ రించారు. మహిళలు, బాలికలు తమ హక్కులపై అవగాహన పెంచుకుని ధైర్యంగా ముందుకు రావాలని, ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకుంటారని సీఐ తెలిపారు. విద్యాసంస్థల్లో భద్రతా వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో పోలీసు అధికారులు ముఖాముఖి నిర్వహించి వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. అధ్యాపకులు, కళాశాల విద్యార్థులు, మహిళా పోలీసు సిబ్బంది, కసింకోట పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

లింగంపేట పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

గొలుగొండ జూలై 16, ప్రభాతవార్త

తన పుట్టినరోజు సందర్భంగా తాను చదివిన పాఠశాలలో పూర్వ విద్యార్థి బొద్దు నాని విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. లింగంపేట గ్రామానికి చెందిన బొద్దు నాని తన సొంత గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో తన వంతు సాయంగా నోట్ బుక్స్ వితరణకు శ్రీకారం చుట్టారు. గురువారం పాఠశాలకు 850 నోట్ పుస్తకాలు ఎంఈఓ సత్యనారాయణ చేతుల మీదుగా పంపిణీ ప్రారంభించారు. పాఠశాలల్లో చదువుతున్న 62 మంది విద్యార్థులకు 25 వేలు విలువచేసే హాలో నోట్ పుస్తకాలను అందించడం సేవా దృక్పథానికి నిదర్శనం అన్నారు. ఈ సందర్భంగా బొద్దు నాని మాట్లాడుతూ, తాను చదివిన పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందించే అవకాశం రావడం ఆనందాన్ని కలిగిస్తుంది అన్నారు. ప్రతి విద్యార్థి చదువుపై శ్రద్ధ చూపి భవిష్యత్తుకి బాటలు వేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలకు ఖర్చు చేసే నగదును ఈ విధంగా తన సొంత ఊరు సొంత పాఠశాలగా భావించి నోట్ పుస్తకాలు అందించడం సమాజానికి మంచి సందేశాన్నిస్తుందని అన్నారు. నానిని ఎంఈఓ, ఉపాధ్యాయులు, స్థానిక గ్రామ పెద్దలు అభినందిస్తూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న రోజుల్లో ప్రతి పుట్టినరోజును ఇలా ఆదర్శవంతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థులు నానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

మహిళలు, విద్యార్థినులు భద్రతే లక్ష్యంగా యలమంచిలి, కొక్కరపల్లిల్లో 'అభయ' సదస్సులు

ఎలమంచిలి, జూలై 16, ప్రభాతవార్త

మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలను అరికట్టి, వారికి పూర్తి భద్రత కల్పించడమే ప్రధాన ధ్యేయంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు శాఖ ప్రతిష్ఠాత్మ కంగా చేపట్టిన 'అభయ' అవగాహన సద స్సులు గురువారం నిర్వహించారు. పట్టణం లోని వాగ్దేవి ఇంటర్ కళాశాలలో పట్టణ ఎస్సై సావిత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కళాశాల ప్రధానాచార్యులతో పాటు సుమారు రెండు వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎస్సై మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ఉన్న చట్టాల గురించి, ఆపద సమయంలో ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలో వివరించారు. ఏ ఆపద వచ్చినా భయపడకుండా పోలీసుల కు సమాచారం ఇవ్వాలని భరోసా కల్పించారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొక్కిరాపల్లి గ్రామంలో సరస్వతీ విద్యానికేతన్ పాఠశాలలో కూడా ఈ అభయ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామీణ ఎస్సై ఉపేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు సుమారు నూట యాభై మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై ఉపేంద్ర అభయ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలను విద్యార్థులకు కూలంకషంగా వివరించారు. ముఖ్యంగా విద్యార్థులు వ్యక్తిగత భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. మహిళలు, చిన్నారులపై ఏవైనా వేధింపులు లేదా నేరాలు జరిగినప్పుడు మౌనంగా భరించకుండా, భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన ఆవశ్యకతను స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలిగి మహిళల భద్రతకు తోడ్పడాలని ఎస్సై ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఘనంగా జగన్నాథ రథోత్సవం..

అగనంపూడి, ప్రభాతవార్త

శ్రీశ్రీశ్రీ జగన్నాథ స్వామి రథోత్సవ ఘనంగా నిర్వహించారు. స్వామివారిని అగనంపూడి సత్రం నుండి ఆంజనేయస్వామి గుడి వద్ద ఇంద్రజిత్తు హాల్ వరకు రథోత్సవం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్లు రౌత్ శ్రీను,బొండా జగన్, దుల్ల రాము నాయుడు, స్వామివారిని దర్శించుకున్నారు, ఆలయ కమిటీ చైర్మన్ పైడ్రాజు, స్థానిక నాయకులు కర్ణం సత్య రావు, కర్రి దశంద్ర, గురుత్రనాథ, గురు భాస్కర్, గురు మోహన్, గవర సోమ శేఖరు, కోర్రాయి నాగార్జున రావు, కొయ్య రమణారెడ్డి, గొల్లవిల్లి వెంకటరావు, జెర్రిపోతుల సమర, పాములు వసంత్, నార పిన్ని అప్పలరాజు, మామిడి అప్పలరాజు, కమిటీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఈవో పద్మావతి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దువ్వాడ సిఐ నమ్మి గణేష్, ట్రాఫిక్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సైలు శ్రీనివాసరావు, రామకృష్ణంరాజు బందోబస్తు నిర్వహించారు.

రామ్‌నగర్‌లో సిసి రోడ్డు నిర్మాణ పనుల భూమి పూజ

ఎలమంచిలి, జూలై 16, ప్రభాతవార్త

మున్సిపాలిటీ పరిధిలోని పట్టణంలోని రామ్నగర్లో నూతన సిమెంట్ రహదారి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి కూటమికి చెందిన మూడు పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాస రావు, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు నానాజీ, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు శేషు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు గోపి, ప్రభుత్వ వైద్యశాల సంచాలకులు గుర్రాల శేఖర్, పప్పు ఈశ్వరరావు, ఊటకూటి రమేష్ నాయుడు, కర్రీరూన్సీ, లవుడు లోవరాజు, పూడి బాబులు, పిట్టా శ్రీనివాస్, జయరాం, కొటారి శ్రీనివాస్ మాస్టర్, లంక ఉదయ్ కుమార్, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

తీసుకున్న సహకార రుణాలు రైతులు చెల్లించేందుకు ఏపీఐఐసి అధికారులు సహకరించారు..

అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి

నక్కపల్లి, ప్రభాతవార్త

నక్కపల్లి సహకార సంఘం పరిధిలో రుణాలు తీసుకున్న రైతులు ఏపీఐఐసీ భూ సేకరణలో భాగంగా పరిహారం తీసుకునే సందర్భంలో రుణాలు చెల్లించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి కోరారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధ్యక్షులు బుజ్జి ఈ విషయాన్ని తాసిల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన సహకరిస్తామని హామీ ఇచ్చారు. నక్కపల్లి తో పాటు వేంపాడు పిఏసిఎస్ పరిధిలో కూడా తీసుకున్న రుణాలు వసూలు విషయంలో కూడా దృష్టి పెట్టాలని అధ్యక్షులు వెలగా శ్రీనివాసరావు కోరారు. ఈ సందర్భంగా బుజ్జి మండలంలోని ఉప్మాక గ్రామానికి సంబంధించిన పలు విషయాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. డంపింగ్ యార్డ్ నిమిత్తం 50 సెంట్లు భూమి కేటాయించాలని, ఉప్మాక గ్రామ కంఠం భూమిని (22ఏ) నుండి తొలగించాలని, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా తల్లిదండ్రులు కోల్పోయిన చిన్నారులు అందరికీ నెలకు 4000 రూపాయలు వచ్చిందేందుకు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన అధికారులు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నేడు పలుఅభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

అగనంపూడి, ప్రభాతవార్త

జీవీఎంసీ 79వ వార్డులో మూడు కోట్ల రూపాయల అభివృద్ధి పనులను. శుక్రవారం రాష్ట్ర అధ్యక్షులు గాజువాక ఎమ్మెల్యేపల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేస్తున్నట్లు మాజీ వార్డ్ కార్పొరేటర్ రౌతు శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటమి నాయకులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

కిష్టంపాలెంలో బంగారమ్మ తల్లిని దర్శించిన ఎమ్మెల్యే

రాంబిల్లి, జూలై 16, ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నియోజక వర్గంలోని రాంబిల్లి మండలం కిష్టంపాలెం గ్రామంలో వెలసిన గ్రామదేవత బంగారమ్మ తల్లిని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికి, వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, రాంబిల్లి మండల జనసేన అధ్యక్షుడు పప్పల నూకనదొర, కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

20 లక్షలతో నూతన స్టేజీ నిర్మాణానికి శంకుస్థాపన

రాంబిల్లి, జూలై 16 ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నియోజకవర్గంలోని రాంబిల్లి మండలం కొత్తూరు గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన స్టేజికి ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా అన్ని సౌకర్యాలతో నూతన స్టేజీని నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో నిర్వహించే సామాజిక, సాంస్కృతిక, ప్రభుత్వ కార్యక్రమాలకు ఈ వేదిక ఎంతో ఉప యోగపడుతుందన్నారు.

ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

రైతు సంఘం డిమాండ్

(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలోని నల్లమట్టిపాలెం గ్రామ సమ స్యలను వెంటనే పరిష్కరించాలి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనబాల రాజేష్‌లు డిమాండ్. నక్కపల్లి మండలం, బుచ్చిరాజుపేట పంచాయతీ, నల్లమట్టిపాలెం గ్రామంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనబాల రాజేష్, స్థానిక నాయకులు ప్రజలతో కలిసి గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అధికారులు దృష్టి పెట్టాలని,గ్రామంలో మురుగు నీటి కాలువలు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, 10 రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోయి తాగునీటి కోసం మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, విద్యుత్ సమస్యలు నెలకొని తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని, ఉపాధి హామీ పనులు సక్రమంగా కల్పించడం లేదని, గ్రామంలో మురుగు కాలువలు కారణంగా దోమలు, దుర్వాసనతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం, సంబంధిత అధికారులు అత్యవసరంగా గుర్తించి పూర్తిస్థాయిలో వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, రైతులు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్ టిప్పర్లకు రూ.40 వేల జరిమానా

అచ్యుతాపురం జూలై 16 ప్రభాతవార్త

అచ్యుతాపురం వాహనాల తనిఖీల్లో భాగంగా గురువారం ఉదయం ఓవర్‌లోడ్‌తో ప్రయాణి స్తున్న రెండు టిప్పర్ లారీలను అధికారులు పట్టుకు న్నారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు ఒక్కో లారీకి రూ.20 వేల చొప్పున మొత్తం రూ.40 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఇకపై ఓవర్‌లోడ్‌తో వాహనాలు నడిపినా, అధిక లోడుతో నిర్లక్ష్యంగా లేదా రేసింగ్ తరహాలో వాహనాలు నడిపినా సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రహదారి భద్రతకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు.

అచ్యుతాపురంలో 'అభయ'పై విద్యార్థినులకు అవగాహన

అచ్యుతాపురం, జూలై 16 ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళలపై జరుగుతున్న నేరాల నివారణ, మహిళలు తీసుకోవాల్సిన జాగ్ర త్తలు, వారి భద్రత విషయంలో పోలీసుల బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన 'అభయ' కార్యక్రమంలో భాగంగా గురు వారం అచ్యుతాపురం మండ లంలోని ఏపీ రెసిడెన్షియల్ పాఠ శాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎస్సై సుధాకర్, మహిళా ఎస్సై పోషణ సుమారు 300 మంది విద్యార్థినులకు మహిళల భద్రత, సైబర్ నేరాల నుంచి అప్రమత్తంగా ఉండాల్సిన విధానం, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను ఎలా సంప్రదించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే 'అభయ' కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని వివరించి, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

ఆరోగ్యవంతమైన విశాఖకు సైక్లింగ్ ట్రాక్‌లు

కాలుష్య నియంత్రణకు సైకిల్ వినియోగాన్ని ప్రోత్సహిద్దాం: జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

-సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు

విశాఖపట్నం, జూలై 16, ప్రభాతవార్త :

నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ సంరక్షణ, కాలుష్య నియంత్రణకు సైక్లింగ్, వాకింగ్ వంటి ఆరోగ్యకరమైన అలవాట్లు అత్యంత అవసరమని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. నగరంలో నిర్మిస్తున్న సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌ల పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మధురవాడ జోన్ పరిధిలోని సాగర్‌నగర్‌లో గుడ్లవానిపాలెం నుంచి రాడిసన్ బ్లూ హోటల్ వరకు నిర్మిస్తున్న సైక్లింగ్, వాకింగ్ ట్రాక్ పనులను కమిషనర్ స్వయంగా పరిశీలించారు. కార్యనిర్వాహక ఇంజనీర్ దిలీప్‌తో కలిసి పనుల పురోగతిని సమీక్షించి, మిగిలిన పనులను నిర్ణీత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగర ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు వాకింగ్, సైక్లింగ్ వంటి శారీరక వ్యాయామాలు కీలకమన్నారు. దీనికోసం అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు జీవీఎంసీ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. సాగర్‌నగర్‌లో గుడ్లవానిపాలెం నుంచి రాడిసన్ బ్లూ వరకు సుమారు 2 కిలోమీటర్ల పొడవునా, 5 మీటర్ల వెడల్పుతో సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణంలో వ్యాయామం చేసే అవకాశం కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ ట్రాక్ నిర్మాణానికి సంబంధించి కొంత భూభాగం అటవీ శాఖ పరిధిలో ఉండటంతో అనుమతుల ప్రక్రియ పూర్తయిందని, ప్రస్తుతం పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అవసరమైన మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మధురవాడ జోన్ పరిధిలోని పాత స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో సుమారు 5.20 కిలోమీటర్ల పొడవునా అభివృద్ధి చేస్తున్న సైకిల్ ట్రాక్‌లను కూడా వేగంగా పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు. భవిష్యత్తులో విశాఖపట్నాన్ని మరింత పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఇటువంటి మౌలిక వసతుల అభివృద్ధికి జీవీఎంసీ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ పర్యటనలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, వార్డు ఎమినిటీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

దయాసాగరుడు శ్రీ జగన్నాథుడు

విశాఖపట్నం జూలై16 ప్రభాతవార్త

సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ రథయాత్ర సందర్భంగా ఆధ్యాత్మిక సాంస్కృతిక ఉత్సవం జరిగింది . ముందుగా వేదికపై వేంచేసియున్న సుభద్ర బలభద్ర సమేత శ్రీ జగన్నాథ స్వామి వారికి సాంప్రదాయ రీతిలో అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్య మంత్రపుష్పములు దివ్య మంగళ హారతి స్వామివారికి సమర్పించారు ఈ సందర్భంగా ఇస్కాన్ విశాఖ నగర శాఖ అధ్యక్షులు సాంబదాస్ ప్రభుజీ భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తూ శ్రీమన్నారాయణుని స్వరూపమైన జగన్నాథుని కృప అపారమైనదని జగన్నాథుడు దయాసాగరుడని పేర్కొన్నారు . భక్తిశ్రద్ధలతో శ్రీ జగన్నాథ స్వామివారిని పూజిస్తే దారిద్ర్యములు తొలగి సకల శుభములు కలుగుతాయని తెలిపారు. అనంతరం విచ్చేసిన భక్తులందరికీ స్వామికి నివేదించిన ప్రసాదము అన్నప్రసాదము వితరణ చేయడమైనది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సందర్భంగా వేదికపై నిర్వహించిన కూచిపూడి నృత్యాంశములు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ మాతాజీ నితాయ్ సేవిని, ఆధ్యాత్మికవేత్త ఎం.వి రాజశేఖర్, వంశీకృష్ణ ప్రభు, ఇస్కాన్ జీవితకాల సభ్యులు అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు .

పద్మనాభంలో 20వ తేదీన జరగనున్న చాగంటి ప్రవచనాలు సభను విజయవంతం చేయాలి

పద్మనాభం, జూలై 16, ప్రభాతవార్త

పద్మనాభ మండల కాంప్లెక్స్ లో ఈనెల 20వ తేదీన జరగనున్న ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఆధ్యాత్మిక ప్రవచనాల సభను విజయవంతం చేయాలని కోటేశ్వరరావు కార్యాలయ ప్రతినిధి ఏ సత్యనారాయణ, మండల నాయకులు కోరారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సభ ఏర్పాట్లను వారు గురువారము పరిశీలించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ సమావేశ మందిరంలో నాయకులు, అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనతోపాటు , వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు శేషు,సింహాచలం దేవస్థానం ట్రస్ట్ సభ్యులు కే దామోదర్ రావు, భీమిలి ఇన్చార్జి విజయ్ బాబు, మండల టిడిపి అధ్యక్షులు కే రమణ, మాజీ ఎంపీపీ గోపి బాబు, నాగు, మాట్లాడుతూ సభకు హాజరుకానున్న భక్తులు క్రమశిక్షణతో ప్రవచనాలు వినాలని వారు కోరారు. చాగంటి వస్తారని కళ త్వరలోనే నెరవేరబోతుందని వారు అన్నారు. సభకు జిల్లా, నియోజకవర్గము నుండి రానున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని నాయకులను కోరారు. రిటైర్డ్ డి ఈ కృష్ణ కుమార్ మాట్లాడుతూ అనంత పద్మనాభ స్వామి ఆలయాన్ని టీటీడీ దేవస్థానము దత్తత తీసుకునేటట్లు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆరుగురు సభ్యుల కు నాయకులు అధికారులు సహకరించాలని విజయబాబు కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శైలజ, ఎంపీడీవో చిన్నారావు, నాయకులు పాల్గొన్నారు.

లారీల అక్రమ పార్కింగ్: టోల్‌గేట్ సిబ్బంది, ఆర్‌కేడీ సూపర్‌వైజర్‌పై కేసు నమోదు

గాజువాక,జూలై 16,ప్రభాతవార్త



విశాఖ పోర్ట్ రోడ్డులో సాగుతున్న లారీల అనధికార పార్కింగ్ వ్యవహారంలో పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. షీలానగర్ టోల్‌గేట్ పరిసరాలు, మారుతి సర్కిల్ వరకు రోడ్డుపై నిబంధనలకు విరుద్ధంగా వందలాది లారీలను నిలపడం వల్ల తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇటీవల ఇక్కడ ప్రమాదాలు కూడా జరుగుతుండటంతో పాటు వీఐపీల ప్రయాణాలకు సైతం భద్రతా ముప్పు ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో లారీలను తొలగించాలని టోల్‌గేట్ సిబ్బందికి, రహదారి పనులు చేస్తున్న ఆర్‌కేడీ సంస్థకు పలుమార్లు హెచ్చరించినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీనివల్ల పోర్టు కార్గో రవాణా పనులకు విఘాతం కలుగుతోందని పోర్టు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కొట్టాన రమణ ఇచ్చిన నివేదిక ఆధారంగా.. టోల్‌గేట్ మేనేజర్ రాకేష్‌కుమార్ శర్మ, షిఫ్ట్ ఇన్‌ఛార్జ్ ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌కేడీ సూపర్‌వైజర్ దేవిప్రసాద్‌లపై గాజువాక ట్రాఫిక్ సిఐ షేక్ హుస్సేన్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలి

అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్

విశాఖపట్నం, జూలై 16 ప్రభాత వార్త

ఎస్ఐఆర్(సర్) ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులోగా వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ–2026 కార్యక్రమం పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ స్థానిక అధికారులతో సమావేశమయ్యారు. గుర్తింపు పొందిన ఓటర్ల పునఃధృవీకరణ, మ్యాపింగ్ సరిగా అవ్వని, అనామలీ (లాజికల్ డిస్క్రిపాన్సీస్) కేసులు, ఓటర్ల ఫోటోల నవీకరణ, ఫోటో నాణ్యత నిర్ధారణ, పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ, బుక్ ఏ కాల్ విత్ బీఎల్వో తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆధార్ డేటా ఆధారంగా ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రత్యేక మాడ్యూల్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈఆర్వోలు, ఏఈఆర్వోలు తమ పరిధిలోని పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, పెండింగ్ కేసుల పరిష్కారంలో వేగం పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎటువంటి లోపాలకు తావులేకుండా, ప్రతి కేసును నిబంధనల ప్రకారం పరిశీలించి, నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.జిల్లా రెవెన్యూ అధికారి ఎం.విశ్వేశ్వరనాయుడు, ఆర్డీఓలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాథుర్, అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎలక్షన్ సెల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

చివరి సమావేశం.. సమస్యలు పరిష్కారం పైన దృష్టి పెట్టండి

మండల పరిషత్ సమావేశంలో సమస్యలు లేవనెత్తిన ఎంపీటీసీ సభ్యులు

నక్కపల్లి, ప్రభాతవార్త

ఇది మాకు చివరి సమావేశం పెండింగ్లో ఉన్న సమస్యలు పరిష్కారం పై దృష్టి పెట్టండి అని ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన గురువారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులో మీ దృష్టికి ఏ సమస్యలు తీసుకువెళ్లి పరిష్కారాన్ని కృషి చేయాలని కోరారు. ముందుగా ఎజెండా వివరాలను ఎంపీడీవో చలపతిరావు ఆధ్వర్యంలో ఏవో దెందుకూరు సీతారామరాజు సభ దృష్టికి తెలియజేశారు. ఇటీవల మండలానికి బదిలీపై వచ్చిన పలువురు అధికారులు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వేంపాడు, డి ఎల్ పురం, న్యాయంపూడి ఎంపిటిసిలు ఆకేటి గోవిందరావు, కొంద్ర కాసులు, కుంచే మధు తదితరులు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు కాలంలో గ్రామాల అభివృద్ధి విషయంలో ప్రజల సమస్యలు పరిష్కారం కోసం అధికారులు సహకరించారని వారందరికీ ధన్యవాదాలు అన్నారు. అనంతరం ఏజెండా ప్రకారం వ్యవసాయ శాఖ అధికారి ఉమా ప్రసాద్ మాట్లాడుతూ ఖరీఫ్ కు సంబంధించిన పలు విషయాలను సభ దృష్టికి తీసుకొచ్చారు. విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అందరూ ఉపయోగించుకోవాలని పొలం పిలుస్తుంది కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులకు సంబంధించి ప్రధానంగా సివిల్ సప్లై సిబ్బంది కనిపించడం లేదని, ఇదే కాకుండా చాలా మంది డీలర్లు ఇళ్ల వద్దనే సరుకులు పంపిణీ చేస్తున్నారని, ఎన్ని సార్లు చెప్పిన పద్ధతి మార్చుకోవడం లేదని ఎంపిటిసి గోవిందరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన తాసిల్దార్ చిన్నికృష్ణ మాట్లాడుతూ భవిష్యత్తులో చర్యలు తీసుకుంటామని చెప్పారు. నక్కపల్లి పిఏసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి మాట్లాడుతూ ఉపమాక గ్రామానికి సంబంధించిన పలు సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. పరిష్కారాన్ని కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్దండ పురం ఎంపీటీసీ బచ్చల రాజు మాట్లాడుతూ గ్రామ సమస్యలు ఎవరికి చెప్పుకోలో తెలియడం లేదని ,గ్రామ కార్యదర్శి అందుబాటులో ఉండాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో చలపతిరావు వారానికి రెండు రోజులు కార్యదర్శులు అందుబాటులో ఉంటారని ,గ్రామంలోని సమస్యలు వారం రోజుల్లోగా పరిష్కారం కృషి చేస్తామని సమాధానం ఇచ్చారు. ఎంఈఓ నరేష్ విద్యాశాఖ సంబంధించి పలు విషయాలను సభ దృష్టికి తీసుకొచ్చారు. రాజయ్యపేట వద్ద మంజూరైన రెసిడెన్షియల్ పాఠశాలకు సంబంధించిన పూర్తిస్థాయి వివరాలు రావాల్సి ఉందని, నక్కపల్లి స్టేజ్. 3 పాఠశాలకు సంబంధించి అడ్మిషన్లు జరుగుతున్నాయని, అవసరమైన వారు బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మిని సంప్రదిం చాలని తెలియజేశారు. ఆగస్టు చివరినాటికి నక్కపల్లి వరకు ఉద్దండ పురం పైలట్ ప్రాజెక్టు నుంచి మంచినీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని జేఈ శివప్రసాద్ చెప్పడం తో సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం శ్రీనివాస్ మాట్లాడుతుండగా మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ మాట్లాడుతూ ఉపమాక ప్రాంతంలో బొమ్మలు తయారీ కంపెనీ ఏర్పాటు అయినట్లు ఉద్యోగాల కోసం దరఖాస్తు తీసుకుంటున్నట్లు వారికి ట్రైనింగ్ ఇస్తున్నట్లు వచ్చిన ప్రచారం నిజమా అని ప్రశ్నించారు. అసలు బొమ్మలు పరిశ్రమకు భూసేకరణ ఎక్కడ జరిగిందని లేవనెత్తారు. ఇదే విషయం సభలో ప్రస్తావనకు రావడంతో అధికార పార్టీకి చెందిన పిఏసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి మాట్లాడుతూ భూసేకరణ జరిగిందా అని శ్రీనివాసన్ ప్రశ్నించారు. కుట్టి శిక్షల మీద అనుభవం ఉన్న వారిని పిలవడం జరిగిన తప్ప బొమ్మల పరిశ్రమకు సంబంధించి ఎటువంటి పూర్తి సమాచారం లేదని శ్రీనివాస్ సభలో వివరించారు. జడ్పిటిసి గోసల కాసులమ్మ మాట్లాడుతూ మా గ్రామం నుంచి కూడా బొమ్మల పరిశ్రమ కోసం శిక్షణ ఇస్తామని వివరాలు సేకరిస్తున్నారని, ఇది ఎంతవరకు నిజమో అర్థం కావడం లేదని చెప్పారు. ఎలక్ట్రికల్ జేఈ మాట్లాడుతూ సోలార్ ఏర్పాటు విషయం కొంతసేపు సభలో గందరగోళం నెలకొంది. సోలార్ పై పూర్తి అవగాహన లేదని అవగాహన కల్పించాలని మండల పరిషత్ అదనపు ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు తో పాటు ఎంపీటీసీ కుంచే మధు, కో-ఆప్షన్ సభ్యులు లోడగల చంద్రరావు కోరారు. ఎస్సీ, ఎస్టీలు విషయంలో కూడా అవగాహన కల్పించాలని మధు సభ దృష్టికి తీసుకువచ్చారు. చిన్న దొడ్డి గ ళ్ళు గ్రామంలో విద్యుత్ సమస్య అధికంగా ఉందని, వెలగ ప్రకాష్ ఇంటి దగ్గర నుంచి ఆ వీధిలో చివరి వరకు పైపులైన్లు పాడవడం వలన డ్రైనేజీ నీరు పైపులైన్లు లోకి వస్తుందని ,ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అదనపు ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎంపీడీవో చలపతిరావు, అధికారులు పరిశీలించి పరిష్కారాన్ని కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎలక్ట్రికల్ సిబ్బంది సకాలంలో స్పందిస్తున్నప్పటికీ సరిపడినంత సిబ్బంది లేక గ్రామాల్లో ఇబ్బందులు పడుతున్నారని దీనిపై దృష్టి పెట్టాలని కోరారు. పల్లె వెలుగు బస్సులు బస్ స్టాప్ లో ఆపకపోవడం వలన మహిళలు పలు అవస్థలు పడుతున్నారని, బస్ స్టాప్ దాటి దూర ప్రాంతం ఆపడం వలన మహిళలు పరుగులు పెట్టే పరిస్థితి తీసుకొస్తున్నారని ,తక్షణమే దీనిపై ఆర్టీసీ అధికారులు దృష్టి పెట్టాలని పిఏసిఎస్ అధ్యక్షులు వెలగా శ్రీనివాసరావు కోరారు. ఈ సమావేశంలో అధికారులకు ఎంపీపీ రత్నం, జడ్పిటిసి గోసల కాసులమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, అదనపు ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావులు సారధ్యంలో ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో జ్యోతి, అదనపు ఎంఈఓ దొర, ఉద్యానవన శాఖ అధికారి తో పాటు ఎక్సైజ్ ఎస్సై, పంచాయతీరాజ్ జేఈ,పలువురు ఎంపిటిసిలు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన శ్రీ జగన్నాథ స్వామి వారి రథయాత్ర

కసింకోట, జూలై 16, ప్రభాతవార్త

మండల కేంద్రమైన కసింకోటలో గురువారం శ్రీ జగన్నాథ స్వామి వారి పాదయాత్ర ఘనంగా జరిగింది. శ్రీమాన్ రేజేటి రామాచార్యులు సారథ్యంలో శ్రీ జగన్నాథ స్వామి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వడ్డీ వీధిలో గల శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయంలో స్వామి వారిని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేజేటి కన్నబాబు, రేజేటి మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఎండాడ-పనోరమ హిల్స్ రహదారిని 60 అడుగులకు విస్తరించండి

ప్రభావిత ఆస్తులపై సమగ్ర సర్వే చేపట్టి కార్యాచరణ రూపొందించాలి: జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం, జూలై 16, ప్రభాతవార్త

నగర మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా ఎండాడ--పనోరమ హిల్స్ మార్గంలో ప్రతిపాదించిన 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులకు అవసరమైన కార్యాచరణను వెంటనే ప్రారంభించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. గురువారం మధురవాడ జోన్ పరిధిలోని ఎండాడ నుంచి పనోరమ హిల్స్ వరకు వీఎంఆర్డీఏ అభివృద్ధి చేయనున్న మాస్టర్ ప్లాన్ రహదారి మార్గాన్ని జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడుతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ప్రస్తుతం 40 అడుగుల వెడల్పుతో ఉన్న రహదారిని 60 అడుగులకు విస్తరించేందుకు అవసరమైన అడ్డంకులను గుర్తించి తొలగించేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. రోడ్డు విస్తరణ వల్ల ప్రభావితమయ్యే ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల వివరాలను పూర్తిస్థాయిలో సేకరించి, సమగ్ర సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి ఆస్తికి సంబంధించిన యాజమాన్య పత్రాలు, ఇతర రికార్డులను పరిశీలించి పారదర్శకంగా ప్రతిపాదనలు రూపొందించాలని, అలాగే రోడ్డు విస్తరణ వల్ల నగరానికి కలిగే ప్రయోజనాలను ప్రభావిత ఆస్తి యజమానులకు వివరించి అవగాహన కల్పించాలని కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. ఈ పరిశీలనలో మధురవాడ జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, టౌన్ ప్లానింగ్ అధికారి తేజేశ్వరరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ షబ్నం శాస్త్రి తదితర అధికారులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పాయకరావుపేట, జూలై 16 ప్రభాతవార్త

ఇక్కడి తాండవ జంక్షన్ వద్ద గల జాతీయ రహదారిపై గత అర్ధ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానిక ఎస్ఐ పురుషోత్తం కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం నుండి రాజమండ్రి వైపు వెళుతున్న ఏపీ39 టిఈ 4477 నెంబరు గల లారీ డ్రైవర్ లారీని వేగంగా అజాగ్రత్తగా నడుపుతూ తన వాహనం ముందు నడుచుకుంటూ వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టడంతో ఈ సంఘటన సంభవించింది. ఈ ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుడిచేతి మణికట్టుపై కళ్యాణి విజయ్, మన్యం సాయి, రత్నాలు అను పేర్లు కలిగిన పచ్చబొట్టులు, చాతిపై ఎడమ భాగమున విజయ్ అనే పచ్చబొట్టు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని పొడవు 5.6 అడుగులు కలిగి సుమారు 45 సంవత్సరాల వయసు ఉంటుందని తెలిపారు. నలుపు రంగు మాసిన గడ్డం సహా నలుపు రంగు తల వెంట్రుకలు కలిగి చామన చాయ రంగు కలిగి ఉన్నాడన్నారు. కాఫీ రంగు ఫుల్ హాండ్ షర్టు, లనేవీ బ్లూ రంగు ఫుల్ ఫాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. స్థానిక వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ పురుషోత్తం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీల్లో భద్రపరిచామని తెలిపారు. మృతదేహం వివరాలు తెలిసిన యెడల స్థానిక సిఐ వినోద్ బాబు మొబైల్ 9440796106, ఎస్ఐ పురుషోత్తం మొబైల్ 93476 33643 నెంబర్లకు సమాచారం అందజేయాలని ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

రేపు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలి

అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

విశాఖపట్నం, జూలై 16 ప్రభాత వార్త

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా 18వ తేదీన జిల్లా వ్యాప్తంగా చేపట్టనున్న స్వచ్ఛతా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర దినంలో భాగంగా జిల్లాలోని అన్ని పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రహదారులు, వీధులు, మార్కెట్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా శానిటేషన్ డ్రైవ్‌లు నిర్వహించాలని గురువారం ప్రకటన విడుదల చేశారు.కాలువలు, చెరువులు, కుంటలు, ఇతర జల వనరులను శుభ్రపరచి నీటి నిల్వలు ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. చెత్త పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి వాటిని పరిశుభ్రమైన, పచ్చదనం నిండిన ప్రజా ప్రదేశాలుగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణను 100 శాతం చేపట్టి తడి, పొడి, గృహ ప్రమాదకర వ్యర్థాలను మూలస్థాయిలోనే వేరు చేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కంపోస్టింగ్ యూనిట్లు, ఇతర వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాల పనితీరును మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజా, సామాజిక మరుగుదొడ్లను ప్రత్యేకంగా శుభ్రపరిచి వాటిలో నీరు, విద్యుత్, నిర్వహణ సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల్లో పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, వ్యర్థాల వేర్పాటు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, మానవహారాలు, వీధి నాటకాలు, ఇతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, పార్కులు, రహదారుల వెంట మొక్కలు నాటడం, సుందరీకరణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

10వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆరిలోవ, జూలై 16, ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం స్థానిక 10వ వార్డు డైరీ ఫారం మెయిన్ రోడ్ పెట్రోల్ బంక్ వద్ద జీవీఎంసీ నిధులతో సుమారు 8 లక్షల వ్యయంతో సిసి రోడ్లు అదేవిధంగా ఆదర్శనగర్ కొండవాల ప్రాంతంలో హ్యాండ్ రైలింగ్ సుమారు 11 లక్షలతో శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, వార్డు మాజీ కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్ హాజరై పూజా కార్యక్రమాలతో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి వేమల వెంకటరావు, బి సి సెల్ అధ్యక్షులు చనుమల్ శ్రీనివాసరావు,యువత అధ్యక్షులు కర్రి ప్రకాష్ రావు,క్లస్టర్ ఇంచార్జి మద్దిల రాజేష్ తో పాటు గ్రామ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF XII ADDITIONAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM

E.P.440/2024 O.S.809/2015

Between:
Sri Bheesetti Simhachalam ...Decree Holder
AND
Sri Bogaraju Rama Krishna ...Judgement Debtor
To:
Sri Bhogaraju Rama Krishna, Son of Sri Bhogaraju Venkata Suryanarayana Rao, Residing at D.No.39-3-13, Murali Nagar, Visakhapatnam-530007.

NOTICE

Please take notice that DHR herein filed the above EP 440/2024 against you under Order 21 Rule 34 enclosing a copy of draft sale deed with a prayer to direct the JDR herein to execute registered Sale Deed in favour of Decree Holder failing which the Honourable Court to execute and register Sale Deed as per the draft in favour of the Decree Holder on behalf of the Judgement Debtor as the entire Sale Consideration was already paid to the Judgement Debtor and Possession was also delivered to the Decree Holder. The matter stands posted to **14.08.2026** for your appearance. You are therefore required to appear before the Honourable Court Personally or through your advocate by **10:30 AM** on **14.08.2026** failing which the matter will be decided in your absence basing on the material available before the Court.

(M RAMDAS) Advocate for DHR
Plot No.191, Door No.50-116-1, 1st Floor, Royal Court, Seethammadhara, North Extension, **Visakhapatnam-530013,**
Mobile No: 93481 86105

Visakhapatnam,
Date: 16.07.2026

ఫారం నెం. 14 (రెగ్యులేషన్ 33(2) చూడవలెను)

రికవరీ ఆఫీసర్ వారి కార్యాలయం-I
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్

(ఆర్థిక సేవల విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వము)
31-31-21, నారాయణ భవనం, సాయిబాబా వీధి, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020

డిమాండ్ నోటీసు

రికవరీ ఆఫ్ డెట్స్ అండ్ బ్యాంక్‌రప్సీ యాక్ట్, 1993లోని సెక్షన్లు 25 నుండి 28 మరియు ఆదాయపు పన్ను చట్టం, 1961లోని రెండవ షెడ్యూలులోని రూల్ 2 క్రింద ప్రకటన

RC/919/2024 11.05.2026

కెనరా బ్యాంక్ (ఇ-సిండికేట్ బ్యాంక్), ఒంగోలు మెయిన్ బ్రాంచ్, ప్రకాశం జిల్లా
వర్సెస్
M/s. స్వామి గ్రానైట్స్ & ఇతరులు

(CD-2) శ్రీ కె. రాధా కృష్ణ, తండ్రి: శ్రీ కె. సుబ్బారావు, హెచ్.నెం.12-34, చినముషిడివాడ, శ్రమశక్తి నగర్, వార్డు నెం.70, పెందుర్తి, సుజాత నగర్, విశాఖపట్నం-530051.

1. జారీ చేయబడిన రికవరీ సర్టిఫికేట్ దృష్ట్యా గౌరవనీయ ప్రెసిడింగ్ అధికారి, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం ద్వారా OA/450/2022 ఆమోదించబడింది. మొత్తం **రూ.55,98,244.08 పై (అక్షరాల యాభై ఐదు లక్షల తొంభై ఎనిమిది వేల రెండు వందల నలభై నాలుగు రూపాయల ఎనిమిది పైసలు మాత్రమే)** పెండెంటెలైట్ మరియు భవిష్య వడ్డీతో పాటుగా @ 11.95% p.a. నెలవారీ వడ్డీతో కలిపి పైన పేర్కొన్న మొత్తంపై **తేది.04.05.2022** నుండి రియలైజ్ అయ్యే వరకు / చెల్లింపు తేదీ వరకు చెల్లించాల్సి ఉంటుంది. (ఉమ్మడిగా మరియు అనేకంగా / పూర్తిగా / పరిమితంగా)
2. ఈ నోటీసు స్వీకరణ నుండి 15 రోజులలోగా పైన తెలిపిన మొత్తాన్ని మీరు చెల్లించాలని మిమ్మల్ని ఇందుమూలంగా ఆదేశించడమైనది. లేనిచో రికవరీ ఆఫ్ డెట్స్ డ్యూ టు బ్యాంక్స్ అండ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ యాక్ట్, 1993 మరియు అందులోని నియమాలకు అనుగుణంగా రాబట్టుకోబడును.
3. మీ ఆస్తుల వివరాల అఫిడవిట్‌ను విచారణ తదుపరి తేదీన లేదా ఆలోగా వెల్లడించాలని మీకు ఆదేశించడమైనది.
4. పైన తెలిపిన మొత్తానికి అదనంగా మీరు చెల్లించవలసినవి:
   (ఎ) ఎగ్జిక్యూషన్ ప్రొసీడింగ్స్ యొక్క ఈ నోటీసు తరువాత వెంటనే ప్రారంభమయ్యే కాలానికి చెల్లించవలసిన వడ్డీ.
   (బి) ఈ నోటీసు అందించడానికి మరియు మొత్తం బకాయిని రాబట్టుకోవడానికి తీసుకున్న ఇతర ప్రక్రియలు మరియు అన్ని ఇతర ప్రొసీడింగ్స్‌కు సంబంధించి అయిన అన్ని వ్యయాలు, ఛార్జీలు మరియు ఖర్చులు.
5. దిగువ పునరుత్పత్తి చేయబడిన ఆదాయపు పన్ను చట్టం, 1961 లోని రెండవ షెడ్యూల్ నందు రూల్ 16 ని చూడండి.

16(1) రూల్ 2 ప్రకారం డిఫాల్టర్పై నోటీసు అందజేసినట్లయితే డిఫాల్టర్ లేదా అతని ప్రతినిధి వడ్డీకి తనఖా పెట్టడానికి, ఛార్జ్ చేయడానికి, లీజుకు లేదా రికవరీ అనుమతితో తప్ప అతనికి సంబంధించిన ఏదైనా ఆస్తితో వ్యవహరించడానికి సమర్థుడు కావు. అధికారి లేదా ఏదైనా సివిల్ కోర్టు డబ్బు చెల్లింపు కోసం డిక్రీని అమలు చేయడంలో అటువంటి ఆస్తికి వ్యతిరేకంగా ఎటువంటి ప్రక్రియను జారీ చేయరాదు.
16(2) ఈ షెడ్యూల్ ప్రకారం అటాచ్‌మెంట్ చేయబడినప్పుడు అటాచ్ చేసిన ఆస్తి యొక్క ఏదైనా ప్రైవేట్ బదిలీ లేదా డెలివరీ లేదా అందులో ఏదైనా వడ్డీ మరియు అటువంటి అటాచ్మెంటు విరుద్ధంగా ఏదైనా ఋణం, డివిడెండ్ లేదా ఇతర డబ్బులను డిఫాల్టరు చెల్లించడం చెల్లదు. అటాచ్మెంట్ క్రింద అమలు చేయగల అన్ని క్లెయిమ్లకు వ్యతిరేకంగా ఉంటుంది.

(నా స్వహస్తములతో మరియు ఈ ట్రిబ్యునల్ యొక్క ముద్రతో తేది.11 మే, 2026 న ఇవ్వబడినది)

(అవసరాల అనిల్) రికవరీ ఆఫీసర్
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం

కెనరా బ్యాంక్ Canara Bank | ప్రాంతీయ కార్యాలయం, విశాఖపట్నం జిల్లా, ఆంధ్రప్రదేశ్. | బంగారు ఆభరణముల వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా ఈ క్రింది పేర్కొనబడిన ఖాతాదారులు, దిగువ తెలిపిన కెనరా బ్యాంకు బ్రాంచ్‌లలో బంగారు నగలు తాకట్టు పెట్టి, తీసుకున్న ఋణములు చెల్లించాల్సిందిగా బ్యాంకు వారు పలుమార్లు కోరిననూ, నోటీసులు పంపిననూ, వారు తమ బాకీలు చెల్లించలేదు. ఋణము చెల్లించవలసిన కాలము గడిచినందున సదరు బంగారు నగలను మా బ్యాంకు సంబంధిత బ్రాంచ్ ఆవరణలో **తేది 23.07.2026, గురువారం మధ్యాహ్నం 3 గం॥లకు** బహిరంగ వేలము వేసి వారి పేరున ఉన్న బకాయిలు జమకట్టుకొనబడును. ఈ ఖాతాదారులలో ఎవరికైననూ బ్యాంకు వారి నోటీసులు అందని యెడల లేదా నోటీసులు తిరస్కరించిన వారికి ప్రతికాముఖంగా చివరగా తెలియజేయడమైనది. వేలము వేసినా బకాయిలు రద్దుకాని యెడల వారిపై చట్టరీత్యా తగుచర్యలు తీసుకొని మిగిలిన బకాయిలు వసూలు చేయబడును మరియు వేలము తదితర ఖర్చులు వారి ఖాతాలకు వ్రాయబడును. ఈ దిగువ ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది.

ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	స్థూల బరువు
కొమ్మాది బ్రాంచ్ (13594), ఫోన్: 83329 59574		
180155190144	**గట్టి జ్యోతి, భర్త: జి. యేసు,** డి.నెం. 7-117, శ్రీనివాస స్కూల్ ఎదురుగా, పిల్లా వారి వీధి, రేవళ్లపాలెం, మధురవాడ, విశాఖపట్నం	4.48 గ్రాములు

వేలం నియమనిబంధనలు: (1) వేలంలో పాల్గొనదలచిన వారు **రూ.10,000/-** ధరావత్తు సొమ్మును సంబంధిత బ్రాంచ్లో చెల్లించి వేలంలో పాల్గొనవచ్చును. ధరావత్తు చెల్లించిన వ్యక్తిని మాత్రమే ఆక్షన్ హాలులోకి అనుమతించబడును. (2) పై నగలను వేలం తేదీనాటికి ఉన్నటువంటి బంగారం ధరను బట్టి రిజర్వు ధర నిర్ణయించబడును. వేలంలో పాల్గొన్నవారు పై వస్తువుల విలువ పరిమాణము, నాణ్యత కొరకు ఎటువంటి వివాదములకు బ్యాంకు బాధ్యత వహించదు. (3) హెచ్చుపాటదారుడు మొత్తం పాట సొమ్మును అదేరోజు చెల్లించి వస్తువులను పొందవలెను. లేనియెడల ధరావత్తు సొమ్ము కోల్పోవుదురు. (4) పై ఖాతాదారులలో ఎవరికైనా మా బ్యాంకు నందు ఇంకనూ అప్పులు వున్నచో, వేలం ద్వారా మిగిలిన సొమ్మును ఆ ఖాతాకు సర్దుబాటు చేయబడును. (5) బ్యాంక్ సంతృప్తి మేరకు కె.వై.సి. డాక్యుమెంట్ తప్పనిసరిగా సమర్పించవలెను. (6) జిఎస్ టి మరియు ఇతర ట్యాక్సు పాటదారుడే భరించవలెను. (7) ఏకారణం చూపకుండానే వేలం షరతులు మార్చుటకు, వేలం వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు బ్యాంకు వారికి సర్వహక్కులు కలిగియున్నవి. (8) ఇతర వివరములకు సంబంధిత బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించవలెను.

తేది: 17.07.2026, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

సి ఐ నరసింహారావు ఆర్థిక సహాయంతో ప్రభుత్వ కళాశాలకు పుస్తకాల పంపిణీ

గాజువాక,జులై 16,ప్రభాతవార్త

మల్కాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మల్కాపురం స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇ నరసింహారావు అండగా నిలిచారు. కళాశాల విద్యార్థుల ఉన్నత చదువుల కోసం మల్కాపురం స్టేషన్ హౌస్ ఆఫీసర్ నరసింహారావు సొంత నిధులతో గురువారం సుమారు రూ. 10 వేల విలువైన జేఈఈ నీట్ ప్రవేశ పరీక్షల పుస్తకాలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నిరోధం, మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సి ఐ నరసింహారావు మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వేధింపులు ఎదురైతే ధైర్యంగా పోలీసులను సంప్రదించాలని కోరారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల కొనుగోలు చేయలేని తమకు పోలీసులు పుస్తకాలు అందించడం పట్ల విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం పనులను వేగవంతం చేయాలి: ప్రభుత్వ విప్ గణబాబు

గాజువాక,జులై 16,ప్రభాతవార్త

జీవీఎంసీ 60వ వార్డ్ వుడా కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం పనులను ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు పి.జీ.వి .ఆర్. నాయుడు (గణబాబు) గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నిర్మాణ పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా, ఆధునిక వసతులతో నిర్ణీత గడువులోగా పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ టీడీపీ అధ్యక్షులు మాత శ్రీనివాసరావు స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

30 వసంతాలు పూర్తి చేసుకున్న ఆరిలోవ ఎఫ్ఆర్యు ఆసుపత్రి

ఆరిలోవ,జులై 16, ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం స్థానిక 11వ వార్డు ఆరిలోవలో ఉన్న ప్రాథమిక వైద్యశాల (ఎఫ్ ఆర్ యు) 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఆసుపత్రి వైద్యాధికారిని డాక్టర్ అనిత ఆధ్వర్యంలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, రెడ్ క్రాస్ చైర్మన్ బాల సతీష్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ... 30 సంవత్సరాలుగా సుమారు 20 లక్షల మందికి వైద్య సేవలు, మహమ్మారి కరోనా సమయంలో ఐదు లక్షల మందికి కరోనా పరీక్షలు, రెండు లక్షల మందికి కరోనా టీకాలు అదేవిధంగా రోజుకి 250 నుండి 300 వరకు ఓపీ పేషెంట్లు వస్తున్నారని తెలిపారు. 10 పడకల ఆసుపత్రిలో మహిళలకు సంబంధించి సుమారు 200 మందికి సుఖ ప్రసవాలు, 10000 మందికి శాస్త్ర చికిత్స ద్వారా ప్రసవాలు నిర్వహించారని తెలిపారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. 18 ఏళ్లగా సేవలందిస్తున్న వైద్యాధికారిని డాక్టర్ అనితకు ఎమ్మెల్యే వెలగపూడి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు ఒమ్మి సన్యాసిరావు, ముగడ రాజారావు, కాకి గంగరాజుతో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్వాకల్చర్‌కు వ్యవసాయ హోదా కల్పించండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆక్వా రైతుల హృదయపూర్వక విజ్ఞప్తి

జులై 16, ప్రభాతవార్త

భారతదేశంలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో, ఆక్వాకల్చర్ (రొయ్యలు, చేపల పెంపకం) లక్షలాది మంది రైతులు, కార్మికులు, యువత మరియు వారి కుటుంబాలకు జీవనాధారంగా నిలిచిన ప్రధాన రంగం. ప్రపంచ దేశాలకు నాణ్యమైన రొయ్యలు, చేపలను ఎగుమతి చేస్తూ ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యాన్ని దేశానికి సమకూర్చడంలో ఈ రంగం కీలక పాత్ర పోషిస్తోంది. అయితే దేశ ఆర్థికాభివృద్ధికి ఇంతటి సేవ చేస్తున్న ఆక్వా రంగానికి ఇప్పటికీ వ్యవసాయ హోదా లభించకపోవడం ఆక్వా రైతులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. ఆక్వా రైతులు కూడా వ్యవసాయ రైతుల మాదిరిగానే ప్రకృతి వైపరీత్యాలు, తుఫానులు, వరదలు, వైరస్ వ్యాధులు, విద్యుత్ అంతరాయాలు, పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, మార్కెట్ ధరల హెచ్చుతగ్గులతో తీవ్రంగా నష్టపోతున్నారు. అయినప్పటికీ వ్యవసాయ రైతులకు లభించే అనేక ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సంక్షేమ పథకాలు ఆక్వా రైతులకు పూర్తిస్థాయిలో అందడం లేదు.

వ్యవసాయ హోదా కల్పిస్తే కలిగే ప్రధాన ప్రయోజనాలు

తక్కువ వడ్డీతో సులభంగా బ్యాంకు రుణాలు పొందే అవకాశం. ప్రభుత్వం అందించే సబ్సిడీలు, 24ఐ7 నాణ్యమైన విద్యుత్ రాయితీలు. వరదలు, తుఫానులు, వ్యాధుల వల్ల నష్టపోయినప్పుడు పంట బీమా, నష్టపరిహారం. ఈ-క్రాప్ నమోదు ద్వారా పరిహారం నేరుగా రైతుల ఖాతాల్లో జమ అయ్యే అవకాశం.హ్యాచరీలు, కోల్డ్ చైన్, ప్రాసెసింగ్ యూనిట్లు మరింత అభివృద్ధి.గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల పెరుగుదల. ప్రజలకు నాణ్యమైన ప్రోటీన్ ఆహారం మరింత అందుబాటులోకి రావడం. రొయ్యలు, చేపల ఎగుమతులు పెరిగి దేశానికి మరింత విదేశీ మారకద్రవ్యం సమకూరడం.

ఆక్వాకల్చర్‌కు వ్యవసాయ హోదా కల్పించడం వల్ల రైతులకు మాత్రమే కాదు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు, దేశ ఆర్థికాభివృద్ధికి కూడా ఎంతో మేలు జరుగుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు భారతదేశం ప్రపంచ ఆక్వా రంగంలో మరింత ముందంజలో నిలిచే అవకాశం ఉంటుంది.

ప్రభుత్వానికి వినమ్ర విజ్ఞప్తి

కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రంగం ప్రాధాన్యతను గుర్తించి, లక్షలాది మంది ఆక్వా రైతుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆక్వాకల్చర్‌కు వ్యవసాయ హోదా కల్పించే అంశాన్ని అత్యంత సానుకూలంగా, మానవతా దృక్పథంతో పరిశీలించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని హృదయపూర్వకంగా కోరఈ ఒక్క నిర్ణయం లక్షలాది ఆక్వా రైతుల జీవితాల్లో భరోసా నింపడమే కాకుండా, దేశానికి మరింత విదేశీ మారకద్రవ్యం, గ్రామీణ ప్రాంతాలకు ఉపాధి, ప్రజలకు నాణ్యమైన ప్రోటీన్ ఆహారం అందించే చారిత్రాత్మక నిర్ణయంగా నిలుస్తుంది. ఆక్వా రైతు బలపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. ఆక్వా రంగం అభివృద్ధి చెందితే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది. ఆక్వాకల్చర్‌కు వ్యవసాయ హోదా కల్పించడం కాలానుగుణ అవసరం."

గాజువాకలో వైభవంగా జగన్నాథుడి ఊరేగింపు

-10 రోజుల పాటు దశావతార పూజలు

గాజువాక,జులై 16,ప్రభాతవార్త

శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో బలభద్ర, సుభద్ర సమేత శ్రీ జగన్నాథ స్వామి వారి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని గాజువాక పురవీధుల్లో ఘనంగా ఊరేగించి, అనంతరం సంఘ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. ఈ శోభాయాత్రలో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. గురువారం నుంచి పది రోజుల పాటు స్వామివారికి నిరంతరాయంగా దశావతార పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హైస్కూల్ రోడ్డు, పరిసర ప్రాంతాల భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు శిలపరశెట్టి నారాయణమూర్తి, అధ్యక్షులు బి.శెట్టి సింహాచలం నాయుడు, ప్రధాన కార్యదర్శి చదరం నూకరాజు, కోశాధికారి ఆదారి రాము, ప్రతినిధులు బి.శెట్టి వెంకటేశ్వరరావు, బొడ్డేడ నాగేశ్వరరావు, ఆదారి నాగేశ్వరరావు, శరగడం జయేశ్వరరావు, ఆదారి లీల, నూక సాయి, దొడ్డి పరశురాం, సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అదాని గూగుల్ డేటా సెంటర్లకు ఇచ్చే అనుమతులను రద్దు చేయాలని సిపిఐ మానవహారం

ఇద్దరు సిపిఐ నాయకులు శిరోమండనం చేసుకొని నిరసన

ఆరిలోవ, జులై 16, ప్రభాతవార్త

ముడసర్లోవలో 512 మెగావాటు సామర్థ్యం కలిగిన గూగుల్ డేటా సెంటర్లకు కూటమి ప్రభుత్వం అనుమతులు ఎలా ఇచ్చిందని వెంటనే ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని రాష్ట్ర పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు జెవి. సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక 12వ వార్డు పెదగదిలి జంక్షన్లో సిపిఐ పార్టీ నేతలు మానవహారం నిర్వహించి ఇద్దరు పార్టీ నాయకులు అచ్యుతరావు, కొమర సందీప్ కుమార్ శిరోమండనం చేసుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముడసర్లోవ రిజర్వేయర్ ఆనుకొని సింహాచలం దేవస్థానం కొండ భూములు అదానీ సెంటర్‌కు కేటాయించి డేటా సెంటర్ పనులు కూడా ప్రారంభించారని, దీని కారణంగా పెదగదిలి, చినగదిలి, రామకృష్ణాపురం బాలాజీ నగర్, రవీంద్రనగర్,డైరీఫారం, అడవివరం ప్రాంతం ప్రజలపై ప్రత్యక్షంగా ప్రభావం ఉండి, పర్యావరణ పూర్తిగా నాశనం అవుతుందన్నారు. ఆరిలోవ ముడసర్లోవ రిజర్వాయర్ పూర్తిగా ఎండిపోయి తాగునీరు దొరక్క ప్రజలు ఇబ్బందులకి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. మన భూమి మన నీరు మన పకృతి వనరులను కాపాడుకుంటూ కలిసి పోరాటం చేద్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ రహిమాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అత్తిలి విమల, సహాయ కార్యదర్శి పి.చంద్రశేఖర్ , ఎం. పైడిరాజు, ఎం. మన్మధరావు, కే.వనజాక్షి ఎంఎ. బేగం, ఆర్. శ్రీనివాసరావు, షేక్.మస్తాన్, బి.పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న 6,400 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలి

విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు -ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి -ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జిల్లా కార్యదర్శి ఉల్లం.నాగరాజు

విశాఖపట్నం, జులై 16 ప్రభాత వార్త :

రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ విశాఖ పట్నం జిల్లా సమితి ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు గురు వారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ను ముట్టడించి, మహాధరాను నిర్వహిం చారు. అంతకు ముందు వారు జిల్లాపరిషత్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకుపెద్ద ఎత్తున ర్యాలీగా ప్రదర్శన చేస్తూ ధర్నా చేపట్టారు ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల.నాసర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విద్యా రంగ సమస్యల నిలయంగా మారిన ఘనత ఈ రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందని,పాఠశాల విద్య నుంచి యూనివర్సిటీల విద్య వరకు అనేక సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయని ఆరోపించారు.ప్రధానంగా సంక్షేమ వసతి గృహాలకు నిధులు కేటాయించక దశాబ్ద కాలంగా ఖాళీగా ఉన్న కుక్, కమాటి, వార్డెన్ పోస్టులు భర్తీ కాకపోవడం వలన విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగి గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో డ్రాప్ అవుట్స్ పెరిగిపోతున్నాయని డిగ్రీ బీటెక్ పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ రాక సర్టిఫికెట్ చేతికి రాక కళాశాల చుట్టూ తిరుగుతున్నారని,రాష్ట్రంలో 6400 కోట్ల రూపాయలకు పైగా బకాయిలు పెండింగ్లో ఉండిపోవడం వలన దిక్కుతోచని స్థితిలో విద్యార్థులను నిట్టేసిన ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఆందోళన ద్వారా బుద్ధి చెప్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్,డిగ్రీ,పాలిటెక్నికల్ ఐటిఐ. కళాశాలలు ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు విద్య అందుబాటులోకి తేవాలని కోరారు. విశాఖ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు పువ్వల శేఖర్,ఉల్లం నాగరాజు మాట్లాడుతూ విద్యా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని విద్యా శాఖ మంత్రి గొప్పగా గొప్పగా చెప్పుకుంటున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలను గాలికి వదిలేసి నిధులు కేటాయించక విద్యార్థులు తక్కువ ఉన్నారని నెపంతో చాలా వరకు డిపార్ట్మెంట్లను క్లోజ్ చేస్తున్నారని యూనివర్స్ లో టీచింగ్ నాల్ టీచింగ్ పోస్టులు మూడు వేలకు పైగా ఖాళీగా ఉన్నాయని పోస్టులు భర్తీ చేయకపోవడం వలన యూనివర్సిటీ విద్యార్థులకు ఉన్నత విద్య దూరమవు తుందని. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత పీజీ చదువుకునే కలలు కంటున్న విద్యార్థులకు జీవో నెంబర్ 77 వలన వారికి ఫీజు రీయంబర్స్మెంట్ వర్తించకపోవడం చాలా వరకు పీజీ కళాశాలలు మూతపడడం వలన విద్యార్థులు ఉన్నత విద్య కు దూరమవుతున్నారని అన్నారు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగలం పాదయాత్రలో అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో నెంబర్ 77 రద్దు చేస్తానని చెప్పి ఇంతవరకు దాన్ని ఊసే పట్టకపోవడం విద్యార్థులను మోసం చేయడమని మండిపడ్డారు పది రోజులో విద్యార్థి లోకంలో ఉన్న సమస్యలను పరిష్కరించకపోతే అన్ని విద్యార్థి సంఘాలన్ని ఏకదాటిపై తీసుకోవచ్చి రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ఎత్తున వ్యతిరేక కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ విశాఖ జిల్లా కార్యదర్శి ఉల్లం.నాగరాజు, అధ్యక్షులు పి శేఖర్, ఉపాధ్యక్షులు కిరణ్, సహాయ కార్యదర్శి మౌనిక, కార్యవర్గ సభ్యులు గ్రేస్ ప్రకాష్, నాయకులు గణేష్, హారిక ,సాయి, ముఖేష్, అశోక్ ,తేజ,రోహిత్,మణి,తేజ,గణేష్,రాజు,విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన సనపల రవీంద్ర భరత్

విశాఖపట్నం, జులై 16, ప్రభాతవార్త

వైఎస్ఆర్సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర బీసీ విభాగం సమీక్షా సమావేశం లో పాల్గొన్న విశాఖ జిల్లా బీసీ అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసారు ఈసందర్భంగా బీసీల సంక్షేమం కోసం బీసీ విభాగం తరపున కూటమి ప్రభుత్వం మీద నిరంతరం నిరసనల ద్వారా ముందుకు వెళ్ళాలని భరత్ కు జగన్ సూచించారు.

రైతులు సమగ్ర వ్యవసాయ విధానాలను అవలంబించాలి

బిసిటీ కృషి విజ్ఞాన కేంద్రం,సస్యరక్షణ శాస్త్రవేత్త,బండి నాగేంద్ర ప్రసాద్ -ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అవగాహన సదస్సు

పాయకరావుపేట జులై 16 ప్రభాతవార్త :

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో తాజాగా ఎల్ నినో పరిస్థితులు తలెత్తిన నేపథ్యంలో రైతులు ప్రధానంగా సమగ్ర వ్యవసాయ విధానాలను అవలంబించాలని బిసిటీ కృషి విజ్ఞాన కేంద్రం, సస్యరక్షణ శాస్త్రవేత్త, బండి నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ సహా జిల్లా వనరుల కేంద్రం సహకారంతో ఇక్కడి వ్యవసాయ శాఖ కార్యాలయంలో పాయకరావుపేట సబ్ డివిజన్ పరిధి లోని రైతులకు గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ప్రధానంగా తేలిక రకాల ఎద వరి సాగుకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. పచ్చిరొట్ట సహా జీవన ఎరువుల వాడకంపై దృష్టి సారించాలన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సమ్మిళిత వ్యవసాయం చేయాలని,జీవన ఎరువులు వినియోగం పెంచాలని శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ అన్నారు. ఈ ఏడాది ఆలస్యంగా వరి నారు పోసుకునే రైతులు శ్రీదృతి,తరంగిణి తదితర తేలిక పాటి రకాల వరి విత్తనాలను సాగు చేసుకోవాలన్నారు. కాలువ నీరు లేదా బోరు వసతి అందుబాటులో ఉన్నట్లయితే దీర్ఘకాలిక వరి రకాలైన శ్రీకాకుళం సన్నాలు, సాంబ మషూరి, స్వర్ణ,ఇంద్ర వంటి రకాలు కొనసాగించవచ్చని తెలియ జేశారు. ఇంకా ఆలస్యమైతే జూలై చివరి వరకు ఇవే రకాలను నేరుగా విత్తే వరి విధానంలో (ఎద వరి) సాగు చేయాలని బిసిటీ కృషి విజ్ఞాన కేంద్రం, సస్యరక్షణ శాస్త్రవేత్త, బండి నాగేంద్ర ప్రసాద్ సూచించారు. ఒకవేళ వర్షాలు తగినంత పడకపోతే చిరుధాన్యాల సాగు చేయాలని వ్యవసాయ విభాగం అధికారులు సూచించారు. ఈ

కార్యక్రమంలో పిఎల్ పురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ దేవరపు సత్యనారాయణ, అనకాపల్లి రైతు శిక్షణా కేంద్రశీ సహాయ సంచాలకులు కె.ఝాన్సీ లక్ష్మి, వ్యవసాయ శాఖ పాయకరావుపేట సబ్ డివిజన్ ఇంచార్జ్ సహాయ సంచాలకులు కె.ఉమా ప్రసాద్, వ్యవసాయ అధికారులు ఆదినారాయణ, సుగుణ తులసీ మణి,ఆ విభాగం విస్తరణ అధికారులు (ఏఈఓలు) సత్యనారాయణ, నాగమణి, సాయి,ఆత్మ మేనేజర్ సత్యవేణి సహా రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల కంటి వెలుగుకు మెగా స్క్రీనింగ్ కార్యక్రమం

విశాఖ జిల్లాలో 1.71 లక్షల మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు -9,900 మందికి ఉచిత కళ్లద్దాలు -జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కుమార్ చేతుల మీదుగా కార్యక్రమానికి శ్రీకారం

పిఎం పాలెం, జులై 16, ప్రభాతవార్త

పాఠశాల విద్యార్థుల్లో దృష్టిలోపాలను ప్రారంభ దశలోనే గుర్తించి, వారికి సకాలంలో చికిత్సతో పాటు ఉచిత కళ్లద్దాలు అందించేందుకు జాతీయ అంధత్వ నియంత్రణ మరియు దృష్టి లోపాల నివారణ కార్యక్రమం (ఎన్‌పీసీబీ అండ్ వీఐ)లో భాగంగా పాఠశాల విద్యార్థుల కంటి పరీక్షల కార్యక్రమం (ఎస్‌సీఈఎస్‌పీ)ను విశాఖ జిల్లాలో విస్తృతంగా అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కుమార్ గురువారం కలెక్టర్ కార్యాలయంలో కార్యక్రమ బ్యానర్‌ను ఆవిష్కరించి అధికారికంగా ప్రారంభించారు. ఆరోగ్య అండ్ కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, మంగళగిరి ఆదేశాల మేరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని 2026 జులై 15 నుంచి 2027 ఫిబ్రవరి 28 వరకు నిర్వహించనున్నారు. ఈ విద్యా సంవత్సరానికి విశాఖ జిల్లాలో మొత్తం 1,71,000 మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే 1,21,000 మంది విద్యార్థుల్లో దృష్టిలోపాలను గుర్తించి, అవసరమైన 9,900 మంది విద్యార్థులకు ఉచిత కళ్లద్దాలు అందించనున్నారు. అదనంగా 425 మంది ఉపాధ్యాయులకు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

14 ప్రత్యేక వైద్య బృందాల ఏర్పాటు

జిల్లా వైద్య ఆ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వర రావు, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వి. మీనాక్షి మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించేందుకు 14 ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, మండలాల వారీగా పరీక్షల షెడ్యూల్ రూపొందించినట్లు వెల్లడించారు.

విద్యాశాఖకు కీలక ఆదేశాలు

జిల్లా విద్యాశాఖాధికారి అన్ని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. తమ పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో కంటి పరీక్షల బృందాలకు పూర్తి సహకారం అందించడంతో పాటు, పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

అంధత్వ నివారణే ప్రధాన లక్ష్యం

విద్యార్థుల్లో చిన్న వయస్సులోనే దృష్టిలోపాలను గుర్తించడం ద్వారా వారి విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడటంతో పాటు, భవిష్యత్తులో అంధత్వాన్ని నివారించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమానికి సహకరించి ప్రతి విద్యార్థి కంటి పరీక్ష చేయించుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి రహిత సమాజమే ధ్యేయంగా జిల్లా అధికార యంత్రాంగం ఉక్కుపాదం

డ్రోన్ల నిఘాతో ప్రస్తుతం సాగు శాతం 'శూన్యం'- జిల్లా అధికారులతో ఎన్ కార్డ్ సమావేశం :జిల్లా కలెక్టర్ టి.నిశాంతి

పాడేరు,జులై16,ప్రభాతవార్త:

ముఖ్యమంత్రి ఆదేశాలు, ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి సాగు, నిల్వ, రవాణాను పూర్తిగా నిర్మూలించడానికి జిల్లా అధికార యంత్రాంగం అత్యంత పటిష్టమైన చర్యలను అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ నిషాంతి.టి తెలిపారు. గురువారం జిల్లా అధికారులతో కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో ఎన్ కార్డ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో ఆమె మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని, క్షేత్రస్థాయి నిఘాను సమన్వయం చేస్తూ గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా జిల్లా అధికారులు శ్రమిస్తున్నారన్నారు.

రవాణా మార్గాలపై కఠిన నిఘా, నిరంతర తనిఖీలు

గంజాయి రవాణా జరిగే అన్ని ప్రధాన, అంతర్గత మార్గాల్లో శాశ్వత మరియు తాత్కాలిక చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎక్కడికక్కడ వాహనాలను తనిఖీ చేసేందుకు నిరంతరం మారుతూ ఉండే 'డైనమిక్ వాహన తనిఖీలు' నిర్వహిస్తున్నామన్నారు. డ్రోన్ ద్వారా నిఘా చేపట్టి 357 గ్రామాల నుండి 'సున్నా'కి సాగు తగ్గించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, పాడేరు ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ, జిల్లా ఈగల్ టీం ఇన్స్పెక్టర్ జి. దేముళ్ళు, పోలీస్ ఇన్స్పెక్టర్ జి. అప్పన్న, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్బిఎస్ నంద్, డ్రగ్ ఎడిక్షన్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.కె రియాజ్ మెహబూబ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కృష్ణమూర్తి నాయక్ , స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిని ఝాన్సీరామ్ పడాల్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పీబికే పరిమళ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలకర్ణ, జిల్లా ఇంచార్జ్ అటవీ శాఖ అధికారి ఉమామహేశ్వరి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అబ్బబ్బో అబబ్బో... ఎన్నికల పండగబ్బో..!

స్థానిక ఎన్నికలు సమీపిస్తుండడంతో ఆశావహుల సందడి

కొయ్యూరు జులై 16 ప్రభాతవార్త

సెప్టెంబరు లేదా అక్టోబర్ నెలల్లో కచ్చితంగా స్థానిక, పంచాయతీ ఎన్నికలు జరగవచ్చుననే ప్రచారం గట్టిగా సాగుతుం డడంతో మండలంలోని పలు గ్రామాలలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఆశావహుల సందడి మొదలైంది. ఎప్పుడా? ఎప్పుడా? అని అంతా ఆశగా ఎదురు చూస్తున్న స్థానిక, పంచాయతీ ఎన్నికలు సర్ పేరుతో ఓటర్ల ప్రత్యేక సర్వే తో ఆలస్యం అవ్వడంతో ఢీలా పడ్డ ఆశా వహుల్లో, ఇటీవల సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్థానిక ఎన్నికల సమరంపై చేసిన ప్రకటనలు ఉత్సాహాన్ని రేకెత్తించాయి. సెప్టెంబరు నెలాఖరు లేదా అక్టోబర్ లో స్థానిక ఎన్నికలు జరుగుతాయని సీఎం, డిప్యూటీ సీఎం ప్రకటించిన విషయం విధితమే. దీనితో కార్యకర్తలను, అభిమానులను సమాయత్తం చేసి, స్థానిక ఎన్నికలలో మంచి ఫలితాలు సాధించాలన్న దిశగా వివిధ పార్టీలకు చెందిన నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు ఇప్పటికే సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ పరిణామం పంచాయతీలలో ని ఆశావహుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. తమ తమ పార్టీ నేతల అనుగ్రహాన్ని పొంది, ఎలాగైనా సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి టికెట్లను సాధించాలన్న పట్టుదలతో ఆశావహులు ఉన్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుత రాజకీయ పరిణామాలతో మండలంలో ఏ పార్టీకి ఫలితాలు ఎలా ఉండబోతున్నాయన్న దానిపై విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

గుర్తుతెలియని కారు ఢీకొని వృద్ధుడు మృతి

పాడేరు,జులై16,ప్రభాతవార్త

గురువారం రాత్రి పాడేరు. మండలం చింతల వీధి -ఆడారమట్ట జంక్షన్ వద్ద గిరిజనుడును గుర్తు తెలియని కారు ఢీ కొట్టింది. దీంతో స్థానిక వడ్డాది మూర్తి వృద్ధుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదంపై పాడేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రపతి ఉత్తర్వులు-2025 అమలుపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష

ఉద్యోగుల కేడర్ కేటాయింపులు నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ టి.నిశాంతి

పాడేరు,జులై16,ప్రభాతవార్త:

రాష్ట్రపతి ఉత్తర్వులు-2025కు అనుగుణంగా ఉద్యోగుల కేడర్ కేటాయింపు ప్రక్రియను నిబద్ధతతో పారదర్శకంగా, నిబంధనల మేరకు, నిర్ణీత సమయ పట్టిక ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ టి.నిశాంతి సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ మీటింగు మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ అంశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఉమ్మడి పాత జిల్లా కేడర్ నుంచి కొత్తగా ఏర్పడిన జిల్లా, అనుబంధ జిల్లా, జోనల్, అనుబంధ జోనల్, మల్టీ జోనల్ కేడర్లకు ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియను దశల వారీగా చేపట్టాలని సూచించారు. ప్రతి శాఖకు సంబంధించిన పోస్టుల కేడర్ బలం, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య, తుది కేడర్ బలాన్ని సమగ్రంగా పరిశీలించి వివరాలను ఖరారు చేయాలని ఆమె ఆదేశించారు. రాష్ట్రపతి ఉత్తర్వులు-2025 అమలుకు రూపొందించిన షెడ్యూల్‌ను కచ్చితంగా పాటించాలని ఇందులో భాగంగా జులై 16న ముసాయిదా సీనియారిటీ జాబితా ప్రచురణ, ఆప్షన్ ఫారాల జారీ, జులై 20 నాటికి అభ్యంతరాల స్వీకరణ, జులై 22న తుది సీనియారిటీ జాబితా ప్రచురణ జరుగుతుందని తెలిపారు. అదే రోజు నుంచి ఉద్యోగుల ఆప్షన్ల స్వీకరణ, సమాంతర ధ్రువీకరణ చేపట్టి జులై 26 లోగా ఆప్షన్ల దాఖలు పూర్తి చేయాలని, జులై 28న తుది కేటాయింపు జాబితా ప్రచురణ, కేటాయింపు ఉత్తర్వుల జారీ, ప్రభావిత ఉద్యోగుల గుర్తింపు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం జులై 30న కొత్త నియామక యూనిట్లలో రోస్టర్ల ప్రారంభం, రిక్విజిషన్ల తయారీ, చేరిక ఉత్తర్వుల జారీ, ఆగస్టు 5లోగా కొత్త యూనిట్లలో ఉద్యోగుల చేరిక పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. డ్రాఫ్ట్ సీనియారిటీ జాబితా ప్రచురించిన అనంతరం నిర్ణీత గడువులోగా అభ్యంతరాలను స్వీకరించి, నిబంధనల మేరకు పరిశీలించి తుది జాబితాను విడుదల చేయాలన్నారు. సర్వీస్ రిజిస్టర్, ఇతర ధ్రువీకరణ రికార్డుల ఆధారంగా ఉద్యోగుల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని, అర్హులైన ఉద్యోగులు ఎవరు, హోదా, వారి సీనియారిటీ జాబితా నుంచి మినహాయింపు కాకుండా చూడాలన్నారు. ఏ ఒక్క ఉద్యోగి లేదా పోస్టు కేటాయింపు లేకుండా మిగిలి పోకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగి అభ్యంతరాలు, ఆప్షన్ ఫారాలు, ప్రాధాన్యత కేటగిరీలకు సంబంధించిన క్లెయిమ్‌లను నిబంధనల ప్రకారం నిష్పక్షపాతంగా పరిశీలించాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ,డీఆర్వో ఎం. వి ఎస్ లోకేశ్వరరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ వివిధ విభాగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దళితులకు ఇచ్చిన డి పట్టా భూములపై కన్నేసిన అగ్ర కులస్తులు

న్యాయం చేయాలంటూ రోడ్డెక్కిన హక్కు దారులు

రాజాం, జూలై 16, ప్రభాతవార్త :

రాజాం మున్సిపాలిటీ డోలపేటలో ఉన్న కొత్త చెరువు గర్భంలో చెరువు కింద భాగంలో ఆయకట్టు లేకపోవడంతో 103 సర్వే నెంబరులో సుమారు 5.90 ఎకరాలు కలిగిన ప్రభుత్వ భూమిని 1976లో రాజాం గ్రామంలో పని చేస్తున్న దళిత నిరుపేద తలయారి (బారికోడు) జీవనోపాధి కొరకు వ్యవసాయం చేసుకోవడానికి అప్పటి రెవెన్యూ అధికారులు కేటాయించారు. అలాగే ప్రభుత్వం భూమి కేటాయించిన వారిలో తలచింతల రామారావు, చిన్నయ్య, మరో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. అయితే మాకు కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఆ భూమిని సాగు చేయలేకపోయామని, ఇలా సాగు చేయక వదిలేయడంతో డోలపేటలో ఉన్న కొంతమంది అగ్రకులస్తులు ఆ భూమిలో మట్టిని గ్రావెల్స్‌ను తవ్వకం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అదేవిధంగా ఈ చెరువుపై మీకు ఎలాంటి హక్కు లేదని వాదిస్తున్నారు. 2018లో అప్పటి ఎమ్మార్వో వై.శ్రీనివాసరావు హయాంలో ఆ భూమి విషయం 1.బి అడంగల్, డి.పట్టాలు ఇవ్వడం కూడా జరిగిందని తెలిపారు. అయితే 5.90 ఎకరాల్లో ఉన్న భూమిని 50 సెంట్లు వరకు ఎస్సీ బాలురు వసతి గృహానికి కేటాయించారు. మిగతా 5.40 ఎకరాలు మాకు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఆ భూమిలో హద్దులు గురించి చిన్న గోడలు నిర్మాణం చేస్తే అగ్ర కులస్తులు మాపై తిరుగుబాటు చేస్తున్నారని అన్నారు. మా దళిత భూములు విషయంపై రెవిన్యూ అధికారులు, రాజకీయ నాయకులు, తక్షణమే స్పందించి మాకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. చేయకపోతే తీవ్ర ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

'వార్త' కథనంతో చర్చనీయాంశమైన నాయకుడి వ్యవహారం

రణస్థలం, జూలై 16 ప్రభాతవార్త :

లావేరు మండలంలో అధికార పార్టీకి చెందిన నాయకుడిపై గురువారం వార్త దినపత్రికలో సొంత పార్టీలోనే మండల నేతకు సెగ అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై లావేరు మండలంలోనే కాకుండా నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశమైంది. వార్త దినపత్రికలో ప్రచురితమైన కథనం వాస్తవమేనని పత్రిక ప్రతినిధికి ఫోన్ చేసి సదరు నాయకుడి తీరుపై ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు చెప్పడం గమనార్హం. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనేది పాత మాట. కానీ ఒకే పార్టీలో ఉంటూ సొంత అనుచరులే శత్రువులుగా మారిపోయారంటే సదరు నాయకుడి రాజకీయ తీరుకు అద్దం పడుతోంది. తాజాగా సదరు నాయకుడు రాజకీయ వ్యవహారాలు ఇప్పుడు నియోజకవర్గ వ్యాప్తంగానే కాకుండా జిల్లా రాజకీయాల్లోనూ హాట్ టాపిక్‌గా మారాయి. పార్టీ శ్రేణుల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం సదరు నాయకుడు పార్టీని తన గుప్పిట్లోకి తీసుకోవాలని చూడటం, పాత క్యాడర్‌ను విస్మరించడం తీవ్ర అసంతృప్తికి దారితీసింది. పార్టీ కోసం ఎప్పటి నుంచో జెండా మోసిన సీనియర్ కార్యకర్తలను, ద్వితీయ శ్రేణి నాయకులను పక్కనబెట్టి, కేవలం తన కోటరీకి మాత్రమే ప్రాధాన్యత ఇస్తుండటంతో క్షేత్రస్థాయిలో పార్టీ బలహీన పడుతోందన్నది సదరు నాయకుడిని తీరును వ్యతిరేకిస్తున్న మరో వర్గం వాదన. అధిష్ఠానం వద్ద ఒకలా, స్థానిక నాయకుల వద్ద మరోలా సదరు నాయకుడు ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని, ఈ 'డబుల్ గేమ్' వల్ల పార్టీ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందనే చర్చ గట్టిగా నడుస్తోంది. అంతేకాకుండా నాయకుల్లోనూ, ప్రజల్లోనూ ఇంతకాలం తెరవెనుక ఉన్న విభేదాలు ఇప్పుడు రచ్చకెక్కాయి. సదరు నాయకుడి వ్యవహార శైలి నచ్చని కొందరు కీలక నాయకులు అంతర్గతంగా గ్రూపులు కడుతూ, ఆయన ఆధిపత్యానికి గండి కొట్టేందుకు వ్యూహాలు రచించెలా సదరు నాయకుడు వ్యవహరిస్తున్న తీరుపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. సదరు నాయకుడు తీరు కారణంగా మండలంలో రోజురోజుకూ దిగజారుతున్న పార్టీ పరిస్థితిని అధిష్ఠానం గమనిస్తోందా? లేదా సదరు నాయకుడు చెబుతున్న కట్టుకథలను నమ్మి ఊరుకుంటుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సొంత ఇల్లే సదురుగా లేనప్పుడు, రేపు ఎన్నికల బరిలో ప్రత్యర్థులను ఎలా ఎదుర్కొంటారు? ఈ అంతర్గత కలహాల వల్ల ప్రత్యర్థి పార్టీలకు లాభం చేకూరడం ఖాయమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. సదరు మండల నాయకుడు అనుసరిస్తున్న తీరు, సొంత వర్గాన్ని దూరం చేసుకోవడం ఇప్పుడు ఆయన రాజకీయ భవిష్యత్తుకే పెద్ద ప్రశ్నార్థకంగా మారింది.

జోరుగా సిమెంట్ రహదారి నిర్మాణ పనులు

ఆమదాలవలస, జూలై 16, (ప్రభాతవార్త):

రావికంటిపేట గ్రామంలో సిమెంటు రహదారి పనులు జోరుగా సాగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ కృషితో అభివృద్ధి పనుల కు నిధులు మంజూరయ్యాయి. పురపాలక సంఘం అభివృద్ధి ధ్యేయంగా నిధులను ఎమ్మెల్యే మంజూరు చేశారు. 21వ వార్డు పరిధి రావికంటిపేట, అచ్చన్నపేట గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం 30 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులతో రహదారుల నిర్మాణం చేపడుతున్నారు. ఇరుక సందుల్లో రోడ్లు వేయడంతో గ్రామస్తుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామం చివర్లో ఉన్న స్మశాన వాటికకు రోడ్డు నిర్మాణం ప్రారంభం కావడంతో సమస్య పరిష్కారం అయ్యిందని గ్రామస్తులు భావిస్తున్నారు. ఈ పనులను ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు పీవీకే రాజు పరిశీలన చేపట్టారు. నాణ్యత ప్రమాణాలతో పనులు జరుగుతున్నాయని, ఆయన తెలిపారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ మెట్ట తేజేశ్వరరావు, సచివాలయ కార్యదర్శి కె.సతీష్, కాంట్రాక్టర్ కూన ఆంజనేయులు, గ్రామ నాయకులు బత్తుల సత్యనారాయణ, పొన్నాడ ఆదినారాయణ, శ్రీనివాసరావు, పోగోటి రమణ ఉన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన నెయ్యిల ప్రసాద్

కంచిలి, జూలై 16, ప్రభాతవార్త :

కంచిలి మండలం బూరగాం గ్రామానికి చెందిన నెయ్యిల ప్రసాద్ అనే వికలాంగుడు 2024లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే ఇచ్ఛాపురం నుండి తిరుమల వరకు మూడు చక్రాల సైకిల్ ద్వారా యాత్ర చేసుకుంటూ చంద్రబాబునాయుడుకి కలుస్తానని ప్రతిపక్షంలో వున్నప్పుడు చాలా సమావేశాల్లో మాటిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఇచ్ఛాపురం నియోజకవర్గం శాసన సభ్యులు బెందాళం అశోక్, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, అముదాలవలస శాసన సభ్యులు కూన రవికుమార్ ఆశీస్సులతో ఇచ్ఛాపురం నుండి తిరుమల వరకు సుమారు 1000 కిలోమీటర్లు మూడు చక్రాల సైకిల్‌తో యాత్ర చేసి సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. అన్ని విధాలా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు.

రైతు ఉత్పత్తి కంపెనీ ద్వారా విలువ ఆధారిత పెంపు

సీతంపేట, జూలై 16, ప్రభాతవార్త :

రైతు ఉత్పత్తి కంపెనీ ద్వారా విలువ ఆధారిత వస్తువులు పెంపొందించడానికి వీలు కలుగుతుందని మన్యం జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం సీతంపేటలో నాబార్డ్ సహకారంతో ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆగ్రోఫ్రెష్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ షాపును స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో సహజ సిద్ధంగా పండిస్తున్న అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి వాటికి మద్దతు ధర కల్పించడానికి వీలుగా రైతు ఉత్పత్తి సంఘాలు బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. గిరిజన ప్రాంతాలలో నిరుద్యోగ ఆదివాసి యువతకు ఔత్సాయిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐటిడిఏ పిఓ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, నాబార్డ్ జిల్లా మేనేజర్ దినేష్ కుమార్ రెడ్డి, తహసిల్దార్ శ్రీకన్య, ఎంపీడీవో బీబీ మిశ్రా, ఆర్ట్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు, పీహెచ్ఓ వెంకట గణేష్, సీఈఓ శంకరరావు, మండల వ్యవసాయ అధికారి వారాహి ఇమరక పవన్, ఆదివాసి మహిళ రైతులు, ఉత్పత్తిదారులు, కంపెనీ సీఈవో అరిక గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

ధూపదీప నైవేద్యానికి ప్రభుత్వ నిధులు మంజూరు

ఎమ్మెల్యే, పీయూసీ కమిటీ చైర్మన్ కూన

ఆముదాలవలస, జూలై 16 (ప్రభాతవార్త)

నియోజకవర్గంలోని మూడు పురాతన హిందూ దేవాలయాలకు ధూపదీప నైవేద్య నిర్వహణ కోసం ప్రతినెల రూ.10 వేల చొప్పున ప్రభుత్వ నిధులు విడుదల చేయడం జరిగిందని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో పొందూరు మండలంలోని లచ్చయ్యపేట గ్రామంలో ఎండల మల్లికార్జున స్వామి దేవాలయం, మొదలవలస గ్రామంలోని వల్లభ నారాయణస్వామి దేవాలయం, ఆమదాలవలస మండలంలో లద్దలపేట గ్రామంలోని సీతారామస్వామి దేవాలయమునకు ప్రతి నెల రూ.10 వేల రూపాయలు చొప్పున ధూప దీప నైవేద్యములకు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులు మంజూరు చేయడంపై భక్తుల్లో హర్షాతిరేకం వ్యక్తమైంది. కూటమి ప్రభుత్వం దేవాలయాల పరిరక్షణకు, నిత్య పూజా కార్యక్రమాల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ నిధులను సంబంధిత దేవాలయాల అర్చకుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నారు. ఈ నిర్ణయం వలన దేవాలయాల్లో నిత్య పూజలు, ధూపదీప నైవేద్య కార్యక్రమాలు మరింత సక్రమంగా నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని అర్చకులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆలయాల పరిరక్షణ, అర్చకుల సంక్షేమం, సనాతన ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, భవిష్యత్తులో కూడా అర్హత కలిగిన మరిన్ని దేవాలయాలకు ప్రభుత్వ సహకారం అందేలా కృషి కొనసాగుతుందని రవికుమార్ తెలిపారు. ఈ నిధులు మంజూరు చేసిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎమ్మెల్యే రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

జనం మధ్యకి జగన్నాథుడు

ఇచ్ఛాపురం, జూలై 16, ప్రభాతవార్త:

ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం జగన్నాథ స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. పెద్ద జగన్నాథ స్వామి ఆలయం నుండి బలభద్ర సుభద్ర సుదర్శన సమేత జగన్నాథ స్వామి జనం మధ్యకి వచ్చారు. రథంపై ఊరేగుతూ ఇంద్ర జిమ్మం (గుండిచ మందిరం) వరకు రథయాత్ర సాగింది. ఎమ్మెల్సీ నర్తు రామారావు చామంతి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. రథం వీధి పంజా వీధి, బజార్ రోడ్డు మెయిన్ రోడ్డు మీదుగా దాసన్న పేట వరకు యాత్ర కొనసాగింది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో వేషధారణలతో అలరించాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంతబొమ్మాళి పంచాయతీకి ఐఎస్‌ఓ ధృవపత్రం

సంతబొమ్మాళి, జూలై 16, ప్రభాతవార్త :

మండల కేంద్రం సంతబొమ్మాళి గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ విజయవాడలోని తాడేపల్లిలో పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ చేతుల మీదుగా ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. రాష్ట్రంలో 23 పంచాయతీలకు ఐఎస్ఓ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ సిబ్బందిని అభినందించారు. మెరుగైన రికార్డు నిర్వహణ, పంచాయతీ పాలనలో పారదర్శకత, త్వరితగతిన ధ్రువపత్రాల జారీ, వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్యం తదితర సేవలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు సంతబొమ్మాళి పంచాయతీ ఐఎస్ఓ సర్టిఫికెట్‌కు ఎంపిక కాబడిందని కార్యదర్శి శ్రీనివాస్ తెలియజేశారు. కేరళ తరహాలో రాష్ట్రంలోని పంచాయతీరాజ్ శాఖను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఈ ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను పంచాయతీలకు ప్రభుత్వం బహుకరిస్తుందని తెలిపారు. ఐ ఎస్ ఓ సర్టిఫికేట్ అందుకున్న పంచాయతీ కార్యదర్శి దుంపల శ్రీనివాస్‌ను మండల సిబ్బంది, తోటి కార్యదర్శులు అభినందనలు తెలియజేశారు.

కృత్రిమ మేధ పరిశోధనలు సమాజ అవసరాలకు దోహదపడాలి

టెక్కలి, జూలై 16, ప్రభాతవార్త :

కృత్రిమ మేధ (ఏఐ) పరిశోధనలు సమాజ అవసరాలకు అనుగుణంగా సాగాలని భారత సాంకేతిక విద్యాసంస్థ (ఐఐటీ) హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డా. శిర్షేందు దాస్ అన్నారు. టెక్కలి సమీపంలోని ఐతం ఇంజినీరింగ్ కళాశాల రజతోత్సవ వేడుకల సందర్భంగా గణనాత్మక మేధ-జనన కృత్రిమ మేధలో గణిత నమూనాల రూపకల్పనపై రెండో అంతర్జాతీయ కార్యశాల (సిగాయ్-2026) గురువారం ప్రారంభమైంది. ఈ కార్యశాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న డా. శిర్షేందు దాస్ మాట్లాడుతూ కృత్రిమ మేధ, యంత్ర అభ్యాసం, గణిత నమూనాల రూపకల్పన రంగాల్లో జరుగుతున్న పరిశోధనలు భవిష్యత్ సాంకేతికాభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. సమాజ సమస్యలకు ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాలపై పరిశోధకులు దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా కార్యశాల స్మారక గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్. శ్రీనివాసరావు, పరిశోధన-అభివృద్ధి విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ దేబనాథ్ భట్టాచార్య పాల్గొన్నారు. కన్వీనర్‌గా డా. డి.శ్రీరాములు, సహ కన్వీనర్లుగా డా.నరేష్ తంగుడు, డా. ఎ.లక్ష్మణరావు, డా. నారాయణరావు వ్యవహరించారు.

ఎరువుల పంపిణీలో విఫలమైన సిబ్బంది

సరుబుజ్జిలి, జూలై 16, ప్రభాతవార్త:

మండల కేంద్రంలో గల బహుళ ప్రయోజన సౌకర్య గోదాంలో గత రెండు రోజుల నుండి ఎరువుల పంపిణీ కో-ఆపరేటివ్ బ్యాంక్ (సొసైటీ) సిబ్బందితో సక్రమంగా జరగకపోవడంతో గురువారం రెవెన్యూ సిబ్బంది, సచివాలయ, మరియు కో-ఆపరేటివ్ బ్యాంక్ (సొసైటీ)సిబ్బంది పోలీసు సిబ్బంది సహకారంతో ఎరువుల, పంపిణీ చేపట్టారు. సిబ్బంది తమ పరిచయ వ్యక్తులకు ఎలాంటి ఆధారాలు లేకుండా ఎరువులను అందజేయడంతో రైతులు ఆగ్రహంతో అధికారుల పైకి విరుచుకుపడడంతో ఎరువుల పంపిణీ విఫలమైంది. గురువారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో సరుబుజ్జిలి సచివాలయ సిబ్బంది మరియు పోలీసు సిబ్బందితో ఆధార్ లింక్ ఓటీపీలు ద్వారా ఎరువుల పంపిణీ జరిపారు. ఈ పంపిణీలో సిబ్బంది అందదండలతో కొందరు దొరికితే దొరికినంత సంబంధిత అధికారుల చొరవతో అక్రమార్గంలో తీసుకుపోయిన వాస్తవాలే వెలువడుతున్నాయి. దీంతో మూడు రోజుల నుండి ఎరువుల గూర్చి నిరీక్షిస్తున్న రైతులు అధికారులపై తిరగబడడంతో ఎరువుల పంపిణీ విఫలమైంది. మూడు రోజుల నుండి పడిగాపులు కాస్తున్న రైతులకు ఎరువులు అందకపోవడంతో అధికారులపై నానా దుర్భాషలాడి ఎరువుల పంపిణీకి భంగం చేశారు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి ప్రతి రైతుకు తగినంత ఎరువు అందించేలా చర్యలు చేపట్టకపోతే ప్రభుత్వమే బాధ్యత వహించాలని పలువురు రైతులు తెలిపారు.

మూఢనమ్మకాలను నమ్మొద్దు : ఎస్సై షణ్ముఖరావు

వీరఘట్టం, జూలై 16, ప్రభాతవార్త :

చేతబడులు, మూఢనమ్మకాలను ప్రజలు నమ్మొద్దని ఎస్సై జి.షణ్ముఖరావు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని గిరిజన గ్రామమైన బట్టిగూడ గ్రామంలో గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులతో సమావేశాన్ని నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. ఎలాంటి వదంతులను ప్రచారం చేయవద్దని ఆధునిక యుగంలో కూడా మూఢనమ్మకాలను విస్మరించాలని ఆయన అవగాహన కల్పించారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు, మాదకద్రవ్యాల నివారణ, హెల్మెట్ వినియోగం దానివల్ల కలిగే ఫలితాలు గ్రామంలో శాంతి భద్రతలు, సామాజిక సామరస్యాన్ని కాపాడే అంశాలపై కూడా అవగాహన కల్పించారు.

వీరఘట్టంలో ఘనంగా మొదటి రథయాత్ర



వీరఘట్టం, జూలై 16, ప్రభాతవార్త :

మండల కేంద్రంలోని మొదటి రథయాత్ర గురువారం అత్యంత వైభవంగా జరిగింది. బలభద్ర సుభద్ర జగన్నాథ స్వామి దేవతమూర్తులను రథంపై ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జగన్నాథ స్వామి దేవాలయం నుండి రథంపై దేవతామూర్తులను మెయిన్ రోడ్డు మీదుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న గుడించ మందిరంనకు తీసుకువచ్చి అక్కడ తొమ్మిది రోజులు పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం మరలా జగన్నాథ స్వామి ఆలయంకు తీసుకురావడంతో మారు రథయాత్ర పూర్తయి అక్కడినుండి జగన్నాథ స్వామి ఆలయంలో దేవతామూర్తులు కొలువుదీరి ప్రత్యేక పూజలు అందుకుంటారు. ఆలయ ప్రధాన అర్చకులు లింగరాజు రథో ఆధ్వర్యంలో జరిగిన ఈ రథయాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై జి.షణ్ముఖరావు గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. అలాగే ఇందుకు రెవెన్యూ, విద్యుత్ శాఖలు సహకరించాయి.

ఎమ్మెల్యే శిరీషను మర్యాదపూర్వకంగా కలుసుకున్న టీడీపీ యాదవ సంఘం సభ్యులు

కోటబొమ్మాళి, జూలై 16, ప్రభాతవార్త:

పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీషను తన క్యాంపు కార్యాలయంలో టెక్కలి నియోజకవర్గంకు చెందిన పలువురు యాదవ సంఘం సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆమె వీరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ద్విచక్ర వాహన ప్రమాదంలో ఇటీవల మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వీరిలో ఈగల పాపారావు, గంగులు మాన్యాల మల్లేశ్వర రావు, తదితరులు ఉన్నారు.

ఘనంగా జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవం

కంచిలి, జూలై 16, ప్రభాతవార్త

మండలంలోని కంచిలి, కొల్లూరు గ్రామాలలో శ్రీ జగన్నాథ స్వామి వారి రథాయాత్ర ఒడిస్సాలోని పూరీ క్షేత్రం తరహాలోనే గురువారం సాయంత్రం అత్యంత వైభవంగా జనసందోహం మధ్య సాగింది. గురువారం ఉదయం నుంచి ఆలయ ప్రధాన అర్చకులు, జానకిరామ్ దాస్ మహంతి, పద్మనాభ పాడి మరియు వేద పండితులు స్వామివారికి నిత్య ఆరాధనలు జరిపారు. అనంతరం స్వామివారిని నూతన వస్త్రాలను అలంకరించారు. భోగమండపం నుండి ముఖ మండపానికి తీసుకొచ్చి రక్షా బంధన్, అలంకారాలు చేసి, రథయాత్రకు సిద్ధం చేశారు. మధ్యాహం విశ్వక్షేణపూజ, పుణ్యాహ వాచనం, రథసంప్రోక్షణ, హారతి, హోమం అనంతరము, మేళతాళాలు, కీర్తన, భజన బృందం భజనలతో భక్తల జయజయ ధ్వనాల మధ్య రథయాత్ర కార్యములు సాగింది. కొల్లూరులోశ్రీ జగన్నాథ స్వామివారిని ఈ ఏడాది క్రొత్తగా పునర్నిర్మించిన రథంపైకి ప్రధాన అర్చకులు పద్మనాభ పాడి ఆవాహన చేయగా మిగిలిన ఋత్విక్కులు స్వామి వారిని రథంపైకి చేర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ రథయాత్రను ఆలయ మేనేజర్ బెండి రామారావు మరియు కొల్లూరు గ్రామ పెద్దలు, యువకులు పర్యవేక్షణలో జరిగింది. ఈ రథయాత్రలో కొల్లూరు గ్రామ ప్రజలు కాకుండా సమీప ప్రాంతాల్లో గ్రామాల్లోని ప్రజలు, మహిళలు , యువకులు పెద్దఎత్తున పాల్గొని , మొక్కులు తీర్చుకొని, రథయాత్రలో పాల్గొన్నారు.

శ్రీకాకుళం వార్త

షైనింగ్ స్టార్ అవార్డుకి ఐదుగురు విద్యార్థుల ఎంపిక

సంతబొమ్మాళి, జూలై 16, ప్రభాతవార్త :

ప్రభుత్వం 10వ తరగతి విద్యార్థులకు గురువా రం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డుకు మం డలం నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యా రు. దండు గోపాలపురం ఉన్నత పాఠశాల చెందిన నిహారిక నాయకో, మర్రిపాడు పాఠశాలకు చెందిన త్రిపురాన వంశీ గణేష్, ఎం జె పి పాఠశాల చెందిన శివ హరీష్, తమ్మినేని సాయికుమార్, సంత బొమ్మాళి పాఠశాల చెందిన కొత్తపల్లి సంధ్య ఈ అవార్డులకు ఎంపికయ్యారు. వీరందరికీ శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో జిల్లా అధికారులు చేతుల మీదుగా జ్ఞాపిక, నగదు పురస్కారం అందజేస్తారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈఓ చిన్నవాడు, అర్జునుడు, ఆయా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా జగన్నాథస్వామి రథయాత్ర

కోటబొమ్మాళి, జూలై 16, ప్రభాతవార్త:

మండలంలోని పెద్ద హరిశ్చంద్రపురం గ్రామంలో గురువారం ఘనంగా జగన్నాధస్వామి రథయాత్ర ఆ గ్రామ ప్రజలు నిర్వహించారు. అత్యంత వైభవంగా జన సందోహం మధ్య రథాయాత్ర కొనసాగింది. సాక్షాత్తు జగన్నాథుడే జనం మధ్య నడిచి వస్తున్నట్లు భక్తులకు అనిపించింది. ఉదయం నుంచే అక్కడి అర్చకులు పూజలు నిర్వహించి, సాయంకాలం యాత్రను ప్రారంభించారు. వందలాదిమంది భక్తులు స్వామివారిని కన్నులారా తిలకించారు.

శాఖాంబరి రూపంలో కొత్తమ్మతల్లి

కోటబొమ్మాళి, జూలై 16 ప్రభాతవార్త :

శాఖాంబరి అమ్మవారి రూపంలో స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి గురువారం భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారిని భక్తులు సమర్పించిన పలు రకాల కూరగాయలతో కొత్తమ్మతల్లిని శాఖాంబరి రూపంలో ఆలయ పూజారి కమ్మకట్టు రాజేష్ అలంకరించారు. అషాడమాసంలో శాఖాంబరి అమ్మవారు వెలిచారని ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకున్నవారికి సుఖశాంతులతో పాటు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలుగుతాయని ఈ ప్రాంత భక్తులు విశ్వసిస్తారు. ఈ రూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకొనందుకు భక్తులు ఆలయానికి క్యూ కట్టారు. అమ్మవారిని దర్శిణానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అలయ ఈవో వాకచర్ల రాధాక్రిష్ణ అన్ని ఏర్పాటు చేశారు. అలాగే భక్తులకు అన్నదాన ప్రసాదం అందజేశారు.

ఎరువులు పంపిణీ

సంతకవిటి, జూలై 16, ప్రభాతవార్త :

మాజీ మంత్రి, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు సూచన మేరకు గురువారం సంతకవిటి మండలం కాకరాపల్లి గ్రామ సచివాలయంలో టీడీపీ నాయకులు మరియు సచివాలయం సిబ్బందితో కలిసి మండల తెలుగు యువత అధ్యక్షులు వావిలపల్లి శ్రీనివాస్ ఎరువులు పంపిణీ చేశారు.

పలాసలో ఘనంగా జగన్నాథ రథయాత్ర

పలాస, జూలై 16 ప్రభాతవార్త :



పలాస పట్టణంలో శ్రీ జగన్నాథ స్వామివారి రథయాత్ర గురువారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి అనంతరం శ్రీ జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్ర అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ప్రతిష్ఠించారు. వేద మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాలు, భజన బృందాల కీర్తనల మధ్య రథాన్ని భక్తులు ఉత్సాహంగా లాగుతూ పట్టణ ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు “జై జగన్నాథ” నినాదాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. మహిళలు, యువత, చిన్నారులు పెద్ద ఎత్తున రథయాత్రలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు తాగునీరు, మజ్జిగ, ప్రసాదం పంపిణీ చేయగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. జగన్నాథ రథయాత్ర విజయవంతం కావడానికి ఆలయ కమిటీ సభ్యులు, సేవా సంస్థలు, స్వచ్ఛంద కార్యకర్తలు విశేషంగా కృషి చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు.

గుర్రపుడెక్కను తొలగించాలి

కోటబొమ్మాళి, జూలై 16 ప్రభాతవార్త :

కోటబొమ్మాళి పంచాయతీ పరిధిలోని కోటబొమ్మాళి-సంతబొమ్మాళి రహదారికి అనుకొని ఉన్న పెద్దచెరువులో ఉన్న గుర్రపుడెక్కను తొలగించాలని పంచాయతీ పరిధిలోని చిన్నపొందరవీధి, పెద్ద పొందర వీధి, రెడ్డికవీధి, కరణాలవీధి, మెయిన్ రోడ్డులో నివాసముంటున్న ప్రజలు కోరుతున్నారు. సుమారు 800కుటుంబాల స్నానాలకు, ఇతర అవసరాలకు ఎంతో సౌకర్యంగా ఉన్న ఈ పెద్దచెరువు మొత్తం గుర్రపుడెక్కతో నిండిపోయింది. దీంతో స్నానాలు చేయలేకపోతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. వంశధార కాలువ నీరు ఈ చెరువుకురావడంతో చెర వు మధ్యలో ఉన్న గుర్రపుడెక్క అంత స్నానాలు చేసే రేవులకు వచ్చి ఉందన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చెరువులో ఉన్న గుర్రపుడెక్కను తొలగించాలని ప్రజలు కోర కుంటున్నారు.

కదిలిన జగన్నాథుని రథ చక్రాలు

సంతబొమ్మాళి, జూలై 16, ప్రభాతవార్త:

శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర సందర్భంగా సంతబొమ్మాళి, కోటపాడు, కొత్తూరు, వడ్డితాండ్ర గ్రామాల్లో ఆ జగన్నాధుని రథయా త్ర గురువారం ఘనంగా జరిగింది. జగన్నాథ స్వామిని రథంపై సుందరంగా అలంకరించి పుర వీధుల్లో ఊరిగింపు నిర్వహించారు. ఈ రథయాత్రలో స్వామి వెంట చిన్న పెద్ద తారతమ్యం లేకుండా భక్తులు అందరూ పాల్గొన్నారు. మత్స్యకార సామజిక వర్గంకు చెందిన (కంద్ర కులస్తులు)వారు ఏటా ఈ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్దలతో వైభంగా నిర్వహిస్తుంటారు. శ్రీ జగన్నాధుడు కొలువైన రథం ఆలయం వద్ద బయలు దేరి భజనలు మంగళవాయిద్యాలతో పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించి మళ్లీ ఆలయం చెంతకు చేరింది.

బి.ఎల్.ఏలకు సమావేశానికి పిలిచి అవమానించిన రెవెన్యూ అధికారులు

కంచిలి, జూలై 16 ప్రభాతవార్త :

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బిఎలఎ, బిఎల్ఓలకు సర్‌పై సమావేశం ఏర్పా టు చేశారు. సమావేశానికి మండలంలో గల అన్ని పార్టీలకు చెందిన బిఎలఎ బిఎలఓలకు రావాలని పిలుపు నిచ్చారు. అయితే మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి కేవలం కూటమి నాయకులు, మరి కొంతమందికి మాత్రమే కూర్చోవడానికి సీట్లు ఏర్పాటు చేశారు. కొద్ది సమయం తర్వాత ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి వైఎసఆర్ పార్టీకి చెందిన 67 మంది బిఎల్వోలు సమావేశంనకు వచ్చినప్పటికీ అప్పటికే కూటమి బిఎలఏలతో సమావేశం ప్రారంభించిన ఈఆరఓ తహసిల్దార్ రమేష్ కుమార్ వైసీపీ బీఎలఎ లు వచ్చినప్పటికీ ఏమాత్రం పట్టించుకోకుండా చూసి చూడనట్లు వ్యవహరించారని, ఈ విషయంపై ఈఆర్వోను ఎంపీపీ దేవదాస్ ప్రశ్నించడంతో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఈఆర్వో ఒక పార్టీకి చెందిన బిఎలఎలకు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నట్లు ఎంపీపీ ప్రెస్‌నోట్ ద్వారా పత్రికా ప్రతినిధులకు తెలియజేశారు. కనీసం ఎంపీపీ అన్న గౌరవం కూడా ఇవ్వలేదని ఎంపీపీ పేర్కొన్నారు. ఈఆర్వో తీరుపై ఎంపీపీ ఆగ్రహిస్తూ కేవలం ఒక పార్టీకే మాత్రం తహసిల్దార్ రాచమర్యాదలు చేస్తున్నారని వైసీపీ నాయకులు వస్తే కనీసం పట్టించు కోలేదని తమ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి తమకే అవమానం చేశారని ప్రోటోకాల్‌కు విరుద్ధం గా తనకు పిలవకుండా అధికార పార్టీ నాయకులకు పిలిచి సమావేశంలో కూర్చోబెట్టారని ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలియజేశారు. కంచిలి మండల బి ఎల్ ఏలు పాల్గొన్నారు.

17 -7 Pg9th cheli.qxd:17 -7 Pg9th cheli.qxd 1/1/02 6:35 AM Page 1

కాఫీ వ్యర్థాలతో ఎంతో ఉపయోగం

కాఫీ కేవలం మనకు శక్తి ఇవ్వడానికే కాదు మరెన్నో రకాలుగానూ దీని వ్యర్థాలు ఉపయోగపడతాయి. అదెలాగంటారా?

సహజ ఎరువు.. కాఫీ పొడిలో నైట్రోజన్, పొటాషియం, మెగ్నీషి యం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అన్ని మొక్కల మొదట్లో వేస్తే ఏపుగా పెరుగుతాయి. ముఖ్యంగా గులాబీ, టొమాటో వంటి మొక్కలకు ఇది ఎంతో మేలు చేస్తుంది.

దుర్వాసనకు చెక్.. ఫ్రిజ్‌లో రకరకాల ఆహార పదార్థాలు పెట్టడం వల్ల కొన్ని సార్లు ఒక రకమైన వాసన వస్తుంది. దీన్ని పోగట్టడానికి ఒక చిన్న గిన్నెలో కాఫీ పొడిని వేసి ఫ్రిజ్‌లో ఓ మూల ఉంచితే సరి. కాఫీ పొడిలో ఉండే గుణాలు ఫ్రిజ్‌లోని చెడు వాసనలను పీల్చేసుకుం టుంది. సింక్ కింద లేదా షూరక్‌ల్లో కూడా ఈ చిట్కా బాగా పనిచేస్తుంది. అలానే నాన్‌వెజ్ వండినప్పుడు లేదా ఉల్లిపాయలు, వెల్లుల్లి కోసినప్పుడు చేతులకు పట్టే వాసన అంత త్వరగా పోదు. అలాంటప్పుడు కూడా కొద్దిగా కాఫీ పొడిని చేతుల్లో వేసుకుని నీటితో బాగా రుద్ది కడుక్కుంటే సరి. ఆ వాసన మాయమై చేతులు తాజాగా మారతాయి.

కీటకాలు దూరం: ఇంట్లో చీమలు ఎక్కువగా తిరిగే చోట లేదా కిటికీల దగ్గర కొద్దిగా కాఫీ పొడి చల్లండి కాఫీలోఉండే కెఫీన్ వాసన చీమలకు, కొన్ని రకాల కీటకాలకు అస్సలు పడదు. దాంతో అవి ఆ ప్రాంతానికి రాకుండా దూరంగా వెళ్లిపోతాయి.

మొండి మరకలు మాయం.. వంట పాత్రలకు పట్టిన మొండి జిడ్డు, మాడుని వదిలించడం పెద్ద పని. కాఫీ పొడి కొంచెం గరుకుగా ఉండటం వల్ల ఇది ఒక మంచి స్క్రబర్‌గా పనిచేస్తుంది. పాత్రలపై కొద్దిగా కాఫీ పొడి రుద్దితే, రసాయనాలు వాడకుండానే జిడ్డు సులభంగా వదిలిపోతుంది. ◻

కురులు దృఢంగా..

సీజన్ మారిందంటే ప్రభావం పడేది కురుల పైనే! రాలిపోతుంటాయి. అయితే కొన్ని ఆహార పదార్థాలు ఈ విషయంలో మనకి సాయపడతాయని తెలుసా? వాటిని చేర్చుకోండి.. సమస్య తీవ్రం కాకుండా కాపాడతాయి.. పసుపులోని కర్‌క్యుమిన్ ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గిస్తుంది. కుదుళ్లు బలంగా ఉండేలా చేస్తుంది. కురులు ఆరోగ్యంగా ఉండాలని కొబ్బరి నూనె రాస్తుంటాం కదా!

డైట్‌లోనూ చోటివ్వండి. దీనిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు, లారిక్ యాసిడ్ కురులు దృఢంగా చేస్తాయి. అవిసెలు తిన్నా, నానబెట్టి కురులకు పెట్టినా మంచిదే! రోజూ మాత్రం ఓ స్నూను తప్పక తినండి. వీటిలోని ఒమెగా ఫ్యాటీ యాసిడ్లు మాడుకి మేలు చేస్తాయి. ఒత్తిడి కారణంగా ఊడే జుట్టుకీ అడ్డుకట్ట వేయగలవు. కూరలు, పులుసుల్లోని ఉల్లిపాయలను పక్కన పెట్టేస్తారా? చేయకండి. ఇవీ కురులకు మేలు చేసేవే. వీటిలో ఉండే ఒక రకమైన యాంటీ ఆక్సిడెంట్ కుదుళ్లను బలంగా చేసి, కురులు వేగంగా పెరిగేలా చూస్తుంది. టీ, కాఫీకు బదులు గ్రీన్‌టీకి మారండి. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు కురుల ఆరోగ్యానికి సాయపడేవే. స్నాక్స్‌లా గింజలను తినండి. ముఖ్యంగా గుమ్మడి గింజలకు తప్పక చోటివ్వండి. వీటిలో జింక్, ఐరన్, మెగ్నీషియం, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవన్నీ కురులను దృఢంగా చేసి, ఊడకుండా సాయపడతాయని. ఆకుకూరల్లో ఐరన్ ఫొలేట్, విటమిన్లు మెండుగా ఉంటాయి. వీటినీ వారంలో రెండు మూడు సార్లయినా తప్పక తీసుకోండి. ◻

నలభైలో బరువు తగ్గాలంటే..

అధికబరువు. ఏ వయసు వారైన సరే. చాలామంది అంగీకరించలేని విషయమిది! అయితే ఎంత వద్దనుకున్నా.. 40 దాటాక చాలామంది మహిళలు క్రమంగా బరువు పెరుగుతారు. ఇందుకు మన శరీరంలో జరిగే మార్పులతో పాటు జీవనశైలి విషయంలో నిర్లక్ష్యంగా ఎలా కారణమని చెబుతున్నారు. మరి, ఈ సమస్యను అధిగమించి ఈ వయసులో ఫిట్ ఉండడం సాధ్యపడదా అంటే.. అదీ మన చేతుల్లోనే ఉంది. ఇందుకోసం కొన్ని నియమాలుపాటించాల్సి ఉంటుంది. ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలంటే బరువు అదుపులో ఉండాలి. అయితే వయసు పెరుగుతున్నకొద్దీ శక్తి క్షీణించడం వల్ల ఏ పని పైనా దృష్టి పెట్టలేం. వ్యాయామమూ చేయలేం. మరోవైపు జీవ క్రియల పనితీరు నెమ్మది స్తుంది. ఇది క్రమంగా తీపి తినాలన్న కోరికను పెంచుతుంది. ఇలా అటు శరీరానికి శ్రమలేక, ఇటు అనారోగ్యపూరిత ఆహారానికి అలవాటు పడడం వల్ల క్రమంగా బరువు పెరుగుతాం. జీవక్రియల పనితీరు నెమ్మదించడం వల్ల శరీరంలోకి చేరిన కొవ్వులు, క్యాలరీలు కరగడానికి చాలా సమయం పడుతుంది. ఇది క్రమంగా అధిక బరువుకు దారితీస్తుంది. 40 దాటిన చాలామంది బరువు పెరగడానికి మెనోపాజ్ కూడా ఓ కారణం. ఈ వయసులో మెనోపాజ్‌కు చేరువవ్వడం, లేదంటే అప్పటికే ఈ దశలోకి ప్రవేశించడం వల్ల ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్, టెస్టోస్టిరాన్.. వంటి హార్మోన్ల స్థాయుల్లో మార్పులు చోటుచేసు కుంటాయి. ఈ హార్మోన్ల అసమతుల్యత అధిక బరువుకు దారితీస్తుంది. వయసు పెరిగే కొద్దీ ఎముక, కండరాల సామర్థ్యం తగ్గడం వల్ల వ్యాయామం చేయడానికి శరీరం సహకరించదు. ఒకవేళ బలవంతంగా చేసినా గాయాలయ్యే ప్రమాదం ఉంటుంది కాబట్టి ఇలా శారీరక శ్రమ లేకపోవడం వల్ల కూడా శారీరక బరువు పెరుగుతాం. మెనోపాజ్‌కు చేరువయ్యే కొద్దీ వేడి ఆవిర్లు, ఆర్ధరాత్రి ఉన్నట్లుండి చెమట లు పట్టడం. వంటి సమస్యలొస్తాయి. తద్వారా రాత్రుళ్లు సుఖ నిద్రకు దూరమవుతారు. దీనివల్ల ఒత్తిడి, ఆందోళనలు పెరిగిపోవడం.. జీవనశైలి అదుపు తప్పడం. ఆఖరికి ఇవి అధిక బరువుకు కారణమవుతాయి.

ఫిట్‌గా ఉండవచ్చు!..... బాదం పప్పులు, వాల్‌నట్స్, గుమ్మడి గింజలు, పొద్దుతిరుగుడు గింజలు వంటి నట్స్‌ని సాయంత్రం స్నాక్‌గా తరచూ తీసుకోవడం మంచిది. తద్వారా ఎక్కువ సమయం కడుపు నిండుగా ఉండి, ఆకలేయకుండా, ఇతర పదార్థాల పైకి మనసు మళ్లకుండా జాగ్రత్తపడచ్చు. తీసుకునే ఆహారంలో ప్రొటీన్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఈ క్రమంలో పాలు- పాలపదార్థాలు, మాంసం, గుడ్లు, వంటివి ముఖ్యమైనవి. ఫైబర్ అధికంగా ఉండే కాయగూరలు, పండ్లు ఎక్కువగా తీసుకుంటూ.. ప్రాసెస్డ్, నూనె సంబంధిత పదార్థాలను పూర్తి పక్కన పెట్టాలి. శరీర బరువును అదుపులో ఉంచుకోవాలంటే వ్యాయామం కీలకం. కాబట్టి వయసు పెరుగుతున్నా వర్కవుట్ చేయడం మానకూడదు. ఈ క్రమంలో స్కాట్స్, లాంజెస్, పుషప్స్, కెటిల్‌బెల్‌తో ఎక్సర్‌సైజ్.. వంటివి రోజూ సాధన చేయాలి ఒకవేళ ఒంటరిగా చేయడం ఇబ్బంది అనుకుంటే జిమ్‌లో చేరచ్చు. సుఖ నిద్ర వల్ల ఒత్తిడి, ఆందోళనలు తగ్గడంతో పాటు హార్మోన్ల సమతుల్యత పెరుగుతుంది. తద్వారా బరువు పెరగకుండా జాగ్రత్తపడచ్చు. కాబట్టి రోజూ రాత్రుళ్లు 7-8 గంటలపాటు నిద్ర పోవడం మంచిది. విటమిన్ల లోపాలు కూడా శారీరక సత్తువను కోల్పోయేలా చేస్తాయి. కాబట్టి పోషకాహారం తీసుకోవడంతో పాటు అత్యవసరమైతే నిపుణుల సలహా మేరకు ఆయా విటమిన్ సప్లిమెంట్స్ వాడడం వల్ల ఫలితం ఉంటుంది. ◻

దశ మహా విద్యాలలో మొదటిరూపం కాళిక అయితే రెండవ రూపం తార. తార అంటే నక్షత్రం అనే అర్థం వుంది .. అలాగే 'దాటించేది' అనే అర్థం కూడా వుంది. కష్టాల నుంచి .. ఆపదల నుంచి .. సంసార సాగరం నుంచి ఆ తల్లి తన

ॐ తారాదేవి

భక్తులను దాటిస్తుందనీ, అందుకే తార పేరుతో పూజలు అందుకుంటోందని ఆధ్యాత్మిక గ్రంధాలు చెబుతున్నాయి. తారాదేవిని ఆరాధించడమనేది ప్రాచీనకాలం నుంచి వుంది. వశిష్ఠ మహర్షి .. వ్యాస మహర్షి .. దూర్వాసుడు .. భరద్వాజుడు తారాదేవిని ఉపాసించినట్టుగా ఆధ్యాత్మిక గ్రంధాల్లో కనిపిస్తోంది. వశిష్ఠ మహర్షి ఆ తల్లిని ఉపాసించిన ప్పుడు అమ్మవారు పరమ శివుడిని పసిబాలుడిగా ఎత్తుకుని పాలిస్తున్నట్టుగా ప్రత్యక్ష మైందట. అందుకు కారణమే మిటని వశిష్ఠ మహర్షి అడగ్గా .. క్షీ ర సాగర మథనం లో వెలువడిన హాలాహలాన్ని పరమశివుడు తాగగా, ఆయన గొంతు పుండులా తయారైందనీ .. ఆ బాధని తగ్గించ డానికి తాను పాలిస్తున్నానని అమ్మవారు సెలవిచ్చిందట. ఆ తల్లి వాత్స ల్యాన్ని చూసిన వశిష్ఠ మహర్షి ఆనంద బాష్పాలు వర్షిస్తుండగా రెండు చేతులూ జోడించాడట.

నాణ్యతను తేల్చేస్తుంది !

వర్షాకాలంలో.. ఆకుకూరలు, కాయగూరలు, చేపలు, మాంసాహారంపై బ్యాక్టీరియా

ఎక్కువగా వృద్ధి చెందుతూ ఉంటుంది. అందుకే ఫ్రిజ్‌లోంచి తీసిన వెంటనే లేదా బజారు నుంచి తెచ్చిన వెంటనే వండేయడానికి సిద్ధపడిపోకుండా కాస్త వాటి నాణ్యతను ఆరాతీయండి. అదెలా అంటారా? ఇందుకోసం డిజిటల్ ఫుడ్ టెస్టర్లు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. మాంసం, పండ్లు, కాయగూరలని ఈ టెస్టర్‌తో గుచ్చి చూస్తే చాలు. ఇందులో మెతాడుకు మించి క్రిమి సంహారాల వాడకం ఉంటే ఆ విషయాన్ని తెరపై చూపిస్తుంది. అలాగే నీళ్ల పరి శుభ్రతనూ చిటికెలో చెప్పేస్తుంది. ఇవేకాదు బ్యాక్టీరియా వంటివి ఉంటే వాటినీ పసికట్టేస్తుంది.

జీన్స్ మన్నాలంటే !

ఈ రోజుల్లో చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా మహిళల క్యాజువల్ వేర్‌గా జీన్స్ మారిపోయింది. అయితే, వీటినీ సరిగా ఉంచుకోకపోతే అవి ఎక్కువకాలం నాణ్యంగా, మన్నికగా ఉండవు. ఈ పరిస్థితి తలెత్తకుండా జాగ్రత్తలిలా తీసుకోవాలి.

మొదటి సారి జీన్స్ నానబెట్టే సర్స్ నీళ్లలో కాస్త రాళ్ల ఉప్పు కూడా వేయండి. ఇలా చేస్తే రంగు పోకుండా ఉంటుంది. మురికీ, మరకలూ త్వరగా వదులుతాయి. కొత్తదనమూ పోదు. ముదురు రంగు జీన్స్‌లు మెరుపు తగ్గుతున్నాయా? అయితే వాటిని ఉతికిన తరవాత చివరిలో అరబకెట్ నీటిలో కప్పు బేకింగ్ సోడా కలిపి ముంచితీసి ఆరేయండి చాలు. మరకలు పడితే రెండు చెంచాల వంటసోడాలో కాస్త వినెగర్ కలిపి పేస్టులా చేసి మరక మీద రాయాలి. పావుగంటయ్యాక బ్రష్‌తో రుద్దితే త్వరగా వదిలిపోతుంది. జీన్స్ కాస్త మందంగా ఉంటుంది కదా అని.. వేణ్నీళ్లలో నానబెట్టడం, బండకేసి బాదడం చేయొద్దు. దీనివల్ల దాని ఫైనింగ్‌తో పాటు మన్నికా తగ్గుతుంది. వీలైనంతవరకూ వీటిని చన్నీళ్లతోనే ఉతకాలి. అలానే జీన్స్‌ని వేసుకున్న ప్రతిసారీ ఉతికేయొద్దు. గాలికి ఆరనిచ్చి రెండు మూడుసార్లు వేసుకుంటే మంచిది.

'సవా' మెదటి సాంగ్ లాంచ్

తాజాగా చిత్ర బృందం మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ప్రారం భిస్తూ తొలి పాట 'కాలాన్నే తిరగేసి'ను విడుదల చేసింది. ఈ పాటని 'ఎమోషన్ ఆఫ్ సావ'గా పరిచయం చేశారు. సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర మరోసారి తన మెలోడీ మ్యాజిక్‌ను చూపించారు. నెమ్మదిగా మొదలై క్రమంగా భావోద్వేగాలను పెంచుకుంటూ సాగే ఈ గీతం అద్భుత మైన ఆర్కెస్ట్రేషన్‌తో అందరినీ కదిలిస్తుంది. తన జీవితంలోని ప్రేమను కోల్పోయిన కథానాయకుడు, మళ్లీ ఆమెను కలుసుకోవాలని కలలు కంటూ అనుభవించే ఆవేదన, ఆశలను ఈ పాట అద్భుతంగా ప్రతిబింబిస్తుంది.'మళ్లీ రావా' అనే పల్లవి అతని మనసులోని తపనను హృదయానికి హత్తుకునేలా చేతుంది. పూర్ణాచారి రాసిన సాహిత్యం భావోద్వేగాలకు కవిత్వ రూపం ఇవ్వగా, అనురాగ్ కులకర్ణి తన మధురమైన వోకల్స్‌తో పాటను మరో స్థాయికి తీసుకెళ్లారు.ప్రేమని కోల్పోయిన యువకుడి పాత్రలో శివ కుమార్ కాసారం ఎంతో సహజంగా నటించారు. శ్వేత లక్ష్మ ణ్ కూడా తన పాత్రలో భావోద్వేగాలను అద్భుతంగా పలికిస్తూ ఆకట్టుకున్నారు. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ ఈ పాటలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

'ది ఒడిస్సీ' 17న ప్రపంచవ్యాప్తంగా విడుదల

క్రిస్టోఫర్ నోలన్ రూపొందించిన 'ది ఒడిస్సీ' IMAX ఫిల్మ్ టెక్నాలజీతో విడుదలకాబోతోందిక్రిస్టోఫర్ నోలన్ యొక్క 'ది ఒడిస్సీ' సరికొత్త IMAX ఫిల్మ్ టెక్నాలజీని ఉపయోగించి ప్రపంచవ్యాప్తంగా చిత్రీకరించబడిన ఒక పౌరాణిక యాక్షన్ ఇతిహాసం. ఇది హోమర్ యొక్క గ్రీకు ఇతిహాసం, ఒడిస్సీ కి అనుసరణ. పూర్తిగా IMAX ఫిల్మ్ కెమెరాలతో చిత్రీ కరించబడిన మొట్టమొదటి ఫీచర్ చిత్రంగా ఇది ప్రపంచ వ్యాప్తంగా తెరపైకి వస్తోంది. నోలన్ యొక్క బది డార్క్ నైట్ ట్రయాలజీ, 'ఇన్సెప్షన్', 'ఇంటర్‌స్టెల్లార్', 'డంకిర్క్', 'ఒపెన్‌హైమర్' మొదలైన చిత్రాల తర్వాత, 6 దేశాలలో చిత్రీకరించబడిన ఈ చిత్రం, ఈ కాలంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా! ఇది నోలన్ యొక్క 13వ ఫీచర్ చిత్రం, ఇది ఒక లీనమయ్యే విస్తృతమైన సినిమాటిక్ అనుభవాన్ని అందిస్తుంది!కథా సారాంశం గ్రీకులోని ఒక రాతి ద్వీపానికి రాజు అయిన ఇథాకాకు చెందిన ఒడిస్సియస్, తన ప్రసిద్ధ వ్యూహం, ట్రోజన్ హార్స్‌తో అగమెమ్నన్ కోసం యుద్ధాన్ని గెలుస్తాడు; 'ది ఒడిస్సీ' చిత్రంలో అకాడమీ అవార్డు విజేత మాట్ డామన్ ఇథాకా రాజు ఒడిస్సియస్‌గా; తోటినీగితి విజేత టామ్ హాలండ్ ఒడిస్సియస్ కుమారుడు టెలిమాకస్‌గా నటించారు; అకాడమీ అవార్డు విజేత ఆన్ హాత్వే ఇథాకా రాణి మరియు ఒడిస్సియస్ భార్య అయిన పెనెలోప్ పాత్రలో; రాబర్ట్ పాటిన్సన్

పెనెలోప్‌ను వివాహం చేసుకోవా లనుకునే ఇథాకా వాసి ఆంటినోస్ పాత్రలో; అకాడమీ అవార్డు విజేత లుపిటా న్యోంగో స్పార్టా రాణి 'హెలెన్ ఆఫ్ ట్రాయ్' ఆమె కవల సోదరి మైసీనే రాణి క్లైటెమ్నెస్ట్రా' అనే రెండు పాత్రలలో; రెండుసార్లు అకాడమీ అవార్డుకు నామినేట్ అయిన సమంతా మోర్టన్ శక్తివంతమైన మంత్రగత్తె సిర్సే పాత్రలో; ఎమ్మీ విజేత జూన్ లెగుయిజామో ఒడిస్సియస్ నమ్మకస్తుడైన సేవకుడు యుమేయస్ పాత్రలో; ఎమ్మీ గోల్డెన్ గ్లోబ్ విజేత జెండయా దేవత ఎథీనా పాత్రలో; అకాడమీ అవార్డు విజేత చార్లిజ్ థెరాన్ (అమరత్వమున్న అప్సర స కాలిప్సో పాత్రలో నటిస్తున్నారు. యూనివర్సల్ పిక్చర్స్ ఈ సినిమాను జులై 17, 2026న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనుంది.

తార

24న హారర్ మూవీ 'అమెన్' విడుదల

గుండె జబ్బులు ఉన్నవాళ్లు సినిమాకు రావద్దు సంచలన ప్రకటన చేసిన మూవీమేకర్ ఎస్కే బషీద్ తెలుగు సినీ పరిశ్రమలో తనదైన ముద్రతో ముందుకు సాగుతున్న దర్శకుడు, నిర్మాత ఎస్కే బషీద్ నుండి మరో విభిన్నమైన చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎస్‌బీకే ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై, రేగుల నీరజరాణి సమర్పణలో, ఆర్ఎన్ఆర్ డిస్ట్రిబ్యూషన్ అండ్ ప్రొడక్షన్ ఆధ్వర్యంలో రూపొందిన అత్యంత ప్రతిష్టాత్మక హారర్ సస్పెన్స్ థ్రిల్లర్ 'అమెన్' (AMEN) జూలై 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. అభిరుచిగల దర్శకుడు, నిర్మాతగా పేరు తెచ్చుకున్న ఎస్కే బషీద్ పలు భాషల్లో విజయవంతమైన చిత్రాలను అందించి తనకంటూ మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. అంచనాలకు అందని అనూహ్యమైన సబ్జెక్టులతో ప్రయోగాలు చేసే బషీద్.. ఇప్పుడు 'అమెన్' మూవీతో మరోసారి ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారారు.గుండె జబ్బులు ఉన్నవాళ్లు రావద్దు!" - బషీద్ వార్నింగ్ ఈ సినిమా గురించి ఎస్కే బషీద్ మాట్లాడుతూ, ఇప్పటివరకు వచ్చిన హారర్ సినిమాల ట్రెండ్‌ను పూర్తిగా మార్చేలా 'అమెన్' రూపొందించాం. సరికొత్త సస్పెన్స్, భయానక ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను థ్రిల్ చేయబోతున్నాం. కొత్త నటీనటులతో టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌తో సినిమా తెరకెక్కింది. ఈ సినిమా ఎంత భయపెడుతుందో చెప్పలేం... గుండె జబ్బులు ఉన్నవాళ్లు థియేటర్‌కు రావద్దు. ఒంటరిగా కూర్చుని చూసే ధైర్యం ఎవరికీ ఉండదు. పోస్టర్‌తోనే భారీ అంచనాలుఇటీవల విడుదలైన 'అమెన్' పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "హెచ్చరిక: మీ తల్లిదండ్రులను జాగ్రత్తగా ఇంట్లో ఉంచి సినిమాకు రండి.." అనే క్యాప్షన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రెట్టింపు చేస్తోంది. త్వరలో విడుదల కానున్న ట్రైలర్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి.

'ఫౌజీ' డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్

రెబెల్ స్టార్ ప్రభాస్ మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'ఫౌజీ'తో వెండితెరపై సందడి చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ భారీ పీరియడ్ యాక్షన్ చిత్రం 2026 డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్ల లోకి రానుందని చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. హను రాఘవపుడి దర్శ కత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో, టిసిరీస్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రాన్ని నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, భూషణ్ కుమార్ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే అద్భుతమైన టైటిల్ పోస్టర్‌తో అంచనాలు పెంచింది. రిలీజ్ డేట్ తో పాటు విడుదల చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ పోస్టర్‌లో ఖిఫౌజీఖి ప్రపంచాన్ని, సినిమా భారీ స్థాయిని అద్భుతంగా ఆవిష్కరించారు. ప్రభాస్ ఇప్పటివరకు ఎప్పుడూ కనిపించని రగ్డ్, ఎమోషనల్ అవతార్‌లో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు.పొడవాటి జుట్టు, గడ్డం, యుద్ధం వల్ల అలసిపోయిన శరీరం, రక్తపు మరకలతో ఉన్న తెల్లటి ధోతీలో ప్రభాస్ చేసిన మేకోవర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తోంది. తన హావభావాలతోనే బాధ, ధైర్యం, సంకల్పం, ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తపరిచే విధంగా పోస్టర్ రూపొందించారు .ముఖ్యంగా ఈ పోస్టర్ సినిమాలోని అత్యంత భారీ యాక్షన్ ఎపిసోడ్‌లలో ఒకదానికి సంబంధించినది. థియేటర్లలో ఈ సీక్వెన్స్ ప్రేక్షకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఖిఫౌజీఖి కేవలం యుద్ధ నేపథ్య చిత్రమే కాకుండా, భావోద్వేగాలతో కూడిన గొప్ప సినీ అనుభూతిని అందించే చిత్రంగా రూపొందుతున్నట్లు పోస్టర్ తెలియజేస్తోంది

'ఓ.! సుకుమారి' ప్రీరిలీజ్ ఈవెంట్

యంగ్ హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ విలేజ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఓ.! సుకుమారితో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. జూలై 17న ఈ సినిమా తెలుగు, తమిళం, మల యాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో తిరువీర్ మాట్లాడుతూ... మసూద సినిమాకి, ఈ సినిమాకి కొన్ని ఆసక్తికరమైన పోలికలు ఉన్నాయి. 'మసూద' సినిమాను ఎస్‌వీసీ రిలీజ్ చేసింది. ఈ సినిమాను కూడా ఎస్‌వీసీనే విడుదల చేస్తోంది. హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ...'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత 'ఓ.! సుకుమారి' తో ప్రేక్షకుల ముందుకు రావడం చాలా ఆనందంగా ఉంది. జూలై 17న సినిమా విడుదలవుతోంది. ముందుగా మా నిర్మాత మహేశ్వర్ రెడ్డి గురించి చెప్పాలి. ఆయన ఈ కథను ఎంతో నమ్మారు. . మా సినిమా టోగ్రాఫర్ ఎంతో అందంగా చూపించారు. మ్యూజిక్ డైరెక్టర్ భరత్ అద్భుతమైన సంగీతం అందించారు.ా మాట్లాడుతూ... ఈ సినిమాపై నాకు డబుల్ కాన్ఫిడెన్స్ ఉంది. జూలై 17న థియేటర్లలో కలుద్దాం. సినిమా చూసి బయటకు వచ్చిన తర్వాత తిరువీర్, ఐశ్వర్య రాజేష్‌ల నటనను మీరు చాలా కాలం గుర్తుంచుకుంటారు. వాళ్ల పెర్ఫార్మెన్స్ పీక్స్‌లో ఉంటుంది. నాకు ఈ అవకాశం ఇచ్చిన నిర్మాత మహేశ్వర్ రెడ్డికి ధన్యవాదాలు. నిర్మాత మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... మేము చాలా మంచి సినిమా తీశాం. ఈ సినిమాపై నాకు పూర్తి నమ్మకం ఉంది. జూలై 17న సినిమా విడుదలవుతోంది. నటుడు మురళీధర్ గౌడ్ మాట్లాడుతూ... ఇది మంచి కాన్సెప్ట్‌తో రూపొందిన సినిమా. దర్శకుడు తొలి సినిమానే అయినా చాలా అద్భుతంగా తీశారు. డీవోపీ కుషేందర్ మాట్లాడుతూ... దర్శన్ గతంలో నేను చేసిన సినిమాకు అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేశాడు.

'హుషార్ పిట్టలు' 'టోంగా.. టోంగా' పాట విడుదల

అన్ను, వాసవి గణేషన్ జంటగా రూపొందు తోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియెస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. బెక్కెం వేణుగోపాల్ మాట్లా డుతూ ఈ సినిమా చూసి నేను ఎంతో ఇంప్రెస్ అయ్యాను. ఈ సినిమా చూసిన అందరూ పాజిటివ్ స్పందించారు. ఈ సినిమాను ఆగస్టు 15న విడుదల చేయడం లక్కీగా అనుకుంటున్నాను. చరణ్ అర్జున్ మట్లాడుతూ తొలిసారిగా నేను మ్యూజిక్ అందించిన చిత్రంలో ఓ సాంగ్‌కు ఈవెంట్ పెట్టడం సంతోషంగా ఉంది. ఈ పాటను ఎంతో సందడిగా, హుషారుగా చేశాం.నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ టీజర్ విడుదలైన ప్పుడు వైరల్ అయ్యింది. కొంత మంది తెలియక బ్యాడ్ కామెంట్లు పెట్టారు. కానీ సినిమా విడుదల తరువాత ఆ సినిమాలో ఉన్న అసలు కథ అందరికి తెలుస్తుంది. అందరి హృదయాలకు హత్తుకునే సినిమా ఇది. ఈ సినిమాలో అన్ని ఎమోషన్స్ ఉన్నాయి. . ప్రముఖ నిర్మాత సురేష్‌బాబు గారు ఈ సినిమాను విడుదల చేయడం అంటేనే ఈ సినిమా ఎలాంటి సినిమానో అర్థం చేసుకోవచ్చు. ఈ సినిమా విడుదల తరువాత అందరూ ఓ మంచి సినిమా తీశామన్న అనుభూతికి లోనవుతారు.దర్శకుడు బిక్షు మాట్లాడుతూ ఈ సినిమా టీజర్ తరువాత నన్ను అందరూ సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ తిట్టడం స్టార్ట్ చేసి నన్ను పాపులర్ చేశారు. అందరూ ఏదోదో ఊహించుకున్నారు. ఈ సినిమా విడుదల తరువాత సినిమా చూసి అందరూ మీరు సోషల్ మీడియాలో చేసిన నెగెటివ్ కామెంట్స్ వెనక్కి తీసుకుంటారు.

17vzm15:17vzm15.qxd 16-07-2026 21:14 Page 1

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

చీపురుపల్లి ఎస్సై పి.ఉమా వెంకటేశ్వర్ రావు

చీపురుపల్లి , జూలై 16 , ప్రభాత వార్త :

చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని చీపురుపల్లి ఎస్సై పి ఉమామహేశ్వరరావు యువతకు బోధించారు. చీపురుపల్లి మండలంలో గల కర్లం గ్రామములో బుధవారం రాత్రి సందర్శించి గ్రామ ప్రజలకు గంజాయి నిర్మూలన మరియు మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా స్థానిక ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చీపురుపల్లి ఎస్సై గ్రామ ప్రజలు, యువత, విద్యార్థులను ఉద్దేశించి గంజాయి రవాణా, నిల్వ, విక్రయం మరియు వినియోగం చట్టరీత్యా తీవ్రమైన నేరమని ప్రజలకు వివరించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబాలు, సమాజం మీద తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు ముఖ్యంగా విద్యార్థులు మరియు యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలు, మానసిక అస్థిరత, ఆర్థిక నష్టం మరియు నేరప్రవర్తన పెరిగే అవకాశాలు ఉన్నాయని వివరించారు.అదేవిధంగా తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా గంజాయి విక్రయించడం, రవాణా చేయడం లేదా అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.పోలీస్ శాఖ ప్రజల సహకారంతో గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుబడి ఉందని, సమాజాన్ని సురక్షితంగా ఆరోగ్యవంతంగా ఉంచేందుకు అందరూ బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బందితో పాట కర్లము గ్రామ పెద్దలు పలువురు యువత మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

జీవో నెంబర్ 396ని ఉపసంహరించుకోవాలి

చీపురుపల్లి ,జూలై 16, ప్రభావత వార్త :

రిజిస్ట్రేషన్ శాఖలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని చేస్తూ ప్రభుత్వం విడుదల చేస్తున్నాం జీవో నెంబర్ 396 ను ఉపసంహరించుకోవాలని కోరుతూ చీపురుపల్లి జాయింట్ సబ్ రిజిస్టర్ ఆఫీస్ పరిధిలో గల దస్తావేజులేఖరులు వారి సహాయకులు స్టాంపు వండర్లు డిటిపి ఆపరేటర్లు గురువారం నాడు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ షాంపుల శాఖను ప్రైవేట్ కరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తున్న జీవో ఎంఎస్ నెంబర్ 396 వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఫ్రంట్ ఆఫీస్ ఏర్పాటు చేసి వాటిని కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని చూడడం కారణంగా దస్తావేజు లేఖలు వారి సహాయకులు కంప్యూటర్ ఆపరేటర్లు జీవనోపాధిని కోల్పోయి కుటుంబాలతో రోడ్డున పడవలసిన దుస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చట్టబద్ధతలేని ప్రైవేట్ సంస్థల పరం చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దారుణమైందని వారు ఆందోళన చెందుతున్నారు. ఇటువంటి మార్పులు జరగడం వలన అవకతవకులు జరిగి ప్రజలు ఇబ్బంది పడే ప్రమాదం ఉంది కనుక ప్రభుత్వం విజ్ఞతతో ఆలోచించి పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య విధానాన్ని ప్రతిపాదనను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖల సంక్షేమ సంఘం ఇచ్చిన పిలుపుమేరకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు దస్తావేజులేఖరులు స్టాంపులు డిటిపి ఆపరేటర్లు , తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోగా డా. పి. విజయలక్ష్మి బాధ్యతల స్వీకరణ

పార్వతీపురం, జూలై 16, ప్రభాతవార్త :

మన్యం జిల్లా నూతన వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారిణి (డీఎంహెచ్‌వో)గా డా. పి. విజయలక్ష్మి గురువారం ఉదయం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఎపిపిహెచ్చిడిఎ అసోసియేషన్ అధ్యక్షులు డా. రఘు కుమార్, ప్రోగ్రాం అధికారి డా. టి. జగన్మోహన్ రావు, గరుగుబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డా. ఎన్.ఎం.కె. తిరుమల ప్రసాద్‌తో పాటు పలువురు పీహెచ్‌సీ వైద్యాధికారులు నూతన డీఎంహెచ్‌వోను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యావ్యవస్థలో కూటమి ప్రభుత్వం కొత్త నాంది పలికింది

పార్వతీపురం, జూలై16, ప్రభాతవార్త:

విద్యార్థినిలు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, మీరు పది మందికి ఆదర్శం కావాలని, దేశానికి వెన్నెముకలా నిలవాలని స్థానిక శాసనసభ్యులు బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం శివారు లో గల మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల విద్యాలయంలో విద్యార్థినిలకు క్రీడా దుస్తులు, షూస్, తదితర క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో కూటమి ప్రభుత్వం కొత్త నాంది పలికిందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో కూడిన విద్యను అందించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని అన్నారు. ప్రతి విద్యార్థిని బాగా చదువుకొని దేశానికి వెన్నెముక కావాలని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల పైన, ప్రభుత్వ విద్యావ్యవస్థపైన ఒక ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుందని అన్నారు. అందులో భాగంగానే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పేరు మీద 15 వేల రూపాయలు విద్య ఖర్చుల నిమిత్తం తల్లి ఖాతాలో జమ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రధానంగా బాలికల విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబు, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు మీ లక్ష్యాలను చేరుకునేందుకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని, మీరంతా బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కోల మధుసూదన్ రావు, ప్రధాన కార్యదర్శి మజ్జి వెంకటేష్, పాఠశాల ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి లక్ష్య సాధన దిశగా చదవాలి : ముత్తెంశెట్టి

గరివిడి, జూలై 16, ప్రభాత వార్త:

ప్రతీ విద్యార్థి లక్ష్యాలను నిర్దేశించుకొని లక్ష్య సాధన దిశగా విద్యార్జన చేయాలని మాజీ మంత్రి,అవంతీ విద్యా సంస్థల వ్యవస్థాపక చైర్మన్ ముత్తెంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ప్రణాళిక బద్దంగా విద్యాభ్యాసం చేయాలని ఆయన విద్యార్థి లోకానికి ఉద్బోధించారు. స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ విద్యార్థుల నూతన విద్యా సంవత్సర తరగతులు ప్రారంభించిన ఆయన పాలిటెక్నిక్ విద్యార్థుల ను ఉద్దేశించి ప్రసంగించారు. పాలిటెక్నిక్ విద్యకు తక్కువగా చూడరాదని పేర్కొన్నారు. కలలు కని కలల సాకారం చేసుకోవాలని పేర్కొన్నారు. ఫిన్ లాండ్ దేశంలో కంప్యూటర్, మొబైల్ వాడకుండా అంతా రాత తోనే విద్యా బోధన జరుగుతుందని, మొబైల్ వలన ఆలోచన శక్తి తగ్గిందన్నారు. ఉన్నతంగా చదివి జాతిరత్నాలు గా ఎదగాలని ముత్తెంశెట్టి కాంక్షించారు. అవంతీస్ కళాశాల యూనివర్సిటీ స్థాయికి ఎదుగుతుందన్నారు.కష్ట పడి చదివి,ఉన్నత ఆలోచనలతో ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. విజయ భాస్కర రావు పాలిటెక్నిక్ విద్య తో మెండైన, మేలైన ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. ఈ విద్య తోనే ఎందరో ఉద్యోగాలు పొందారని ఆయన గుర్తు చేశారు. తొలుత జ్యోతి ప్రజ్వలన ద్వారా కార్యక్రమం ప్రారంభించగా కార్యక్రమంలోగరివిడి ఓం శాంతి కార్యాలయ ఇంఛార్జ్ బ్రహ్మ కుమారి హేమలత, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.బాల భాస్కర రావు లు విద్యాపరమైన అంశాలను, ధ్యానం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. అలాగే విద్యార్థులు నైతికత పాటించడం సత్ ప్రవర్తన పై బ్రహ్మ కుమారీలు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి వి రమణ, పరిపాలనాధికారి గరికపాటి అనీల్ కుమార్ విద్యార్థులు పెక్కు సంఖ్యలో పాల్గొన్నారు.

సొంత నిధులతో స్మశానవాటిక వద్ద శివుని విగ్రహం ప్రతిష్ట

రామభద్రపురం, జూలై 16, ప్రభాత వార్త :

రామభద్రపురం మండలం, రోంపల్లి గ్రామ పంచాయతీ కీర్తిశేషులు, ప్రముఖ ఉపాధ్యాయులు బావిరెడ్డి కూర్మారావు మాస్టారు కుమారుడు, రోంపల్లి గ్రామ ఎంపీటీసీ బావిరెడ్డి శంకర్‌రావు మరియు వారి కుటుంబ సభ్యులు, తమ తండ్రి పవిత్ర స్మృతిని చిరస్థాయిగా నిలుపుకునే ఉద్దేశంతో తమ స్వంత నిధులతో రోంపల్లి గ్రామ శ్మశానవాటిక ముఖద్వారం వద్ద అత్యంత భక్తిశ్రద్ధలతో పరమశివుని దివ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించడం అభినందనీయం.భక్తి, ఆధ్యాత్మికత, సేవాభావానికి ప్రతీకగా నిలిచే ఈ పరమశివుని విగ్రహం శ్మశానవాటికకు విచ్చేసే ప్రతి ఒక్కరిలో దైవభక్తిని పెంపొందించడంతో పాటు, కీర్తిశేషులు బావిరెడ్డి కూర్మారావు మాస్టారు సేవలను చిరస్మరణీయంగా నిలిపే పవిత్ర కార్యంగా నిలిచింది. ఈ పుణ్య కార్యక్రమంలో రోంపల్లి గ్రామ పెద్దలు, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, యువత మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పరమశివుని ఆశీస్సులు పొందారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించడమే కాకుండా, తమ తండ్రి పట్ల ఉన్న ప్రేమ, గౌరవం, కృతజ్ఞతలను సమాజానికి ఆదర్శంగా చాటిన బావిరెడ్డి శంకర్‌రావు మరియు వారి కుటుంబ సభ్యుల ఈ సేవను గ్రామ ప్రజలు హృదయపూర్వకంగా అభినందించారు.

పాంచాలిలో అక్రమ నిల్వ చేసిన ఎరువులు పట్టివేత

పాచిపెంట, జూలై 16, ప్రభాతవార్త:

పాచిపెంట మండలంలో గల పాంచాలి గ్రామంలో ఎరువులు అక్రమంగా నిల్వ చేసిన సమాచారం మేరకు పట్టుకొనిసీజ్ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి జమ్ము శంకరరావు గురువారం విలేకరులకు తెలిపారు. పాంచాలి గ్రామానికి చెందిన పొట్టా సీతారామయ్య అనే వ్యక్తి ఆ గ్రామంలో ఒక పాడుబడిన ఇంటిలో సుమారు 240 బస్తాలు ఎరువులను అక్రమంగా నిల్వ చేశారని. గ్రామంలో ఒక వ్యక్తి మండల వ్యవసాయ అధికారికి సమాచారం అందించగా మండల వ్యవసాయ అధికారి జమ్ము శంకర్రావు , గ్రామ రెవెన్యూ అధికారి మత్స సందీప్ కుమార్ మరియు పాచిపెంట అసిస్టెంట్ , పాచిపెంట ఏఎస్ఐ బెల్లాన ముసలయ్య సహాయంతో సదరు అక్రమ ఎరువుల నిల్వ గోడౌన్ ను రాత్రి 9 గంటల 30 నిమిషాల సమయం లో తనిఖీ చేసినట్టు తెలిపారు. ఒకే దగ్గర ఎక్కువ మొత్తంలో అక్రమంగా ఎరువు నిల్వ చేయడం చట్ట విరుద్ధమన్నారు.

గ్రాండ్‌గా వార్త 30వ వార్షికోత్సవ పత్రిక ఆవిష్కరణ

మున్సిపల్ కమిషనర్ టిటి రత్నకుమార్ అండ్ స్టాఫ్

సాలూరు. జూలై16. ప్రభాతవార్త :

సాలూరు పట్టణ మున్సిపల్ కార్యాలయం కమిషనర్ చాంబర్ లో గురువారం టిటి రత్నకుమార్ ఇంకా మేనేజర్ శివప్రసాద్ చేతుల మీదుగా వార్త 30వ వార్షికోత్సవ పత్రిక ఆవిష్కరణ గ్రాండ్ గా జరిపారు. ముందుగా వార్త దినపత్రికకు మున్సిపల్ అధికారులు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేసారు. అలాగే నిరంతరం ప్రజల సమస్యలను వార్తలరూపంలో తెలియజేస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్న వార్తపత్రిక యాజమాన్యానికి కమీషనర్ టిటి రత్నకుమార్ ధన్యవాదాలు తెలిపారు. అంతేకాకుండా ఇలాగే మరిన్ని వార్షికోత్సవాలు జరుపుకోవాలని కొనియాడారు. మున్సిపల్ డిఈ ప్రసాద్,ఆర్ఓ ఆశిష్ కుమార్, ఆర్ఐ నారాయణరావు, ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్, రిపోర్టర్ వి.శంకర్ , తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలుసుకున్న పంచాయతీరాజ్ శాఖ డీఈ

పార్వతీపురం, జూలై 16, ప్రభాతవార్త :

మన్యం జిల్లా పంచాయతీరాజ్ శాఖ డీఈ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గోర్జి శంకరరావు పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ముందుగా పుష్పగుచ్చం అందించి ధన్యవాదాలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి మీ వంతు సహకారాలు అందించాలని దీనికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు.

సమ్మె విరమణ - విధులకు హాజరైన పారిశుద్ధ్య కార్మికులు

గరివిడి, జూలై 16, ప్రభాత వార్త:

కొండ పాలెం(గరివిడి) మేజర్ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల సమ్మెకు తెరపడింది. ఆగస్టులో ఐదు నెలల జీతాలు చెల్లించేందుకు పంచాయతీ కార్యనిర్వాహణాధికారి జి.వేణుగోపాల రావు అంగీకారం తెలపడం తో పంచాయతీ కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు గురువారం సమ్మె విరమించి,విధులకు హాజరయ్యారు. 14 నెలలుగా వేతనాలు అందక పోవడంతో కొండ పాలెం మేజర్ పంచాయతీ లో పనిచేస్తున్న 26 మంది కాంట్రాక్టు కార్మికులు ఈ నెల 3 నుండి సమ్మెకు ఉపక్రమించారు. పంచాయతీ లో చెత్త పేరుకు పోయింది. పలు దఫాలు గా జరిగిన చర్చలు ఫలించలేదు. టిడిపి, వైకాపా నాయకులు కార్మికుల తో మాట్లాడి సమ్మె విరమింప జేయాలని అభ్యర్థించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు పక్షం రోజులు కి చేరువవుతున్న వేళ, పంచాయతీ లో చెత్త నిల్వలు పెరుగుతున్న సమయంలో ప్రజల నుండి ఆగ్రహావేశాలు పెల్లుబికుతున్న నేపథ్యంలో పారిశుద్ధ్య కార్మికుల కు ఐదు నెలల జీతాలు ఆగస్టు 5 న చెల్లించేందుకు ఈ ఓ ముందుకు వచ్చారు. అందుకు కార్మికులు సమ్మతించారు. అలాగే వేతనాలు చెల్లింపు ఒప్పంద అంగీకార పత్రాన్ని ఇరుపక్షాలు రాసుకొని సంతకాలు చేసుకున్నారు. కాగా సమ్మె విరమించిన శ్రమజీవులు గురువారం సాయంత్రం నుండి విధులకు హాజరై చెత్త తొలగింపు లో నిమగ్నమయ్యారు. దీంతో పంచాయతీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్యే

కురుపాం, జూలై16,ప్రభాతవార్త :

కురుపాం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేతోయక జగదీశ్వరి గురువారం స్పోర్ట్స్ ట్రాక్ సూట్లు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థులు కూడా అన్ని రంగాల్లో ముందుండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని చదువుతో పాటు క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తిని అలవర్చుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదన్ రావు, రాష్ట్ర నాటక రంగ అకాడమీ డైరెక్టర్ అంబటి రాంబాబు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్, కురుపాం పిఏసిఎస్ చైర్మన్ డొల్లు కిషోర్, ఏఎంసి డైరెక్టర్ రామకృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

22న సిఎచ్ సి భవనాలు ప్రారంభోత్సవం

ఈనెల 22న కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన అదనపు భవనాలు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి అన్నారు.

సుపరిపాలనలో కురుపాం మేజర్ పంచాయతీకి ఐఎస్‌వో గుర్తింపు

కురుపాం,జూలై16,ప్రభాతవార్త :

పార్వతీపురం మన్యం జిల్లాలో కురుపాం మేజర్ పంచాయితీ కి అరుదైన ఐఎస్ఓ గుర్తింపు పొందింది. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం, సమర్థవంతమైన దస్త్రాల నిర్వహణ, పారిశుద్ధ్యం, పారదర్శక పరిపాలన, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రంలోని 23 గ్రామ పంచాయతీలకు అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ ఐఎస్‌వో (ఐ ఎస్ ఓ) ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ జాబితాలో పార్వతీపురం మన్యం జిల్లా నుంచి కురుపాం మేజర్ గ్రామ పంచాయతీ ఒక్కటే ఎంపిక కావడం విశేషం.తాడేపల్లిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ చేతుల మీదుగా కురుపాం మేజర్ పంచాయతీ ఈఓ ఎ. వెంకటనాయుడు ఐఎస్‌వో ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా కురుపాం ఎంపీడీఓ జె. ఉమామహేశ్వరి, డిప్యూటీ ఎంపీడీఓ జి.రమేష్ బాబు మాట్లాడుతూ, మన్యం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో కురుపాం మేజర్ పంచాయతీకి మాత్రమే ఐఎస్‌వో ధ్రువీకరణ లభించడం మండలానికి గర్వకారణమని అన్నారు. పంచాయతీ ఈఓ ఎ. వెంకటనాయుడు, సిబ్బంది సమిష్టిగా కృషి చేయడం వల్లే ఈ అరుదైన గుర్తింపు సాధ్యమైందని అభినందించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ, పారదర్శక పాలనను కొనసాగించి, పంచాయతీకి మరిన్ని గుర్తింపులు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఐఎస్‌వో ధ్రువీకరణతో కురుపాం మేజర్ పంచాయతీ పరిపాలనా ప్రమాణాలు, సేవల నాణ్యత రాష్ట్ర స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని మరోసారి రుజువైందని అధికారులు తెలిపారు.

ప్రయాణికుల భద్రత ముఖ్యం : ఎస్సై రాజేష్

బలిజిపేట, జూలై 16, ప్రభాతవార్త :

బలిజిపేట మండలం స్థానిక ఎస్సై కే రాజేష్ ఆటో డ్రైవర్లతో మీటింగ్ ఏర్పాటు చేసి వారితో ప్రత్యేక జాగ్రత్తలు గురించి వివరించారు ప్రయాణికులను భద్రతే నాకు ముఖ్యమని తెలియజేశారు ఓవర్ లోడ్ ఎక్కించకండి అట్లా జరిగితే కేసు ను విధించవలసి ఉంటుందని తెలియజేశారు ప్రతి ఒక్కరికి బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేయాలని ఆటో డ్రైవర్తో ముచ్చటించారు ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు లేనియెడల వారిపై తగులు చర్య తీసుకుంటామని తెలియజేశారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

సీజనల్ వ్యాధులపై అవగాహన

బలిజిపేట, జూలై 16, ప్రభాతవార్త :

బలిజిపేట మండలం గలవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీజనల్ వ్యాధులను సత్వరంగా గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చని గళావిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి. రిషికుమార్ తెలియజేశారు. మండలంలో గంగాడ గ్రామంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కాలానుగున వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ శిబిరంలో బీపీ, షుగర్,ఒళ్ళు నొప్పులు, తలనొప్పి,జ్వరం తదితర లక్షణాలతో బాధపడుతున్న వారికి తనిఖీ చేసి ఉచితంగా మందులు అందజేశారు. వర్షాకాలం వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవో నరసింహులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

100 పడకల ఆసుపత్రిలో అన్ని మెరుగైన సౌకర్యాలు

సాలూరు, జూలై16, ప్రభాతవార్త :

సాలూరు పట్టణం ప్రభుత్వ ప్రాంతీయ అసుపత్రిని గురువారం జిల్లా డీసిహెచ్ఎస్ డాక్టర్ నాగభూషణరావు విజిట్ చేశారని హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.మీనాక్షి తెలిపారు.అలాగే ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలు గురించి అడిగి తెలుసుకున్నారన్నారు. అంతేకాకుండా ఈ మధ్య మంత్రి సంధ్యారాణి చేతుల మీదుగా ప్రారంభించిన మొబైల్ హ్యాండ్ హెల్డ్ ఎక్స్- రే మిషన్ అలాగే పలు వైద్య యూనిట్లు ఇంకా రోగుల గదులు శుభ్రతను పరిశీలించారన్నారు.ఈ మేరకు ప్రజలకు పలురకాల వైద్య సేవలు అందించే 9మంది డాక్టర్ పోస్టులు భర్తీ చేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లామని అలాగే ప్రజలకు ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు సంతృప్తి కరంగా ఉన్నాయని జిల్లా డీసిహెచ్ఎస్ అన్నారని డాక్టర్ మీనాక్షి తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కెమిస్ట్రీలో భోదించుటకు మహిళా అభ్యర్థులు కావలెను

శృంగవరపుకోట,జూలై16,ప్రభాతవార్త :

మండలంలోని తాటిపూడి ఏపీ ఆర్జేసీ మహిళ జూనియర్ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన (గెస్ట్ ఫ్యాకల్టీ) నియమించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శారదాబాయి చౌదరి తెలిపారు.అభ్యర్థులు కెమిస్ట్రీ సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ కలిగి 50శాతం మార్కులు మించి సాధించి ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.దరఖాస్తులను 20-07-26 సాయంత్రం నాలుగు గంటల్లోగా కళాశాల కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.ఇంకా వివరాలు కోసం 8712625071 మొబైల్ కు సంప్రదించాలని ప్రిన్సిపాల్ శారదాబాయి తెలిపారు.

అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం

సర్వసభ్య సమావేశంలో ప్రోటోకాల్ పై రగడ

పద్ధతి మార్చుకోకపోతే ఇబ్బంది పడతారు అన్న అధికారులు

దత్తిరాజేరు, జూలై 16, ప్రభాతవార్త:

అధికారులు గ్రామాల్లో ప్రజాప్రతినిధులుకు ఏ సమాచారాన్ని తెలియపరచకుండా అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై ప్రోటోకాల్ పాటించడం లేదని అధికారులపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు గత సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు అధికారులకు కొన్నిసమస్యలు తెలపగా సమస్యలన్నీ అధికారులు పరిష్కారం చేసి చదివి వినిపించారు పశు వైద్యాధికారి వెలుగు గృహ నిర్మాణశీ ఆర్డబ్ల్యూఎస్ అధికారులపై వైస్ ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు మూగజీవులపై రాజకీయం చేయడం సరైన పద్ధతి కాదని కోమటిపల్లి ఎంపిటిసి సభ్యులు మంత్రి అప్పలనాయుడు వైద్యాధికారిని నిలదీశారు పశుదాన బస్తాల కూడా గ్రామాల్లో రాజకీయం చేయడం సరైన పద్ధతి కాదని పద్ధతి మార్చుకుంటే బాగుంటుందని వైద్యాధికారికి హెచ్చరించారు ఇంగిలాపల్లిలో డ్వాక్రా సంఘాలుసభ్యులు తాలూక డబ్బులు మరియు శ్రీనిధి పేరుతో కొంతమంది డబ్బులు అవినీతి చేశారని వాటి తాలూకా లిస్టులు ఎన్నిసార్లు అడిగినవెలుగు సీ.సీ ఇవ్వక పోవడానికి కారణం చెప్పాలని సి.సిని వైస్ ఎంపీపీ నిలదీశారు నేను మహిళలనే కలుస్తాను మహిళలకే చెప్తాను తప్ప మిమ్మల్ని కలవవలసిన అవసరం లేదని సిసి సమాధానం చెప్పారు మన మండలానికి ఎన్ని ఇల్లులు మంజూరు అయ్యాయి ఒకొక్క ఇంటికి ప్రభుత్వం ఎంత డబ్బులు ఇస్తారు ఎన్ని ఇల్లులు పూర్తయ్యాయిఎంతమంది లబ్ధిదారులుకు బిల్లు ఇచ్చావు ఇంకా ఎంతమందికి ఇవ్వాలి ఆ వివరాలన్నీ చెప్పాలన్నారు మంజూరైన లబ్ధిదారుల లిస్టులన్నీ తీసుకురావాలని ఎంపీపీ ఏఈని నిలదీశారు ఈ మండలంలో 855 ఇల్లులు మంజూరయ్యాయని ఒక్కొక్క ఇంటికి 2 లక్షల 39వేలు రూపాయలు ప్రభుత్వం ఇస్తారన్నారు కేంద్ర ప్రభుత్వం ఎంత రాష్ట్ర ప్రభుత్వం ఎంత అని అడగ్గా సరిగ్గా సమాధానం చెప్పలేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లులు ఇవ్వాలని ఏ.ఈ తెలిపారు గ్రామాల్లో ఇంటింటి కొల్లాయి పనులను ప్రారంభించడం జరుగుతుందన్నారు త్వరలోనే ఈ పనులు పూర్తవుతాయాని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్ కళ్యాణ్ అన్నారు అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి ఉంటే అభివృద్ధి జరుగుతుందన్నారు గ్రామాల్లో టైఫాయిడ్ మలేరియా వంటి జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి కావున మెడికల్ క్యాంపు పెట్టాలని వైద్యులను కోరారు టీ బూర్జువలస లో డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్నారని వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యురాలు రౌతు రాజేశ్వరి వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు మిత్తిరెడ్డి రమేష్ నాయుడు మాజీ జెడ్పీటిసి మంత్రి అప్పలనాయుడు ఏ ఓ శివాజీ సీనియర్ నాయకులు శ్రీనివాసరావు అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

ఆర్ ఆర్ ప్యాకేజి ఇస్తేనే భూములు, స్థలాలు ఖాళీ చేస్తాం

నెల్లిమర్ల ,జూలై 16, ప్రభాతవార్త:

నెల్లిమర్ల, సారిపల్లి గ్రామానికి పునరావాస ప్యాకేజి ఇస్తేనే భూములు, స్థలాలు ఖాళీ చేస్తామని గ్రామస్థులు స్పష్టం చేశారు. గురువారం సారిపల్లి గ్రామంలో ఉన్న కొండ పక్కన ఖాళీస్థలాల్లో గ్రామస్థులు పశువులు మేపుకొని జీవనం సాగిస్తుండగా హుటాహుటిన ప్రాజెక్టు అధికార్లు స్థలాలు ఖాళీ చేయాలని ఒత్తిడి తీసుకు రావడంతో వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రాయి విభీషణ రావు మాట్లాడుతూ గత కొన్నేళ్ళుగా గ్రామానికి పునరావాస ప్యాకేజి కోసం పోరాటం చేస్తున్నామని అయినా ప్రభుత్వాలు మారినా ప్యాకేజి దక్కలేదు సరికదాగత 40సంవత్సరాలనుండి కొండ పక్కన స్థలంలో అన్నివర్గాలు ప్రజలు పశువుల శాల ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తుండగా ప్రాజెక్టు అధికార్లు ఖాళీ చేయడం దారుణమన్నారు. అలాగే ప్రాజెక్ట్ నిర్మాణం లో భూములు మేము కోల్పోయి ఉపాధి లేక ఇబ్బంది పడుతుంటే ప్యాకేజి ఇవ్వలేదు సరికదాఅధికార్లు బతుకుతున్న పశువుల శాలలను ఖాళీ చేయమని చెప్పడం భావ్యం కాదన్నారు.ఇప్పటికే పలుమార్లుగ్రామానికి ప్యాకేజి అమలు చేయాలని, రక్షణ గట్టు డిజైన్ మార్చాలని గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వాని కోరుతున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా దళితుడైన తనను కూటమి నాయకులు కక్ష గట్టి స్థలాలు ఖాళీ చేయాలని ప్రభుత్వం ద్వారా ఒత్తిడి తీసుకు వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కాబట్టి గ్రామానికి ప్యాకేజి ఇస్తేనే భూములు, స్థలాలు ఖాళీ చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం నడిపేన ఆనంద్ మాట్లాడుతూ గ్రామానికి ప్యాకేజి కోసం గత ప్రభుత్వం నుంచి పోరాటం చేస్తున్నామని 5లక్షల 50వేలు మంజూరు అయ్యిందని దురదృష్టం వెంటాడి ఎన్నికలు రావడంతో ప్యాకేజి సమస్య మూలకు చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా కూటమి ప్రభుత్వం వచ్చాక సారిపల్లి కి పునరావాస ప్యాకేజి వస్తుందని ఆశ పడ్డామని కానీ పునరావాస పైకేజి అడుగుతున్నామని కొంతమంది జీరించుకోలేక గ్రామంలో ప్రాజెక్టు వల్ల ఉపాధి లేక ఖాళీ స్థలం లోఅన్ని వర్గాలు పశువులు, ఆవులు మెప్పుకుంటూ జీవనం సాగిస్తున్నవారిని అధికార్ల మీద ఒత్తిడి తీసుకు వచ్చి స్థలాలు ఖాళీ చేయమని చెప్పడం సమంజసం కాదన్నారు. కాబట్టి గ్రామానికి ఆర్ ఆర్ ప్యాకేజి అమలు చేసి గట్టు డిజైన్ మారిస్తేనే భూములు స్థలాలు ఖాళీ చేస్తామని స్పష్టం చేశారు. అలా చేయకపోతే మరింత ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాయి పైడమ్మ,మజ్జి త్రివేణి, గ్రామస్థులు పాల్గొన్నారు.

17-07pg10.qxdo/p:17-07pg10.qxd 1/1/02 6:37 AM Page 1

ఫిఫా వరల్డ్‌కప్‌లో అర్జెంటీనా ప్లేయర్ల వివాదాస్పద బ్యానర్

అట్లాంటా,జులై 16: ఫిఫా వరల్డ్‌కప్‌లో అర్జెంటీనా ఫుట్‌బాల్ ప్లేయర్లు వివాదాస్ప రీతిలో బ్యానర్లు ప్రదర్శించారు. ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో గెలిచిన తర్వాత అర్జెంటీనా ఆటగాళ్లు సంబరాలు జరుపుకున్నారు. అయితే మైదానంలోనే ఆ ప్లేయర్లు ఓ బ్యానర్‌ను ప్రదర్శించారు. ఫాక్‌ల్యాండ్స్‌కు మద్దతు ఇచ్చే రీతిలో ఉన్న బ్యానర్‌ను ఆటగాళ్లు పట్టుకున్నారు. దీనిపై వివాదం చెలరేగింది. లాస్ మాల్వినాస్ సన్ అర్జెంటీనాస్ అని బ్యానర్‌లో రాసింది. అర్జెంటీనాకే ఫాక్‌ల్యాండ్స్ చెందుతాయన్న అర్థం వచ్చే రీతిలో బ్యానర్ ఉన్నది. అట్లాంటిక్ సముద్రంలో ఉన్న ఫాక్‌ల్యాండ్స్ దీవులు ఒకప్పుడు బ్రిటన్ ఆధీనంలో ఉన్నాయి. అయితే ఆ దీవులు తమకే చెందుతాయని అర్జెంటీనా పోరాడుతోంది. ఈ నేపథ్యంలో అర్జెంటీనా ఫుట్‌బాల్ ప్లేయర్లు బ్యానర్లు ప్రదర్శించడం వివాదానికి దారి తీసింది. ఫుట్‌బాల్ ప్లేయర్లు రాజకీయ సంకేతాలు ఇవ్వడం సరికాదు అని అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. 1982లో ఈ రెండు దేశాల మధ్య ఆ దీవుల కోసం యుద్ధం కూడా జరిగింది. ఆ యుద్ధంలో వందల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. 2014లో అర్జెంటీనా ప్లేయర్లు ఇలాగే ఓ వివాదాస్పద బ్యానర్‌ను ప్రదర్శించారు. అప్పుడు ఆ జట్టుకు 20 వేల పౌండ్లు జరిమానా వేశారు. అయితే తాజాగా జరిగిన ఘటన పట్ల దర్యాప్తు చేపట్టనున్నట్లు ఫిఫా అధికారులు చెబుతున్నారు. ఆటగాళ్లు నియమావళిని ఉల్లంఘించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఐపిఎల్ పంజాబ్‌కింగ్స్ రికార్డు బ్రేక్‌చేసిన వాషింగ్టన్ ఫ్రీడమ్!

న్యూయార్కు,జులై 16: ఈ ఏడాది ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ పెట్టిన 265 పరుగుల భారీ లక్ష్యాన్ని పంజాబ్ కింగ్స్ ఛేదించిన టీ20 క్రికెట్‌లో రికార్డును మేజర్ లీగ్ క్రికెట్(ఎంఎల్‌సీ) ఫ్రాంచైజీ వాషింగ్టన్ ఫ్రీడమ్ పంజాబ్ కింగ్స్ రికార్డును బ్రేక్ చేసింది. 267 పరుగుల లక్ష్యాన్ని ఉఫ్ అనేసి టీ20 క్రికెట్‌లో వరల్డ్ రికార్డు సృష్టించింది. గురువారం ఎంఎల్‌సీ లీగ్‌లో ఎంఐ న్యూయార్క్‌తో జరిగిన ఎలిమినేటర్‌లో వాషింగ్టన్ ఫ్రీడమ్ ఈ ఘనత సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఎంఐ న్యూయార్క్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 266 రన్స్ చేసింది. కెప్టెన్ నికోలస్ పూరన్ 33 బంతుల్లో 106 పరుగుతో మెరుపు శతకం బాదాడు. 31 బంతుల్లో సెంచరీ చేసిన అతను ఫ్రాంచైజీ టీ20ల్లో గేల్(30) తర్వాత ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. అతనికితోడు డికాక్(51), కీరన్ పొలార్డ్(64) కూడా హాఫ్ సెంచరీలు చేశారు. దీంతో ఎంఐ న్యూయార్క్ వాషింగ్టన్ ఫ్రీడమ్ ముందు 267 పరుగుల భారీ లక్ష్యాన్ని పెట్టింది. ఈ టార్గెట్‌ను ఆ జట్టు మరో 8 బంతులు మిగిలి ఉండగానే ఛేదించడం విశేషం. 4 వికెట్లు కోల్పోయి 270 పరుగులు చేసి గెలుపొందింది. ఆ జట్టులో ఆండ్రీస్ గౌస్(132), స్టీవ్ స్మిత్(110 నాటౌట్) సెంచరీలతో కదం తొక్కి వాషింగ్టన్ ఫ్రీడమ్‌ను గెలిపించారు. వీరిద్దరే 241 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో పలు రికార్డులు కూడా నమోదయ్యాయి. ఓ టీ20 మ్యాచ్‌లో ముగ్గురు సెంచరీలు చేయడం ఇదే తొలిసారి. ఈ గేములో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 51 సిక్సర్లు వచ్చాయి. టీ20 మ్యాచ్‌లో అత్యధిక సిక్స్‌లు ఇవే. ఇంతకుముందు 42 సిక్సర్లు రికార్డుగా ఉండగా ఈ మ్యాచ్ దాన్ని బ్రేక్ చేసింది.

ఛాన్సొస్తే కెప్టెన్సీకి
నేను రెడీ
స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన

లండన్,జులై 16: టీమిండియా మహిళా క్రికెట్ జట్టు స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన టీమ్ సారథ్య బాధ్యతలను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించి తన మనసులోని మాటను బయటపెట్టింది. ప్రస్తుత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ స్థానంలో భవిష్యత్తులో కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు స్మృతి మంధాన స్పష్టం చేశారు. జట్టు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న స్మృతి మంధాన గత కొన్నేళ్లుగా హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలో జట్టు కోసం కీలక పాత్ర పోషిస్తున్నారు. హర్మన్‌ప్రీత్ జట్టుకు అందుబాటులో లేనప్పుడు తాత్కాలిక కెప్టెన్ గా భారత జట్టును విజయ పథంలో నడిపించిన అనుభవం స్మృతి మంధానకు ఉంది. భారత మహిళా జట్టు కెప్టెన్సీ మార్పునకు సంబంధించి వస్తున్న ఊహాగానాలపై స్మృతి మంధానకు ఓ ప్రశ్న ఎదురైంది. ఒకవేళ భవిష్యత్తులో భారత జట్టు సారథ్య బాధ్యతలు అప్పగిస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నారా అని అడగితే అవును తప్పకుండా నేను దానికి సిద్ధంగా ఉన్నానని స్మృతి మంధాన ఎంతో నమ్మకంతో సమాధానమిచ్చింది. ఎంతో ఒత్తిడితో కూడిన మ్యాచుల్లో కూడా కూల్ గా నిర్ణయాలు తీసుకుని జట్టును నడిపించిన అనుభవం కూడా స్మృతి మంధానకు ఉంది. ఆ టాలెంటే స్మృతి మంధానను కెప్టెన్ రేసులో నిలబెట్టింది. స్మృతి మంధాన కెప్టెన్సీ రికార్డు భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్సీ కి స్మృతి మంధాన బలమైన పోటీదారుగా నిలిచింది. ఆమె 18 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లకు, నాలుగు వన్డేలకు కెప్టెన్‌గా వ్యవహరించి, మొత్తం 15 మ్యాచ్‌లలో జట్టును విజయపథంలో నడిపించింది. ఆమె నాయకత్వంలో ఆడిన నాలుగు వన్డేలలోనూ భారత జట్టు అజేయంగా నిలిచింది. లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్‌లో భారత్ చారిత్రాత్మక విజయం సాధించిన అనంతరం స్మృతి మంధాన ఈ ప్రకటన చేసింది. లార్డ్స్‌లో జరిగిన చారిత్రాత్మక మహిళల టెస్ట్ మ్యాచ్‌లో, భారత జట్టు ఇంగ్లాండ్‌పై 270 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేసింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 285 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 341 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఆ తర్వాత భారత బౌలర్లు ఇంగ్లండ్‌ను రెండు ఇన్నింగ్స్‌లలోనూ వరుసగా 170, 186 పరుగులకే ఆలౌట్ చేసి విజయాన్ని ఖాయం చేసుకున్నారు. ఈ మ్యాచ్‌లో స్మృతి మంధాన కీలక పాత్ర పోషించింది, తొలి ఇన్నింగ్స్‌లో 83 పరుగులు చేసి, ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో అద్భుతమైన అర్ధశతకం సాధించింది. స్మృతి మంధాన మాట్లాడుతూ, "లార్డ్స్‌లో జరిగిన తొలి మహిళల టెస్ట్ మ్యాచ్‌లో భాగం కావడం, అంతకంటే ముఖ్యంగా దానిని గెలవడం ఒక అద్భుతమైన అనుభవమని స్మృతి చెప్పింది.

కోహ్లి, రోహిత్‌ల సంయుక్త రికార్డు
అంతర్జాతీయ క్రికెట్‌లో 8వేల పరుగులు చేసిన జంట

కార్డిఫ్,జులై 16: టీమిండియా స్టార్ బ్యాటర్లు విరాట్‌కోహ్లి, రోహిత్‌శర్మలు సంయుక్తంగా మరో రికార్డుసాధించారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ ఇద్దరూ ఎనిమిదివేల పరుగుల భాగస్వామ్యం పూర్తిచేసారు. ఈ ఘటన సాధించినమూడో భారత జోడిగా,ఓవరాల్‌గా తొమ్మిదోజోడీగా రికార్డుల్లోకెక్కారు. అందకుముందు భారత్ తరపున గంగూలీ టెండూల్కర్‌లు 12,400, ద్రవిడ్ టెండూల్కర్ 11,037 పరుగులుచేసారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ రికార్డు శ్రీలంక స్టార్ ద్వయం మహేళ జయవర్ధనే, కుమార సంగక్కర 13,368 పరుగులుచేసి వారిపేరిట ఉంది. ఈ ఎనిమిదివేల పరుగుల ఘనత కార్డిఫ్‌లో ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో వన్డేలో చోటుచేసుకుంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌చేస్తున్న భారత్ 50ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 209 పరుగులుచేసి మరింతగా ఇంగ్లండ్‌కు చెక్‌పెట్టేందుకు దూకుడుగా ఉంది.

గోల్డెన్‌బూట్ రేసులో మెస్సీ!

న్యూయార్క్,జులై 16: అర్జెంటీనా స్టార్ ప్లేయర్ ఫిఫా వరల్డ్‌కప్‌లో తన ఆటతీరుతో ఆకట్టుకుంటున్నాడు. దిగ్గజ ఫుట్‌బాల్ ప్లేయర్‌గా పేరుగాంచిన మెస్సీ తన మ్యాజిక్ గేమ్‌తో ప్రత్యర్థులను చిత్తు చేస్తున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్‌లోనూ మెస్సీ తన ట్యాలెంట్ ప్రదర్శించారు. రెండు అసిస్ట్‌లు ఇచ్చి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయితే వరల్డ్‌కప్ టోర్నీలో ఇచ్చే గోల్డెన్ బూట్ అవార్డు రేసులో ప్రస్తుతం అర్జెంటీనా ప్లేయర్ లియోనల్ మెస్సీ ముందున్నారు. మెస్సీ ఖాతాలో 8 గోల్స్, 4 అసిస్ట్‌లు ఉన్నాయి. దీంతో అతను అడిడాస్ గోల్డెన్ బూట్ అవార్డు రేసులో దూసుకెళ్ల తున్నాడు.అయితే ఫ్రాన్స్‌ను సెమీస్ వరకు తీసుకెళ్లిన ఆ జట్టు కెప్టెన్ కైలియన్ ఎంబాపే కూడా మెస్సీ వెనుకే దూసుకొస్తున్నాడు. ఎంబాపే ఖాతాలో 8 గోల్స్ , 3 అసిస్ట్‌లు ఉన్నాయి. గోల్డెన్ బూట్ కోసం రెండో స్థానంలో ఎంబాపే ఉన్నాడు. నార్వేకు చెందిన ఎర్లింగ్ హాలాండ్, ఇంగ్లండ్ ప్లేయర్ జూడ్ బెల్లింగ్‌హామ్.. కేన్, ఫ్రాన్స్ ప్లేయర్ డెంబ్లే, స్పెయిన్ ప్లేయర్ ఒయర్‌జెబల్ తర్వాత స్థానాల్లో ఉన్నారు. ఇంగ్లండ్‌పై ఊహించని రీతిలో కోలుకుని అర్జెంటీనా విక్టరీ నమోదు చేయడంతో గోల్డెన్ బూట్ రేసులో ముందు వరసలోకి వచ్చేశాడు. వాస్తవానికి ఎంబాపే, మెస్సీ మధ్య గోల్స్ సంఖ్య సమంగా ఉన్నా అసిస్ట్‌ల సంఖ్యలో మెస్సీ ఆధిక్యంలో ఉన్నాడు. దీంతో గోల్డెన్ బూట్ రేసు ఆసక్తికరంగా మారింది. ఇక మూడో స్థానం కోసం ఇంగ్లండ్‌తో జరిగే మ్యాచ్‌లో ఫ్రాన్స్ తలపడనున్నది. ఒకవేళ ఆ మ్యాచ్‌లో ఎంబాపే గోల్స్ చేస్తే, అప్పుడు పరిస్థితి మారే అవకాశం ఉంటుంది.

సత్తాచూపిస్తున్న బ్యాడ్మింటన్ స్టార్ పివి సింధు!

టోక్యో,జులై 16: జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ క్రీడాకారిణి పీవీ సింధు సత్తాచాటుతోంది. వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. రెండో రౌండ్‌లో ఆమె తన కంటే మెరుగైన ర్యాంకర్ అయిన వరల్డ్ నం.5 హాన్ యూ(చైనా)కు షాకిచ్చింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో 21-16, 21-14 తేడాతో విజయం సాధించింది. 35 నిమిషాల్లోనే సింధు వరుసగా రెండు గేముల్లోనూ నెగ్గింది. హాన్ యూపై సింధుది తిరుగులేని తిరుగులేని ఆధిపత్యం. ఈ మ్యాచ్‌కు ముందు 8 మ్యాచ్‌ల్లో ఎదురుపడితే ఏడింట సింధునే గెలిచింది. ఈ మ్యాచ్‌లోనూ ఆమె ఆధిపత్యం ప్రదర్శించింది. రెండు గేముల్లోనూ సింధు దూకుడు ముందు ప్రత్యర్థి నిలువలేకపోయింది. ఈ సీజన్‌లో సింధు క్వార్టర్స్‌కు చేరుకున్న 6వ టోర్నీ ఇది. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల, తనీషా క్రాస్టో జోడీ రెండో రౌండ్‌లో ఓడిపోయింది. చైనాకు చెందిన ఫెంగ్ యాన్ జీ హువాంగ్ డాంగ్ పింగ్ జంట చేతిలో 22-20, 21 -17 తేడాతో పోరాడి ఓడింది. సింగిల్స్‌లో లక్ష్యసేన్, ఆయుశ్ శెట్టి, ఉన్నతి హుడా ఇప్పటికే ఇంటిదారిపట్టిన విషయం తెలిసిందే. పురుషుల డబుల్స్‌లో సాత్విక్,చిరాగ్ జోడీ గాయం కారణంగా తొలి రౌండ్ మధ్యలోనే వైదొలిగింది. దీంతో ఇప్పుడు టోర్నీలో భారత్ తరఫున మిగిలిన ఏకైక ప్లేయర్ సింధు.అయితే, క్వార్టర్స్‌లో ఆమెకు కఠిన సవాల్ ఎదురైంది. శుక్రవారం జరిగే క్వార్టర్స్‌లో ఆమె వరల్డ్ నం.1 క్రీడాకారిణి నోజోమి ఒకుహార(జపాన్)ను ఎదుర్కోనుంది.

వాణిజ్యం

ఎక్కడి సూచీలు అక్కడే..

పశ్చిమాసియా ఎఫెక్ట్‌తో నామమాత్రంగా లాభాలు!

ముంబై, జులై 16: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం దాదాపు నిలకడగా ముగిశాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల ఒడిదొడుకులు, ఆసియా మార్కెట్లలో బలహీన ధోరణి నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు ఆర్థిక రంగ (ఫైనాన్షియల్) షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడం ప్రధాన సూచీలపై ప్రభావం చూపింది. బీఎస్ఈ సెన్సెక్స్ 1.44 పాయింట్ల స్వల్ప లాభంతో 77,186.87 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 5.75 పాయింట్లు లేదా 0.02 శాతం స్వల్ప నష్టంతో 24,072.75 వద్ద స్థిరపడింది.రోజువారీ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 394 పాయింట్లు ఎగబాకి 77,579.69 గరిష్ఠ స్థాయిని తాకింది. అనంతరం లాభాల స్వీకరణ, అమ్మకాల ఒత్తిడి కారణంగా 77,086.42 కనిష్ఠ స్థాయికి చేరింది. ఇదే సమయంలో నిఫ్టీ కూడా 108 పాయింట్లకు పైగా పెరిగి 24,186.50 ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేయగా, తరువాత 24,050 కనిష్ఠ స్థాయిని తాకింది.రంగాల వారీగా చూస్తే వినియోగదారుల అవసరాలకు సంబంధించిన కంపెనీల షేర్లు మెరుగైన ప్రదర్శన కనబర్చాయి. నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీ 1.48 శాతం లాభంతో అగ్రస్థానంలో నిలిచింది. నిఫ్టీ కెమికల్స్ 1.41 శాతం, నిఫ్టీ మీడియా 1.18 శాతం, నిఫ్టీ ఐటీ 0.67 శాతం, నిఫ్టీ ఆటో 0.46 శాతం చొప్పున లాభపడ్డాయి. నిఫ్టీ50లో ఎటర్నల్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈఎల్), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్, సిప్లా, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, ఎన్‌టీపీసీ, అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. వీటిలో కొన్ని షేర్లు మూడు శాతం వరకు క్షీణించాయి. పశ్చిమాసియా పరిణామాలు, ముడి చమురు ధరల్లో అస్థిరత, ఆసియా మార్కెట్ల బలహీనత వంటి అంశాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో మార్కెట్ రోజంతా పరిమిత శ్రేణిలోనే కదిలింది.డాలరుతో రూపాయి విలువలు 96.33వద్ద నిలిచింది.ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్ మార్కెట్‌దరలు 0.19శాతం క్షీణించి రూ.1.41,585కి చేరాయి. ముడిచమురు బ్యారెల్‌కు 84.73 డాలర్లుగా కొనసాగింది.

విప్రో తొలి త్రైమాసిక లాభం
4.3% తగ్గుదల
రూ.3,352 కోట్ల నికర లాభం

ముంబయి, జులై 16: దేశీయ ఐటీ దిగ్గజం విప్రో తొలి త్రైమాసికం నికర లాభం 4.3 శాతం తగ్గి రూ.3,352 కోట్లకు చేరింది. అంతకుముందు త్రైమాసికంలో కంపెనీ రూ.3,502 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. మార్కెట్ అంచనాలతో పోలిస్తే కూడా కంపెనీ లాభం కొంత నిరాశపరిచింది. విశ్లేషకులు విప్రో నికర లాభం రూ.3,466 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేయగా, కంపెనీ ప్రకటించిన లాభం ఆ అంచనాలకు తక్కువగా నమోదైంది.లావాదేవీల ద్వారా వచ్చిన ఆదాయం స్వల్పంగా 1 శాతం పెరిగి రూ.24,479 కోట్లకు చేరింది. గత త్రైమాసికంలో ఇది రూ.24,236 కోట్లుగా ఉంది. ఈ ఆదాయం మార్కెట్ అంచనాలకు అనుగుణంగా నమోదైంది. కంపెనీ వడ్డీ, పన్నులకు ముందు లాభం 8.4 శాతం తగ్గి రూ.3,829 కోట్లకు పడిపోయింది. గత త్రైమాసికంలో ఇది రూ.4,181 కోట్లు. అదే సమయంలో ఆపరేటింగ్ మార్జిన్ 17.2 శాతం నుంచి 15.6 శాతానికి క్షీణించింది. అంటే 160 బేసిస్ పాయింట్లు తగ్గింది. విప్రో ఒక్కో రూ.2 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేరుకు రూ.2 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు ఈనెల 27, 2026ను రికార్డు తేదీగా నిర్ణయించింది. డివిడెండ్ చెల్లింపును ఆగస్టు 14 లోపు పూర్తి చేయనున్నట్లు తెలిపింది. కంపెనీ మొత్తం బుకింగ్స్ 2.4 శాతం తగ్గి 3.37 బిలియన్ డాలర్లకు చేరాయి. ఐటీ సర్వీసుల ఆదాయం 1.4 శాతం తగ్గి 2.62 బిలియన్ డాలర్లుగా నమోదైంది. త్రైమాసికం ముగిసే నాటికి కంపెనీ 12 నెలల ఉద్యోగుల నిష్క్రమణ రేటు 13.9 శాతంగా నమోదైంది. మొత్తం ఉద్యోగుల సంఖ్య 2.43 లక్షలుగా ఉంది.కంపెనీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీని పల్లియా మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు వల్ల మార్కెట్ అవకాశాలు తగ్గడం కాకుండా మరింత విస్తరిస్తున్నాయని తెలిపారు. కంపెనీ డీల్ పైప్‌లైన్ బలంగా కొనసాగుతోందని చెప్పారు.టెక్నాలజీ, కమ్యూనికేషన్స్ విభాగాల్లో మంచి వృద్ధి కొనసాగుతోందని, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ విభాగం రెండో త్రైమాసికంలో వేగం అందుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

మెట్రో నగరాల్లో
అద్దె డిపాజిట్లు
1.26
లక్షల కోట్లు

ముంబయి,జులై 16: దేశంలోని ఆరు ప్రధాన మెట్రో నగరాలు ముంబై మెట్రోపాలిటన్ రీజియన్, బెంగళూరు, ఢిల్లీఎన్‌సీఆర్, చెన్నై, హైదరాబాద్, పుణే నగరాల్లో అద్దె ఇళ్లకు సంబంధించిన భద్రతా డిపాజిట్లు (సెక్యూరిటీ డిపాజిట్లు) రూపంలో సుమారు రూ.1.26 లక్షల కోట్లు ఇళ్ల యజమానుల వద్ద నిలిచిపోయినట్లు ప్రముఖ ప్రాప్‌టెక్ సంస్థ నోబ్రోకర్ నిర్వహించిన తాజా అధ్యయనం వెల్లడించింది. ఈ అధ్యయనం ప్రకారం, ముంబైలో రూ.41,156 కోట్లు, బెంగళూరులో రూ.31,628 కోట్లు భద్రతా డిపాజిట్ల రూపంలో నిలిచిపోయి ఉండగా, దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే ఇవే అత్యధిక మొత్తాలు. బెంగళూరులో 75 శాతం మంది అద్దెదారులు, అధిక సెక్యూరిటీ డిపాజిట్ కారణంగా తాము ఇష్టపడిన ఇంటిలోకి మారలేకపోయిన సందర్భాలు ఉన్నాయి. ప్రధాన మెట్రో నగరాల్లో ఈ శాతం అత్యధికంగా నమోదైంది.అదే సమయంలో ఢిల్లీఎన్‌సీఆర్‌లో లీజు గడువు ముగిసిన తర్వాత 58 శాతం మంది అద్దెదారులు తమ పూర్తి డిపాజిట్‌ను తిరిగి పొందగా, సుమారు 30 శాతం మందికి కొంత మొత్తం కోత పడింది. మరో 12 శాతం మంది డిపాజిట్ తిరిగి పొందడంలో తీవ్ర వివాదాలను ఎదుర్కొన్నారు. నోబ్రోకర్ నివేదిక ప్రకారం, పట్టణ ప్రాంతాల్లో నివసించే అద్దెదారుల నెలవారీ ఖర్చుల్లో ఇంటి అద్దెనే అతిపెద్ద వ్యయంగా మారింది. దాదాపు సగం మంది అద్దెదారులు తమ నెలవారీ ఆదాయంలో 30 శాతానికి పైగా అద్దెకే వెచ్చిస్తున్నారు. ముంబైలో 25 శాతం మంది అద్దెదారులు తమ ఆదాయంలో సగానికి పైగా అద్దెకే ఖర్చు చేస్తుండగా, మరో 15 శాతం మంది 41-50 శాతం ఆదాయాన్ని అద్దెకు చెల్లిస్తున్నారు. ముంబైలో ప్రతి 10 మంది అద్దెదారుల్లో నలుగురు తమ ఆదాయంలో 40 శాతానికి పైగా గృహ అవసరాలకే వెచ్చిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. ఒకే రకమైన ఇంటికి 30 ఏళ్ల గృహ రుణానికి చెల్లించాల్సిన ఈఎంఐ దాదాపు అన్ని ప్రధాన నగరాల్లో నెలవారీ అద్దె కంటే గణనీయంగా ఎక్కువగా ఉంది. బెంగళూరులో ఈఎంఐఅద్దె నిష్పత్తి 2.07 నుంచి 2.38,హైదరాబాద్లో 2.21 నుంచి 2.47, ముంబైలో 2.03 నుంచి 2.19కు పెరిగింది. జెన్‌జెడ్ అంటే 18-24 ఏళ్ల వయస్సు అద్దెదారులు, ఇతర వయస్సు వారితో పోలిస్తే సుమారు 1.5 రెట్లు ఎక్కువగా ఇళ్లు మారుతున్నారు. వీరిలో 30 శాతం మంది ప్రతి ఆరు నుంచి 12 నెలలకోసారి ఇల్లు మారుతుండగా, పెద్ద వయస్సు గల వారిలో కేవలం 10 శాతం మాత్రమే ఉంది. బెంగళూరులో 4.8 శాతం, హైదరాబాద్‌లో 4.6 శాతం అద్దె రాబడితో దేశంలో అగ్రస్థానాల్లో నిలిచాయి.

అంచనాలను మించి 40% పెరిగిన భెల్ రాబడి!

న్యూఢిల్లీ, జులై 16: ప్రభుత్వ రంగ ఇంజినీరింగ్ దిగ్గజం బిహెచ్ఇఎల్ తొలి త్రైమాసికంలో అంచనాలకు మించిన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. కంపెనీ ఆదాయం, నిర్వహణ లాభదాయకత (ఎబిట్డా), నికర లాభం అన్ని ప్రధాన సూచీల్లో అంచనాలను అధిగమించాయి.గత ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.456 కోట్ల నష్టాన్ని నమోదు చేసిన బీహెచ్ఈఎల్, ఈసారి రూ.378 కోట్ల సమీకృత నికర లాభాన్ని ఆర్జించింది. కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 40.3 శాతం పెరిగి రూ.5,487 కోట్ల నుంచి రూ.7,698 కోట్లకు చేరుకుంది.నిర్వహణ లాభం (ఎబిట్డా) గత ఏడాది రూ.537 కోట్ల నష్టంలో ఉండగా, ఈసారి రూ.504 కోట్ల లాభంగా నమోదైంది. ఎబిట్డా మార్జిన్ 6.5 శాతానికి చేరుకుంది. నికర లాభం కూడా నిపుణులు అంచనావేసిన రూ.33.9 కోట్లతో పోలిస్తే ఎంతో ఎక్కువగా నమోదైంది.ఇతర ఆదాయం కూడా గత ఏడాది రూ.171.2 కోట్ల నుంచి ఈసారి రూ.214.1 కోట్లకు పెరిగింది. కంపెనీ వృద్ధికి విద్యుత్ విభాగం ప్రధాన ఆధారంగా నిలిచింది. ఈ విభాగం ఆదాయం గత ఏడాది రూ.3,898.9 కోట్ల నుంచి రూ.5,919.5 కోట్లకు పెరిగింది. పరిశ్రమ విభాగం ఆదాయం కూడా రూ.1,588.1 కోట్ల నుంచి రూ.1,778.2 కోట్లకు పెరిగింది.ఇదిలా ఉండగా, సూడాన్‌లో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా మాజీ ఎన్ఈసీ సూడాన్ సంస్థ నుంచి రావాల్సిన రూ.196 కోట్ల బకాయిలు ఇంకా అందలేదని బీహెచ్ఈఎల్ వెల్లడించింది. గురువారం ట్రేడింగ్‌లో షేరు ధర 2 శాతం వరకు పెరిగి రూ.426.15కు చేరుకోగా, అదే సమయంలో ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ కేవలం 0.1 శాతం మాత్రమే లాభపడింది.



టెక్ మహీంద్ర లాభం రూ.1465 కోట్లు

ముంబై, జులై 16: దేశీయ ఐటీ దిగ్గజం టెక్ మహీంద్రా తొలి త్రైమాసికంలో ప్రాతిపదికన పెరిగినప్ప టికీ, మార్కెట్ నిపుణుల అంచనాలను అందుకోలేకపోయింది. త్రైమాసికంలో టెక్ మహీంద్రా సమీకృత నికర లాభం రూ.1,465 కోట్లుగా నమోదైంది. ఇది మార్చి త్రైమాసికంలోని రూ.1,354 కోట్లతో పోలిస్తే 8.2 శాతం అధికం. అయితే, నిపుణులు అంచనా వేసిన రూ.1,607 కోట్ల కంటే తక్కువగా ఉండటంతో మార్కెట్ అంచనాలను అందుకోలేకపోయింది.కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 4.2 శాతం పెరిగి రూ.15,712 కోట్లకు చేరుకుంది. గత త్రైమాసికంలో రూ.15,076 కోట్లు కాగా, మార్కెట్ అంచనా రూ.15,422 కోట్లు. దీంతో ఆదాయం అంచనాలకు అనుగుణంగానే నమోదైంది.వడ్డీ, పన్నులకు ముందు లాభం రూ.2,073 కోట్ల నుంచి రూ.2,264 కోట్లకు పెరిగి 9.2%వృద్ధి నమోదు చేసింది. అలాగే ఎబిడిటామార్జిన్ 13.7 శాతం నుంచి 14.4 శాతానికి పెరిగింది. కొత్త ఒప్పందాల మొత్తం విలువ ఏడాది ప్రాతిపదికన 33.3 శాతం పెరిగి 1.08 బిలియన్ డాలర్లకు చేరుకోవడం విశేషం. కంపెనీ సీఈఓ మోహిత్ జోషి మాట్లాడుతూ, వరుసగా మూడు త్రైమాసికాల్లో 1 బిలియన్ డాలర్లకు పైగా కొత్త డీల్ విజయాలు సాధించడం సంస్థ వ్యాపార బలాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. అలాగే 50 మిలియన్ డాలర్లకు పైగా ఆదాయం అందించే ఖాతాదారుల సంఖ్య ఏడు పెరగడం, అన్ని వ్యాపార విభాగాలు వార్షిక ప్రాతిపదికన వృద్ధిని నమోదు చేయడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు.ఉద్యోగుల నిష్క్రమణ రేటు 12.1 శాతం నుంచి 11.8 శాతానికి తగ్గిందని, కృత్రిమ మేధ రంగాలవారీ ప్రత్యేక సామర్థ్యాలు, ప్లాట్‌ఫారమ్‌లు, ప్రతిభావంతులైన ఉద్యోగులపై పెట్టుబడులు కొనసాగిస్తూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సంస్థను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఫలితాల ప్రకటనకు ముందు ఎన్ఎస్ఈలో టెక్ మహీంద్రా షేరు 1.13% పెరిగి రూ.1,515.60 వద్ద ముగిసింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.